సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+16+40 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 6.00 | సంపుటి: 10 సంచిక: 143

SUNDAY Special | ఆదివారం 13-8-2017

SIMULTANEOUSLY PRINTED AT KADAPA | VIJAYAWADA | BANGALORE | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'పారిశ్రామిక రంగానికి దీటుగా సేద్యరంగం ఎదగాలి. వ్యవసాయ ఫలాలు పదింతలు పెరగాలి'



నేనే హీరోని

- ఫ్యామిలీలో



ధావన్ శతకం

- స్పోర్ట్స్‌లో



గోస్పాడు మండలం యాళ్లూరు రోడ్‌షోలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, చిత్రంలో పార్టీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి

ఎన్నికలు ఉంటేనే ప్రజలు గుర్తొస్తారా!

సీఎం చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజం

- రోడ్డపక్క భవనాలను కూల్చడమేనా అభివృద్ధి?
- మూడున్నరేళ్లలో ఏ ఒక్క హామీనీ బాబు నెరవేర్చలేదు
- ధరల స్థిరీకరణ నిధి లేకపోవడంతో రైతులు నష్టపోయారు
- మళ్లీ చంద్రబాబు మోసపు వాగ్దానాలతో ఓటర్లకు ఎర
- ప్రశ్నిస్తే జగన్ మనుషులంటాడు.. కేసులు పెడతాడు..
- ఇది ధర్మానికి, అధర్మానికి మధ్య జరుగుతున్న యుద్ధం
- నంద్యాల ప్రజలు న్యాయం వైపే నిలబడాలి
- నాలుగోరోజు రోడ్‌షోలో ప్రతిపక్షనేత పిలుపు

- వివరాలు 5లో

బాధ్యులెవరైనా వదిలిపెట్టం!

చిన్నారుల మృతికి ఆక్సిజన్ కొరతే కారణం కాదు: యూపీ సీఎం యోగి

- మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌పై వేటు
- ప్రభుత్వానిది నేరపూరిత నిర్లక్ష్యమన్న విపక్షాలు



రాజ్యసభ నేతగా శరద్ తొలగింపు

- ఆ స్థానంలో నితీశ్ సన్నిహితుడు ఆర్సీపీ సింగ్ ఎన్నిక



ఉత్తర కొరియాను రెచ్చగొట్టడం ఆపండి

- లేదంటే కొరియా ద్వీపకల్పంలో పరిస్థితులు దిగజారుతాయి
- ట్రంప్‌కు చైనా అధ్యక్షుడు ఫోన్

... వివరాలు 6లో ...

ఖానా, పీనా, బజానా కోసం మాత్రమే..

రోజూ రూ.5 కోట్లు!

నంద్యాలలో టీడీపీ నేతల విచ్చలవిడి ప్రచారం ఖర్చు

- ఒక్కో వార్డుకు రూ.5 లక్షలు కేటాయింపు
- 42 వార్డులకుగాను రూ.2 కోట్లకుపైగా వ్యయం
- మిగిలిన రూ.3 కోట్లు గ్రామాల్లో ఖర్చు
- భారీ హంగామా నడుమ మంత్రుల కార్యక్రమాలు
- వార్డుల్లో ప్రచారానికి లారీల ద్వారా జన సమీకరణ
- విచ్చలవిడిగా మందు, బిర్యానీ పంపిణీ



ఇప్పటివరకు కోట్లు పోసి ఎమ్మెల్యేలను కొనడం చూశాం.. ప్రత్యర్థి పార్టీకి చెందిన నాయకులను కొనడం చూశాం.. కార్లు వంటి ఖరీదైన బహుమతులతో ప్రలోభపెట్టడం చూశాం.. మందు, బిర్యానీలతో లొంగదీసుకోవడమూ చూశాం.. ఇపుడు నంద్యాలలో తెలుగుదేశంవారు తమ పాత రికార్డులన్నీ తామే అధిగమించారు. ఎదుటివారి ప్రచారాన్ని అడ్డుకోవడం కోసం వారి మనుషులకు డబ్బు పంచుతున్నారు... వారు చేయాల్సిందేమిటంటే ప్రచారానికి గైర్హాజరు కావడమే.. ఇక ఇక్కడ తమకు ప్రచారం చేసేవారు లేకపోవడంతో పొరుగు నియోజకవర్గాల నుంచి కూలీకి జనాన్ని తరలిస్తున్నారు.. ఇందుకోసం తమ్ముళ్లు రోజుకు రూ. 5 కోట్లు పైనే ఖర్చు చేస్తున్నారు..

.. ఇదీ కొత్త ట్రెండ్..

జెండాలు లేకుండా ప్రచారం చేయండి

నంద్యాల ఉప ఎన్నికలో బీజేపీ మద్దతు కోరిన చంద్రబాబు.. కర్నూలు బీజేపీ నేతలు ఆగ్రహం

2లో

ఏపీలో ఎయిమ్స్ సేవలు

మరో రెండేళ్ల తర్వాతే!

అప్పటివరకూ ఎంబీబీఎస్ సీట్లు వచ్చే అవకాశం లేదు.. ఎయిమ్స్ అధికార వర్గాల వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్ర విభజన సందర్భంగా కేంద్రం రాష్ట్రానికి ప్రకటించిన ఎయిమ్స్(ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) సేవలు అందుబాటులోకి వచ్చేందుకు మరింత జాప్యం జరిగే అవకాశం కనిపిస్తోంది. మంగళగిరి వద్ద ఏర్పాటు చేస్తున్న ఈ ఇన్‌స్టిట్యూట్‌కు ఇప్పటివరకూ ప్రహరీ గోడ కూడా పూర్తి కాలేదు. ఎలక్ట్రికల్ లైను, ఎన్డీఆర్‌ఎఫ్ (నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) దళానికి ప్రత్యామ్నాయ స్థలం చూపించడం తదితర స్థానిక సమస్యలు పరిష్కరించడానికే రెండున్నరేళ్లు పట్టింది. ఇదిలాఉండగానే తొలుత తెనాలి జిల్లా ఆస్పత్రిని క్లినికల్ అటాచ్‌మెంట్‌గా చూపించి మొదటి ఏడాది కనీసం 50 ఎంబీబీఎస్ సీట్లయినా తెచ్చుకోవాలని అధికారులు లేఖ రాశారు. కానీ ఎయిమ్స్‌కు కావాల్సిన స్థాయిలో వసతులు లేవన్న కారణంగా కేంద్ర ప్రభుత్వం తోసిపుచ్చింది. ఎయిమ్స్‌ను ప్రకటించి మూడేళ్లు దాటిపోగా.. ఈ ఏడాది జూన్16న వైద్యుల గృహ సముదాయం, ఔట్‌పేషెంట్ బ్లాకులకు టెండర్లు పిలిచారు. టెండర్ల ప్రక్రియ గడువు కూడా ముగిసిందని, త్వరలో నిర్మాణ సంస్థకు పనులు అప్పజెబుతామని అధికార వర్గాలు తెలిపాయి. ఇవిగాకుండా ఎయిమ్స్‌కు సంబంధించి పలు నిర్మాణాలతోపాటు రోజువారీ అవసరాలకు కావాల్సిన నీటి వనరులను ఏర్పాటు చేయాల్సి ఉందని, ఇప్పటికే దీనిపై రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసినట్టు ఎయిమ్స్ నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న సంస్థ ప్రతినిధి ఒకరు 'సాక్షి'కి తెలిపారు. ఈ నిర్మాణాలన్నీ పూర్తయ్యేసరికి మరో రెండేళ్ల సమయం పడుతుందని, అప్పటివరకూ ఎంబీబీఎస్ సీట్లు వచ్చే పరిస్థితి కనిపించడం లేదని ఆయన స్పష్టం చేశారు. కాగా, మనతోపాటే ఎయిమ్స్ అనుమతులను తెచ్చుకున్న నాగపూర్‌లో ఇప్పటికే 50 ఎంబీబీఎస్ సీట్లతో సేవలు ప్రారంభమైన విషయం తెలిసిందే.

పత్తి రైతులకు 'గులాబీ' గుబులు!

హడలెత్తిస్తున్న పింక్ బోల్ వామ్ పురుగు

- కంటికి కనిపించదు.. వేగంగా వ్యాపిస్తుంది..
- పురుగు ఉధృతమైతే రైతుకు తీవ్ర నష్టాలే
- రాష్ట్రంలోని 3 జిల్లాల్లో సోకినట్లు గుర్తింపు
- అప్రమత్తంగా ఉండాలని రైతులకు వ్యవసాయశాఖ సూచన



సాక్షి, అమరావతి

రాష్ట్రంలో ఈ ఏడాది తెల్ల బంగారం(పత్తి) సాగు చేసిన రైతుల్లో 'గులాబీ' గుబులు మొదలైంది. పత్తిపై గులాబీ రంగు పురుగు(పింక్ బోల్ వామ్) దాడి చేస్తోంది. రైతుల్ని హడలెత్తిస్తోంది. బయటకు కనిపించని.. ఉధృతమైతే పురుగు మందులకు సైతం లొంగని ఈ పురుగు పత్తి పంటకు అపార నష్టం కలిగిస్తుంది. దీనివల్ల ఎకరాలకు ఎకరాలు తుడిచిపెట్టేసే ప్రమాదం ఉంది. దిగుబడి పూర్తిగా పడిపోయేందుకు ఆస్కారముంది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, మహారాష్ట్ర, గుజరాత్‌లలో ఈ ఏడాది గణనీయమైన విస్తీర్ణంలో పత్తిని ఈ పురుగు ఆశించినట్టు కేంద్ర వ్యవసాయమంత్రి పార్లమెంటులో అధికారికంగా ప్రకటించగా.. పంజాబ్, హర్యానాలో తెల్లదోమ(వైట్‌ఫ్లై), మిగతా రాష్ట్రాల్లో గులాబీరంగు పురుగు పత్తిని కుదిపేస్తున్నదని కేంద్రీయ పత్తి పరిశోధన సంస్థ(సీఐసీఆర్) సైతం తేల్చింది. రాష్ట్రంలోని కర్నూలు, వైఎస్సార్, ప్రకాశం జిల్లాల్లో వేసిన పత్తి పంటకు ఈ పురుగు సోకినట్టు వెల్లడించింది. ఈ నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని, తగిన నివారణ చర్యలు చేపట్టాలని వ్యవసాయశాఖ సూచించింది.

అసలేమిటీ గులాబీ రంగు పురుగు..

పత్తిపై గులాబీరంగు పురుగు ఉధృతిని 2015-16 డిసెంబర్‌లో తొలిసారి గుర్తించారు. అయితే 2016-17లో పెద్దగా కనిపించలేదు. మళ్లీ ఈ ఏడాది ప్రారంభంలోనే గుర్తించారు. పురుగు ఉధృతమైతే మిగిలేది నష్టమే. కనిపెట్టే లోపలే అపార నష్టాల్ని మిగుల్చుతుంది. ప్రస్తుత వర్షాభావ స్థితి, అడపాదడపా పడుతున్న వర్షాలు ఈ పురుగుకు అనుకూలం. 30, 35 రోజుల్లోనే తన జీవితచక్రాన్ని పూర్తి చేసుకుంటుంది. గులాబీరంగు పురుగు, తల్లి పురుగు ఉదయం 8-10 గంటలు, సాయంత్రం 4-6 గంటలమధ్య ఒక్కొక్కటిగా ఆకు అడుగుభాగానికి చేరతాయి. ఒక్కోపురుగు 150, 200 గుడ్లను లేత ఆకులు, కొమ్మలు, పూ మొగ్గలు, లేత కాయలపైన పెడుతుంది. గుడ్లనుంచి పొదిగిన పిల్ల పురుగులు గంటలోపే పూ మొగ్గలోకి తొలుచుకుపోయి లోపలి పదార్థాల్ని తినివేస్తాయి. బయటకు కనిపించవు. పురుగు కాయలోనే ఉన్నందువల్ల కాయ పగిలిన తర్వాతే నష్టాన్ని గుర్తించగలుగుతాం. దీంతో

మిగతా 14వ పేజీలో ▶



మన్యంలో రంగు రాళ్ల వేట

- విచ్చలవిడిగా తవ్వకాలు
- పన్నెండేళ్ల కిందట కరక క్వారీ ప్రమాదంతో తగ్గుముఖం
- ఇటీవల తిరిగి ఊపందుకున్న మైనింగ్

- 10లో



కాలేయాన్ని కబళిస్తోంది!

- ఏపీ, తెలంగాణల్లో విస్తరిస్తున్న హెపటైటిస్-సి
- వ్యాధి తీవ్రతను వెల్లడించిన కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ
- బాధితుల్లో ఏపీ 2వ స్థానం..

2లో






ఇదండీ వరస



...సామాన్యురాలిగా జీవించడానికేగా.. ఏ ఇబ్బంది రాదు హైదరాబాద్‌కు హ్యాపీగా పంపించండి ట్రంప్‌జీ!



కాలేయాన్ని కబళిస్తోంది!



- ఏపీ, తెలంగాణల్లో విస్తరిస్తున్న హెపటైటిస్-సి
- వ్యాధి తీవ్రతను వెల్లడించిన కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ
- బాధితుల్లో ఏపీ 2వ స్థానం.. తెలంగాణ 5వ స్థానం

సాక్షి, అమరావతి:

తెలుగు ప్రజలను కాలేయ వ్యాధి భయపెడుతోంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో హెపటైటిస్–సి వ్యాధి చాపకింద నీరులా విస్తరిస్తోంది. హెపటైటిస్–సి కారణంగా వేలాది మంది మృత్యువాత పడుతున్నట్టు తాజా లెక్కల్లో తేలింది. అంతే కాకుండా వ్యాధి బారిన పడ్డవారు ఆర్థికంగానూ చితికిపోతున్నారు. వ్యాధి ముదిరితే అత్యంత ఖరీదైన వైద్యం చేయించాల్సి ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. వ్యాధిపై అవగాహన లేకపోవడంతో దీనిబారిన పడుతున్న వారు ఎక్కువవుతున్నారు.

దేశంలోనే రెండోస్థానంలో ఏపీ

దేశంలో హెపటైటిస్–సి వ్యాధి వ్యాప్తి ఎలా ఉందో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఇటీవల రాజ్యసభలో ఎంపీ రంజిబ్ బిస్వాల్ హెపటైటిస్‌పై ప్రశ్నించినప్పుడు ఆ శాఖ మంత్రి జేపీ నడ్డా లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. దానిలో వివిధ రాష్ట్రాల్లో హెపటైటిస్ బాధితుల సంఖ్యను వెల్లడించారు. ఇందులో మహారాష్ట్రలో అత్యధిక కేసులు నమోదవుతుండగా.. రెండో స్థానంలో ఆంధ్రప్రదేశ్ ఉన్నట్టు తేలింది. తెలంగాణ ఐదో స్థానంలో ఉంది.


వ్యాధిని గుర్తించడం కష్టం..

హెపటైటిస్–సి వ్యాధికి గురైన 90 శాతం మందిలో ఆ వ్యాధి ముదిరే వరకూ తెలిసే అవకాశం ఉండదు. ఇదే అతిపెద్ద ముప్పు. వైరస్ ద్వారా వ్యాపించే ఈ జబ్బు కాలేయాన్ని పూర్తిగా కబళిస్తుంది. రక్త మార్పిడి, కలుషిత ఆహారం, కలుషిత నీరు, వ్యాధిగ్రస్తుడు దగ్గినప్పుడు గాలిద్వారా ఈ వైరస్ వ్యాప్తి చెందే అవకాశం ఉంది. హెపటైటిస్–సి రక్తపరీక్ష చేస్తే కానీ ఈ వ్యాధి నిర్ధారణ కాదు. చాలా ప్రభుత్వాసుపత్రుల్లో శస్త్రచికిత్స చేసే ముందు హెచ్ఐవీ టెస్టులు చేస్తున్నారు. కానీ, హెపటైటిస్–సి టెస్టులు చేయడం లేదు.

వ్యాధి లక్షణాలు



- ఆకలి పూర్తిగా మందగించడం
- పొట్ట ఉబ్బినట్టు అనిపిస్తుండడం
- బరువు తగ్గిపోతూ ఉండడం
- ఇన్ఫెక్షన్లు అధికంగా ఉండడం
- కళ్లు పసుపు వర్ణంలోకి అంటే కామెర్లు వచ్చినట్టుండడం
- నీరసంగా అనిపించడంతో పాటు ఏ పనీ చేయాలనిపించకపోవడం



రోజూ రూ.5 కోట్లు!

నంద్యాలలో టీడీపీ నేతల ప్రచారం ఖర్చు • లారీల ద్వారా జన సమీకరణ.. విచ్చలవిడిగా మందు, బిరియాని పంపిణీ

నంద్యాల నుంచి సాక్షి ప్రతినిధి:

అడుగడుగునా అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ.. ప్రశ్నించిన వారిపై దాడులకు యత్నిస్తూ.. పథకాలు ఆపేస్తామంటూ స్థానికులను బెదిరింపులకు గురిచేస్తూ.. గెలుపే లక్ష్యంగా అడ్డదారిలో ముందుకు సాగుతున్న టీడీపీ పెద్దలు నంద్యాల్లో ఒక్క ప్రచారం కోసం మాత్రమే రోజుకు రూ.5 కోట్లు చొప్పున ఖర్చు చేస్తున్నారు. ఇతర జిల్లాల నుంచి దిగుమతి అయిన నల్ల ధనం మూటలను ఇసుక బస్తాల్లా గుమ్మరిస్తున్నారు. ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పర్యటనకు భారీగా జనం వస్తున్న నేపథ్యంలో అధికార పార్టీ నేతల్లో వణుకు పుట్టింది. నంద్యాల పట్టణంలో తమకూ బలం ఉందని గోబెల్స్ తరహా ప్రచారం చేసుకునేందుకు వీలుగా వార్డుల్లో ఆర్భాటంగా పర్యటనలను మొదలు పెట్టింది. ఇందు కోసం ఒక్కో వార్డుకు రోజుకు రూ.5 లక్షల చొప్పున 42 వార్డుల కోసం ఏకంగా రూ.2 కోట్లకు పైగా ఖర్చు చేస్తోంది. స్థానికంగా మనుషులు దొరక్క లారీల ద్వారా ఇతర ప్రాంతాల నుంచి జనసమీకరణ చేస్తోంది. మూడు రోజులుగా పట్టణంలో భారీగా ప్రచార పర్వానికి తెరలేపింది. జగన్ పర్యటనకు వెళ్లవద్దంటూ మరోవైపు గ్రామాల్లో ప్రధానంగా యువత, మహిళలకు ఆ పార్టీ స్థానిక నేతల ద్వారా రూ.300 చొప్పున పంపిణీ చేస్తోంది. అయినప్పటికీ జగన్ సభలకు జనం పోటెత్తడంతో ఏం చేయాలో దిక్కుతోచక కొట్టుమిట్టాడుతోంది. ఈ నేపథ్యంలో మంత్రుల కార్యక్రమాలకు చేస్తున్న హంగామా అంతా ఇంతా కాదు. ఇదంతా ఒక ఎత్తు అయితే ఏకంగా రూ.30 కోట్ల విలువైన మద్యం బాటిళ్లను నంద్యాల పరిసర ప్రాంతాల్లో నిల్వ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. అక్కడి నుంచే రోజువారీ అవసరం మేరకు పట్టణంలోకి తీసుకొస్తున్నట్లు తెలిసింది.

వార్డుల్లో హంగామా..

ఓటమి భయంతో టీడీపీ నేతలు మూడు రోజులుగా ప్రచారాన్ని ముమ్మరం చేశారు. వార్డు సభ్యులు, మండల నాయకుల ఆధ్వర్యంలో ప్రచారం సాగిస్తున్నారు. ఇందులో భాగంగా ఒక్కో వార్డులో కనీసం వంద మందితో (స్థానికులు, రోజు కూలీలతో పాటు ఆళ్లగడ్డ, పాణ్యం, కర్నూలు నుంచి పిలిపించుకుని) హంగామా చేస్తున్నారు. ప్రచారానికి రాలేమని చెప్పిన వారిని నయాన, భయాన రప్పించుకుంటున్నట్లు విమర్శలు ఉన్నాయి. కుటుంబ అవసరాల నిమిత్తం కొందరు డబ్బులు తీసుకుంటున్నారు. మరి కొందరు ఇష్టం లేక ప్రచారానికి రాలేమని చెప్పినా బలవంతంగా వారి చేతిలో డబ్బులు పెడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. కర్నూలు, పాణ్యం, ఆళ్లగడ్డ ప్రాంతాల నుంచి సుమారు వెయ్యి మంది చొప్పున వివిధ వాహనాల ద్వారా నంద్యాలకు తీసుకొస్తున్నారు. మొత్తం మీద రోజుకు సుమారు 5 వేల మందిని ప్రచారానికి వినియోగించుకుంటున్నారు. వారిచేతికి జెండాలు ఇచ్చి వార్డుల్లో తిప్పుతున్నారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం బిరియాని, సాయంత్రం స్నాక్స్ ఇచ్చి వారి చేత రెండు విడతలుగా ప్రచారం చేయిస్తున్నారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు ప్రచారం చేయిస్తున్నారు. మహిళలకు రూ.400, పురుషులకైతే రూ.500లు చెల్లిస్తున్నారు. పురుషులకు అదనంగా రెండు క్వార్టర్ బాటిళ్లు (మద్యం) ఇస్తున్నట్లు ప్రచారానికి వెళ్తున్న వారు తెలిపారు. ఇలా అన్ని కార్యక్రమాలకు కలిపి ఒక్కో వార్డుకు రూ.5 లక్షలకు పైనే ఖర్చు చేస్తున్నట్లు స్పష్టమవుతోంది.

గ్రామాలపై ప్రత్యేక దృష్టి

నంద్యాల రూరల్, గోస్పాడు మండలాల పరిధిలో సుమారు 30 గ్రామాలున్నాయి. ఈ గ్రామాల్లోని ఓటర్ల కోసం మండల నాయకుల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహిస్తూనే ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు నగదు, బహుమతులు ఇస్తున్నారు. ప్రతి గ్రామంలో స్థానిక టీడీపీ నాయకుడి ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇందు కోసం రోజుకు రూ.2.70 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిసింది. ఈ మొత్తాన్ని రెండు మండలాల్లోని కీలక నేతలకు అప్పజెప్పుతున్నారు. వారు ఆ డబ్బును గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుల ద్వారా ఖర్చు చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో అయితే స్థానిక సర్పంచ్‌లపై నమ్మకం లేక మండల నాయకులే అన్నీ తామై చూసుకుంటున్నారు. ఈ ఖర్చులన్నింటితో కలిపి మంత్రుల పర్యటనకు చేస్తున్న మొత్తం డబ్బు రోజుకు రూ.5 కోట్లకు పైగానే అవుతోందని సమాచారం. కాగా డబ్బు పంపిణీ చేస్తున్న కీలక నేతలపై కూడా ప్రభుత్వ పెద్దలు నిఘా పెట్టారు. ఇతర ప్రాంతాల నుంచి రప్పించుకున్న వారి ద్వారా.. మండల నాయకులు డబ్బులు ఖర్చుచేస్తున్నారా? లేక జేబులో వేసుకుని కాకి లెక్కలు చెబుతున్నారా? అనే విషయాలను ఆరా తీస్తున్నారు. నిఘా వర్గాల ద్వారా ఈ విషయాలను సైతం ప్రభుత్వ పెద్దలకు ఎప్పటికప్పుడు చేర వేస్తున్నారు.

గృహోపకరణాలు, నగదు ఎర

టీడీపీ నేతలు ఓ వైపు ప్రచారం చేస్తూనే మరో వైపు ఓటర్లకు గృహోపకరణాలు ఎర వేస్తున్నారు. వస్తువుల కోసం అంటూ పది పదిహేను ఓట్లున్న వారికి ప్రత్యేకంగా నగదు పంపిణీ చేస్తున్నారు. ఇందులో భాగంగా నంద్యాల పట్టణంలోని 19, 20, 32, 35, 36వ వార్డుల్లో 20, 25 ఓట్లు ఉన్న 27 కుటుంబాల వారికి శుక్రవారం రూ.లక్ష చొప్పున ఇచ్చినట్లు తెలిసింది. నగదు పుచ్చుకున్న వారిలో రెండు కుటుంబాల వారు శనివారం విలువైన వస్తువులు కొనుగోలు చేసి నివాసానికి తీసుకొచ్చినట్లు చుట్టుపక్కల వారు తెలియజేశారు. గోస్పాడు మండలంలో ఓటు బ్యాంకు ఉన్న ఓ తటస్థ వ్యక్తికి భారీ మొత్తంలో ఆఫర్ చేసినట్లు తెలిసింది.

అటు వైపు ఎవరూ వెళ్లొద్దు..

టీడీపీ నేతలు వివిధ ప్రాంతాల నుంచి నల్లధనాన్ని నంద్యాలకు చేరవేస్తున్నట్లు నిఘా అధికారి ఒకరు వెల్లడించారు. మద్యం బాటిళ్లను కూడా భారీ పరిమాణంలో నిల్వ చేసినట్లు వివరించారు. ప్రతి రోజూ ఓ వాహనంలో నగదు వస్తోందని, ఆ నగదును నంద్యాల పరిసర ప్రాంతాల్లోని పాత భవనాల్లో దాచారని చెప్పారు. అయితే ఆ నగదు, మద్యం బాటిళ్లు ఎక్కడ ఉన్నాయో తెలిసినా వాటిని స్వాధీనం చేసుకోవద్దని పోలీసులపై పై స్థాయి నుంచి ఒత్తిడి ఉందన్నారు. నగదు, మద్యం డంప్‌లున్న ప్రాంతాల వైపు అసలు వెళ్లకండంటూ ఉన్నతాధికారులు గట్టిగా చెబుతున్నారని, అన్ని విషయాలు తెలిసినా వారి ఆదేశాలు పాటించడం మినహా మరో మార్గం లేదని ఆ అధికారి ఆవేదన వ్యక్తం చేశారు. తమ శాఖలో చాలా మంది పరిస్థితి ఇదేనని చెప్పారు.



ఉప ఎన్నికలో తమకు మద్దతివ్వకుంటే ఉద్యోగం నుంచి తొలగిస్తామని టీడీపీ నేతలు బెదిరిస్తున్నారంటూ నంద్యాల మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు

టీడీపీ నేతల వేధింపులు ఆపాలి

నంద్యాల మున్సిపల్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల ధర్నా

నూనెపల్లె (నంద్యాల): టీడీపీకి ఓటేయాలంటూ ఆ పార్టీ నేతలు బెదిరింపులకు దిగుతున్నారని అంగన్‌వాడీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారి వేధింపులు ఆపాలని శనివారం నిరసనకు దిగారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నంద్యాల మున్సిపల్ కార్యాలయం వద్ద వారు శనివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నంద్యాల డివిజన్ అధ్యక్షుడు కేఎండీ గౌస్ మాట్లాడుతూ.. గోస్పాడు మండలం శ్రీరామ్‌నగర్‌కు చెందిన అంగన్‌వాడీ కార్యకర్త చెన్నమ్మపై అధికారపార్టీ నేతల వేధింపులు అధికమయ్యాయని చెప్పారు. ఆమె బంధువులు వేరే పార్టీలో ఉన్నారన్న నెపంతో టీడీపీ నాయకులు బెదిరింపులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. అధికార పార్టీకి మద్దతిస్తావా? లేదా ఉద్యోగం తొలగించమంటావా? అంటూ బెదిరిస్తున్నారని చెప్పారు. రాజకీయ వేధింపులు ఆపకపోతే యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు నిర్మలమ్మ, నాయకురాళ్లు నిర్మల, సారమ్మ, హన్నమ్మ, శాంత కుమారి, రమణమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

కోస్తాంధ్రకు భారీ వర్ష సూచన

రాయలసీమలో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం: ఐఎండీ

విశాఖ సిటీ/ సాక్షి, అమరావతి: ఒడిశా నుంచి దక్షిణ తమిళనాడు దాకా కోస్తాంధ్ర మీదుగా అల్పపీడన ద్రోణి స్థిరంగా కొనసాగుతోంది. దీని ప్రభావం వల్ల ఈ నెల 14, 15, 16 తేదీల్లో కోస్తాంధ్రలో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశముందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) శనివారం తెలిపింది. అలాగే రాయలసీమలో అక్కడక్కడ 3 రోజుల పాటు మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. మరోవైపు నైరుతి రుతుపవనాలు రాయలసీమలో చురుగ్గా కొనసాగుతుండగా.. కోస్తాంధ్రలో సాధారణంగా ఉన్నాయని ఐఎండీ తెలిపింది. వీటి ప్రభావం వల్ల గడిచిన 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో పలు ప్రాంతాల్లో భారీ నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి. విజయనగరం జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవగా.. శ్రీకాకుళం, అనంతపురం జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిశాయి. విజయనగరం జిల్లా



పూసపాటిరేగలో 12 సెంటీమీటర్ల వర్షం కురిసింది. రాయదుర్గంలో 9, మందస, డెంకాడ, కల్యాణదుర్గంలో 7 సెం.మీ, శృంగవరపుకోట, బాపట్ల, పలాస, గుడివాడ, నర్సీపట్నం, సత్యవేడు, ఓర్వకల్లులో 5 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

అది న్యాయ పాలనను ఎగతాళి చేయడమే

- ఏపీఏటీ ఉత్తర్వులను అమలు చేయకపోవడంపై హైకోర్టు మండిపాటు
- ఈ విషయంలో సీఎస్ సమాధానం చెప్పాలి

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగుల సర్వీసు వివాదాలను పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ పరిపాలన ట్రిబ్యునల్ (ఏపీఏటీ) ఇచ్చే తీర్పును ఆయా ప్రభుత్వ శాఖలు అమలు చేయకపోతుండటంపై ఉమ్మడి హైకోర్టు తీవ్రంగా స్పందించింది. ట్రిబ్యునల్ ఇచ్చే న్యాయ సంబంధిత ఆదేశాలను అమలు చేయకపోవడం న్యాయపాలనను ఎగతాళి చేయడమేనని ప్రభుత్వాన్ని ఉద్దేశించి ఘాటుగా వ్యాఖ్యానించింది. 'ట్రిబ్యునల్ ఆదేశాలను అమలు చేయించేందుకు మేము (హైకోర్టు) ఆయా ప్రభుత్వ శాఖలకు గడువునివ్వడం.. అధికారుల వ్యక్తిగత హాజరుకు ఆదేశాలివ్వడం వంటివి చేస్తున్నాం. ఈ మా ప్రయత్నం సత్ఫలితాలను ఇస్తుందని ఆశించాం. అయితే మా అంచనా



తప్పని రుజువైంది. ట్రిబ్యునల్‌లో విజయం సాధించిన వారు ఆ ఆదేశాల అమలుకు ప్రతీ రోజూ కోర్టు మెట్లు ఎక్కుతున్నారు. విధిలేని పరిస్థితుల్లో వారు అవసరం లేకపోయినా మరో రౌండ్ వివాదానికి సిద్ధమవుతున్నారు' అంటూ హైకోర్టు వ్యాఖ్యానించింది. ఈ పరిస్థితి మారాలని, ఈ విషయంలో చొరవ తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)ని ఆదేశించింది. ట్రిబ్యునల్ ఉత్తర్వులను అమలు చేసేందుకు సీఎస్ తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. ఫైనల్ అయిన కేసులన్నింటినీ సమీక్షించి, ఆ ఉత్తర్వులను నిర్దిష్ట గడువులోపు అమలు చేస్తామంటూ తదుపరి విచారణనాటికి కోర్టుకు అఫిడవిట్ రూపంలో హామీ ఇవ్వాలని సీఎస్‌ను ఆదేశించింది. ట్రిబ్యునల్ ఉత్తర్వులను ఏ ఏ శాఖల్లో అమలు చేయాల్సి ఉందో ఆ వివరాలను అఫిడవిట్‌తో పాటు తమ ముందుంచాలని సీఎస్‌కి స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఈ నెల 28కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ సి.వి.నాగార్జునరెడ్డి, జస్టిస్ జి.శ్యాంప్రసాద్‌లతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. తమ సర్వీసుల క్రమబద్ధీకరణ విషయంలో మూడు వారాల్లో తగిన ఉత్తర్వులు జారీ చేయాలంటూ 2014 ఫిబ్రవరి 12న ట్రిబ్యునల్ ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయకపోవడాన్ని సవాలు చేస్తూ తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఎం.వెంకటేశ్వరరావు మరో ఏడుగురు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై జస్టిస్ నాగార్జునరెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది.

జెండాలు లేకుండా ప్రచారం చేయండి

- నంద్యాల ఉప ఎన్నికలో బీజేపీ మద్దతు కోరిన చంద్రబాబు
- జెండాలు లేకుండా రమ్మనడంపై కర్నూలు బీజేపీ నేతలు ఆగ్రహం
- బీజేపీ రాష్ట్ర పదాధికారుల సమావేశంలో ఈ అంశంపైనే చర్చ

సాక్షి, అమరావతి: కర్నూలు జిల్లా నంద్యాల ఉప ఎన్నికలో ప్రచారానికి తెలుగుదేశం పార్టీ మిత్రపక్ష బీజేపీ మద్దతు కోరింది. అయితే పార్టీ నాయకులు మెడలో బీజేపీ కండువాలు వేసుకోకుండా.. ప్రచారానికి వచ్చే కార్యకర్తలు కమలం పార్టీ జెండాలు పట్టుకోకుండా తమ పార్టీ అభ్యర్థికి ప్రచారం చేయాలని టీడీపీ పెద్దలు కోరడంపై బీజేపీలో దుమారాన్ని రేపింది. శనివారం విజయవాడ సిటీ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు, విశాఖపట్నం ఎంపీ కంభంపాటి హరిబాబు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర పార్టీ పదాధికారుల (రాష్ట్ర కమిటీ) సమావేశంలో ఈ అంశంపై ఘాటుగా చర్చ జరిగింది. సమావేశంలో కర్నూలు జిల్లా నేతలు, రాష్ట్ర పార్టీ నాయకుల మధ్య వాదనలు తీవ్రంగా జరిగాయి. ఉప ఎన్నికలో టీడీపీ అభ్యర్థి గెలుపునకు సహకరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబే తనకు ఫోను చేసి కోరినట్టు కంభంపాటి హరిబాబు తెలిపారు. సమావేశంలో పాల్గొన్న కర్నూలు జిల్లాకు చెందిన కపిలేశ్వరయ్య (పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు), మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. నంద్యాలలో బీజేపీ నేతలను పార్టీ కండువాలు వేసుకొని రావద్దని, జెండాలను పట్టుకుని రావద్దని మంత్రులు, టీడీపీ ఎమ్మెల్యేలు, నాయకులు అంటున్న విషయాన్ని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దృష్టికి తీసుకొచ్చారు. అందువల్లే తాము ప్రచారానికి దూరంగా ఉంటున్నామని తెలిపారు. అలా అయితే తాము ప్రచారంలో పాల్గొనబోమని తేల్చి చెప్పారు. బీజేపీ జెండాలు లేకుండా టీడీపీకి ప్రచారం చేయడం మంచిది కాదని మరికొందరు అభిప్రాయపడ్డారు. జెండాలు లేకుండా రమ్మనడం టీడీపీ తప్పేనని హరిబాబు వ్యాఖ్యానించారు. అయినా చంద్రబాబు కోరిక మేరకు టీడీపీ గెలుపునకు సహకరించాల్సిందేనన్నారు. చివరకు బీజేపీ ఓట్లు టీడీపీ అభ్యర్థికి వేయించేందుకు మంత్రి కామినేని శ్రీనివాసరావు, ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్‌లను రాష్ట్ర పార్టీ నుంచి ప్రతినిధులుగా నంద్యాలకు పంపాలని నిర్ణయించారు.

అమిత్‌షా రాష్ట్ర పర్యటనపైనా చర్చ...

దేశవ్యాప్తంగా బీజేపీని బలోపేతం చేసే ప్రక్రియలో ప్రతి రాష్ట్రంలో మూడు రోజుల పాటు పర్యటిస్తున్న ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా ఈ నెల 28, 29, 30వ తేదీల్లో విజయవాడకు రానున్నారు. దీనికి సంబంధించిన అమిత్‌షా పర్యటన ఏర్పాట్లు, ఇతర విషయాలపై పదాధికారుల సమావేశంలో చర్చించారు. ఇక, దేశానికి స్వాతంత్య్రం వచ్చి 70 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా పార్టీ నిర్వహించే సంకల్ప సిద్ధి యాత్రలో భాగంగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో తిరుపతి, విజయవాడ, ఉత్తరాంధ్రలో సెమినార్‌లు నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు.

'కిడ్నీ' బాధితులు 1,800 మందేనట!

- డయాలసిస్ చేయించుకుంటున్న వారి జాబితా సిద్ధం
- జాబితాలో ఉన్నవారికే పెన్షన్
- నిధుల ఆదా కోసం సర్కారు ఎత్తుగడ
- 15 వేల మందికి తీవ్ర అన్యాయం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కిడ్నీ వ్యాధుల బాధితులు కేవలం 1,800 మంది మాత్రమే ఉన్నట్లు ప్రభుత్వం తేల్చింది. తీవ్ర మూత్రపిండాల రుగ్మతతో బాధపడుతున్న వారికి నెలకు రూ.2,500 చొప్పున పెన్షన్ ఇస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే, వారంలోనే బాధితుల సంఖ్యను భారీగా కుదిస్తూ జాబితాను తయారు చేయడం గమనార్హం. రాష్ట్రంలో డయాలసిస్ చేయించుకుంటున్న వారు 1,800 మందేనని జాబితాలో పేర్కొనడంపై బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెన్షన్ సొమ్మును మిగుల్చుకోవడానికే బాధితుల సంఖ్యను ప్రభుత్వం కుదించిందని అధికార వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రంలో డయాలసిస్ పేషెంట్లు 15 వేల మందికి పైగా ఉన్నట్లు పేర్కొంటున్నాయి. ప్రధానంగా శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంతంలో 17 మండలాల్లో మూత్రపిండాల బాధితులు అత్యధికంగా ఉన్నారు. ప్రకాశం, నెల్లూరు, గుంటూరు, చిత్తూరు జిల్లాల్లోనూ చాలామంది కిడ్నీ వ్యాధుల బారినపడ్డారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోని డయాలసిస్ కేంద్రాల్లో వైద్యం చేయించుకుంటున్న వారికే పెన్షన్ వర్తిస్తుందంటూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రైవేట్ ఆస్పత్రుల్లో డయాలసిస్ చేయించుకుంటున్న బాధితులకు తీవ్ర అన్యాయం జరగనుంది. ఇప్పటికే ఒక్కో కిడ్నీ వ్యాధిగ్రస్థుడికి నెలకు రూ.10 వేలు ఖర్చు చేస్తున్నట్టు ప్రభుత్వం చెబుతోంది. ఒక్కో బాధితుడికి ఒక్కసారి రక్తశుద్ధి చేస్తే రూ.వెయ్యి ఖర్చవుతోందని, నెలకు ఎనిమిదిసార్లు డయాలసిస్ చేస్తే రూ.8,000 వ్యయమవుతోందని, మందుల కోసం మరో రూ.2,000 ఇస్తున్నామని పేర్కొంటోంది. ఇప్పుడు నెలకు రూ.2,500 చొప్పున పెన్షన్ ఇస్తే, ఏడాదికి రూ.30,000 ఇచ్చినట్టు అవుతుందని భావిస్తోంది. అందుకే నిధులు మిగుల్చుకోవడానికే బాధితుల సంఖ్యలో కోత విధించినట్లు తెలుస్తోంది.

రాష్ట్రంలో డయాలసిస్ యంత్రాలు, చికిత్స పొందుతున్న రోగులు

ఆస్పత్రి	డయాలసిస్ యంత్రాలు	రోగుల సంఖ్య
కింగ్‌జార్జి, విశాఖ	13	141
జీజీహెచ్, గుంటూరు	16	181
జీజీహెచ్, కాకినాడ	11	125
జీజీహెచ్, కర్నూలు	17	178
ఎస్వీఆర్ఆర్, తిరుపతి	9	86
జీజీహెచ్, విజయవాడ	12	157
రిమ్స్, శ్రీకాకుళం	15	190
రిమ్స్, ఒంగోలు	21	178
రిమ్స్, కడప	17	165
డీహెచ్, ఏలూరు	10	110
జీజీహెచ్, అనంత	11	109
ఏసీఎస్ఆర్, నెల్లూరు	13	103
డీహెచ్, విజయనగరం	8	86

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 270 1083



సిక్స్‌ప్యాక్ మైకంలో...
స్టెరాయిడ్స్ లోకంలో...

అడ్డదారులు తొక్కుతున్న యువత

- బాడీబిల్డింగ్ వర్కవుట్ కోసం స్టెరాయిడ్ల వాడకం
- ఒకొక్కరు నెలకు రూ.5 వేల నుంచి 8 వేల వరకు ఖర్చు
- డాక్టర్ సిఫారసు లేకుండానే విక్రయాలు

విదేశాల నుంచి దిగుమతి అవుతున్న స్టెరాయిడ్స్‌తోపాటు స్థానికంగా దొరికే వీటికి అలవాటుపడుతున్న యువత ఆరోగ్యంతోపాటు ఆర్థికంగాను చిత్తవుతున్నారు. సాధారణ యువకుడు జిమ్‌లో 30 నిమిషాలపాటు ఆగకుండా వర్కవుట్స్ చేయగలుగుతాడు. అదే స్టెరాయిడ్స్ తీసుకున్న వ్యక్తి దాదాపు రెండు గంటలపాటు అలిసిపోకుండా చేయగలడు.

ఆరోగ్యంపై దుష్ప్రభావాలు..

తాత్కాలిక ప్రయోజనం కోసం ఉత్ప్రేరకాలను వినియోగిస్తే దీర్ఘకాలంలో చెడు ఫలితాలే ఎక్కువ. ఇవి హార్మోన్లు విడుదలలో తీవ్ర ప్రభావం చూపిస్తాయి. అదనపు శక్తి కోసం తీసుకునే స్టెరాయిడ్స్ వినియోగం ఆపేసిన మూడు, నాలుగేళ్లలో వాటి దుష్ప్రభావాలు బయటపడతాయి. హైపర్ టెన్షన్, నరాల బలహీనత, గుండెపోటు, బ్రెయిన్ ట్యూమర్, క్యాన్సర్, కీళ్లు, మోకాళ్ల నొప్పులు, బీపీ, షుగర్ వచ్చే ప్రమాదం ఉంది.

– డాక్టర్ వీరభద్రయ్య, అసోసియేట్ ప్రొఫెసర్, అనంతపురం ప్రభుత్వాసుపత్రి

యువశక్తిని నిర్వీర్యం చేసుకోవద్దు..

రాష్ట్రంలోని జిమ్‌లు, బాడీబిల్డింగ్ సెంటర్లలో వీటిని ఎట్టి పరిస్థితుల్లోను అనుమతించరు. అయినా, చాటుమాటుగా కొందరు యువకులు ఉత్ప్రేరకాలను వాడుతున్నట్లు తెలిస్తే జిమ్ ఇన్‌స్ట్రక్టర్లు మాన్పించే ప్రయత్నాలు చేస్తారు. లేని శక్తిని తెచ్చుకునేందుకు ఉత్ప్రేరకాలు వినియోగించి యువశక్తిని నిర్వీర్యం చేసుకోవడం మంచిదికాదు. ఆరోగ్యం కోసం, అందమైన దేహదారుఢ్యం కోసం చేసే బాడీబిల్డింగ్ క్రమశిక్షణతో కూడుకున్నదిగా ఉండాలి.



– షేక్ ఖాసీం, ఏపీ బాడీ బిల్డింగ్ అసోసియేషన్, స్టేట్ జాయింట్ సెక్రటరీ

కండల వీరుడు సల్మాన్‌ఖాన్‌లా తక్కువ టైమ్‌లోనే తయారవ్వాలి.. బాహుబలిలో ప్రభాస్, రాణా మాదిరిగా బలిష్టమైన శరీరాకృతిని సాధించాలి.. కాలేజీల్లోను, కార్యాలయాల్లోను సిక్స్‌ప్యాక్‌తో సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్ కావాలి.. ఇవి ఫిజికల్ ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యత ఇస్తున్న యువత ఆలోచనా ధోరణులు. వీరిలో జిమ్‌లకు వెళ్లి కఠోర శ్రమతో కండలు తిప్పుతున్న వారు కొందరైతే.. అనతికాలంలో కండలు పెంచేందుకు అడ్డదారులు తొక్కుతున్న వారు ఇంకొందరు. రెండో కోవకు చెందిన వారి రహస్యం తెలిస్తే కంగుతినాల్సిందే. అవే స్టెరాయిడ్స్.

– సాక్షి, అమరావతి



క్రమశిక్షణ, క్రమం తప్పకుండా వ్యాయామం (వర్కవుట్)తో క్రమంగా సాధించాల్సిన శరీరాకృతి(సిక్స్‌ప్యాక్)ని ఉన్నపళంగా అందిపుచ్చుకోవాలన్న ఆతృతతో కొందరు అడ్డదారులు తొక్కుతున్నారు. రాష్ట్రంలో విజయవాడ, విశాఖతోపాటు పలు ముఖ్య పట్టణాల్లో వీటిని ఎక్కువగా వాడుతున్నారు. సిక్స్‌ప్యాక్, దేహదారుఢ్యం యువతకు క్రేజ్‌గా మారిన ప్రస్తుత తరుణంలో ఉత్ప్రేరకాల మోజులో పడడం ఆందోళన కలిగిస్తున్న పరిణామం. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో దాదాపు 450 జిమ్‌లు ఉన్నట్టు అంచనా. అయితే, నిత్యం వ్యాయామం చేస్తూ శరీరాకృతిని కాపాడుకుంటూ బాడీబిల్డింగ్ పోటీలకు వెళ్తున్న ప్రొఫెషనల్స్ కేవలం 320మంది మాత్రమే ఉన్నారు. సిక్స్‌ప్యాక్, మెలితిరిగిన కండల కోసం నిత్యం జిమ్‌లలో వర్కవుట్లు చేస్తున్న యువకులు వేల సంఖ్యలో ఉన్నారు. వీరంతా ప్రతీరోజు ఉదయం, సాయంత్రం గంటల తరబడి సమయాన్ని వెచ్చిస్తున్నారు. ఒకరిని చూసి మరొకరు వీటిని అలవాటు చేసుకుంటున్నారని జిమ్ ఇన్‌స్ట్రక్టర్లు చెబుతున్నారు. వాస్తవానికి క్రమం తప్పకుండా ఖచ్చితమైన పద్ధతులు పాటిస్తే సిక్స్‌ప్యాక్ రావడానికి కనీసం ఏడాది పడుతుంది. కానీ, షార్ట్‌కట్‌లో మూడు నెలల్లో సాధించేందుకు స్టెరాయిడ్స్‌కు అలవాటుపడి కొత్త సమస్యలు కొనితెచ్చుకుంటున్నారు.

విచ్చలవిడిగా స్టెరాయిడ్స్ వినియోగం

విదేశాల నుంచి దిగుమతి అవుతున్న స్టెరాయిడ్స్‌తోపాటు స్థానికంగా దొరికే వీటికి అలవాటుపడుతున్న యువత ఆరోగ్యంతోపాటు ఆర్థికంగాను చిత్తవుతున్నారు. సాధారణ యువకుడు జిమ్‌లో 30 నిమిషాలపాటు ఆగకుండా వర్కవుట్స్ చేయగలుగుతాడు. అదే స్టెరాయిడ్స్ తీసుకున్న వ్యక్తి దాదాపు రెండు గంటలపాటు అలిసిపోకుండా చేయగలడు. శరీరంలో కొవ్వును వేగంగా తగ్గించి కండరాల ఆకృతిని మలిచేందుకు ఇవి దోహదం చేస్తాయి. తక్కువ సమయంలో సామర్థ్యానికి మించిన వేగంతో శరీరాకృతిని సాధించేందుకు ఉపయోగపడతాయి. ఉత్ప్రేరకాల ప్రభావంతో శరీరంలోని మెదడు, అవయవాలు శక్తికి మించి పనిచేయడం ప్రారంభిస్తాయని వైద్యులు చెబుతున్నారు. మామూలుగా జరగాల్సిన ప్రక్రియను ఉత్ప్రేరకాల ద్వారా ఒత్తిడి పెంచడంవల్ల భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలు తీవ్రమవుతాయని వైద్యులు చెబుతున్నారు.

ఇల్లు.. ఒళ్లు గుల్ల..

బాడీబిల్డింగ్ చేసే యువకులు రోజువారీ సాధారణ ఆహారంకంటే బలమైన ఆహారం తీసుకుంటారు. దీనికితోడు విటమిన్ పౌడర్ కూడా వాడుతున్నారు. అంతవరకు బాగానే ఉన్నా.. ఉత్ప్రేరకాల కోసం చాలా మంది యువకులు నెలనెలా రూ.5 వేల నుంచి రూ.8 వేల వరకు ఖర్చుపెడుతున్నారు. డైనబాల్, టెస్టోస్టెరాయిన్, న్యూవిర, కెన్‌బొట్రాల్, అనిమల్‌పాక్ తదితర ఉత్ప్రేరకాలను వాడుతున్నారు. డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ లేకుండా మెడికల్ షాపుల్లో వీటిని విక్రయించకూడదన్న నిబంధనను కొందరు ఉల్లంఘిస్తున్నారు. ఇటువంటి షాపులు రాష్ట్రంలో 30కి పైగా ఉన్నాయి. కాగా, విదేశాలకు చెందిన స్టెరాయిడ్స్ ధరలు ఎక్కువగా ఉండటంతో ఇప్పుడవి స్థానికంగానే తయారుచేసి తక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. ఈ తరహా మందులవల్ల ఫలితం ఎలా ఉన్నా దుష్ఫలితాలు ఎక్కువగా ఉంటాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

‘పురుషోత్తపట్నం’కు ఎత్తిపోతలకు
హంద్రీ-నీవా మోటార్లు

నేడు ఒక మోటారుతో ట్రయల్ రన్

సాక్షి, అమరావతి: పురుషోత్తపట్నం ఎత్తిపోతల ట్రయల్ రన్‌ను హంద్రీ–నీవా సుజల స్రవంతి పథకం మోటార్లతో నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఒక మోటారుతో దీనిని నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేసుకున్నారు. పట్టిసీమ ఎత్తిపోతల ట్రయల్ రన్‌కూ ఇదే తరహాలో 2015లో హంద్రీ–నీవా సుజల స్రవంతి పథకం మోటార్లను తరలించడం గమనార్హం. తొమ్మిది నెలల్లోగా పురుషోత్తపట్నం ఎత్తిపోతలను పూర్తిచేసి పట్టిసీమలో తాము సృష్టించిన ‘ఏడాది’ రికార్డును తిరగరాస్తామని సీఎం చంద్రబాబు గతేడాది జనవరి 5న ప్రకటించారు. ఒప్పందం తేదీ నుంచి తీసుకుంటే పురుషోత్తపట్నం ఎత్తిపోతల పూర్తిచేసే గడువు 20 రోజుల్లోగా పూర్తికానుంది. ఈ నేపథ్యంలో కేవలం రెండు పంప్ హౌస్‌లను తాత్కాలికంగా అందుబాటులోకి తెస్తూ.. రెండు మోటార్లనైనా బిగించి.. 700 క్యూసెక్కులను తోడాలని నిర్ణయించారు. ఇందుకు అవసరమైన మోటార్లను హంద్రీ–నీవా ఎత్తిపోతల పథకం నుంచి తీసుకోవాలని ప్రభుత్వం సూచించింది. దాంతో రెండు రోజుల క్రితం కర్నూల్ జిల్లా మల్యాల వద్ద హంద్రీ–నీవా పంప్ హౌస్ నుంచి రెండు మోటార్లను తూర్పుగోదావరి జిల్లా పురుషోత్తపట్నానికి తరలించారు. ఇందులో ఒక మోటారును శనివారం బిగించారు. స్విచ్చాన్ చేసి.. పది నిమిషాలపాటైనా నీటిని తోడాలన్న ఉద్దేశ్యంతో ఆదివారం ట్రయల్ రన్ నిర్వహించనున్నారు. బీహెచ్‌ఈఎల్ నుంచి పురుషోత్తపట్నం ఎత్తిపోతలకు మోటార్లు అందిన తర్వాతే ఇక్కడి హంద్రీ–నీవా మోటార్లను మల్యాలకు తిరిగి తరలిస్తామని జలవనరుల శాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

న్యాయవాదులు ఆందోళన చేయడం సరికాదు

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్ భట్

ఆదోని: కోర్టు భవనాల నిర్మాణం కోసం ఆదోని బార్ న్యాయవాదులు కొందరు రిలే నిరాహార దీక్షలు, ఆందోళనలు చేపట్టడం సరికాదని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్ భట్ అన్నారు. శనివారం ఆయన కర్నూలు జిల్లా ఆదోనిలో కోర్టు భవన సముదాయాల నిర్మాణం కోసం ప్రతిపాదించిన స్థలాలను పరిశీలించారు. ఎమ్మిగనూరు రోడ్డులోని ఆరేకల్లు గ్రామం, పట్టణ శివారులోని ఆర్ఆర్ లేబర్ కాలనీ పాత క్వార్టర్స్ పక్కన ఉన్న స్థలాలతో పాటు ప్రస్తుతం కొనసాగుతున్న కోర్టు భవనాలను పరిశీలించారు. అనంతరం న్యాయవాదులతో బార్ అసోసియేషన్ కార్యాలయంలో మాట్లాడారు. ఆందోళన కారణంగా ఇబ్బంది పడ్డ కక్షిదారులకు న్యాయస్థానాలపై విశ్వాసం సన్నగిల్లే అవకాశం ఉందని, న్యాయవ్యవస్థకు ఇది ఏ మాత్రమూ మంచిది కాదని పేర్కొన్నారు. ఆదోని కోర్టుకు కొత్త భవనాలు మంజూరు అయినప్పటికీ ఎక్కడ నిర్మించాలన్న విషయమై న్యాయవాదుల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నాయన్నారు. అయితే హైకోర్టు దృష్టికి తీసుకురాకుండా కొందరు న్యాయవాదులు ఆందోళనలు చేపట్టడం విచారకరమన్నారు.



ఆదోనిలోని ఆర్ఆర్ లేబర్ కాలనీ వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి వీఆర్ భట్

తాను పరిశీలించిన మూడు స్థలాలకు సంబంధించి పూర్తి వివరాలతో కూడిన నివేదికను హైకోర్టు కమిటీకి సమర్పిస్తానని, కమిటీ నిర్ణయం మేరకే కోర్టు భవన సముదాయాల నిర్మాణం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా జడ్జి అనుపమ చక్రవర్తి, ఆదోని రెండో జిల్లా కోర్టు జడ్జి శ్రీనివాసరావు, సీనియర్, జూనియర్ జడ్జిలు తిరుమలరావు, మధుస్వామి, మేజిస్ట్రేట్ సాయిరామ్, ఆర్డీవో ఓబులేసు, తహశీల్దారు శ్రీనివాసరావు, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జీసీ రంగన్న, విజయభాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏనుగుల తరలింపునకు
హైడ్రాలిక్ అంబులెన్స్

దేశంలోనే మొదటిసారి తమిళనాడులో ప్రయోగాత్మకంగా పరిశీలన

కేకే.నగర్ (చెన్నై): ఏనుగులను తరలించేందుకు ప్రత్యేక హైడ్రాలిక్ అంబులెన్స్‌ను శనివారం తమిళనాడు అటవీశాఖ అధికారులు ప్రవేశపెట్టారు. ఇందులో కుంకీ ఏనుగును ఎక్కించి ప్రయోగాత్మకంగా ట్రయల్‌రన్ నిర్వహించారు.



ఏనుగును హైడ్రాలిక్ అంబులెన్స్‌లో ఎక్కిస్తున్న శిక్షకులు

తమిళనాడులోని కోయంబత్తూరు, ఈరోడ్, నీలగిరి జిల్లాల్లో అటవీ ప్రాంతాల నుంచి ఏనుగులు గ్రామాల్లోకి ప్రవేశించి దాడులు చేస్తున్నాయి. వీటిని అక్కడి నుంచి పట్టుకుని అడవుల్లోకి వదిలేందుకు లారీల్లో ఎక్కించడం అధికారులకు సమస్యగా మారింది. దీనికి పరిష్కారంగా సత్యమంగళం అభయారణ్యం పులుల సంరక్షణ కేంద్రంలో ఏనుగులను సురక్షితంగా తీసుకెళ్లేందుకు అంబులెన్స్‌ను ప్రవేశపెట్టారు. దీన్ని శనివారం కోయంబత్తూరులోని చావడిలో ప్రయోగాత్మకంగా పరీక్షించారు. దీనిపై సత్యమంగళం అటవీ శాఖ వెటర్నరీ వైద్యుడు అశోకన్ మాట్లాడుతూ తిరునల్వేలి, హోసూరు, సత్యమంగళం, పులుల సంరక్షణ కేంద్రంలో రూ.20 లక్షలతో అంబులెన్స్‌ను రూపొందించినట్లు తెలిపారు. ఇందులో 10 టన్నుల బరువు గల ఏనుగులను ఎక్కించవచ్చన్నారు. అంబులెన్స్‌లో ట్రక్కును కిందకు దింపి మోటార్ సహాయంతో తాడు కట్టి ఏనుగులను సులభంగా లోపలికి పంపవచ్చునని చెప్పారు. మూడు వైపులా తలుపులు ఉండడం వల్ల ఏనుగులను సులభంగా వెలుపలికి వదలవచ్చునని ఆయన వివరించారు.

ఎస్పీడీసీఎల్‌లో 26 మందికి మెరిట్ అవార్డులు

15న తిరుపతిలో సీఎండీ చేతుల మీదుగా ప్రదానం

సాక్షి ప్రతినిధి, తిరుపతి: దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్) పరిధిలోని వివిధ జిల్లాలకు చెందిన 26 మంది ఉద్యోగులకు ఆగస్టు 15న మెరిట్ అవార్డులు ప్రదానం చేస్తున్నట్లు తిరుపతి ఎస్పీడీసీఎల్ కార్యాలయం పేర్కొంది. తిరుపతిలోని డిస్కం కార్యాలయ ప్రాంగణంలో జరిగే స్వాతంత్ర్య వేడుకల్లో వీటిని సీఎండీ హెచ్‌వై దొర ప్రదానం చేయనున్నట్లు వివరించింది. ఆపరేషన్స్ విభాగంలో 10 మంది, డీపీఈ విభాగంలో ముగ్గురు, ట్రాన్స్‌ఫార్మర్స్ విభాగంలో ఇద్దరు, మెయింటెనెన్స్, ప్రొడక్షన్ విభాగంలో ఇద్దరు, అకౌంట్స్ విభాగంలో నలుగురు చొప్పున అవార్డులకు ఎంపికయ్యారు. బెస్ట్ డివిజనల్ ఇంజనీర్‌గా యు.హనుమయ్య (గుంటూరు డీఈఈ), బెస్ట్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్‌గా కె.బాబు (ఏడీఈ, గుంటూరు), ఉత్తమ ఏఈగా ఇ.శ్రీనివాసరెడ్డి (పొద్దుటూరు), ఉత్తమ సబ్‌ఇంజనీర్‌గా ఎన్.శివప్రసాద్ (పొద్దుటూరు), ఉత్తమ ఫోర్‌మెన్‌గా కె.రఘురామరాజు (పైపల్లి), ఉత్తమ సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్‌గా కె.సుబ్రమణ్యం (కోవూరు), ఉత్తమ లైన్ ఇన్‌స్పెక్టర్‌గా జి.రామలింగారెడ్డి (మదనపల్లె), ఉత్తమ లైన్‌మెన్‌గా సి.హెచ్.సాంబశివరావు (బుజబుజ నెల్లూరు), ఉత్తమ అసిస్టెంట్‌లైన్‌మెన్‌గా పి.బాబు (కర్నూలు), ఉత్తమ జూనియర్ లైన్‌మెన్‌గా బి.వెంకటసుబ్బయ్య (నెల్లూరు) ఎంపికయ్యారు. డీపీఈ విభాగంలో ఉత్తమ డివిజనల్ ఇంజనీర్‌గా జె.శ్రీనివాసులురెడ్డి (గుంటూరు), ఉత్తమ ఏడీఈగా జి.రెడ్డెప్ప (తిరుపతి), ఉత్తమ అసిస్టెంట్ ఇంజనీర్‌గా బి.రమేష్‌బాబు (కడప) ఎంపికయ్యారు. ట్రాన్స్‌ఫార్మర్స్ విభాగంలో.. ఉత్తమ డివిజనల్ ఇంజనీర్‌గా కె.సంపత్‌కుమార్ (అనంతపురం), ఉత్తమ ఏడీఈగా బి.పులికొండ (కర్నూలు) ఎంపికయ్యారు. మెయింటెన్స్, ప్రొడక్షన్ విభాగంలో.. ఉత్తమ డివిజనల్ ఇంజనీర్‌గా జి.వి.ఎన్.పార్థసారథి (విజయవాడ), ఉత్తమ ఏడీఈగా డి.భూపతి (చిత్తూరు) అవార్డులు గెలుచుకున్నారు. అకౌంట్స్ విభాగంలో.. బెస్ట్ అకౌంట్స్ ఆఫీసర్‌గా జి.మధుకుమార్ (నెల్లూరు), ఉత్తమ ఏఏవోగా కె.శ్రీనివాసులురెడ్డి (గుడివాడ), ఉత్తమ జేఏవోగా ఏవీఎస్ఎస్ ప్రసాద్ (గుంటూరు), ఉత్తమ సీనియర్ అసిస్టెంట్‌గా కె.రమేష్ (పిడుగురాళ్ల), ఉత్తమ జూనియర్ అసిస్టెంట్‌గా ఎన్.సరోజినీదేవి (సత్తెనపల్లి) ఎంపికయ్యారు. అలాగే సివిల్ విభాగంలో.. ఉత్తమ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పి.భాస్కర్‌రెడ్డి (తిరుపతి), ఉత్తమ ఏడీఈగా జి.విష్ణువర్ధన్ (తిరుపతి), ఉత్తమ ఏఈగా ఎ.గురుప్రసాద్ (కర్నూలు), ఉత్తమ సబ్ ఇంజనీర్‌గా పి.వసంతరాజులు (కడప) ఎంపికయ్యారు.

తుపాకీతో కాల్చుకుని సైనికుడి ఆత్మహత్య

తిరువణ్ణామలై (తమిళనాడు): అస్సాం రాష్ట్రంలోని దేశ సరిహద్దు ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న ఓ సైనికుడు గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తమిళనాడులోని తిరువణ్ణామలై జిల్లా ఆరణి తాలుకా ఇళయప్పగుణం గ్రామానికి చెందిన మాజీ సిపాయి కరుణాకరన్ కుమారుడు కార్తికేయన్ (32) అస్సాంలోని దేశ సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 10వ తేదీన విధినిర్వహణలో ఉండగా కార్తికేయన్ తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు ఢిల్లీ ఆర్మీ కార్యాలయం నుంచి శుక్రవారం ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం వచ్చింది. అతడి మృతిపై పూర్తి సమాచారం తెలుసుకునేందుకు కుటుంబ సభ్యులు ఢిల్లీలోని ఆర్మీ అధికారులకు ఫోన్ చేసినా ఫలితం లేకుండాపోయింది. దీంతో ఆయన కుటుంబ సభ్యులు శనివారం తిరువణ్ణామలై కలెక్టర్‌ను కలసి కార్తికేయన్ ఆత్మహత్యపై సందేహాలున్నాయని కన్నీరు మున్నీరయ్యారు. ఈ ఘటనపై విచారణ జరుపుతామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కాగా, కార్తికేయన్ మృతదేహాన్ని శనివారం సాయంత్రం అస్సాం నుంచి విమానంలో చెన్నైకు తీసుకొచ్చి అక్కడ నుంచి ఆర్మీ వాహనంలో ఆరణికి తీసుకువస్తారని తెలిపారు.



కార్తికేయన్ (ఫైల్)

బస్సులో చెలరేగిన మంటలు

సురక్షితంగా బయటపడ్డ 44 మంది ప్రయాణికులు

తమిళనాడు: బెంగుళూరు నుంచి చెన్నై వైపు వస్తున్న వోల్వో బస్సులో హఠాత్తుగా మంటలు వ్యాపించడంతో బస్సు తగలబడింది. అయితే డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో 44 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. కర్ణాటకకు చెందిన ఏసీ బస్సు శుక్రవారం రాత్రి బెంగుళూరు నుంచి చెన్నైకి బయలుదేరింది. శనివారం ఉదయం బస్సులో నుంచి స్వల్పంగా పొగలు వస్తున్నట్టు గుర్తించిన కొందరు ద్విచక్ర వాహనచోదకులు డ్రైవర్‌ను అప్రమత్తం చేశారు. వెంటనే తేరుకున్న డ్రైవర్ శ్రీధరన్ చాకచక్యంగా వ్యహరించి బస్సును రోడ్డు పక్కన నిలిపి వేశాడు. అప్పటికే పొగలు మరింత వ్యాపించడంతో బస్సులోని ప్రయాణికులను వెంటనే కిందకు దిగాల్సిందిగా కేకలు వేశాడు. దీంతో ప్రయాణికులు బస్సు దిగి పరుగులు తీశారు. వెంటనే పొగలు మరింత ఎక్కువై మంటలు వ్యాపించాయి. డ్రైవర్ అందించిన సమాచారంతో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది దాదాపు గంట పాటు శ్రమించి మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే బస్సు పూర్తిగా కాలిపోయింది.



బస్సులో నుంచి చెలరేగుతున్న మంటలు

విజయవాడలో సేంద్రియ, నర్సరీ ఎక్స్‌పో!

- 15 నుంచి 18 వరకు నిర్వహణ.. 120 స్టాళ్ల ఏర్పాటు
- సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై అవగాహన
- ఉద్యాన కమిషనర్ చిరంజీవి చౌదరి

సాక్షి, అమరావతి బ్యూరో: సేంద్రియ పంటల ఉత్పత్తి, మార్కెటింగ్, నర్సరీ ఉత్పత్తుల ఎగుమతులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ‘సేంద్రియ, నర్సరీ ఎక్స్‌పో–2017’ను నిర్వహిస్తున్నట్లు ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ కమిషనర్ చిరంజీవి చౌదరి తెలిపారు. విజయవాడలోని సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ ప్రాంగణంలో ఈనెల 15 నుంచి 18 వరకు ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ ఎక్స్‌పో కొనసాగుతుందన్నారు. గుంటూరులోని వ్యవసాయ శాఖ కమిషనరేట్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఉద్యాన రంగంలోని ప్రాసెసింగ్, ఉత్పత్తుల మార్కెటింగ్ అవకాశాలను ఒకే వేదికపై తీసుకొస్తున్నట్లు వివరించారు. ఎక్స్‌పోలో రైతులు, రైతు సంఘాలు, వ్యాపార సంస్థలు తాము ఉత్పత్తి చేసే సేంద్రియ ఆహార, ఆహారేతర ఉత్పత్తులను ప్రదర్శిస్తారని చిరంజీవి చౌదరి తెలిపారు. సేంద్రియ పద్ధతిలో పండించిన పండ్లు, కూరగాయలు, ఆహార శుద్ధి పదార్థాలు, తేనె, విలువ ఆధారిత ఉత్పత్తులను అమ్ముకునే అవకాశం కల్పిస్తారని వివరించారు. రాష్ట్రంలోని ప్రముఖ ప్రైవేటు నర్సరీలు, కంపెనీల ఉత్పత్తులను స్టాల్స్‌లో ప్రదర్శిస్తారని ఆయన చెప్పారు. దేశంలోనే కడియం పూల నర్సరీలు, పండ్ల తోటల నర్సరీలు చాలా ప్రాధాన్యత సంతరించుకున్నాయని, పూలు, మొక్కలు ప్రదర్శనలో ఉంటాయని తెలిపారు. ఈ ఎక్స్‌పోలో దాదాపు 120 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు చిరంజీవి చౌదరి తెలిపారు. అందులో 2 స్టాల్స్ సేంద్రియ విభాగానికి, 17 నర్సరీ విభాగానికి , 8 నీటి పారుదల విభాగానికి, మిగిలినవి రైతులు, రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన శాఖలకు కేటాయిస్తున్నారు. ఆహార శుద్ధి, సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల వ్యాపారంపై ఈ నెల 17న రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ చిరంజీవి చౌదరి, డిప్యూటీ డైరెక్టర్ హనుమంతరావు

GOVERNMENT OF ANDHRA PRADESH
APEWIDC :: Vijayawada, Amaravathi
"e-Procurement Tender Notice"
NIT No.s : 144 to 156 /MD/APEWIDC/VJA/2017-18. Dt: 11.08.2017.
Repairs and Maintenance to Residential School complex buildings at Srikakulam, Vizianagaram, Visakhapatnam, East Godavari, West Godavari, Krishna, Prakasam, Kurnool (2nd Call), Construction of Additional Dining Hall at MJPAPBCWR School for Girls at Onipenta of Kadapa (DT), Construction of SW College hostel building for Girls at Mochampeta and Prakash Nagar in Kadapa (DT), Rajampeta, Proddatur of Kadapa (DT) and Construction of Kreeda Vikasa Kendram (KVP) at Govt.Junior College / High School ground, Palasa in Srikakulam (DT)
Start Date for download 12.08.2017 at 03.00 PM.
Further details can be had from the O/o MD, APEWIDC, Chittinagar, Vijayawada and viewed at https://tender.apeprocurement.gov.in or Phone No.: 0866-2512822.
Sd/- Managing Director, APEWIDC, Vijayawada.

సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్స్ ఇంజనీరింగ్ & టెక్నాలజీ (సిపెట్)
(రసాయన మరియు పెట్రో రసాయన విభాగం, రసాయన మరియు ఎరువుల మంత్రిత్వశాఖ, భారత ప్రభుత్వం)
ఐడీఏ, ఫేజ్-2, చర్లపల్లి, హైదరాబాద్ - 500 051
Tel: 040-27263750, 27263615; Fax: 040-27264051
ఈమెయిల్: cipethyderabad@yahoo.co.in, వెబ్: www.cipet.gov.in
ఉచిత శిక్షణ మరియు ఉపాధి కార్యక్రమాలు
నిరుద్యోగ SC/ST/BC/GENERAL క్యాటగిరీలకు చెందిన యువత కొరకు దిగువ నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు CIPET- హైదరాబాద్ నిర్వహిస్తున్నది. ఈ కోర్సులలో చేరుటకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నవి.

క్ర.సం.	కోర్సు పేరు	కాల వ్యవధి	కనీస అర్హత	వయోపరిమితి
1	మెషిన్ ఆపరేటర్ అసిస్టెంట్/మెషిన్ ఆపరేటర్ (ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్/ప్లాస్టిక్స్ ఎక్స్‌ట్రూషన్/ ఇంజక్షన్ మౌల్డింగ్/బ్లో మౌల్డింగ్)	3 లేదా 6 నెలలు	8వ తరగతి లేదా ఆపైన	18 నుండి 30 సంవత్సరాలు*
2	మెషిన్ ఆపరేటర్ & ప్రోగ్రామర్ - CNC లేత్/CNC మిల్లింగ్	6 నెలలు	10వ తరగతి లేదా ITI లేదా ఆపైన	

*గరిష్టవయోపరిమితి SC/ST అభ్యర్థులకు 05 సం॥లు & BC అభ్యర్థులకు 03 సం॥లు వరకు సడలించబడుతుంది.
శిక్షణ ఇచ్చు స్థలం: సిపెట్, చర్లపల్లి, హైదరాబాద్
ఉపాధి: శిక్షణ అనంతరం పేరెన్నికగల ప్లాస్టిక్స్ లేదా ప్లాస్టిక్స్ అనుసంధపరిశ్రమలలో ఉద్యోగ అవకాశాలు కల్పించబడును
శిక్షణ, వసతి మరియు భోజనం: పూర్తిగా ఉచితం
వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాలలో రూ. 98,000/- మరియు పట్టణ ప్రాంతాలలో రూ. 1,20,000/- కు మించరాదు.
దరఖాస్తు చేయు విధానం: ఆసక్తిగల అభ్యర్థులు తమ బయోడాటాని అవసరమైన అన్ని డాక్యూమెంట్ల కాపీలు అనగా: మార్కు షీట్స్, కులం సర్టిఫికెట్, ఆదాయం సర్టిఫికెట్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు మరియు 05 కలర్ పాస్ పోర్టు సైజు ఫోటో గ్రాఫ్ లతో పై చిరునామాకు లేదా Email ID: cipethydstc2@gmail.com కి మెయిల్ ద్వారా పంపవలెను.
వివరాలకు సంప్రదించండి
శ్రీ పి విజయ్ కుమార్ : 9849599133
శ్రీ ఎ కె రావ్ : 9959333416
శ్రీ డి వి సాయి సురేంద్ర : 9959333418
శ్రీ బి అంజి నాయక్ : 9959426791
శ్రీ ఎ కిరణ్ కుమార్, డైరెక్టర్ & హెడ్ - 9959333415

అహ్మద్ పటేల్ (రాజ్యసభ సభ్యుడు)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

దేవుడు ఒకటిచ్చి ఒకటి తీసుకుంటాడు. రాజ్యసభలో నాకు చోటిచ్చి, హమీద్‌జీ సీటు లాగేసుకున్నాడు. దేవుడు ఒకటడిగితే ఇంకోటి ఇస్తాడు. ఉపరాష్ట్రపతిగా గోపాలకృష్ణ గాంధీని ఇమ్మంటే వెంకయ్య నాయుడిని ఇచ్చాడు.

హమీద్‌జీ ప్లేస్‌లో వెంకయ్య నాయుడిని ఊహించడం కష్టంగా ఉంది. ఊహేముందీ? వాస్తవమే! వచ్చి సీట్లో కూడా కూర్చున్నాడు. శుక్రవారం అయింది, శనివారం అయింది.

ఈ శుక్రవారాలు, శనివారాలు ఇక్కడితో అయిపోయేవి కావు. వర్షాకాలాల్లో వర్షాకాల శుక్రవారాలు, వర్షాకాల శనివారాలు ఉన్నట్లే.. శీతాకాలాల్లో శీతాకాల శుక్రవారాలు, శీతాకాల శనివారాలు ఉంటాయి. ఇవి కాకుండా.. బడ్జెట్ కాల శుక్రవారాలు, బడ్జెట్ కాల శనివారాలు!! వారంలో వట్టి శుక్రవారాలు, శనివారాలు మాత్రమే ఉండవు కదా.

ఇరవై నాలుగేళ్లుగా రాజ్యసభకు వచ్చిపోతున్నాను. ఎప్పుడూ నేనిలా రోజుల్ని, వారాల్ని లెక్కేసుకోలేదు! ఇంకో ఐదేళ్లు వెంకయ్య నాయుడిని చూస్తూ గడపాలి. నయం, రాజ్యసభ సభ్యుడికి ఉన్నట్లు, రాజ్యసభ ఛైర్మన్‌కి ఆరేళ్ల టెన్యూర్ లేదు. ఉండుంటే, ఇంకో ఏడాది ఆయన్ని శీతాకాలాల్లో, వర్షాకాలాల్లో, బడ్జెట్ కాలాల్లో చూస్తూ గడపవలసి వచ్చేది.

ఇవాళ నేను నిద్ర లేవగానే సర్వశక్తి



సంపన్నుడైన ఆ భగవంతుడిని ఒకటే కోరుకున్నాను. రాష్ట్రపతిగా రామ్‌నాథ్ కోవింద్ పదవీకాలం ముగిశాక, మళ్లీ ఆయన్నే రాష్ట్రపతిని చెయ్యకుండా, ఆ స్థానంలోకి వెంకయ్య నాయుడు వెళ్లేలా చూడు దేవుడా అని వేడుకున్నాను. అలా కాకుండా, హమీద్‌జీలా మళ్లీ వెంకయ్య నాయుడే రెండోసారి కూడా ఉపరాష్ట్రపతిగా కొనసాగితే రాజ్యసభలో నేను అదనంగా ఇంకో ఏడాది వెంకయ్య నాయుడిని చూస్తూ గడపవలసి వస్తుంది. ఒకవేళ నేను మళ్లీ ఇంకోసారి రాజ్యసభ సభ్యుడిని అయితే ఇంకో నాలుగేళ్లు వెంకయ్య నాయుడికి ఎదురుపడుతూనో, వెంకయ్య నాయుడు ఎదురు పడకూడదని అనుకుంటూనో గడపాలి.

నాయుడి మీద నాకేం కోపం లేదు. నాయుడు ముఖంలో నాకు నవ్వు కనిపించదు. నవ్వు కనిపించని ముఖాల్ని నేను అస్సలు చూడలేను. నవ్వు కనిపించని ముఖం నాయుడిదైనా, నాయుడిది కాకపోయినా నాకది మోదీ ముఖంలానో, అమిత్‌షా ముఖంలానో కనిపిస్తుంది. పాపం వెంకయ్య నాయుడు ప్రమాణ స్వీకారం చేస్తూ నవ్వు ముఖం పెట్టాలని చాలా ట్రై చేశాడు. మోదీ, అమిత్‌షా నవ్వలేదు. వెంకయ్య నాయుడినీ నవ్వనివ్వలేదు.

మోదీ రాజ్యాంగ శక్తి. అమిత్‌షా రాజ్యాంగేతర శక్తి. శక్తులు నవ్వవు. ఒకరితో కలవ్వు. మోదీ, అమిత్ కలిసి ఉన్నట్లు కనిపిస్తారు. కలిసి లేరని నాకు అనిపిస్తుంది. కలిసి లేకున్నా కలిసి ఉన్నట్లు కనిపించే శక్తులు ఎప్పటికైనా డేంజర్.

ఏడు పదుల్లో ఏమి సాధించాం?

త్రికాలమ్



కె. రామచంద్రమూర్తి

ఏడు దశాబ్దాల స్వతంత్ర భారత దేశం సాధించింది ఏమిటి? స్వాతంత్ర్యాన్ని పరిరక్షించుకోవడం ప్రధానమైన విజయం. ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడుకోవడం, గడువు ప్రకారం ఎన్నికలు జరుపుకోవడం, శాంతియుతంగా ప్రభుత్వాలు మారిపోవడం మరో ఘనవిజయం. మూడో విజయం పేర్కొనాలంటే కష్టమే. దారిద్ర్యం తగ్గింది. అక్షరాస్యత పెరిగింది. జీవన ప్రమాణాలు గణనీయంగా పెరిగాయి. వైద్యవసతి పెరిగింది. కానీ ఈ రంగాలలో సాధించవలసిన లక్ష్యాలను సాధించలేకపోయామనే అభిప్రాయం సర్వత్రా ఉంది. ఉత్తరప్రదేశ్‌లో ఆక్సిజన్ లభించక 63మంది చిన్నారులు ప్రాణాలు వదలిన ఘటన మనం ఆరోగ్యరంగంలో ఏ స్థాయిలో ఉన్నామో సూచిస్తున్నది. మనం చేసుకున్న చట్టాలనే మనం తుంగలో తొక్కడం కూడా ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతమే. సమాచార హక్కు చట్టం చేసుకున్నాం. కానీ ప్రభుత్వాలు సమాచార కమిషనర్లను నియమించవు. సమాచారం అందించవు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం చేశాం. కానీ ఫిరాయింపులను నిస్సంకోచంగా, నిస్సిగ్గుగా ప్రోత్సహిస్తాం. నంద్యాల ఎన్నికల ప్రచారం చూస్తే ఎన్నికలు జరుగుతున్న విధానం తెలుస్తుంది. ప్రజాస్వామ్యం అంటే క్రమం తప్పకుండా ఎన్నికలు జరగడం మాత్రమే కాదు. అది జీవనవిధానం కావాలి. 1947 ఆగస్టు 14–15 అర్ధరాత్రి భారత పార్లమెంటులో నాటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చేసిన చారిత్రక ప్రసంగం 'ట్రిస్ట్ విత్ డెస్టినీ' స్ఫూర్తి క్రమంగా ఆవిరైపోతున్నదనే ఆవేదన వెన్నాడుతోంది. పాలనాధికారం కాంగ్రెస్ నుంచి బీజేపీకి మారిన నేపథ్యంలో దేశంలో సంభవిస్తున్న పరిణామాలు ఎటు దారితీస్తాయోనన్న గుబులు పట్టి పీడిస్తోంది. కాలక్రమేణా ఈ భయ సందేహాలు నిరాధారమైనవనీ, నిర్హేతుకమైనవనీ తేలవచ్చు. అదే జరిగితే అంతకంటే ఆనందం ఏముంటుంది? అట్లా జరుగుతుందా, లేదా అన్నదే ఆలోచనాపరులను అనుక్షణం వేధిస్తున్న ప్రశ్న.

స్వప్నం చెదురుతోందా?

'ది ఐడియా ఆఫ్ ఇండియా' (భారతస్వప్నం) చెదిరిపోతోందని కొందరి ఫిర్యాదు. మత ప్రాతిపదికన ఏర్పడిన పాకిస్తాన్ కంటే సర్వమత సమానం, సహనం ప్రాతిపదికగా ఏర్పడిన ఇండియాకు నైతికంగా ఆధిక్యం ఉన్నదనే విశ్వాసం క్రమంగా సడలుతోంది. చివరికి ఇండియా కూడా పాకిస్తాన్ బాటలోనే ప్రయాణం చేస్తున్నదా? ఇదేనా ఏడు దశాబ్దాల స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, లౌకికవాదం సాధించింది? దేశ విభజన సృష్టించిన అది పెద్ద వివాద హేతువు కశ్మీర్ సమస్య ఇన్ని సంవత్సరాలుగా పరిష్కారం కాకపోగా కొరకరాని కొయ్యగా తయారై రావణకాష్టంగా రగులుతోంది. ట్రిపుల్ తలాక్, 370వ అధికరణ రద్దు వంటి ప్రతిపాదనలు ముందుకు రావడంతో మైనారిటీవర్గాలలో అభద్రతా భావం పెరుగుతోంది. లౌకికవాదం అనే పదమే హాస్యాస్పదమైనప్పుడు, నిందాత్మకమైనప్పుడు ఇంతకాలం పాటించిన, విశ్వసించిన విలువలు అగ్నిపరీక్ష ఎదుర్కోవడం అనివార్యం. రెండు భావజాలాల మధ్య సంఘర్షణను ఇప్పుడు చూస్తున్నాం. కాంగ్రెస్, బీజేపీ రెండు భావజాలాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న జాతీయ పార్టీలు. కాంగ్రెస్ పతనం– బీజేపీ ఉత్థానం ఏకకాలంలో సంభవిస్తున్న పరిణామాలు. కాంగ్రెస్ బలహీనపడినప్పుడే బీజేపీ బలపడుతుంది. ఇందిర హత్యానంతరం జరిగిన ఎన్నికల తర్వాత మండల్, కమండల్ రాజకీయాల కారణంగా, అద్వానీ రథయాత్ర ఫలితంగా ఉత్తరాదిలో బీజేపీకి ఆదరణ గణనీయంగా పెరిగింది. బీజేపీకి లోక్‌సభ ఎన్నికలలో గౌరవప్రదమైన సంఖ్యాబలం లభించాక బీజేపీ నాయకులలో ఉదారవాదిగా పేరు తెచ్చుకున్న వాజపేయి నాయకత్వంలో తొలి ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పడింది. ఈ కూటమి బీజేపీ–సంఘపరివార్ భావజాలాన్ని రాజకీయ, సామాజిక రంగాలలో ప్రవేశపెట్టడానికి ప్రయత్నించలేదు. అందరినీ కలుపుకొని పోయే విధంగా పాలన సాగింది. ఒక విధంగా నెహ్రూ బాటలోనే నడిచింది. పీవీ నరసింహారావు ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలనే, ఆయన ఆచరించిన విదేశాంగ విధానాలనే కొనసాగించారు. ఇజ్రేల్‌తో దౌత్యసంబంధాలు పెట్టుకున్నది కూడా పీవీ నరసింహారావు హయాంలోనే. కాంగ్రెస్ విధానాల నుంచి వాజపేయి ప్రభుత్వం దూరంగా పోయిందని, రాడికల్‌గా వ్యవహరించిందని నిరూపించే ఉదంతం ఒక్కటీ లేదు. అందువల్ల ఆయన హయాంలో భావజాలాల మధ్య ఘర్షణ జరగలేదు. మోదీ ప్రధానిగా ప్రమాణం స్వీకరించిన తర్వాతనే కాంగ్రెస్, బీజేపీ మధ్య సైద్ధాంతిక సమరం ప్రారంభమైంది. కాంగ్రెస్ ముక్త్ భారత్‌ను ఆవిష్కరించాలనే సంకల్పాన్ని నరేంద్రమోదీ 2014 ఎన్నికల ప్రచారంలో ప్రకటించినప్పుడే భావసంఘర్షణ మొదలయింది.

నెహ్రూ నుంచి వాజపేయి వరకూ

వాజపేయి గద్దె దిగేవరకూ దేశం ఒక మార్గంలో పయనించింది. ప్రభుత్వ పగ్గాలను మోదీ స్వీకరించిన తర్వాత కాంగ్రెస్ సంస్కృతికంటే భిన్నమైన సంస్కృతిని ప్రవేశపెట్టే ప్రయత్నం బలంగా జరుగుతోంది. కాంగ్రెస్‌ను ఎన్నికలలో ఓడించడంతో సరిపెట్టుకోకుండా ఆ పార్టీకి కానీ, దాని దిగ్గజాలకు కానీ ప్రాసంగికత లేకుండా చేయాలన్న ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది. అందుకే పాఠ్యాంశాలలో మార్పులు చేయడం. క్విట్ ఇండియా ఉద్యమానికి 75 సంవత్సరాలు నిండిన సందర్భంగా మోదీ నెహ్రూ పేరు ప్రస్తావించకపోవడం, కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ ప్రసంగంలో నెహ్రూ ప్రసక్తి ఒకటికి రెండు సార్లు రావడం గమనార్హం. తొలి ప్రధాని నెహ్రూ సోషలిస్టు సమాజం కోసం పరితపించినా, మిశ్రమ ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించినా, ఇందిరాగాంధీ ఈ విధానాలనే కొనసాగించడంతో పాటు దళితులలో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ప్రత్యేక చట్టాలు చేసినా, నిర్దిష్టమైన విధానాలు రూపొందించినా దేశం మౌలిక స్వభావంపైన వాటి ప్రభావం పడలేదు. ఈ దేశం అన్ని జాతుల, భాషల, మతాల, సంస్కృతుల, ఆచారవ్యవహారాల సమాహారం అనే భావనకు ప్రమాదం ఏర్పడలేదు. నెహ్రూ నుంచి వాజపేయి దాకా ఈ విషయంలో అటు ఇటుగా ఒకే అభిప్రాయం కలిగినవారుగా నిర్ధారించవచ్చు. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాతనే బీజేపీ–ఆర్ఎస్ఎస్ భావజాలం అధికార పీఠంపైన కూర్చున్నదనే అభిప్రాయం జనసామాన్యంలో ఏర్పడింది. ఒక దేశం గమనంలో ఏడు దశాబ్దాలు గడచిన తర్వాత ఇటువంటి పెనుమార్పు సంభవించడంలో వింతలేదు. స్వాతంత్ర్య సమరంలో అగ్రగామి పాత్ర పోషించి, స్వతంత్ర భారత నిర్మాణానికి సారథ్యం వహించిన కాంగ్రెస్ క్రమంగా బలహీనమై, భ్రష్టుపట్టిపోయింది. ప్రత్యామ్నాయశక్తిగా బీజేపీ జాతీయ స్థాయిలో ఎదిగింది. ఈ క్రమంలో ఆర్ఎస్ఎస్‌ది గురుతరమైన బాధ్యత. అద్వానీని పక్కన పెట్టి మోదీని బీజేపీ ప్రధాని అభ్యర్థిగా నిర్ణయించింది ఆర్ఎస్ఎస్ అనడంలో సందేహం లేదు. ఇప్పుడు మోదీతో పాటు రాష్ట్రపతి కోవింద్, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్, బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా–అందరూ ఆర్ఎస్ఎస్ శాఖీయులు కావడం యాదృచ్ఛికం కాదు. ఆర్ఎస్ఎస్ భావజాలం ప్రస్తుత పాలనావ్యవస్థను నడిపిస్తున్నదనడానికి ఇది నిదర్శనం.

మోదీ ప్రధానిగా పదవీబాధ్యతలు స్వీకరించిన తర్వాతనే ఘర్‌వాప్సీ, అవార్డ్ వాప్సీ, గోరక్షక్, ట్రిపుల్ తలాక్ వంటి పదాలు దక్షిణాదివారికి కూడా అర్థం అవుతున్నాయి. ఏ పౌరుడికైనా దేశభక్తిని చాటుకోవలసిన అవసరం కలగడం కంటే అవమానకరం మరొకటి లేదు. మీడియా సంస్థలు సైతం బీజేపీ–ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని ప్రచారం చేస్తున్నట్టు వ్యవహరించడం విచిత్రం. మొన్న ఉపరాష్ట్రపతి అన్సారీ వీడ్కోలు సమావేశంలో ప్రధాని ప్రసంగించిన విధం కానీ , అన్సారీ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యను బీజేపీ నాయకులు అసందర్భంగా ప్రచారం చేసిన పద్ధతి కానీ, దానికి వెంకయ్యనాయుడు స్పందించిన తీరు కానీ దేశంలో కొన్ని నెలలుగా కొనసాగుతున్న అసహన ధోరణిని చాటుతున్నాయి. కాంగ్రెస్, ఇతర 'సెక్యులర్' పార్టీలు ఇంతకాలం మైనారిటీలను ఓటు బ్యాంకులుగా వినియోగించుకున్న తీరును ఖండిస్తూ బీజేపీ పరోక్షంగా అదే పని చేస్తున్నది. మైనారిటీలపైన ఒత్తిడి పెంచడం ద్వారా మెజారిటీ సమాజాన్ని సంఘటితం చేసి పెద్ద ఓటు బ్యాంకుగా మార్చుకునే ప్రయత్నంలో బీజేపీ సఫలమైనదని చెప్పవచ్చు. ఉదాహరణకు ఉత్తర ప్రదేశ్‌లో 403 అసెంబ్లీ స్థానాల లోనూ ఒక్క స్థానంలోనైనా ముస్లిం అభ్యర్థిని నిలబెట్టకుండా ముస్లిమేతర వర్గాలను ఆకట్టుకోవడం వెనుక అమిత్‌షా పకడ్బందీ ప్రణాళిక లేక



పోలేదు. మదర్సాలు స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకోవడమే కాకుండా ఆ కార్యక్రమాలను వీడియో తీసి ప్రభుత్వానికి సమర్పించాలన్న ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ జారీ చేసిన ఆదేశం బీజేపీ విధానాన్ని స్పష్టం చేస్తున్నది.

బీజేపీ ఉద్దేశం ఏమిటి?

సమాజాన్ని మతప్రాదిపదికపైన రెండుగా చీల్చడం అధికార బీజేపీ–ఆర్ఎస్ఎస్ ఉద్దేశమా? 2019లో సైతం బీజేపీ అధికారంలోకి సునాయాసంగా వస్తుందని అందరూ భావిస్తున్న దశలో ఇటువంటి ప్రమాదకరమైన రాజకీయం అవసరమా? తెగేవరకూ లాగాలనే అభిప్రాయం మోదీకి లేదనే విషయంగా స్పష్టంగా తెలుస్తోంది. కశ్మీర్‌లో అన్ని రాజకీయ పక్షాలూ 370వ అధికరణ కొనసాగవలసిన అవసరాన్ని నొక్కివక్కాణించిన తర్వాత ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ ప్రధానిని ఢిల్లీలో కలుసుకున్నారు. దాన్ని రద్దు చేసే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని మోదీ స్పష్టం చేశారు. గోరక్షకుల ఆగడాలను ఉపేక్షించేది లేదంటూ ప్రధాని ఒకటికి రెండు సార్లు హెచ్చరించారు. అవార్డ్ వాప్సీ సందర్భంలో సైతం మోదీ నిగ్రహం పాటించారు.

2014 వరకూ దేశంలో వ్యాప్తిలో ఉన్న కాంగ్రెస్ సంబంధ భావజాలానికి ప్రత్యామ్నాయమైన బీజేపీ–ఆర్ఎస్ఎస్ భావజాలంపై చర్చ జరగాలన్నది ప్రధాన లక్ష్యంగా కనిపిస్తున్నది. చర్చలో కొన్ని ఆచరణ సాధ్యం కానివిగా తేలవచ్చు. మరికొన్ని దేశ సమైక్యతకు ముప్పు తెచ్చేవిగా కనిపించవచ్చు. ఈ పరీక్షలో నిలబడని విధానాలను పక్కన పెట్టి, నిలబడే విధానాలను ఆచరించాలన్న సంకల్పం ఉండవచ్చు. నేటి భారతంలో మైనారిటీల స్థానం ఏమిటో చూపించాలన్న ప్రయత్నం కావచ్చు. భిన్నమతాలూ, జాతులూ, భాషావర్గాలూ, కులాలూ సహజీవనం చేయవలసిన దేశంలో ఏ మతమూ మరో మతపైన, ఏ ప్రాంతం మరో ప్రాంతంపైన, ఏ భాషావర్గం మరో భాషావర్గం పైన, ఏ కులం మరో కులంపైన ఆధిక్యం ప్రదర్శించడం సాధ్యం కాదు. అటువంటి ప్రయత్నం జరిగితే అది దేశ సమైక్యతకే ప్రమాదంగా పరిణమిస్తుంది. సమాజంలో అశాంతికి దారితీస్తుంది. ఆ స్థాయి వరకూ వ్యవహారాన్ని తీసుకొని వెళ్ళకపోవచ్చు. శతాబ్దాలుగా పరమత సహనానికీ, శాంతియుత సహజీవనానికీ అలవాటు పడిన ప్రజలు ఈ విలువలకు పూర్తిగా తిలోదకాలు ఇవ్వడాన్ని ఆమోదించరు. కొన్ని సర్దుబాట్లకూ, సవరణలకూ అంగీకరించవచ్చు. అధికార కూటమి ప్రయత్నం ఆ దిశగానే జరుగుతున్నదని భావించాలి. ఇందుకు భిన్నంగా జరిగితే ప్రతిఘటన తథ్యం. 1975లో ఇందిరాగాంధీ అత్యయిక పరిస్థితి ప్రకటించినప్పుడు జాతి ఒక్క తాటిపైన నిలిచి ప్రజాస్వామ్య వ్యవస్థను ఏ విధంగా రక్షించుకున్నదో అదే విధంగా లౌకిక భావజాలానికి భంగం వాటిల్లినా ప్రజలు తిరగబడి తీరుతారు. అటువంటి పరిస్థితే ఏర్పడితే దేశం అనూహ్యమైన మూల్యం చెల్లించలవసి వస్తుంది. ఈ సంగతి మోదీ ప్రభృతులకు తెలుసు. అందుకే ప్రత్యామ్నాయ భావజాలంపైన చర్చను అవధులు మీరనీయరు. చర్చ జరుగుతుంది. కానీ తెగదు. ముడిపడదు.

ప్రమాదంలో స్వాతంత్ర్య ఫలాలు

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఈ ఆగస్టు 15కి 70 సంవత్సరాలు పూర్తి చేసుకుని 71వ సంవత్సరంలోకి అడుగుపెడుతోంది. ఈ 70 ఏళ్ల కాలంలో దేశం సమస్యల సుడిగుండంలో ప్రయాణం చేస్తూనే, ప్రజాస్వామ్యాన్ని మరింత పటిష్టం చేసుకుంటూ నిలకడగా స్థిరత్వం, వృద్ధి దిశగా వేగంగా అడుగులు వేస్తున్నది. మన దేశం ఎందుకు స్వాతంత్ర్యం కోల్పోయింది? స్వాతంత్ర్య సాధనలో మనం ఏం కోల్పోయాం అనే అంశాలను సమీక్షించుకుని అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవడంపైనే మన స్వాతంత్ర్య రక్షణ ఆధారపడి ఉంది.

మనదేశం గత వెయ్యేళ్లుగా ఇస్లామిక్ సామ్రాజ్యవాదంపై ఎంతో ఘర్షణ పడింది. ఆ రోజుల్లో దేశంలో శక్తిమంతమైన రాజ్యాలున్నా, శక్తిమంతమైన సామ్రాజ్యాలు లేని కారణంగా మనం ఎంతో నష్టపోయాం. ఆ పెనుదెబ్బనుంచి మనం ఇప్పటికీ కోలుకోలేదనే చెప్పాలి. ఆ తర్వాత ఇస్లామ్ పాలన బలహీనపడుతూ, పాశ్చాత్య ప్రాబల్యం పెరుగుతూ వచ్చి మరో 200 ఏళ్లు దేశం బానిసత్వంలో మగ్గింది. 1857లో ఈస్టిండియా కంపెనీపై జరిగిన పోరాటంలో దేశంలోని హిందువులు, ముస్లింలు కలసి పోరాడారు. అదో అరుదైన సంఘటన. అయితే ఆ సమరంలో రాజకీయంగా ఓడిపోయాం కానీ మత మార్పిడిపై నైతిక విజయం సాధించాం. బ్రిటిష్ రాణి స్వయంగా వచ్చి మీ మతపరమైన విషయాల్లో మేం జోక్యం చేసుకోం అని ప్రకటించింది. తదుపరి కాలంలో అదే స్ఫూర్తితో ఈ దేశంలో స్వాతంత్ర్య పోరాటం జరిగి బ్రిటిషర్ల నుంచి స్వాతంత్ర్యం పొందాం.. కానీ దేశం ముక్కలైంది.

ఈస్టిండియా పాలనలోని భారత్‌ని 1857 తర్వాత బ్రిటిష్ పార్లమెంటు నేరుగా పాలించడంతో ప్రజాస్వామ్యబద్ధ ఎన్నికల ప్రక్రియ చోటుచేసుకుంది. దీంతో రాజకీయ పార్టీలు ప్రారంభమయ్యాయి. స్వాతంత్ర్య పోరాటానికి మహాత్మాగాంధీ నాయకత్వం వహించిన తర్వాత కాంగ్రెస్ కూడా ఎన్నికలలో పోటీ చేయడం మొదలైంది. ఆ కాలంలోనే రష్యాలో కమ్యూనిస్టు విప్లవం భారతీయ నేతలను ప్రభావితం చేసింది. అలా దేశంలోకి కమ్యూనిస్టు సిద్ధాంతం ప్రవేశించింది. మరోవైపు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొంటూనే.. ఈ దేశంలో ఇస్లామిక్ సామ్రాజ్యవాద శక్తులు ఆధిపత్యం కోసం చేసిన పోరాటం చివరకు దేశాన్నే ముక్కలు చేసింది. కానీ నేడు ఇస్లామ్ సామ్రాజ్యవాదం నేడు ప్రపంచాధిపత్యం కోసమే పోరాటం చేస్తోంది. దేశంలో జరుగుతున్న పలు సైద్ధాంతిక ఘర్షణలకు తెర దించకపోతే మన స్వాతంత్ర్యమే అస్థిరమైపోయే ప్రమాదం ఉంది. దీన్ని నివారించడానికి ఏం చేస్తున్నామనేది మౌలిక ప్రశ్న.

సామాజికంగా కూడా మనం ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటున్నాం. మన మేధావులే మన దేశ విషయాలపై అపోహలూ, విద్వేషమూ నిర్మాణం చేస్తున్నారు. ఆ పనిలో కొంత విజయం కూడా సాధించారు. ఈ మధ్య నేనొక కార్యక్రమంలో మాట్లాడుతూ మన ధర్మశాస్త్రాలలోని రెండు మంచి విషయాలు ప్రస్తావించాను. సభానంతరం కొందరు నన్ను 'మన ధర్మశాస్త్రాలను మీరు సమర్థిస్తారా?' అని అడిగారు. దానికి నేను 'మంచి విషయాలు ఎక్కడున్నా గ్రహించాలి, మీకేమైనా అభ్యంతరమా? అన్నాను. ఖురాన్, బైబిల్, దాస్‌క్యాపిటల్ నుంచి మంచి గ్రహించటంలో లేని అభ్యంతరం మన ధర్మశాస్త్రాల నుంచి గ్రహించటంలో ఎందుకు?' అని కూడా అడిగాను. దీనిని విశ్లేషిస్తే 'మనలో మనమే సవాళ్లు విసురుకుంటూ విడిపోతున్నాం' అనేది అర్థమవుతుంది. ఈ విషయం మనం ఎంత త్వరగా గ్రహిస్తే దేశానికి అంత మంచిది. ఈ అంతర ఘర్షణ సమసిపోయినప్పుడే మన దేశ స్వాతంత్ర్యం స్థిరమౌతుంది.



స్వాతంత్ర్యం నాటి నుంచి మన దేశంలో సామాజిక సమత కోసం విశేష ప్రయత్నం జరుగుతున్నది. శతాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైన ప్రజలు మిగతా సమాజంతో పాటుగా ఎదగటానికి అటు ప్రభుత్వం, ఇటు సమాజం, కొన్ని స్వచ్ఛంద సంస్థలూ ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాయి. ఆ విషయంలో కొంత విజయం కూడా సాధించాం. కానీ మన దేశం ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్య రాజకీయ స్వలాభం. మన రాజకీయ నేతలు వారి రాజకీయ లబ్ధి కోసం సమాజాన్ని మరింతగా విడగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ స్థితి మారితే సామాజిక ఐక్యతకు అడ్డంకి తొలగిపోతుంది.

ఈ 70 ఏళ్లలో మన దేశం శాస్త్ర సాంకేతిక రంగాలలో దూసుకు పోతోంది. మన శక్తియుక్తులను ఈ రోజు ప్రపంచం విస్మరించే స్థితిలో లేదు. అలాగే మన విదేశీ సంబంధాలు ఎంతో మెరుగయ్యాయి. పైగా మనకు మానవ వనరుల లోటు లేదు. కానీ వాటిని సక్రమంగా వినియోగించుకోలేక పోవడమే సమస్య. పీవీ నరసింహారావు ప్రధానిగా ఉన్న సమయంలో ప్రారంభమైన ఆర్థిక సంస్కరణలు మన ఆర్థిక పరిస్థితులను వేగంగా మార్చాయి. కానీ వాటివల్ల దేశంలో ఆర్థిక అసమానతలు పోటీ పడి పెరుగుతున్నాయి. దేశంలోని ఆరు లక్షలకుపైగా గ్రామాల ప్రగతే దేశ ప్రగతి. కానీ చాలా గ్రామాలు నిర్లక్ష్యానికి గురయ్యాయి. మనకు స్వాతంత్ర్యం లభించిన సమయంలో 'ఈ దేశానికి రాజకీయ స్వాతంత్ర్యం వచ్చింది. గ్రామ స్వరాజ్యం ఇంకా రావలసి ఉంది. వేల సంవత్సరాలుగా మన గ్రామాలు స్వయం సమృద్ధిగా ఉండేవి. నేడు అవి పతన స్థితిలో ఉన్నాయి. ఇది మారాలి' అన్నారు మహాత్మాగాంధీ. దేశ రక్షణతో సహా అన్ని అంశాల్లో స్వావలంబన సాధ్యమైనప్పుడే భారత్ ప్రపంచంలో గౌరవనీయ స్థానం పొందుతుంది.

రాంపల్లి మల్లికార్జునరావు, సామాజిక కార్యకర్త
మొబైల్ : 95022 30095

అత్యున్నత రాజకీయాల్లో అనుచిత వ్యాఖ్యలా?

మన అత్యున్నత రాజకీయాలు ఇప్పటికీ మర్యాదపూర్వకంగా, ఔచిత్యభరితంగా ఉంటున్నాయి. భారత ఉప రాష్ట్రపతిపై ప్రధాని చేసిన వ్యాఖ్యలు ఆ సాంప్రదాయాన్ని భగ్నం చేశాయని నా నమ్మకం. అన్సారీ అరబ్బు ప్రపంచంలో వృత్తి దౌత్యవేత్తగా గడపడాన్ని, విద్యావేత్తగా పనిచేయడాన్ని మోదీ ఉద్దేశపూర్వకంగానే.. తమ మతం పట్ల అసహనంపై అన్సారీ ఆలోచనలతో ముడిపెట్టారు. తద్వారా ఆయన అన్సారీని, ముస్లింగా ఆయనకున్న గుర్తింపు స్థాయికి కుదించి వేస్తున్నారు.

అవలోకనం




ఆకార్ పటేల్

తరచుగా మన దేశంలో ఎవరైనా ఏదైనా విషయాన్ని చెప్పినపుడు, దాన్ని ఎవరు చెప్పారనేదానికంటే ఆ విషయం ఏమిటనే దానికి తక్కువ ప్రాముఖ్యత లభిస్తుంటుంది. భారతదేశంలోని ఎక్కువ అసాధారణమైన విషయాలలో ఇది ఒకటి. ప్రపంచంలోని చాలా భాగాల విషయంలో కూడా ఇది కొంత వరకు నిజమే. కానీ, మన దేశంలో వివాదాస్పదమైన అంశాన్ని దేన్నయినా చెప్పినప్పుడు దాని ప్రధాన ఉద్దేశ్యాన్ని ఆ అభిప్రాయాన్ని గలిగిన వ్యక్తి గుర్తింపునకు ఆపాదిస్తారు. అందువల్లనే, నేను పాటీదార్ల రిజర్వేషన్లను సమర్థిస్తే, అందుకు కారణం నేను పటేల్‌ను కావడమేనని, నా సొంత కులస్తుల తరపున మాట్లాడుతున్నానని అంటారు. నిరసనకారులపై తుపాకులు ప్రయోగించొద్దంటే, అతడు లేదా ఆమె కశ్మీరీ కావడం వల్లనే, వారు మొత్తం దేశ ప్రయోజనాన్ని విస్మరించి తమ వారికి మద్దతు తెలుపుతున్నారని అంటారు. సంకుచిత దృక్పథం కలవారిగా పిలవడం పరిపాటియైన భారత ముస్లింలే అతి ఎక్కువగా ఆలాంటి ఆరోపణలకు గురయ్యే అవకాశం ఉంది.

అసలు వారు ఏమి చెబుతున్న దేమిటో పరిశీలించకుండానే ఇది జరిగిపోతుంటుంది. నేను చెబుతున్న ఈ విషయం నిత్యం మన రోజువారి జీవితాల్లో, టీవీ వార్తల్లో స్పష్టంగా కనిపిస్తూనే ఉంటుంది. కాబట్టి దాన్ని నేను మరింతగా వివరించాల్సిన పని లేదు. అయితే, ఈ ధోరణి, మర్యాదపూర్వకంగానూ, ఔచిత్యభరితంగానూ ఉండే మన అత్యున్నత స్థాయి రాజకీయాల్లోకి ప్రవేశించడాన్ని మనం ఇంకా చూడలేదు. భారత ఉపరాష్ట్రపతిపై ప్రధాని చేసిన వ్యాఖ్యలు ఆ సాంప్రదాయాన్ని భగ్నం చేశాయని నా నమ్మకం.

ఉపరాష్ట్రపతి రాజ్యసభ టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో కరణ్ థాపర్ ''...ముస్లింలలో భయం నెలకొంది, వారు అభద్రతతో ఉన్నట్టు భావిస్తున్నారు. భారత్ ముస్లింల మనోభావాల గురించి ఇది సరైన అంచనాయేనా లేక అతిశయీకరించినదా? '' అని ప్రశ్నించారు. హమీద్ అన్సారీ : ''దేశంలోని విభిన్న వర్గాల నుంచి వినవస్తున్న వాటినన్నిటినీ బట్టి చూస్తే నిజమే. అది సరైన అంచనాయే. బెంగళూర్‌లో కూడా నేను అదే విషయాన్ని వింటున్నాను, దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి కూడా విన్నాను. ఉత్తర భారతంలో మరింత ఎక్కువగా విన్నా. ఇబ్బందిలో ఉన్న భావన, అభద్రతా భావం మెల్లగా వ్యాపిస్తున్నాయి.'' ఈ వాక్యాన్ని పట్టుకుని, మొదటి పేజీ వార్తను చేసేశారు. అన్సారీ ఆ ఇంటర్వ్యూలో



ఎంత ఆచి తూచి, జాగ్రత్తగా మాట్లాడారో పూర్తిగా తెలుసుకోవాలంటే ఆ ఇంటర్వ్యూను చూడటమో లేక చదవడమో చేయాలి. ఆయన చెప్పినదాన్లో ఏ మాత్రమూ తప్పు లేదు. ఆయన, తాను చూస్తున్న, వింటున్న వాటి గురించిన తన అంచనాను చెబుతున్నారు. ఆయన ప్రభుత్వాన్ని తప్పు పట్టలేదు కూడా. కానీ, బీజేపీ నుంచి వచ్చిన ప్రతిస్పందన అత్యంత దుర్మార్గమైనది, తీవ్ర మతతత్వ పూరితమైనది. మోదీ మాటలు కలతపరచాయి, విచారం కలిగించాయి. అన్సారీ పదవిలో ఉన్న ఆఖరు రోజున మోదీ ఆయనను అపహాస్యం చేశారు. మొదటి నుంచి అన్సారీ బీజేపీ దాడులకు ఎరగానే ఉండేవారని పాఠకులకు గుర్తుండే ఉంటుంది. ఆ పార్టీ కార్యదర్శి రామ్ మాధవ్, అన్సారీ నడవడికపై కొన్ని అజ్ఞాన పూరితమైన వ్యాఖ్యలను చేశారు. మాధవ్ చెప్పినది తప్పని తేలినాక ఆయన వాటిని తన ట్విటర్ ఖాతాను తొలగించారు.

ఇదంతా జరుగుతుండగా కూడా అన్సారీ మర్యాదపూర్వకంగా, హుందాగానే కనిపించారు. ఆయన పదవీ కాలం ఆఖరు రోజున, మోదీ ఆయన మొహం మీదే ఇలా మాట్లాడారు. ''వృత్తి దౌత్యవేత్త కరచాలనానికి లేదా నవ్వుకు అర్థం ఏమిటో వెంటనే అవగతం చేసుకోవడం కష్టం కాబట్టి, వృత్తి దౌత్యవేత్తలంటే అర్థం ఏమిటో ప్రధానమంత్రి అయినాకే'' తెలుసుకున్నానని అన్నారు. అన్సారీ కుటుంబానికి కాంగ్రెస్‌తోనూ, ఖిలాఫత్ ఉద్యమంతోనూ సుదీర్ఘమైన అనుబంధం ఉందని అన్నారు. దౌత్యవేత్తగా ఆయన మధ్యప్రాచ్యంపైనే దృష్టిని కేంద్రీకరించారు, ''ఒక విధమైన వాతావరణం, ఒకే విధమైన భావజాలం, ఒకే రకమైన మనుషుల''తో కలసి ఉన్నారని పేర్కొన్నారు. పదవీ విరమణ తర్వాత కూడా అన్సారీ చాలావరకు మైనారిటీ కమిషన్, అలీఘర్ ముస్లిం విశ్వవిద్యాలయాలలో పనిచేశారు అంటూ మోదీ కొనసాగించారు. ''కొంత కాలంగా (అన్సారీ ఉపరాష్ట్రపతిగా ఉన్న పదేళ్లు) మీరు లోలోపలే కొంత మధన పడుతూ ఉండి ఉంటారు. ఇక మీదట మీరు ఆ సందిగ్ధాన్ని ఎదుర్కోవాల్సి రాదు. మీరిక స్వేచ్ఛగా ఉన్నాననే భావనతో ఉండవచ్చు, మీకు పనిచేసే అవకాశమూ దొరుకుతుంది, మీ భావజాలానికి అనుగుణంగా ఆలోచించుకోండి, మాట్లాడండి''అనే ఎత్తిపొడుపు మాటలతో మోదీ తన ప్రసంగాన్ని ముగించారు.

ప్రధాని అభిప్రాయం ప్రకారం అన్సారీకి ఉన్న భావజాలం ఏదై ఉంటుంది? మోదీ అది చెప్పలేదు. అయన ఆ విషయాన్ని చెప్పి ఉండాల్సిన అవసరమూ లేదు. మోదీ మాటల ఉద్దేశం ఏమిటో గ్రహించలేకపోవడం అసాధ్యం. అన్సారీ అరబ్బు ప్రపంచంలో వృత్తి దౌత్యవేత్తగా గడపడాన్నీ, విద్యావేత్తగా పనిచేయడాన్నీ మోదీ ఉద్దేశపూర్వకంగానే తమ మతం పట్ల ఉన్న అసహనం గురించిన ఆయన ఆలోచనలతో ముడిపెట్టారు. తద్వారా ఆయన అన్సారీని, ముస్లింగా ఆయన కుండే గుర్తింపు స్థాయికి తగ్గించివేస్తున్నారు. మోదీ మద్దతుదార్లు ఆయన చెప్పినదాన్ని పట్టుకుని అన్సారీని అత్యంత అసభ్యకరమైన రీతిలో దాడిని సాగించారు.

''ముజ్‌పే ఇల్జామ్ ఇత్నే లగాయే గయే, బేగునాయీ కె అందాజ్ జాతే రహే'' నాపై ఎన్ని ఆరోపణలు చేశారంటే, ఇప్పుడిక నిర్దోషినని రుజువు చేసుకోవడమే అసాధ్యం అని అర్థం. పదవిని వీడుతున్న ఒక ఉపరాష్ట్రపతి నోట ఇలాంటి మాటలు వస్తే భారతీయులంతా ఆందోళన చెందవద్దా? బహుశా మనం వాటి గురించి పెద్దగా ఆలోచించం. లేదా, ఆలోచించినా, ఆయన చేసిన హెచ్చరికను మనలో చాలా మందిమి విస్మరిస్తాం. ఈ వాతావరణంలో భారత ముస్లింలు అభద్రతను అనుభవించరా? అది లెక్కలోకి రాదు. భారత ఉపరాష్ట్రపతి ఆ మాటలు ఆ హెచ్చరికను చేశారూ అంటే అది ఆయన కూడా ఒక ముస్లిం కాబట్టి మాత్రమే.

వ్యాసకర్త కాలమిస్టు, రచయిత I aakar.patel@icloud.com

పుత్రోత్సాహం!

కన్నవారిపై ప్రేమ అమ్మానాన్నలకు సహజం. ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తండ్రి ఆనంద్ సింగ్ బిస్త్ కూడా ఇందుకు మినహాయింపు కాదు. 2024లో తన కుమారుడు ప్రధాని కావడం ఖాయమని ఆయన బల్లగుద్ది చెబుతున్నారు. ఇది ఆశనో, జోస్యమో కాదు... రాజకీయ లెక్కలన్నీ వేసి చెప్పిన మాట అంటున్నారు. 'సీఎంగా యోగికి పదికి పది మార్కులూ వేస్తాను. ఇలాగే పనిచేస్తే 2024లో ప్రధాని కావడమెంత' అని ఊరిస్తున్నారు. అంతా బాగుంది కానీ... గోరఖ్‌పూర్ ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రిలో వరసగా రెండురోజులు ఆక్సిజన్ కొరత వల్ల 30మంది చిన్నారులు మరణించారు. యోగి సర్కారు చేతగానితనంవల్లే ఇలా జరిగిందని విపక్షాలు అంటున్నాయి. అందుకే బిస్త్ కాస్త వెనకా ముందూ చూసుకుని మాట్లాడి ఉంటే బాగుండేదని బీజేపీలో గుసగుసలాడుకుంటున్నారు.

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం
దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, తిథి బ.షష్ఠి రా.7.54 వరకు , తదుపరి సప్తమి, నక్షత్రం అశ్వని తె.4.28 వరకు (తెల్లవారితే సోమవారం) తదుపరి భరణి, వర్జ్యం రా.12.38 నుంచి 2.10 వరకు
దుర్ముహూర్తం సా.4.43 నుంచి 5.33 వరకు
అమృతఘడియలు రా.9.33 నుంచి 11.05 వరకు.

నమాజ్ వేళలు

ఫజర్	:	4.43
జొహర్	:	12.21
అసర్	:	4.48
మగ్రీబ్	:	6.43
ఇషా	:	7.59

సూర్యోదయం : 5.45
సూర్యాస్తమయం : 6.25
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 270 1083

సాక్షి
రాష్ట్రీయం
వైఎస్ఆర్ జిల్లా
ఆదివారం । ఆగస్టు । 13 । 2017
www.sakshi.com



గోస్పాడులో వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న వైఎస్ జగన్



గోస్పాడు మండలం శ్రీనివాసపురం సమీపంలో తరలివచ్చిన యువతకు అభివాదం చేస్తున్న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



చంద్రబాబు పాలనపై, చేసిన మోసాలపై, అన్యాయాలపై ఓటు వేస్తా ఉన్నాం. మోసం చేసే వాడు కావాలా.. మాట మీద నిలబడే వాడు కావాలా ప్రజలే నిర్ణయించుకోవాలి.

ఎన్నికలు ఉంటేనే ప్రజలు గుర్తొస్తారా!

సీఎం చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజం

నంద్యాల నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి

'చంద్రబాబు హయాంలో రాష్ట్రంలో దారుణమైన పాలన సాగుతోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని బాబు నెరవేర్చలేదు. మూడున్నరేళ్లలో ఎక్కడా అభివృద్ధి జరగలేదు. రెండు కిలోమీటర్ల మేర రోడ్డుకు ఇరువైపులా ఉన్న భవనాలను కూల్చివేయడమే అభివృద్ధి అంటూ ఫోజులు కొట్టుకోవడం చంద్రబాబుకే చెల్లింది. ఎన్నికలుంటేనే చంద్రబాబుకు ప్రజలు గుర్తుకొస్తారు. ఎన్నికలున్నా లేకపోయినా రైతులు, ప్రజలు, అక్కచెల్లెమ్మల మొహాల్లో ఎప్పుడూ చిరునవ్వులు చూడటమే నిజమైన అభివృద్ధి. నాకు అవకాశం వస్తే అభివృద్ధి అంటే ఏంటో నేను చేసి చూపిస్తా..' అని ప్రతిపక్షనేత, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. నంద్యాల ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా నాల్గవరోజైన శనివారం రోడ్ షో గోస్పాడు మండలంలోని ఒంటెలగల గ్రామం నుంచి ప్రారంభమై గోస్పాడు, శ్రీనివాసపురం, యాళ్లూరు మీదుగా ఎం. కృష్ణాపురం వరకూ సాగింది. ఎన్నికల ముందు ఇచ్చిన ఏ వాగ్దానాన్నీ అమలు చేయలేదు కాబట్టే.. చంద్రబాబు, ఆయన కొడుకుతోపాటు కేబినెట్ మొత్తం నంద్యాల రోడ్లపై తిరిగే పరిస్థితి వచ్చిందని జగన్ అన్నారు. చంద్రబాబు పాలనలో ప్రతి సామాజికవర్గాన్నీ మోసం చేశారని విమర్శించారు. 'ఎన్నికల హామీలలో ఒక్కటీ అమలు కాలేదని ప్రశ్నించే వారిపై కన్నెర్రజేస్తాడు. జైలుకు పంపిస్తానంటాడు. ఇలాంటి వ్యక్తికి ఉరిశిక్ష విధించినా తప్పేమీ కాదు' అని అన్నారు. నంద్యాల ఉప ఎన్నిక న్యాయానికి అన్యాయానికి మధ్య జరుగుతున్న యుద్ధమని.. చివరకు న్యాయమే గెలుస్తుందని జగన్ పేర్కొన్నారు. భగవద్గీత, ఖురాన్, బైబిల్ సారాంశం ఇదేనని వ్యాఖ్యానించారు. నంద్యాల ప్రజలు ధర్మం, న్యాయం వైపు నిలబడాలని.. నంద్యాల బరిలో ఉన్న శిల్పామోహన్‌రెడ్డిని గెలిపించుకుని రానున్న కురుక్షేత్ర ఎన్నికలకు నాంది పలకాలని ప్రజలకు జగన్ పిలుపునిచ్చారు. రోడ్‌షోలో భాగంగా గోస్పాడు, యాళ్లూరు, ఎం. కృష్ణాపురం గ్రామాల్లో వైఎస్ జగన్ ప్రసంగం ఆయన మాటల్లోనే..

మోసం చేసేవాడు కావాలా..? మాట మీద నిలబడే వాడు కావాలా?

''ఇవాళ రాష్ట్రంలో దారుణమైన పాలన సాగుతోంది. ఇరిగేషన్ నుంచి మద్యం దాకా.. మట్టి నుంచి ఇసుక దాకా.. గుడి భూముల నుంచి రాజధాని భూముల దాకా దోచిన సొమ్ముతో ఎవరినైనా కొనొచ్చనే అహంకారం చంద్రబాబులో పెరిగిపోయింది. ఆయనకు కళ్లు నెత్తిన ఉన్నాయి. ఎన్నిక ముందు ఒక మాట చెబుతారు. ఎన్నికలైన తర్వాత ప్రజలకు వెన్నుపోటు పొడిచారు. చంద్రబాబులా అధికారం కోసం ఏ గడ్డి అయినా తినడానికి నా మనస్తత్వం ఒప్పుకోదు.. ఎన్నికల్లో గెలవడానికి ప్రజల్ని మోసం చేసినా పర్వాలేదనే గుణం నా దగ్గర లేదు. చంద్రబాబు పాలనపై, చేసిన మోసాలపై, అన్యాయాలపై ఓటు వేస్తా ఉన్నాం. మోసం చేసే వాడు కావాలా.. మాట మీద నిలబడే వాడు కావాలా ప్రజలే నిర్ణయించుకోవాలి.

బాబుకు ఎన్నికలప్పుడే ప్రజలు గుర్తొస్తారు..

అధికారం కోసం అబద్ధపు వాగ్దానాలు గుప్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆ తర్వాత ప్రజలెవరూ గుర్తుకు రాలేదు. ముఖ్యమంత్రిగా మూడున్నరేళ్లలో ఏ ఒక్క రోజూ చంద్రబాబు నంద్యాలకు రాలేదు. ఆయన మంత్రులూ వచ్చిన దాఖలాలు లేవు. ఇప్పుడు చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్ రోడ్లపై కనిపిస్తున్నారు. ఆయన కేబినెట్ మొత్తం నంద్యాల లాడ్జీల్లో తిష్ట వేశారు. ఈ పరిస్థితికి కారణం నంద్యాల ఉప ఎన్నిక పోరులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని పోటీ పెట్టడమే. పోటీ పెట్టకపోయి ఉంటే ఒక్క రూపాయి నంద్యాలకు ఇచ్చి ఉండేవాడు కాదు. చంద్రబాబు నైజం గురించి వాళ్ల మంత్రులు, ఎమ్మెల్యేలే చెబుతున్నారు. భూమానాగిరెడ్డి బావమరిది కూడా బాబు నైజం గురించి చెప్పారు. తమ ఎమ్మెల్యే కూడా ఎప్పుడు పోతాడా అని నంద్యాల చుట్టుపక్కల నియోజకవర్గాల ప్రజలు ఎదురుచూస్తున్నారట. అప్పుడు ఉప ఎన్నికలు వస్తే వైఎస్సార్‌సీపీ పోటీ పెడుతుందని, అప్పుడు చంద్రబాబు కుంభకర్ణ నిద్రలోంచి బయటకొస్తాడని.. కాస్తోకూస్తో మేలు జరుగుతుందని వారి ఆశ.

విశ్వసనీయతే నా ఆస్తి..

చంద్రబాబులా నా వద్ద పోలీసులు లేరు. డబ్బు మూటలు లేవు. ముఖ్యమంత్రి పదవి లేదు. ఉన్నది లేనట్టుగా.. లేనిది ఉన్నట్టుగా చూపించే టీవీలు, పేపర్లు నాకు లేవు. అవసరమైనప్పుడు చంద్రబాబులా ప్రజల్ని మోసం చేసే గుణం లేదు. కానీ దివంగత నేత రాజశేఖరరెడ్డి చనిపోతూ నాకిచ్చిపోయిన ఇంత పెద్ద కుటుంబం నా ఆస్తి. ఆయన చనిపోయిన తర్వాత కూడా ఆయన చేపట్టిన సంక్షేమ పథకాలు మీ గుండెల్లో ఇంకా బతికి ఉండటమే నా ఆస్తి. జగన్ అబద్ధం ఆడడు.. జగన్ ఏదైనా చెబితే అది కచ్చితంగా చేస్తాడన్న విశ్వసనీయత నాకున్న ఆస్తి. జగన్ కూడా వాళ్ల నాన్నలాగా పేదల కోసం తపిస్తాడు.. నవరత్నాల ద్వారా వారి ఇంట్లో వెలుగులు నింపుతాడన్న నమ్మకమే నా ఆస్తి'' అని జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గౌరు వెంకటరెడ్డి, మాజీ మంత్రి కొలుసు పార్థసారథి, పార్టీ నేతలు రాజగోపాల్‌రెడ్డి, పీపీ నాగిరెడ్డి, పార్టీ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ తలశిల రఘురాం, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గోస్పాడులో చిన్నారిని ఎత్తుకున్న వైఎస్ జగన్

నంద్యాల ఎన్నికలో బాబు మళ్లీ అవే బొంకులు..!

ముఖ్యమంత్రిగా 2014 ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న చంద్రబాబు కర్నూలు జిల్లాకు అనేక హామీలు గుప్పించారు. ఎయిర్‌పోర్టు, ఉర్దూ యూనివర్సిటీ అన్నారు. కర్నూలును స్మార్ట్ సిటీగా చేస్తానన్నారు. ట్రిపుల్‌ఐటీ, కర్నూలు ఆస్పత్రిని స్విమ్స్ తరహా సూపర్ స్పెషాలిటీగా, రైల్వే వ్యాగన్ల మరమ్మతు ఫ్యాక్టరీ, మైనింగ్ కళాశాల, ఫుడ్‌పార్క్, హైదరాబాద్–బెంగళూరు పారిశ్రామిక కారిడార్, టెక్స్‌టైల్ పార్కులు, గుండ్రేవుల ప్రాజెక్టు ఇలా అలవి కాని వాగ్దానాలు ఇచ్చాడు. ఒక్కటి కూడా నెరవేర్చకుండా ప్రజల్ని మోసం చేశాడు. ఇప్పుడు మళ్లీ నంద్యాలలో అవే బొంకులు.. అవే వాగ్దానాలు. ఇప్పుడు దోచిన సొమ్ములో కొంత తీసుకొచ్చి నంద్యాల ఉప ఎన్నికల్లో ఓటర్లను, చిన్నాచితక నేతలను కొనుగోలు చేసేందుకు టీడీపీ నేతలు వస్తున్నారు.. రూ. 5వేలు చేతిలో పెట్టి ఓటు వేయమని అడుగుతున్నారు. ఏ దేవుడూ పాపానికి ఓటు వేయమని చెప్పడు. పాపానికి ఓటు వేయమనేది దెయ్యాలు మాత్రమే. ధర్మం వైపే మేము ఉంటామని మనసులో తలచుకుని.. దెయ్యాల దగ్గర లౌక్యంగా వ్యవహరించి దుర్మార్గులను ఇంటికి పంపి ధర్మానికే ఓటు వేయండి.

ప్రశ్నిస్తే కన్నెర్రజేస్తాడు.. జగన్ మనిషంటాడు..

ఎన్నికల ముందు చంద్రబాబు రైతు రుణాలు బేషరతుగా మాఫీ చేస్తానన్నాడు. డ్వాక్రా మహిళల రుణాలు మాఫీ చేస్తానన్నాడు. నిరుద్యోగ భృతి అన్నాడు. రైతులు పండించిన పంటకు మద్దతు ధర కల్పించడం కోసం రూ. 5 వేల కోట్లతో స్థిరీకరణ నిధి ఏర్పాటు చేస్తా అన్నాడు. ఏ ఒక్క హామీ అమలు చేయలేదు. పైగా ఇటీవల నంద్యాల పర్యటనకు వచ్చిన చంద్రబాబును యాళ్లూరుకు చెందిన రైతు మోహన్ రుణమాఫీ కాలేదని.. రాత్రి ఇక్కడే పడుకుని.. ఉదయం వెళ్లి పరిశీలిద్దామని ప్రశ్నిస్తే కన్నెర్రజేశాడు. నీవు జగన్ పంపించిన మనిషివని ధ్వజమెత్తాడు. ఇవాళ రాష్ట్రంలో మిర్చి, మినుము, పసుపు, వేరుశెనగ పంటలకు మద్దతు ధర లేదు. మిర్చి పంట వేసే ధైర్యం రైతులకు లేకుండాపోయింది. స్థిరీకరణ నిధి ఏమైందని ప్రశ్నిస్తే వీరంతా జగన్ మనుషులంటాడు. పోలీసులను పంపిస్తాడు. అరెస్టు చేయిస్తాడు. డ్వాక్రా అక్కచెల్లెమ్మలను మోసం చేశాడు. చదువుకుంటున్న పిల్లలను ఓటు బ్యాంకు రాజకీయాలకు వాడుకున్నాడు. నెలకు రూ.2వేల నిరుద్యోగ భృతి అన్నాడు. మూడున్నరేళ్లలో ఒక్కో నిరుద్యోగికి రూ. 76 వేల బాకీ పడ్డాడు. ఒక్క రూపాయి ఇవ్వలేదు. పేదవాడికి 3 సెంట్ల భూమి, ఇల్లు కట్టిస్తానన్నాడు. ఒక్క ఇల్లు కట్టించిన పాపానపోలేదు. దివంగతనేత రాజశేఖరరెడ్డి హయాంలో రేషన్‌షాపులకు వెళ్తే పేదలకు 9 రకాల సరుకులు అందేవి. ఇప్పుడు చంద్రబాబు పాలనలో బియ్యం తప్ప ఏమీ ఇవ్వడం లేదు.



శనివారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ

■ శనివారం నుంచి మంగళవారం వరకు వరుస సెలవులు రావడంతో హైదరాబాద్ నగరం నుంచి ఆంధ్రప్రదేశ్‌కు ప్రయాణికులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. హైదరాబాద్ వాసులు సొంతూళ్లకు, పర్యాటక ప్రాంతాలకు తరలివెళ్లారు. దీంతో హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ వైపునకు వచ్చే రైళ్లు, బస్సులు, ఇతర ప్రైవేటు వాహనాలు కిక్కిరిసిపోయాయి. వ్యక్తిగత వాహనాలు, బస్సులతో హైదరాబాద్ – విజయవాడ మధ్య జాతీయ రహదారి కిటకిటలాడింది.



నల్లగొండ జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద భారీ సంఖ్యలో నిలిచిపోయిన వాహనాలు

సగం వడ్డీ కూడా మాఫీ కాలేదు

చంద్రబాబు రుణమాఫీ బండారంపై రైతు మోహన్ వ్యాఖ్య

- యాళ్లూరు సభలో జగన్‌కు తన రుణమాఫీని వివరించిన రైతు
- రోడ్‌షో నాలుగో రోజూ ఉరకలేసిన ఉత్సాహం

నంద్యాల నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి : '2014 ఎన్నికలపుడు రైతుల రుణాలన్నింటినీ మాఫీ చేస్తానని చంద్రబాబునాయుడు ప్రకటించినపుడు నా వ్యవసాయ రుణం రూ 70,000లు ఉంది. దానిపై వడ్డీ రూ 30,000లు అయింది. టీడీపీ అధికారంలోకి వచ్చాక పూర్తిగా రుణం మాఫీ అవుతుందనుకున్నాను. ఇప్పటికి రెండు విడతలుగా రూ 7,500లు చొప్పున రెండు సార్లు మొత్తం రూ 15,000లు నా ఖాతాకు జమ అయ్యాయి. నేను అసలుపై చెల్లించాల్సిన వడ్డీలో సగం కూడా మాఫీ కాలేదు. దీన్నే నేనానాడు సభలో చంద్రబాబుకు వివరించే ప్రయత్నం చేస్తే ఆయన నాపై ఆగ్రహం వ్యక్తం చేశారు' అని యాళ్లూరు గ్రామంలో రైతు మోహన్ కిక్కిరిసిన సభలో జగన్ సమక్షంలో ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో గోస్పాడు మండలంలోని యాళ్లూరు గ్రామాన్ని సీఎం చంద్రబాబు సందర్శించినపుడు మోహన్ తనకు రుణమాఫీ పూర్తిగా కాలేదన్నాడు. దాంతో చంద్రబాబు తీవ్ర అసహనంతో మీపై కేసులు పెట్టిస్తా అని బెదిరింపులకు దిగారు. అప్పట్లో చంద్రబాబు వ్యవహారం వివాదాస్పదం అయింది. శనివారం ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యాళ్లూరు గ్రామానికి చేరుకున్నపుడు మోహన్ ఏం జరిగిందో అంతా వివరించారు.



గోస్పాడు మండలం యాళ్లూరు రోడ్‌షోలో రైతు మోహన్‌తో మాట్లాడిస్తున్న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, చిత్రంలో పార్టీ అభ్యర్థి శిల్పామోహన్‌రెడ్డి

నా పొలంలో అడుగు పెడితే చాలన్నా....

గోస్పాడు మండల కేంద్రంలో బహిరంగ సభ ముగించుకుని యాళ్లూరు పొలిమేరల్లో వెళుతుండగా అక్కడే పొలం దున్నుకుంటూ ఉన్న ఓ రైతు జగన్ కాన్వాయ్ వద్దకు వచ్చి.. తన పొలంలోరావాలని ఆహ్వానించాడు. అక్కడ ఓ వైపు పంట వేసి ఉండటాన్ని గమనించి 'వద్దులే అన్నా.. నేను నీ పొలంలోకి వస్తే మా వాళ్లంతా (సిబ్బంది) కూడా నాతో వస్తారు. పంటంతా పాడవుతుంది' అని వారించారు. 'మీరు నా పొలంలో అడుగు పెడితే చాలన్నా' అంటూ ఆ రైతు పట్టుబట్టడంతో జగన్ పొలంలోకి వెళ్లి ఆ రైతు దున్నుతూ నిలిపి ఉంచిన నాగలి మేడిని చేత బట్టి కొద్ది సేపు మెరకను దున్నే యత్నం చేశారు.

దారి పొడవునా ఉత్సాహం

జగన్ ప్రచారంలో శనివారం నాలుగో రోజున జనంలో ఉప్పొంగిన ఉత్సాహం కనిపించింది. వంటివెలగల, గోస్పాడు, శ్రీనివాసపురం, యాళ్లూరు, ఎం.కృష్ణాపురం గ్రామాల్లో పర్యటించిన జగన్ మూడు చోట్ల బహిరంగసభల్లో ప్రసంగించారు. దారి పొడవునా జనం పెద్ద సంఖ్యలో గుమిగూడి జగన్‌కు స్వాగతం పలికారు. ఆయన ప్రసంగించిన మూడు బహిరంగ సభల్లో జనం కిటకిటలాడారు.

కాంట్రాక్టు కార్మికులకు భరోసా

గోస్పాడు మండలంలో కొందరు నంద్యాలకు చెందిన మున్సిపల్ పారిశుద్ధ్య కాంట్రాక్టు కార్మికులు జగన్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. తమకు చాలా తక్కువగా నెలకు 6 నుంచి 7 వేల రూపాయలకు మించి జీతాలు రావడం లేదని వాపోయారు. తమకు మేలు చేయాలని విన్నవించుకున్నారు. జగన్ వారి వినతికి స్పందిస్తూ...'మీరు చేసే కష్టం నాకు తెలుసు.. మీ కష్టానికి ఎంత ఇచ్చినా తక్కువే అవుతుంది అని అన్నారు. మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తప్పకుండా మీకు మేలు చేసేందుకు ప్రయత్నిస్తాను.' అని అక్కడి నుంచి కదిలారు.

సెల్‌ఫోన్ల లెక్క తీస్తున్నారు

- ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగంపై కాలుష్య నియంత్రణ మండలి సర్వే
- తొలి విడతలో ప్రభుత్వ ఆఫీసులు, పెద్ద ప్రైవేట్ సంస్థల్లో..
- రెండో విడతలో ఇంటింటి సర్వేకు సిద్ధం

సాక్షి, అమరావతి: ప్రతి ఇంటా ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగం భారీగా పెరుగుతున్న నేపథ్యంలో అవి పాడైపోయిన తర్వాత వాటిని నాశనం చేసే సమయంలో వెలువడే కాలుష్యంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బెంగ పట్టుకుంది. ఇప్పుడు వినియోగిస్తున్న ఎక్కువ భాగం ఎలక్ట్రానిక్ వస్తువులు పాడైన తర్వాత తిరిగి వేరే అవసరాలకు ఉపయోగించుకునేందుకు అవకాశం ఉండదని కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పేర్కొంటున్నారు. వాటిని నాశనం చేయడమే ఏకైక మార్గంగా చెబుతున్నారు. దేశవ్యాప్తంగా ఎన్ని ఎలక్ట్రానిక్ వస్తువులను ప్రజలు వినియోగిస్తున్నారు? వాటి ద్వారా ఎంత మేర కాలుష్యం ఏర్పడే ప్రమాదం ఉందన్న దానిపై ముందస్తు అంచనాకు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి సిద్ధమైంది.

రెండు విడతల్లో సర్వే

రాష్ట్రాల్లోని కాలుష్య నియంత్రణ మండళ్ల ద్వారా ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగంపై సర్వే చేపట్టారు. తొలి విడత రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలతో పాటు పెద్ద సంఖ్యలో ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగానికి అస్కారమున్న ప్రైవేట్ సంస్థల నుంచి సమాచారం సేకరిస్తున్నారు. రెండో విడతలో ఇంటింటి సర్వే చేపడతారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి రాష్ట్రంలో ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగంపై సర్వే చేయడానికి ప్రత్యేకంగా ఎన్యుమరేటర్లను నియమించుకుంది. కాలుష్య నియంత్రణ మండలి నియమించిన ఎన్యుమరేటర్లు ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేట్ కంపెనీల వద్దకు వెళ్లి సంస్థలో ఎంత మంది ఉద్యోగులున్నారు.. వారు ఎన్ని సెల్ ఫోన్లు ఉపయోగిస్తున్నారు.. ఒక్కొక్క కార్యాలయంలో ఎన్ని కంప్యూటర్లు.. ఎన్ని ఎల్ఈడీ మానిటర్లు, ఎల్ఈడీ టీవీలు వాడుతున్నారు.. వాటిని కొనుగోలు చేసి ఎంత కాలమైంది.. ఎన్ని పని చేస్తున్నాయి.. ఎన్ని మూలనపడ్డాయి.. వంటి వివరాలను సేకరిస్తున్నారు. ఫ్రిజ్, ఏసీ వంటి 16 రకాల ఎలక్ట్రానిక్ వస్తువులపై వివరాలు సేకరిస్తున్నారు. పాడైపోయిన ఎలక్ట్రానిక్ వస్తువులను నిల్వ చేయడానికి ప్రత్యేక వసతి ఉందా? పాడైపోయిన ఎలక్ట్రానిక్ వస్తువుల కారణంగా ఉత్పన్నమయ్యే కాలుష్యంపై మీకు అవగాహన ఉందా? అనే వివరాలను సర్వే సిబ్బంది సేకరిస్తున్నారు.

పౌరుల ప్రశ్నలకు సమాధానం చెప్పరా?

రాష్ట్ర ప్రభుత్వంపై ముద్రగడ ధ్వజం

కిర్లంపూడి: మాజీ ఎంపీ, కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం నిర్వహించ తలపెట్టిన పాదయాత్రను 18వ రోజైన శనివారం కూడా పోలీసులు అడ్డుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలోని ఇంటి నుంచి ముద్రగడ బయలుదేరగానే పాదయాత్రకు అనుమతి లేదని పోలీసులు ఆయన్ను నిలువరించారు. దీనిపై ముద్రగడ స్పందిస్తూ.. కాపులకు ఇచ్చిన హామీలను గుర్తుచేయడం కోసం పాదయాత్ర చేస్తానంటే అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమన్నారు. పౌరులు అడిగే ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన అవసరంలేదా? అని ప్రశ్నించారు. తమ జాతికి ఇచ్చిన హామీలను గుర్తు చేయడం కోసం శాంతియుతంగా పాదయాత్ర చేపడితే.. కేసులు నమోదు చేశారని.. ఆ కేసులను కోర్టుకు అప్పగిస్తే అక్కడైనా బాధలు చెప్పుకుంటామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంత కాలం అడ్డుకున్నా పాదయాత్రను ఆపే ప్రసక్తే లేదన్నారు. రాష్ట్రంలో గుడ్డిపాలన కొనసాగుతోందని, దానికి నిరసనగా తలకు నల్ల ముసుగులు ధరించి నిరసన తెలియజేశారు. జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున చంద్రబాబుకు వ్యతిరేకంగా, ముద్రగడకు మద్దతుగా నినాదాలు చేశారు. పాదయాత్రకు తక్షణమే అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు, మహిళలు, కాపు నేతలు పాల్గొన్నారు. ముద్రగడ చేస్తున్న పాదయాత్రను పోలీసులు అడ్డుకున్నందుకు నిరసనగా ఆయన ఇంట మధ్యాహ్నం కంచాలమోత కార్యక్రమాన్ని నిర్వహించారు.



పాదయాత్రను అడ్డుకుంటున్న పోలీసులు

సాక్షి
జాతీయం /అంతర్జాతీయం
ఆదివారం I ఆగస్టు I 13 I 2017
www.sakshi.com
6

గర్భిణులు వాడే సబ్బులు, లోషన్లు కడుపులోని శిశువుకు హాని చేసే అవకాశముందని తాజా అధ్యయనంలో తేల్చారు. ఇవి ఉపయోగించిన అనంతరం శరీరంపై పేరుకునే ట్రిక్లో కార్బన్ శిశువుకు చేరుతుందని నిర్ధారించారు.





అమెరికాలోని అలస్కా మెండెన్‌హాల్ నదిలో భారీ మంచుకొండ పక్కనుంచి వెళ్తున్న పర్యాటకులు. కొద్ది కాలంగా సమీపంలోని మెండెన్‌హాల్ హిమానీనదం నుంచి నదిలోకి మంచు పలకలు కొట్టుకొస్తున్నాయి.

‘తక్కువ జీతం’తో ఎక్కువ అనారోగ్యం!

లండన్: తక్కువ జీతం పొందే ఉద్యోగం, ఎక్కువ ఒత్తిడిని కలిగించే ఉద్యోగాలు చేసేవారికి అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని ఓ తాజా అధ్యయనంలో వెల్లడైంది. నిరుద్యోగిగా ఉండటం కంటే ఇలాంటి ఉద్యోగాలు చేయడం వల్లే అనారోగ్య సమస్యలు అధికంగా ఎదుర్కోవాల్సి వస్తుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ మేరకు యూకేలోని మాంచెస్టర్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు 35 నుంచి 75 సంవత్సరాల వయసు కలిగిన వారిపై అధ్యయనం నిర్వహించి వెల్లడించారు. ఈ అధ్యయనంలో భాగంగా వీరి ఆరోగ్య, మానసిక స్థితులను ఎప్పటికప్పుడు పరిశీలించినట్లు చెప్పారు. తక్కువ జీతం పొందుతూ ఎక్కువ శ్రమకు లోనవుతున్న ఉద్యోగుల్లో ఒత్తిడి అధికంగా కనిపించిందని, అంతేకాకుండా వీరు అనేక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని వెల్లడించారు. నిరుద్యోగుల కంటే కూడా వీరిలోనే ఎక్కువగా అనారోగ్య పరిస్థితులు కనిపించాయని భారత సంతతికి చెందిన శాస్త్రవేత్తలు తరణీ చందోలా వివరించారు.



జికా వైరస్‌కు సమర్థవంతమైన టీకా

వాషింగ్టన్: ప్రాణాంతకమైన జికా వైరస్‌కు ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా మొక్కల నుంచి టీకాను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఇది అత్యంత సమర్థవంతమైనదని, సురక్షితమైనదని, అంతేకాకుండా ఇది చాలా చవకైనదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ మేరకు జికా వైరస్‌ను నిలువరించేందుకు అమెరికాలోని అరిజోనా యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు పరిశోధన నిర్వహించి ఈ టీకాను అభివృద్ధి చేశారు. జికా వైరస్ ప్రజలకు సోకేలా చేయడంలో జికా వైరల్ ప్రొటీన్‌లోని డీ– ఐఐఐ అనే డొమైన్ కీలక పాత్ర పోషిస్తుందని ఏఎస్‌యూకి చెందిన శాస్త్రవేత్త కియాంగ్ చెన్ వివరించారు. దీన్ని నిలువరించేందుకుగాను ముందుగా పొగాకు మొక్కల్లోకి డీ– ఐఐఐని ప్రవేశపెట్టి, అదే మొక్క నుంచి ప్రతిరక్షకాన్ని అభివృద్ధి చేసినట్లు కియాంగ్ చెప్పారు. ముందుగా ఈ టీకాను ఎలుకలపై ప్రయోగించి 100 శాతం విజయం సాధించామని వివరించారు.



రాజ్యసభ నేతగా శరద్ యాదవ్ తొలగింపు



న్యూఢిల్లీ: బిహార్‌లో బీజేపీతో కలవడాన్ని వ్యతిరేకించడంతో జేడీయూ సీనియర్ నేత శరద్ యాదవ్‌ను రాజ్యసభలో పార్టీ నాయకుడి పదవి నుంచి తప్పించారు. మరో నాయకుడు ఆర్సీపీ సింగ్‌ను రాజ్యసభలో తమ నాయకుడిగా జేడీయూ సభ్యులు ఎన్నుకున్నారు. ఈ విషయాన్ని జేడీయూ ఎంపీలు రాజ్యసభ చైర్మన్ వెంకయ్య నాయుడుకి శనివారం అధికారికంగా తెలియజేశారు. బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌కు ఆర్సీపీ సింగ్ విశ్వాసపాత్రుడు. జేడీయూకు రాజ్యసభలో 10 మంది ఎంపీలుండగా, కాంగ్రెస్ ఏర్పాటు చేసిన విపక్షాల సమావేశానికి హాజరైనందుకుగాను అలీ అన్వర్ అన్సారీ అనే ఎంపీని శుక్రవారం పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. మరోవైపు కేంద్రంలోని ఎన్డీయేలో చేరి మంత్రి పదవి చేపట్టాల్సిందిగా జేడీయూను ఆహ్వానించినట్లు బీజేపీ జాతీయాధ్యక్షుడు అమిత్ షా చెప్పారు. నితీశ్‌ను తన నివాసంలో శుక్రవారం కలిసినట్లు షా శనివారం ఓ ట్వీట్‌లో తెలిపారు.

జెండా ఎగరేసే మంత్రులను అడ్డుకుంటాం

ముంబై: బేషరతుగా రుణమాఫీ చేయకుంటే ఆగస్టు 15న స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా జిల్లా కేంద్రాల్లో జాతీయ జెండాను ఆవిష్కరించకుండా మంత్రుల్ని అడ్డుకుంటామని మహారాష్ట్రలోని రైతు సంఘాల స్టీరింగ్ కమిటీ హెచ్చరించింది. ‘రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీలో చాలా లోపాలున్నాయి. వాటన్నింటిని ప్రభుత్వం వెంటనే సరిదిద్దాల’ని కమిటీ సభ్యుడు రఘునందన్ దాదా పాటిల్ డిమాండ్ చేశారు. మరోవైపు రైతుల రుణమాఫీ కోసం ఆగస్టు 14న రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని మహారాష్ట్ర కిసాన్ సభ నేత అజిత్ నవ్లే, ఎమ్మెల్యే బచ్చూ కడూ తెలిపారు. ఒకవేళ ప్రభుత్వం తమ డిమాండ్లను విస్మరిస్తే మళ్లీ రైతుల ఆందోళన ప్రారంభమవుతుందని హెచ్చరించారు.

అంతరిక్షం నుంచి కనిపించేలా ‘మండేలా’



జొహన్నెస్‌బర్గ్: జాతివివక్ష వ్యతిరేకోద్యమ నేత నెల్సన్ మండేలా శతజయంతి సందర్భంగా దక్షిణాఫ్రికా జైళ్లలోని వందలాది ఖైదీలు ప్రపంచంలోనే అతిపెద్ద ముఖచిత్ర దుప్పటితో(4,500 చదరపు మీటర్లు) నివాళి అర్పించనున్నారు. ఈ చిత్రాన్ని ఊలు దారాలతో అల్లుతారు. వచ్చే ఏడాది జూలై 18(మండేలా శతజయంతి) కోసం చిన్నచిన్న ఊలు దుప్పట్లను కలిపికుట్టి ఈ భారీ దుప్పటిని తయారుచేస్తారు. దీగన్ని అంతరిక్షం నుంచి కూడా చూడొచ్చు. బ్లాంకెట్స్ ఫర్ మండేలా అనే సంస్థ ‘మాసివ్ మండేలా మాస్టర్‌పీస్’ పేరుతో ఈ ప్రాజెక్టును శనివారం జోండర్‌వాటర్ జైల్లో ప్రారంభించింది. దుప్పట్లకు అవసరమయ్యే ఊలు ఖర్చు రూ. 6.6 కోట్లను ఓ అజ్ఞాత వ్యాపారి భరిస్తున్నారు.

మార్కులను బట్టి యూనిఫామ్

మలప్పురం: కేరళలో ఓ ప్రైవేటు స్కూల్ తీసుకున్న నిర్ణయం వివాదాస్పదంగా మారింది. సాధించిన మార్కుల ఆధారంగా వేర్వేరు యూనిఫామ్‌లు వేసుకురావాలని పాండిక్కడ్‌లోని అల్‌ఫరూక్ పాఠశాల యాజమాన్యం విద్యార్థులను ఆదేశించింది. ఎక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులు తెలుపు రంగు, తక్కువ మార్కులు వచ్చినవారు ఎరుపు రంగు దుస్తులు వేసుకురావాలని సూచించింది. ఈ నిర్ణయం చిన్నారులపై వివక్ష చూపడమేనని పలువురు తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు ఈ ఘటనలో కేరళ బాలల హక్కుల సంఘం సదరు పాఠశాల ప్రిన్సిపల్‌పై కేసు నమోదు చేసింది. రెండు వారాల్లోగా ఈ ఘటనపై నివేదిక సమర్పించాలని విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్‌ను ఆదేశించింది.

కెన్యా అధ్యక్షుడిగా రెండోసారి కెన్యట్టా



నైరోబి: ఆఫ్రికా దేశం కెన్యా అధ్యక్షుడిగా ఉహురు కెన్యట్టా రెండోసారి ఎన్నికయ్యారు. 54.27 శాతం ఓట్లు దక్కించుకున్న కెన్యట్టా విజయం సాధించినట్లు కెన్యా ఎన్నికల సంఘం శుక్రవారం ప్రకటించింది. అయితే ఎన్నికలు సక్రమంగా జరగలేదనీ, పలుచోట్ల రిగ్గింగ్, ఓటింగ్ యంత్రాల ట్యాంపరింగ్ జరిగిందని ఎన్నికల్లో ఓడిపోయిన రైలా ఒడింగా ఆరోపిస్తున్నారు. కెన్యట్టా వైఖరిని నిరసిస్తూ కెన్యాలో ప్రతిపక్ష పార్టీ మద్దతుదారులు భారీ ఆందోళనలకు దిగడంతో పరిస్థితులు హింసాత్మకంగా మారాయి. గొడవల్లో 11 మంది నిరసనకారులు చనిపోయారు.

నేపాల్‌లో వరదలు..36 మంది దుర్మరణం

కాఠ్మాండు: నేపాల్‌లో భారీ వర్షాలకు తోడు కొండ చరియలు విరిగిపడడంతో ఇప్పటివరకు 36 మంది దుర్మరణం చెందగా, 12 మంది గల్లంతయ్యారని అధికారులు తెలిపారు. వరదలకు వందలాది ఇళ్లు నీట మునగగా..వేలాది మంది నిరాశ్రయులయ్యారని ఆ దేశ హోంశాఖ పేర్కొంది. మరోవైపు ప్రధాని షేర్ బహదూర్ దేవ్ నేతృత్వంలో అత్యవసరంగా సమావేశమైన కేబినెట్ సహాయక చర్యల్ని మరింత ఉధృతం చేయాలని స్థానిక, జిల్లా అధికారులను ఆదేశించింది. ఝపా, మోరంగ్, సున్సారీ, సప్టారీ, సిరాహా, సర్లాహీ, రౌతహట్, బంకే, బర్డియా, దంగ్ జిల్లాలు వరద తాకిడికి తీవ్రంగా దెబ్బతిన్నట్లు హోంమంత్రి శర్మ వెల్లడించారు. వరద నీరు చొచ్చుకురావడంతో బిరత్‌నగర్ విమానాశ్రయాన్ని మూసివేసినట్లు పేర్కొన్నారు.

బాధ్యులెవరైనా వదిలిపెట్టం!

ఆక్సిజన్ కొరతే కారణం కాదు

- సీఎస్ ఆధ్వర్యంలో విచారణ కమిటీ ఏర్పాటు
- నివేదిక వచ్చాక కఠిన చర్యలు
- చిన్నారుల మృతి కలచివేసింది: యూపీ సీఎం యోగి
- మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌పై వేటు
- యోగి రాజీనామాకు కాంగ్రెస్ డిమాండ్





బీఆర్‌డీ ఆసుపత్రిలో చనిపోయిన బిడ్డతో వెళ్తున్న తండ్రి. రోదిస్తున్న మృతిచెందిన చిన్నారి కుటుంబ సభ్యులు

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ బాబా రాఘవ్‌దాస్ (బీఆర్‌డీ) వైద్య కళాశాలలో ఆక్సిజన్ కొరత కారణంగా ఎవరూ చనిపోలేదని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ స్పష్టం చేశారు. ఆగస్టు 11న ఆక్సిజన్ కొరత కారణంగా ప్రెజర్ కాస్త తగ్గినప్పటికీ చిన్నారుల మృతికి ఇదే కారణం కాదన్నారు. శనివారం లక్నోలో మీడియా సమావేశంలో యోగి మాట్లాడుతూ.. చిన్నారుల మృతి తనను కలచివేసిందని పేర్కొన్నారు. సీఎస్ నేతృత్వంలో కమిటీ ఏర్పాటుచేసినట్లు తెలిపిన యోగి.. నివేదిక అందిన తర్వాత బాధ్యులెంతటివారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. ఒకవేళ విచారణలో ఆక్సిజన్ కొరతే కారణమని తేలితే అంతకన్నా దారుణం మరొకటి ఉండదన్నారు. ఆగస్టు 7 నుంచి వివిధ వ్యాధుల కారణంగా ఇదే ఆసుపత్రిలో 60 మంది చిన్నారులు చనిపోయారని రాష్ట్ర వైద్య మంత్రి సిద్ధార్థ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారని పేర్కొంటూ బీఆర్డీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌పై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. అటు, సీఎం యోగి ఆదిత్యనాథ్ సొంత నియోజకవర్గంలోనే ఈ ఘటన జరగటంతో ప్రభుత్వంపై విపక్షాలు దుమ్మెత్తిపోస్తున్నాయి. కాగా, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గోరఖ్‌పూర్ ఆసుపత్రి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యమే!

గోరఖ్‌పూర్ ఘటనలో రాష్ట్రప్రభుత్వం తీరుపై విపక్షాలు తీవ్రంగా మండిపడ్డాయి. ప్రభుత్వ భారీ నేరపూరిత నిర్లక్ష్యం వల్లే 60 మంది చిన్నారులు చనిపోయారని ఎస్పీ, బీఎస్పీ విమర్శించాయి. ‘ఆరేడు రోజుల్లో 60 మంది చిన్నారులు చనిపోవటం చాలా బాధాకరం. ఇది బీజేపీ ప్రభుత్వ నిర్లక్ష్యపు పాలనకు ఉదాహరణ. యోగికి ప్రజా సంక్షేమం పట్టదు’ అని బీఎస్పీ చీఫ్ మాయావతి విమర్శించారు. ఈ ఘటనకు ప్రభుత్వానిదే బాధ్యతని ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. ఆక్సిజన్ సరఫరాలో లోటుపాట్ల కారణంగానే ఈ దుర్ఘటన జరిగిందన్నారు. ‘ఆసుపత్రికి ఆక్సిజన్ సిలిండర్లను సరఫరా చేసే సంస్థ.. బకాయిలు చెల్లించకుంటే సరఫరా నిలిపేస్తామని మెడికల్ కాలేజీ యాజమాన్యానికి ముందే సూచించినా సర్కారు స్పందించలేదు’ అని అఖిలేశ్ విమర్శించారు. శనివారం బాబా రాఘవ్‌దాస్ మెడికల్ కాలేజీని సందర్శించిన కాంగ్రెస్ సీనియర్ నేత గులాంనబీ ఆజాద్.. చిన్నారుల మృతిపై ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ సీఎం యోగి రాజీనామా చేయాలని ఢిల్లీలో కాంగ్రెస్ అధికార ప్రతినిధి మనీశ్ తివారీ డిమాండ్ చేశారు.

చర్యలు షురూ..

గోరఖ్‌పూర్ ఘటన బాధ్యులపై యూపీ ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. చిన్నారుల మృతికి కేంద్ర బిందువైన బీఆర్డీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజీవ్ మిశ్రా బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారంటూ సస్పెండ్ చేసింది. ‘బకాయిలు చెల్లించాలంటూ ఆగస్టు 1న ఆక్సిజన్ సిలిండర్ల సరఫరాదారు ప్రిన్సిపాల్‌కు లేఖరాశారు. ఈ లేఖను వైద్య విద్య శాఖ డైరెక్టర్ జనరల్‌కు పంపించగా.. ప్రభుత్వం ఆగస్టు 5న బకాయిలను విడుదల చేసింది. కళాశాల అకౌంట్లోకి ఆగస్టు 7న డబ్బులొచ్చినా.. ఆగస్టు 11 వరకు ఆ సరఫరాదారుకు డబ్బులు చెల్లించలేదు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన కాలేజీ ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేస్తున్నాం’ అని యూపీ వైద్య విద్య శాఖ మంత్రి అశుతోశ్ టాండన్ పేర్కొన్నారు. కేంద్ర వైద్య మంత్రి జేపీ నడ్డా, సహాయ మంత్రి అనుప్రియా పాటిల్ (యూపీ) కూడా పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

నేను పదే పదే అడిగా.. అయినా!

‘చిన్నారుల మృతి వేదన కలిగించింది. మెదడువాపు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని ముందునుంచీ హెచ్చరిస్తూనే ఉన్నాను. ఆగస్టు 9న వైద్య అధికారులతో సమీక్ష నిర్వహించాను. మెదడువాపు, డెంగ్యూ, దొంగజ్వరం, స్వైన్ ఫ్లూ, చికున్‌గున్యాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించాను. బీఆర్డీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, పీడియాట్రిక్ వార్డు ఇన్‌చార్జ్‌లతో మాట్లాడా. సంసిద్ధత కోసం ప్రభుత్వం నుంచి ఇంకేమేం కావాలని అడిగాను. అప్పుడు కూడా ఆక్సిజన్ కొరత గురించి నాకు చెప్పలేదు. ఈ ఘటనపై ప్రధాని మోదీ ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఆయన వివరణ అడిగారు’.

‘డోక్లామ్’ సవాలుకు సిద్ధం: భారత్

జమ్మూ: డోక్లామ్ ప్రతిష్టంభనకు సంబంధించి చైనా నుంచి ఎదురయ్యే ఎలాంటి సవాలునైనా ఎదుర్కొనేందుకు భారత్ పూర్తి సన్నద్ధంగా ఉందని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ అన్నారు. ఈ మేరకు చేపడుతున్న చర్యల పట్ల భారత్ విశ్వాసంతో ఉందని చెప్పారు. ఈ మధ్య కాలంలో చైనా మీడియా నుంచి వెలువడుతున్న వరస ప్రకటనలను కొట్టిపారేశారు. సిక్కిం సెక్టార్‌లో భారత్ తన బలగాలను వెనక్కి పిలవాలని చైనా హెచ్చరించడంపై స్పందిస్తూ...‘మనం ఏం చేస్తున్నామన్నదే ముఖ్యం. ఎదుటి పక్షం నుంచి వస్తున్న ట్వీట్లపై మాట్లాడానికి ఇక్కడి రాలేదు. మా చర్యలపై మాకు పూర్తి నమ్మకం ఉంది’ అని అన్నారు. భారత్–పాక్ సరిహద్దులో కాల్పుల విరమణ ఒప్పందాల ఉల్లంఘనకు భారత్ తగిన రీతిలో బదులిస్తోందని పేర్కొన్నారు. కశ్మీర్ లోయలో యువత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు దూరంగా ఉండాలని మిలిటెంట్ జకీర్ మూసా చిత్రంతో కూడిన పోస్టర్లు వెలుగుచూడటంపై మాట్లాడుతూ..అలాంటి పోస్టర్లు గతంలోనూ కనిపించాయని అన్నారు.

‘భారత్ పరిణతితో వ్యవహరిస్తోంది’

వాషింగ్టన్: డోక్లాంపై భారత్ పూర్తి పరిణతితో, చైనా అసహనంతో వ్యవహరిస్తోందని అమెరికా రక్షణ నిపుణుడొకరు అభిప్రాయపడ్డారు. అమెరికా నేవీ యుద్ధ కళాశాల ప్రొఫెసర్ హోమ్స్ స్పందిస్తూ వివాదాన్ని చైనా సుదీర్ఘకాలం కొనసాగించాలని కోరుకుంటోందన్నారు.

కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్

ఇద్దరు జవాన్ల మృతి

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని సోపియాన్ జిల్లాలో శనివారం మిలిటెంట్లతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు జవాన్లు మృతిచెందగా, ఒక కెప్టెన్ సహా ముగ్గురు జవాన్లు గాయపడ్డారు. జైనపోరా ఏరియాలోని అవ్నీరా గ్రామంలో మిలిటెంట్లు ఉన్నారనే సమాచారంతో భద్రతా బలగాలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి గాలింపు జరిపాయి. ఈ సందర్భంగా మిలిటెంట్లు జరిపిన కాల్పుల్లో ఐదుగురు జవాన్లు గాయపడ్డారు. వీరిని చికిత్స కోసం 92 బేస్ ఆస్పత్రికి తరలించగా, క్షతగాత్రుల్లో ఇద్దరు చనిపోయారని పోలీసులు వెల్లడించారు. పూంచ్ సెక్టార్‌లో నియంత్రణ రేఖ వద్ద పాక్ బలగాలు శనివారం జరిపిన కాల్పుల్లో ఒక భారత జవాను, ఒక మహిళ మృతి చెందారు. జవాను జగ్‌రామ్‌సింగ్ (42) చనిపోయాడని ఆర్మీ వెల్లడించింది.

అవగాహన పెంచుకోండి...

భావి లాయర్లకు సీజేఐ జస్టిస్ ఖేహర్ పిలుపు



జస్టిస్ ఖేహర్‌తో 11 బంగారు పతకాలు అందుకున్న ఆరాధన

సాక్షి, న్యూఢిల్లీ: సమాజాన్ని అర్థం చేసుకోలేని న్యాయవాది తన వృత్తిలో రాణించలేడని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేఎస్ ఖేహర్ అన్నారు. బ్రిటిష్ పాలన నుంచి భారత్ విముక్తి పొందినా, స్వాతంత్ర్యం నుంచి లభించే నిజమైన కీర్తి, ప్రతిష్టలను ఇంకా చూడలేదని పేర్కొన్నారు. శనివారం ఢిల్లీ జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఐదో స్నాతకోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయశాస్త్రంలో బ్యాచిలర్స్ డిగ్రీ, పీహెచ్‌డీలు పూర్తిచేసిన వారికి పట్టాలు ప్రదానం చేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అందజేసిన మొత్తం 25 బంగారు పతకాలు, 5 నగదు బహుమానాల్లో సీవీ ఆరాధన అనే విద్యార్థినికి 11 బంగారు పతకాలు దక్కాయి. అనంతరం సీజేఐ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. ‘సమాజంలో పరిణామాలను అర్థం చేసుకోలేకపోతే న్యాయవాద వృత్తిలో రాణించలేరు. మీరు ప్రజాస్వామ్య పరిరక్షణలో ముందుండాలి’ అని అన్నారు. కార్యక్రమంలో ఢిల్లీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి, విశ్వవిద్యాలయం చాన్స్‌లర్ తదితరులు పాల్గొన్నారు.

కొరియాను రెచ్చగొట్టొద్దు

ట్రంప్‌కు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఫోన్

వాషింగ్టన్/బీజింగ్: ఉత్తర కొరియాను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు, చర్యల్ని ఆపాలని.. లేదంటే కొరియా ద్వీపకల్పంలో పరిస్థితులు మరింత దిగజారుతాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ సూచించారు. అమెరికా అధీనంలోని గ్వామ్ ద్వీపంపై క్షిపణుల్ని ప్రయోగిస్తామని ఉత్తర కొరియా హెచ్చరికలు, ఏమాత్రం అనాలోచితంగా వ్యవహరించినా తీవ్ర పర్యవసానాలు తప్పవని అమెరికా హెచ్చరికల నేపథ్యంలో ట్రంప్‌తో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. కొరియా ద్వీపకల్పంలో ఉద్రిక్తతల్ని తగ్గించే లక్ష్యంతో అమెరికాతో కలిసి పనిచేసేందుకు చైనా సిద్ధంగా ఉందని జిన్‌పింగ్ చెప్పారని జిన్హువా న్యూస్ ఏజెన్సీ పేర్కొంది. గ్వామ్‌పై బాలిస్టిక్ క్షిపణుల్ని ప్రయోగిస్తామన్న ఉత్తర కొరియా హెచ్చరికల నేపథ్యంలో జపాన్ క్షిపణి నిరోధక వ్యవస్థను అప్రమత్తం చేసింది. షిమానే, హిరోషిమా, కొచిలో పేట్రియాట్ అడ్వాన్స్‌డ్ కేపబిలిటీ–3(పీఏసీ–3) క్షిపణుల్ని మోహరించింది. ఎహిమేలో కూడా యాంటీ మిస్సైల్ వ్యవస్థను సర్వసన్నద్ధంగా ఉంచింది.



కాయితాలో జపాన్ మోహరించిన పీఏసీ-3 క్షిపణి నిరోధక వ్యవస్థ

కన్నడనాట అమిత్‌షా సమరశంఖం

గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పోరాడాలన్న బీజేపీ అధ్యక్షుడు



సభలో మాట్లాడుతున్న అమిత్‌షా

సాక్షి, బెంగళూరు: వచ్చే ఏడాది ఏప్రిల్–మే నెలల్లో కర్ణాటక శాసనసభకు ఎన్నికలు జరగనున్న తరుణంలో బీజేపీ జాతీయాధ్యక్షుడు అమిత్‌షా ఎన్నికల సమర శంఖాన్ని పూరించారు. కార్యకర్తలు సిపాయిల్లా పోరాడి బీజేపీని కర్ణాటకలో అధికారంలోకి తీసుకురావాలని నిర్దేశించారు. రాష్ట్ర అధ్యక్షుడు బీఎస్ యడ్యూరప్ప తమ ముఖ్యమంత్రి అభ్యర్థి అని షా స్పష్టం చేశారు. మూడు రోజుల రాష్ట్ర పర్యటనలో భాగంగా శనివారం బెంగళూరు కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో షాకు యడ్యూరప్ప, కేంద్రమంత్రులు అనంతకుమార్, సదానందగౌడ, పార్టీ ఇన్‌చార్జ్ మురళీధర్‌రావు తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అనేక అక్రమాలకు పాల్పడుతోందనీ, ఈ విషయాన్ని ప్రతి గడపకూ వెళ్లి చెప్పాలని కార్యకర్తలకు సూచించారు. వచ్చే ఏడాది ప్రధాని మోదీ చేపట్టే విజయ రథయాత్ర కర్ణాటక ప్రాంతాల గుండా సాగనుందని అమిత్‌షా చెప్పారు.

రాజకీయాల్లోకి ఉపేంద్ర

కర్ణాటకలో కొత్త పార్టీ ఏర్పాటు చేస్తానని ప్రకటన

- పారదర్శక ప్రత్యామ్నాయమే లక్ష్యమని వెల్లడి



సాక్షి, బెంగళూరు: ప్రముఖ కన్నడ సినీనటుడు, తెలుగు ప్రేక్షకులకు సుపరిచితుడు, ‘రియల్ స్టార్’ ఉపేంద్ర తాను త్వరలో కర్ణాటకలో కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. వచ్చే ఏడాది మొదట్లో రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ ప్రకటన చేశారు. ప్రజాసమస్యలను పరిష్కరించే శక్తిసామర్థ్యాలు, ఆలోచనలు ఉన్న వారికి వేదిక కల్పించేందుకు పార్టీని స్థాపిస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుత రాజకీయాలకు పూర్తి పారదర్శక ప్రత్యామ్నాయాన్ని అందించాలన్నది తన యోచన అని పేర్కొన్నారు. ఆయన శనివారం బెంగళూరులోని రుప్పీస్ రిసార్ట్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఖాకీ చొక్కా ధరించిన ఉపేంద్ర ‘ఈ దుస్తులు కష్టించి పనిచేసే ‘జన కార్మికుడి’కి ప్రతీక అని వ్యాఖ్యానించారు. ‘మా పార్టీ జన నాయకుడిని, జన సేవకుడిని కాకుండా ప్రజల కోసం నిజాయితీగా పనిచేసే జన కార్మికుడికి ప్రతీక. నాతో నడవాలనుకునే వారు ఈ ఆలోచనతో ఉండాలి. ఖాదీకి బదులు ఖాకీ ధరించాలి. మాది బహిరంగ వేదిక. ప్రతి ఒక్కరూ కలసిరావాలి’ అని పిలుపునిచ్చారు.

అన్ని స్థాయిల్లో పారదర్శకత

‘మా పార్టీలో అన్ని స్థాయిల్లో పారదర్శకత పాటిస్తాం. ప్రజాధనం దుర్వినియోగం కాకూడదన్నదే మా ముఖ్యోద్దేశం’ అని ఉపేంద్ర చెప్పారు. తనతో కలసి వచ్చేవారితో చర్చించాక పార్టీ పేరు ప్రకటిస్తానని చెప్పారు. రాజకీయ ప్రవేశంపై పలుసార్లు సంకేతాలిచ్చిన ఉపేంద్ర శుక్రవారం ఓ ఆడియో క్లిప్పులో మరింత స్పష్టమైన సంకేతం ఇచ్చారు. ‘మార్పు కోసం ఎవరో ఒకరు బాధ్యత తీసుకోవాలి. అందుకు నేను సిద్ధంగా ఉన్నాను’ అని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆయన బీజేపీలో చేరతారన్న ఊహాగానాలకు తాజా ప్రకటనతో తెరపడింది.

తెలుగు, కన్నడ సినిమాలకు విరామం

పార్టీ ఏర్పాటు నేపథ్యంలో సినిమాల్లో అవకాశాలను వదులుకున్నట్లు ఉపేంద్ర తెలిపారు. ప్రస్తుతం చేస్తున్న ఒక సినిమా ముగిశాక పూర్తి సమయం పార్టీ కోసం కేటాయిస్తానని చెప్పారు. మెగాస్టార్ చిరంజీవి సినిమా ‘ఉయ్యాలవాడ నరసింహారెడ్డి’ నుంచి ఉపేంద్ర తప్పుకున్నట్లు తెలుస్తోంది. ఉపేంద్ర 50కిపైగా సినిమాల్లో నటించి, 10 సినిమాలకు దర్శకత్వం వహించారు. ‘ఉపేంద్ర’, ‘ఏ’, ‘టాస్’, ‘సన్నాఫ్ సత్యమూర్తి’ చిత్రాలతో ఆయన తెలుగు ప్రేక్షకులకూ సుపరిచితుడే.

పన్నీర్‌తో కలసిరండి!

పళనిస్వామికి చెప్పిన ప్రధాని మోదీ!

సాక్షి ప్రతినిధి, చెన్నై: ఇకపై తనను కలవాలంటే తమిళనాడు మాజీ సీఎం పన్నీర్‌సెల్వంతో కలసి రావాలని ప్రధాని నరేంద్ర మోదీ ప్రస్తుత సీఎం ఎడపాడి పళనిస్వామితో అన్నట్లు సమాచారం. ఉపరాష్ట్రపతిగా వెంకయ్యనాయుడు పదవీ ప్రమాణ స్వీకారోత్సవ సభకు హాజరైన సీఎం పళనిస్వామి శుక్రవారం రాత్రి మోదీని కలిశారు. ఆయనతో మోదీ మాట్లాడుతూ ‘మీరిద్దరూ (పళనిస్వామి, పన్నీర్‌సెల్వంలు) విడివిడిగా వస్తే మిమ్మల్ని కలవడం కూడా నాకు ఇష్టం ఉండదు’ అని మోదీ అన్నారని విశ్వసనీయవర్గాలు చెప్పాయి. పళని, పన్నీర్ వర్గాలు విలీనమై... పార్టీపై శశికళ కుటుంబీకుల జోక్యం లేకుండా చేయాల్సిందిగా మోదీ చెప్పినట్లు తెలిసింది. మరోవైపు విలీనంపై మళ్లీ ప్రతిష్టంభన నెలకొంది. పన్నీర్‌సెల్వం, పళనిస్వామిలు కలిస్తే ప్రభుత్వాన్ని కూల్చేస్తానని శశికళ మేనల్లుడు దినకరన్ పరోక్షంగా హెచ్చరిస్తుండటం, అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు స్టాలిన్ సిద్ధమవుతుండటంతో విలీనంపై పన్నీర్‌సెల్వం వెనక్కుతగ్గారని వార్తలు వస్తున్నాయి.

సాక్షి ఫ్యామిలీ
వైఎస్సార్ జిల్లా
ఆదివారం, 13-8-2017



ఫొటో: శివ మల్లాల

గాల్లో ఎగిరి ఓ తన్ను తన్నినా..
కెమెరాకు తిరిగి క్లోజ్‌లో ఒక పంచ్ డైలాగ్ కొట్టినా..
మౌనంగా ఒక లుక్ ఇచ్చినా..
చీపురుతో తాట తీసినా.. గన్నుతో కాకపుట్టించినా..
'విజయ'లో ఉన్న అశాంతే కనిపిస్తుంది... కోపం, ఉద్రేకం, రౌద్రం,
ప్రతీకారం కన్నీళ్లలా కాకుండా
చెమట బిందువుల్లా ఆమె చెంపల మీద జారతాయి.
'హీరోయిన్ బేస్డ్ సినిమాల్లేండీ' అని తోసి పారేయకండి.
రాములమ్మది హీరో బేస్డ్ సినిమాయే.
హీరో అవడానికి మీసాలే ఉండక్కర్లా.
రోషం.. పౌరుషం ఉంటే చాలు అంటున్నారు **విజయశాంతి**

నేనే హీరో

● **మరో రెండు రోజుల్లో స్వాతంత్య్ర దినోత్సవం. దేశానికి ఫ్రీడం వచ్చి 70 ఏళ్లైంది. అసలు మహిళలకు ఫ్రీడమ్ వచ్చిందా?**

విజయశాంతి: ఇంకా రాలేదనే అనుకుంటున్నా. స్వాతంత్య్రం వచ్చిన ఈ 70 ఏళ్లలో మంచి మార్పు వచ్చుండాలి. కానీ రాలేదు. టీవీలు, పేపర్లలో ప్రతిరోజూ మహిళలపై ఎన్నో ఘటనలు జరుగుతున్నాయనే వార్తలే. జరగరానివి జరుగుతున్నాయి.

అవన్నీ చూస్తుంటే బాధగా ఉంటుంది. స్కూల్ పిల్లలు, వర్కింగ్ విమెన్, వాళ్లూ–వీళ్లూ అనే తేడా లేదు. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు సేఫ్టీ లేకుండా పోయింది. పెద్దింటి పిల్లలు, రాజకీయ నాయకులు, వాళ్ల వారసులు ఉండడంతో కొన్ని తప్పులు వెలుగులోకి రాకుండాపోతున్నాయి. ఓవరాల్‌గా నష్టపోయేది, చనిపోయేది ఆడవాళ్లే. స్త్రీలకు జరుగుతున్న అన్యాయాలపై మగాళ్లందరూ తలదించుకోవాలి. ప్రధాని నుంచి ముఖ్యమంత్రుల వరకు అందరూ తలదించుకోవాలి. ఆడవాళ్లకు రక్షణ ఉంటేనే కదా.. ఫ్రీడమ్ వచ్చినట్లు!

● **ఏం చేస్తే బాగుంటుందనుకుంటున్నారు... 'నిర్భయ' చట్టం వచ్చాక దారుణాలు తగ్గుతాయేమో అనిపించింది..**

చట్టాలు తీసుకొస్తున్నారు గానీ... వాటిని కరెక్టుగా అమలు చేయడంలేదు. రీసెంట్‌గా ఓ రాజకీయ నాయకుడి కుమారుడు అర్ధరాత్రి ఓ అమ్మాయిని వెంబడించిన ఘటన చూశాం కదా. ఇక, మనం ఎవర్ని నమ్ముతాం? ఏ రకంగా నమ్ముతాం? మగవాళ్ల మైండ్‌సెట్ మారాలేమో అనిపిస్తోంది. ప్రతి ఒక్కరికీ అక్కాచెల్లెల్లు, అమ్మలు ఉంటారు. మరి, బయటకు వచ్చేటప్పటికి అమ్మాయిల పట్ల ఎందుకలా ప్రవర్తిస్తున్నారనేది అర్థం కావడం లేదు. చట్టాలను స్ట్రాంగ్ చేయాలి.

● **ఆడవాళ్లు బయటకు రావడం వల్ల, లేట్ నైట్స్‌లో బయట ఉండడం వల్ల ఇటువంటివి జరుగుతున్నాయనేవాళ్లు ఉన్నారు.**

లేట్ నైట్స్ అంటే... ఇప్పుడు ఉద్యోగాలు చేస్తుంటారు. ఉదాహరణకు... మీరున్నారు. మీడియాలో ఎంతోమంది మహిళలున్నారు. షిఫ్ట్ ప్రకారం నైట్ డ్యూటీలు చేస్తుంటారు. వాళ్లేం చేయాలి? బయట సమాజం ఇలా ఉందని ఉద్యోగాలు మానుకోలేరు కదా! పని చేసేవాళ్లు చేయాలి. ఎదుటి వ్యక్తులు సరిగ్గా ఉండాలి. పద్ధతిగా నడుచుకోవాలి. ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలి. రెండు మూడు ఘటనల పట్ల స్ట్రాంగ్‌గా రియాక్ట్ అయితే అప్పుడు భయం వస్తుంది. పెద్దింటోళ్లు, చిన్నింటోళ్లు అనే తేడాలు లేకుండా తప్పు చేసే ఏ మగాణ్ణయినా శిక్షించాల్సిందే. ఆ విషయంలో దయాదాక్షిణ్యాలు ఉండకూడదు.

● **ఈ ఘటనలు పక్కనపెడితే... మహిళలు అన్ని రంగాల్లోనూ ముందుకు దూసుకు వెళ్తున్నారు. పెద్ద పెద్ద కార్పొరేట్ కంపెనీలకు సీఈవోలుగా ఉన్నారు. అంతరిక్షంలోకి వెళ్తున్నారు. ఆ అభివృద్ధి గురించి?**

అది ఆనందమే. మహిళల్లో మంచి ప్రతిభ దాగుంది. దూసుకెళ్తున్నారు. అదొక్కటే కాకుండా... మహిళలు అన్ని రంగాల్లోనూ కొన్ని ఇబ్బందులూ ఎదుర్కొంటున్నారు. వాళ్ల ప్రతిభను చూసి ఓర్వలేనోళ్లు ఎలాగైనా దెబ్బకొట్టాలని చూస్తారు. అటువంటి ప్రతికూలస్థితులను అధిగమించి కొందరు మహిళలు పైకొస్తున్నారు. ఇది అభినందించాల్సిన విషయం. మగవాళ్ల కంటే ఆడవాళ్లు తక్కువ కాదని నిరూపించుకుంటున్నారు.

● **అప్పట్లో హీరోయిన్ అంటే విజయశాంతి. విజయశాంతి అంటే హీరోయిన్ అన్నంతగా పేరు తెచ్చుకున్నారు. అప్పడు ఈర్ష్యతో మిమ్మల్ని తొక్కేయడానికి ఎవరైనా ట్రై చేశారా?**

ఒక హీరోయిన్‌కి హీరో ఇమేజ్ రావడం ఏంటి? హయ్యస్ట్ పెయిడ్ హీరోయిన్ ఏంటి? అని మాట్లాడిన వాళ్లు ఉన్నారు. అవన్నీ ఓవర్‌కమ్ చేసుకుని నా పని నేను చేసుకుంటూ వెళ్లేదాన్ని. సక్సెస్‌లు వస్తుండేవి. ప్రజలు నన్నెంతో ఆదరించారు. దాంతో భయపడలేదు. యాక్షన్ ఫిల్మ్స్‌లో స్టంట్స్ కూడా డూప్ లేకుండా చేశా. ఇప్పుడంటే గ్రాఫిక్స్ వచ్చాయి కానీ... అప్పట్లో లేవు కదా. 30 అడుగుల ఎత్తు నుంచి దూకాలంటే దూకేయడమే. నేను చేయ నంటే ఎవరూ ఏమీ అనేవారు కాదేమో! కానీ, నేనే తగ్గేదాన్ని కాదు. మహిళలు ఎందులో తక్కువ? అనే ఫీలింగ్‌తో రిస్క్ తీసుకునేదాన్ని. కొన్ని సందర్భాల్లో కాళ్లు–చేతులు విరగొట్టుకున్నా. వాటిని లెక్క చేయకుండా పని చేయాలనే అభిప్రాయంతో చేశా. రాజకీయాల్లో అయితే సినిమాల్లో కంటే దారుణంగా, భయంకరంగా ఉంటుంది. వాటిని ఓవర్‌కమ్ చేసి రావాలి.

● **రాజకీయాల్లో భయంకరమైన రాజకీయాలుంటాయన్నారు. ఇందులోకి ఎందుకొచ్చాం అనే ఫీలింగ్ ఏమైనా..?**

నేనా రోజు తెలంగాణ అంశం టేకప్ చేసినప్పుడు.. 'సినిమాల్లో టాప్‌మోస్ట్‌గా ఉండి, తెలంగాణ కోసం వెంపర్లాడుతోందేంటి? రాంగ్ డెసిషన్ తీసుకుంది?' అని చాలామంది హేళన చేశారు. కొన్ని అవమానాలూ జరిగాయి. అయినా పట్టించుకోలేదు. రెండు ప్రాంతాల్లో (ఆంధ్రా, తెలంగాణ) పేరు, సామాజిక బాధ్యత గల కళాకారిణిగా తెలుగు ప్రజల క్షేమం కోరుకున్నా. రాష్ట్రాలుగా విడిపోయినా... మంచి మనసుతో అందరూ కలిసుండాలని చెప్పా. తెలుగు ప్రజల మధ్య అప్పట్లో నెలకొన్న గీత, వైరుధ్యాలు ఈరోజు తొలగాయనే సంతృప్తి నాకుంది. 'విడిపోతే రెండు ప్రాంతాలు బాగుపడతాయి, ఇరు వర్గాలకు న్యాయం చేసినోళ్లమవుతాం' అని చెప్పా. ఇప్పుడందరూ హ్యాపీగా ఉన్నారు. తెలంగాణ సాధన కోసం పాటుపడినందుకు ఆనందపడుతున్నా.

● **తెలంగాణ ఉద్యమ సమయంలో ఎంతో శ్రమించారు. ఆ పార్టీలో ఉండి ఉంటే ఒక పెద్ద పదవి పొంది ఉండేవారేమో?**

నాపై కొన్ని కుట్రలు, కుతంత్రాలు జరిగాయి. ప్రతిభ ఉన్నోళ్లకు ఇబ్బందులు తప్పవు. రాజకీయాలు అన్నప్పుడు వెన్నుపోట్లు తప్పవు. ప్రాంతీయ పార్టీలు అలాగే ఉంటాయి. ప్రజలు ఆశించినట్టు జరగాలంటే జాతీయ పార్టీల ద్వారానే సాధ్యపడుతుంది. జరిగిందేదో జరిగింది. అయినా... కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇచ్చింది. నాకా గ్రాటిట్యూడ్ ఉంది. పదవులన్నది ఈరోజు రాకపోవచ్చు, రేపు రావొచ్చు. కానీ, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించామనే తృప్తి నాకుంది. అది పదవుల కంటే ఎక్కువని అనుకుంటున్నా. పదవులది ఏముంది? ఐదేళ్లు అధికారంలో ఉంటారు. తర్వాత ప్రజలు మరొక పార్టీకి ఓటేస్తారు. కానీ, ఈ అచీవ్‌మెంట్ అనేది మళ్లీ రాదు. గాంధీగారు దేశ స్వాతంత్య్రం కోసం శ్రమించినట్టు, నేను తెలంగాణ కోసం 19 ఏళ్లు కష్టపడ్డా. నాకది బిగ్గెస్ట్ అచీవ్‌మెంట్.

● **తమిళనాడులో రజనీకాంత్, కమల్‌హాసన్‌లు రాజకీయాల్లోకి వచ్చే పరిస్థితులు ఉన్నాయంటు న్నారు. మీకు అక్కడ బోలెడంత ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. ఆ మధ్య మీరు తమిళనాడు వెళ్లారు. మీరు అక్కడ్నుంచి పోటీ చేసే అవకాశాలు ఉన్నాయా?**

లేదమ్మా. తెలంగాణ కోసం 19 ఏళ్లు నేను కష్టపడి పని చేసి, రాష్ట్రాన్ని సాధించిన తర్వాత మరో రాష్ట్రం గురించి ఆలోచించడం లేదు. అఫ్‌కోర్స్... నాకు అక్కడ అభిమానులున్నారు. నేనక్కడి రాజకీయాల్లోకి రావాలని వాళ్లు కోరుకోవచ్చు. కానీ, నేనలా తెలంగాణ రాష్ట్రాన్ని వదిలి వెళ్లే మనిషిని కాదు. తెలంగాణను తీసుకురావాలనుకున్నాం. తీసుకొచ్చాం. ఇప్పుడీ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి ఇంకా మంచి చేయాలనే ఆలోచనతో నేనున్నా. తమిళనాడులో ఏఐఏడీయంకే పార్టీ వాళ్లు అడిగారు. అయితే... నేను వెళ్లాలనుకోవడం లేదు. జయలలితగారంటే నాకిష్టం. ఆవిడ అధికారంలో తెచ్చిన ప్రభుత్వంలో, పార్టీలో సమస్యలు రాకుండా ఉండడం కోసం... వాళ్లు నన్ను రిక్వెస్ట్ చేయడంతో నేను తమిళనాడుకి వెళ్లి క్యాంపెయిన్ చేసొచ్చా.

● **చెన్నై వెళ్లి శశికళగారిని కలిశారు కాబట్టి, ఆవిడతో చేతులు కలపాలనుకున్నారన్నది చాలామంది ఊహ..**

జయలలితగారిది ప్రజలు ఎన్నుకున్న పార్టీ. మంచి మంచి పథకాలు ఉన్నాయి. ఐదేళ్ల పాటు ఉండాల్సిన పార్టీ. పళనీస్వామి, పన్నీర్ సెల్వం, శశికళ.. వీళ్లంతా కలసికట్టుగా పార్టీని నడిపిస్తే బాగుంటుందనుకున్నా. వీళ్లల్లో ఏ ఒక్కరి పక్షాన నిలబడాలని నేను అనుకోలేదు. ఆ పార్టీ ముందుకెళ్లాలనుకున్నాను. అంతే కానీ, వ్యక్తులతో సంబంధం లేదు.

● **జయలలిత టాపిక్ వచ్చింది కాబట్టి... ఆవిడ మరణం ఓ మిస్టరీ అని చాలామంది ఫీలింగ్?**

జయలలితగారి మరణంలో మిస్టరీ లేదమ్మా. నిజంగా ఆవిడకు ఒంట్లో బాగాలేదు. 1998 నుంచి నేను ఆవిడతో పని చేస్తున్నా. అప్పట్నుంచి జయలలితగారికి షుగర్, బీపీ ఉన్నాయి. ఒకానొక దశలో ఆవిడ వల్ల కాకపోతే క్యాంపెయిన్‌కు నన్ను వెళ్లమని రిక్వెస్ట్ చేశారు. అప్పుడు నేను బీజేపీలో ఉన్నా క్యాంపెయిన్‌కి వెళ్లి వాళ్ల అభ్యర్థులను గెలిపించా. అప్పుడే ఆమెకు కాళ్ల ఆపరేషన్ చేశారు. ఆవిడకు షుగర్ విపరీతంగా ఉండేది. మిస్టరీ ఏం లేదు. అంత పెద్ద హాస్పిటల్‌లో ట్రీట్‌మెంట్ జరుగుతున్న టైమ్‌లో హార్ట్ ఎటాక్ వచ్చింది. ఆల్మోస్ట్ రెండు మూడు రోజుల్లో ఇంటికి వచ్చేస్తారని అనుకుంటున్న టైమ్‌లో ఘోరం జరిగింది. నేను అక్కడి డాక్టర్లతో మాట్లాడాను.

● **తెలంగాణ పరిపాలనపై మీ అభిప్రాయం?**

తప్పులు ఎక్కువైతే మాట్లాడక తప్పదు కదా! తెలంగాణ పరిపాలనపై మాట్లాడాల్సిన సందర్భం వచ్చినట్టుంది. ఆల్మోస్ట్ మూడేళ్లయింది. నేను కొంచెం టైమ్ ఇచ్చా. ఇక, మాట్లాడాల్సిన టైమ్ ఆసన్నమైంది.

● **'ఒసేయ్ రాములమ్మ'కి పార్ట్ 2 చేయాలనుకున్నారని ఓ టాక్. బహుశా దాసరిగారు ఉండి ఉంటే అది జరిగేదేమో...**

దాసరిగారు నాకోసం మూడు సబ్జెక్ట్స్ రెడీ చేస్తూ వచ్చారు. 'ఒసేయ్ రాములమ్మ–2' స్టోరీ కూడా వర్కవుట్ చేశారు. ఆ తర్వాత ఇండియన్ పాలిటిక్స్‌కి సంబంధించి ఒక పొలిటీషియన్ జీవితంతో బయోపిక్ ప్లాన్ చేశారు. హిందీలో 'గులాబ్ గ్యాంగ్' సినిమా టైప్‌లో ఒకటి చేయాలనుకున్నారు. ఆయన ఉండి ఉంటే.. సినిమా చేసి ఉండేదాన్ని. ఆర్టిస్ట్‌ని ఎలా డీల్ చేయాలో ఆయనకు బాగా తెలుసు. హీరోయిన్లను హుందాగా చూపించిన దర్శకుడు.

● **ఇతర రాష్ట్రాల రాజకీయాల గురించి కూడా తెలుసుకుంటుంటారా?**

ఒక్కో స్టేట్‌లో అక్కడికి తగ్గ సమస్యలున్నాయి. అయితే మన స్టేట్‌లో ఎక్కువ ఉన్నాయి. ముందు దీన్ని 'సెట్‌రైట్' చేయాలి. రానున్న రోజుల్లో నా పోరాటం ఈ దిశలోనే ఉంటుంది.

● **ఈ 'డీమానిటైజేషన్', 'జీఎస్‌టీ'.. వీటి వల్ల ప్రజలకు ఏమైనా మేలు జరిగిందా?**

నాకు తెలిసి ప్రజలు లాభపడినట్లు అనిపించలేదు. మధ్యతరగతివాళ్లు, దిగువ మధ్యతరగతులవాళ్లు ఇబ్బందుల పాలవుతున్నారు. డబ్బులు తెచ్చుకోవడానికి ఏటీయంల ముందు ఎన్నేసి గంటలు నిలబడ్డారో, ఎన్నిసార్లు బ్యాంకుల చుట్టూ తిరిగారో తెలిసిందే. జీఎస్‌టీ తర్వాత రేట్లు ఇంకా పెరిగాయేమో అనిపిస్తోంది. ఏ విధానాలనైనా ప్రజల మేలు కొరకు ప్రవేశపెట్టాలి కానీ, వాళ్లను ఇంకా ఇబ్బందుల్లోకి నెట్టేయకూడదు.

● **ఫైనల్లీ మీకు 'సి.ఎం. విజయశాంతి' అనిపించుకోవాలనే కోరిక ఉందా?**

సినిమాల్లో ఒక్కో మెట్టు ఎక్కుతున్నప్పుడు ఇంకా సక్సెస్ వస్తే బాగుంటుందనిపిస్తుంది. సూపర్‌స్టార్ అయితే బాగుంటుందనిపిస్తుంది. ఏ ఆర్టిస్ట్‌కైనా ఇలాంటి ఫీలింగ్ ఉంటుంది. టాప్ పొజిషన్‌కి రావాలనుంటుంది. అలాగే, రాజకీయాల్లో పందొమ్మిదేళ్లు ఎన్నో త్యాగాలు చేసి, ఎన్ని అవకాశాలొచ్చినా పక్కన పెట్టి... తెలంగాణ సాధించేవరకు నా మైండ్‌లోకి ఏదీ తీసుకోనని భీష్మించుకుని కూర్చుని అంత నిజాయితీగా పనిచేసి, టార్గెట్ రీచ్ అయ్యా. తెలంగాణ సాధించా. ఇప్పుడు దేవుడు, ప్రజలు అవకాశం ఇస్తే... సి.ఎం. కావడంలో తప్పు లేదు. సి.ఎం. అని మీరంటున్నారు. నా దృష్టిలో అది కూడా సేవే. పేరుకు మాత్రమే సి.ఎం. కానీ, వర్క్ చేయాలి. అనుకున్నదాంట్లో 60, 70 శాతం చేసినా సక్సెస్ అవుతాం. కానీ, ఎందుకో చాలామంది పని చేయడం లేదు. చెప్పేది చెబుతున్నారు. చేతల్లో అది ఉండడం లేదు.

– డి.జి. భవాని

● **హీరోయిన్‌గా దాదాపు 30 ఏళ్లు బిజీ బిజీగా సినిమాలు చేశారు. బహుశా ఇంత కెరీర్ స్పాన్ ఉన్న ఆర్టిస్టులు తక్కువేమో?**

1979లో స్టార్ అయి, దాదాపు 28 ఏళ్లు కంటిన్యూస్‌గా సినిమాలు చేశాను. అంత లాంగ్ కెరీర్ నాకే దక్కిందేమో. అదో రికార్డ్. మధ్యలో బ్రేక్ తీసుకుని చేసినవాళ్లు ఉన్నారనుకోండి. టి. కృష్ణగారి సినిమాలు చేయడం నా లక్. లేకపోతే గ్లామరస్ హీరోయిన్‌గా మిలిగిపోయేదాన్నేమో. టి. కృష్ణగారు, దాసరి నారాయణరావుగారు, మోహన్ గాంధీ వంటి దర్శకులుంటే... ఇప్పటి హీరోయిన్లకూ మంచి మంచి అవకాశాలొస్తాయి. ఇప్పుడంతా హీరోలకే కదా.

● **అప్పట్లో కూడా హీరోల డామినేషన్ ఉండేది కదా..**

ఉండేది. కాకపోతే మాకు మంచి కథలు వచ్చేవి. నిరూపించుకునే స్కోప్ ఉండేది.

● **మీకు హీరోయిన్ ఇమేజ్ ఇష్టమా? హీరో ఇమేజా?**

హీరోయిన్ ఇమేజ్‌ని తక్కువ చేయడంలేదు. కాకపోతే నిరూపించుకునే చాన్స్ తక్కువ. అందుకే హీరో ఇమేజే ఇష్టం. నా మెంటాలిటీకి అదే సూట్ అవుతుంది. 'మహిళలు తక్కువ కాదు' అనే ఫీలింగ్‌తో ఉంటాను. అందుకు తగ్గట్టుగానే లేడీ ఓరియంటెడ్ మూవీస్ చేసి, తక్కువ కాదని నిరూపించుకున్నాను. అందుకే హీరోలు చేసినట్లే యాక్షన్ మూవీస్ చేశాను.

● **ఈ మధ్య కొంతమంది ఫిల్మ్ ఇండస్ట్రీ పర్సన్స్‌ని డ్రగ్స్ విషయమై విచారించారు కదా.. దాని గురించి ఏమంటారు?**

ఒకవేళ ఫిల్మ్ ఇండస్ట్రీవాళ్లు పొరపాటు చేసి ఉంటే, వాళ్లను పిలిచి, కౌన్సెలింగ్ ఇస్తే సరిపోయి ఉండేదేమో. 'ఇదే ఫస్ట్ అండ్ లాస్ట్' అని చెబితే బాగుండేదేమో. వేరే రంగాల్లోనూ ఉన్నారు కదా. కొంతమంది పేర్లు బయటపెట్టలేమని డిపార్ట్‌మెంట్ అంటోంది. దాన్నెలా అర్థం చేసుకోవాలి? పెద్దవాళ్లను ఎలా వదిలేస్తారు? వాళ్లను ఎందుకు ఫ్రేమ్‌లోకి తీసుకురాలేదు. ఇదెక్కడి న్యాయం? పక్షపాతం ఎందుకు? నైజీరియా వాళ్లు తీసుకొస్తున్నారా? బ్రెజిల్ వాళ్లు తీసుకొస్తున్నారా? డ్రగ్స్ సరఫరా ఎలా జరుగుతోంది? అని కూపీ లాగాలి. వాళ్లను కఠినంగా శిక్షించాలి. పబ్స్‌ని ఎందుకు మూయడం లేదు? పబ్‌లు మన కల్చర్ కాదు. ప్రభుత్వానికి నిజాయతీ ఉంటే పబ్స్‌ని మూసేయాలి. డ్రగ్స్ వల్ల వేల మంది జీవితాలు నాశనమవుతున్నాయి. అందుకే అవసరమైతే ఉద్యమం చేయాలనుకుంటున్నా.





ఆత్మీయం

సూర్యుడికి శుభోదయం చెబుదాం



సూర్యభగవానుడికి మిత్రుడని పేరు... అంటే ఆయనకున్న అనేక నామాలలో మిత్ర అనే నామం కూడా ఒకటి అన్నమాట. మిత్రుడంటే ఎలా ఉండాలి... అనేదానికి సూర్యుడు కంటిముందు కనిపించే నిదర్శనం. ఆయన అన్ని జీవులకూ తన కిరణాలతో ఒకేలా వెలుగునిస్తాడు. వేడిమినిస్తాడు. ఉత్సాహాన్ని నింపుతాడు. తన విధిని నిర్వర్తించడంలో క్షణం కూడా ఆలస్యం చేయడు. సేదతీరడు. భేదభావం చూపడు. తనను ఎంత వాడుకున్నా పన్నులు విధించడు. చిన్నచూపు చూడడు. ఎంత పొగిడినా పొంగిపోడు. అందుకే ఆయనను లోకబాంధవుడన్నారు. కర్మసాక్షి అన్నారు. ప్రత్యక్ష నారాయణుడన్నారు. అసలు సూర్యుడనే అతి పెద్ద దీపం లేకపోతే..? మనం ఆ స్థితిని ఊహించడానికి కూడా సాధ్యం కాదు. పాశ్చాత్య దేశాలవారికి సూర్యుడు ఉదయించడం, ఆయన వెలుగూ, వేడి లభించడం ఎంతో గొప్ప. అరుదైన విషయం. అందుకే వారు సూర్యోదయం కాగానే, దానిని శుభసూచకంగా భావించి, ప్రతివారికీ గుడ్‌మార్నింగ్ అని శుభాకాంక్షలు చెప్పుకుంటారు. కాని, మనం మాత్రం సూర్యుడికి కనీసం కృతజ్ఞత కూడా చూపం. మన సంస్కృతి ప్రకారం గొప్పవారికి ధన్యవాదాలు చెప్పడమంటే నమస్కరించడమే. అదీ మనస్ఫూర్తిగా. కృతజ్ఞతపూర్వకంగా.

రోజూ సూర్యుడిని చూసి, ఆయన కిరణాల స్పర్శను తనివితీరా ఆస్వాదిస్తూ, ఒంటికి తగిలేలా నిలబడితే చాలు... చర్మవ్యాధులు దరిచేరవంటారు. కనుక ఇకనైనా సూర్యుడికి శుభోదయం చెబుదాం. శుభాలను ఆహ్వానిద్దాం.

బ్యూటిప్

ప్రొటీన్ హెయిర్ ప్యాక్

కోడిగుడ్డు – 1; పెసర పిండి – అర కప్పు; నారింజ రసం – టేబుల్ స్పూన్; కీరా తురుము – టేబుల్ స్పూన్

పాత్రలో పెసరపిండి, కీరా తురుము వేసి కలపాలి. దీంట్లో నారింజ రసం, కోడిగుడ్డు వేసి బాగా కలపాలి. శుభ్రంగా తలంటుపోసుకున్న జుట్టుకు కొద్దిగా నూనె అప్లై చేసిన తరవాత ఈ ప్యాక్‌ని కుదుళ్ల మొదలు జుట్టుకంతా పట్టించి 30 నిమిషాల తరవాత కడిగేయాలి. ఇలా వారంలో ఒక్కసారి క్రమం తప్పకుండా చేయడం వల్ల నిగనిగలాడే జుట్టు సొంతం అవుతుంది.



సాక్షి ఫ్యామిలీ
సన్నిధి
వైఎస్‌ఆర్ జిల్లా
ఆదివారం
13-8-2017

సంస్కృతి - సంప్రదాయం

ప్రకృతి బంధం తీజ్



తెలంగాణలోని, అన్ని రాష్ట్రాల్లోని బంజారాల ముఖ్య పండుగల్లో 'తీజ్' ప్రత్యేకమైన పండుగ. తరతరాలుగా వస్తున్న సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా ఈ తీజ్ పండుగను లంబాడీలు ఘనంగా జరుపుతారు. ఈ నాలుగు తేదీన ప్రారంభమైన తీజ్ ఉత్సవాలు నేడు జరిగే నిమజ్జనంతో ముగియనున్నాయి. తీజ్ ఉత్సవాలను తండాల్లోని పెళ్లికాని ఆడపిల్లలే నిర్వహిస్తారు. వర్షాకాలం ప్రారంభంలో కురిసిన ఆరుద్ర పురుగును తీజ్ అంటారు. అలాగే గోధుమ మొలకలను కూడా తీజ్‌గా పిలుస్తారు. బతుకమ్మను పూలతో అలంకరించినట్లే తీజ్‌లో గోధుమ మొలకలను పూజిస్తారు. వర్షాకాలం ప్రారంభమైతే నాట్లు పూర్తయిన అనంతరం తీజ్‌ను జరుపుతారు.

పండుగ విధానం... తండాల్లోని పెళ్లికాని ఆడపిల్లలంతా కలిసి పెద్దవాళ్ళ ఆశీర్వాదాలు తీసుకున్న తరువాత ఇంటింటికీ తిరిగి వేడుకల కోసం విరాళాలు సేకరిస్తారు. ఆ డబ్బుతో గోధుమలు, శనగలు ఇతర సామాగ్రి తెచ్చుకుంటారు. సాయంత్రానికి గోధుమలను నానబెడతారు. మరుసటి రోజు వారి సోదరులు దుసేరు తీగలతో అల్లిన చిన్న బుట్టలలో పుట్టమట్టిని తెచ్చి అందులో లంబాడీల దేవతలు దండియాడి, సేవా భయా పేర్లతో మొదలుగా తండా నాయకునికి ఎరువు కలిపిన మట్టిని పూయిస్తారు. ఈ ఉత్సవంలో ప్రతి కార్యం పాటతోనే సాగుతుంది. ఈ బుట్టలన్నింటినీ ఒక పందిరి కింద ఉంచి, పందిరి వద్ద రోజూ ఆడపిల్లలందరూ నీరు పోసి పాట పాడతారు.

బోరడి రుప్పేరో... గోధుమలను బుట్టలో చల్లేరోజు సాయంత్రం బోరడి రుప్పేరో నిర్వహిస్తారు. పెళ్లికాని ఆడపిల్లలు రేగుముళ్లకు శనగలు గుచ్చేటప్పుడు వరుస అయిన వారు ముళ్లకు కదిలిస్తారు. అయినా సహనంతో ఆడపిల్లలు శనగల్ని ముళ్లకు గుచ్చాల్సిందే. చెల్లెల్ని ఏడిపించే అన్నలూ ఉంటారు.

ధమోళి... ఇక ఏడోరోజు జరిపే కార్యక్రమమే 'ధమోళి'(చుర్మో). రొట్టెలు, బెల్లం కలిపిన ముద్దను మేరామాకు సమర్పించడాన్నే ధమోళి అంటారు. ప్రతి ఇంటినుంచి బియ్యం సేకరించి కదావో (పాయసం) వండుతారు. ఎనిమిదవరోజు తమ బంజారా ఆరాధ్య దేవతల ప్రతిరూపాలను మట్టితో చేసి వారికి పెళ్లి చేస్తారు.

నిమజ్జనం... తొమ్మిదోరోజున తీజ్ నిమజ్జనానికి బంధుమిత్రులందరినీ ఆహ్వానిస్తారు. కొత్తబట్టలు ధరించి మేరామా భవాని, సేవాభయా (సేవాలాల్)కు పూజలు చేస్తారు. తొమ్మిది రోజులపాటు పెంచిన గోధుమ నారు బుట్టలను, తండా నాయకుడిని పిలిచి, కొబ్బరికాయలు కొట్టి, మొదటి తీజ్‌ను నాయక్ రుమాలులో పెట్టిన తరువాత ఆపదల నుంచి తమను రక్షించాలని అన్నదమ్ములకు నారు ఇచ్చి ఆశీర్వాదాలు తీసుకుంటారు.

- తీజ్ బుట్టలను పట్టుకుని వరుసగా ఆడపిల్లలు నిమజ్జనానికి డప్పు చప్పుళ్ళ, పాటలు, నృత్యాలు, కేరింతలతో నిమజ్జనం సాగుతుంది.
- చెరువు దగ్గర తీజ తమను వదిలివేసి వెళ్లిపోతుందనే దుఃఖంతో ఆడపిల్లలు ఏడుస్తుంటే పెద్దలు, సోదరులు వారిని ఊరడిస్తుంటారు. ఆ తరువాత తీజ్‌ను చెరువులో నిమజ్జనం చేస్తారు.

- బొంగిరి శ్రీనివాస్
సాక్షి
మహబూబాబాద్ రూరల్

పండుగ-పర్వం

యశో గుణ సంపన్నుడు



పురుషునిలో ఏమేమి లక్షణాలుంటే స్త్రీలందరికీ అతడు పరిపూర్ణంగా నచ్చుతాడో శ్రీకృష్ణుడు స్వయంగా ఆచరించి చూపాడు. తాను పరమాత్ముడయినప్పటికీ, ఒక సాధారణ బాలకునిలా ఎన్నో చిలిపి చేష్టలు చేశాడు. అమాయక బాలునిలా మన్ను తిన్నాడు. అదేమని అడిగిన తల్లికి నోటిలో పదునాలుగు భువన భాండాలు చూపించాడు. తల్లి ప్రేమపాశానికి లొంగిపోయి, గంధర్వులకి శాపవిముక్తి కావించాడు. మేనమామ కంసుడు పంపిన రాక్షసులనెందరినో మట్టి కరిపించాడు. గోవులు కాచాడు. గోవర్ధనగిరిని చిటికెన వేలిపై నిలిపి గోకులాన్ని రక్షించాడు. కాళియుడి పీచమణిచాడు. ఉట్టికొట్టాడు, వెన్న దొంగిలించాడు. గోపికల చీరలు ఎత్తుకెళ్లాడు. తోటిగోపాలకుల ఆనందం కోసం మురళి వాయించాడు. రాధను పరిపూర్ణంగా ప్రేమించాడు. తననే గుండెల్లో నింపుకుని, తండ్రి బలవంతం మేరకు ఇష్టంలేని పెండ్లికి తలవంచిన రుక్మిణి కోసం అందరినీ ఎదిరించాడు. ఇష్టసఖి సత్యభామ కోపంతో తన్నిన తన్నుకు కూడా చిరునవ్వే సమాధానంగా చూపాడు. చివరకు ఆమెకోసం తులాభారం తూగాడు. ద్రౌపదికి మాన సంరక్షణ చేశాడు. సుభద్రా తనయుడైన అభిమన్యుని ప్రేమను గెలిపించాడు. తననే అన్నీ అనుకున్న పాండవులకు అన్నింటా తానే అయి నిలిచాడు. వారికోసం దౌత్యం కూడా నడిపాడు. చివరికి అర్జునునికి రథసారథిగా మారాడు. ఆత్మస్థైర్యం కోల్పోయిన అర్జునుని కోసం గీతాచార్యునిగా మారాడు. కొన్నితరాల వరకు స్థిరంగా నిలబడిపోయేటటువంటి లోకోత్తరమైన భగవద్గీ తను మానవాళికి అందించాడు. తాను అండగా నిలచిన పాండుపుత్రులకోసం మంత్రాంగం నడిపి కురుక్షేత్ర సంగ్రామంలో నెగ్గేలా చేశాడు. లోకానికి కంటకంగా మారిన కంస, నరకాసురాది రక్కసులను సంహరించాడు. చివరకు తానే దూర్వాసుని శాపానికి కట్టుబడి మామూలు మానవునిలా బోయవాని చేతిలో మరణించిన కృష్ణుడు యశోగుణ సంపన్నుడు.

ఈ పండగను ఇలా జరుపుకోవాలి

శ్రావణ బహుళ అష్టమి నాటి అర్ధరాత్రిపూట సాక్షాత్తూ ఆ పరమాత్ముడే దేవకీదేవి అష్టమగర్భాన జన్మించాడు. భూభారాన్ని తగ్గించడానికి అవతరించినప్పటికీ తన దివ్యప్రేమతో అందరినీ ఉద్ధరించిన అమృతమూర్తి. ఆబాలగోపాలం ఆయన పుట్టినరోజునే జన్మాష్టమిగా జరుపుకుంటారు. ఇది యావద్భారతం చేసుకునే పండుగ. ఈ వ్రతం చేసుకునేవారు ఉదయాన్నే లేచి పరిశుద్ధులై, షోడశోపచారాలతో కృష్ణుని పూజించాలి. పగలంతా ఉపవసించి సాయంకాలం చిన్నికృష్ణుని విగ్రహాన్ని ఊరేగించి, తర్వాత ఊయలలో ఉంచి, ఊపాలి. దేవకీదేవి బాలకృష్ణునికి స్తన్యమిస్తున్నట్లుగా ఉండే విగ్రహాన్ని పూజించినా మంచిదే. అనంతరం కృష్ణునికి ప్రీతికరమైన పాలు, వెన్న, పండ్లు, అటుకులు మొదలైన వాటిని నైవేద్యం పెట్టి, వాటిని ప్రసాదంగా ఆరగించడం వల్ల అన్నింటా జయం సిద్ధిస్తుందని పురాణోక్తి. ఈ పుణ్యతిథి నాడు కృష్ణుని పూజించి, భాగవత గ్రంథాన్ని పఠించినా, దానం చేసినా సకల పాపాలూ తొలగి, చతుర్విధ ఫల పురుషార్థాలు అంటే ధర్మం, అర్థం, కామం, మోక్షం ప్రాప్తిస్తాయని స్కాందపురాణం చెబుతోంది.

ఆచార్య దేవోభవ

సభ, సభాపతి రెండూ శివ స్వరూపమే



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

భీష్ముడు తండ్రికి తద్దినం పెడుతున్నాడు. శంతనమహారాజు పొంగిపోయాడు. చెయ్యి చాపి పిండం చేతిలో పెట్టమన్నాడు. భీష్ముడన్నాడు–'నాన్నగారూ, మీకు నామీద చాలా ప్రేమ ఉండి ఉండవచ్చు. కానీ శరీరం విడిచిపెట్టిన తండ్రిచేతిలో కబళం పెట్టకూడదని శాస్త్రంలో ఉంది. చెయ్యి వెనక్కి తీయండి. దర్భలమీద పెడతాను' అన్నాడు. శాస్త్రాన్ని యథాతథంగా ఆచరించాడు. కాబట్టి భీష్ముడు భీష్మాచార్య అయ్యాడు. కేవలం లెక్కలు, విజ్ఞాన శాస్త్రం వంటివి చెప్పినంత మాత్రాన ఆచార్యులు కాలేరు. ధర్మశాస్త్రాన్ని ఆచరిస్తేనే ఆచార్యులవుతారు. అలా ప్రామాణికంగా చెప్పుకోదగిన వారిని ఆచార్య పురుషులంటారు.



'దేశిక' అని ఒకమాట. తోటకాచార్యులవారు శంకర భగవత్పాదులనుద్దేశించి చేసారు–దేశికలు. దేశిక అన్నపేరుతో 'భవ శంకరదేశికమే శరణం' అని ప్రతిశ్లోకం చివర అంటాం. ఇప్పటికీ శంకరాచార్యులవారికి తోటకాష్టకంతోటే నమస్కారం చేస్తాం. శంకరాచార్యుల వద్ద ఉన్న నలుగురు ప్రధానమైన శిష్యులలో తోటకాచార్యులవారు కొంచెం తక్కువ మేధస్సున్నవారు. కానీ గురువుగారికి విశేషమైన చేసేవారు. ఓసారి గురువుగారు పాఠం చెప్పడానికి ఉపక్రమించి తోటకాచార్యులవారు ఇంకా రాలేదని కాసేపు ఆపితే 'అంతపెద్దబుద్ధి చురుకుదనం ఉన్నవాడు కాదు, ఆయన కోసం పాఠం ఆపడం ఎందుకు, మొదలు పెట్టేయండి' అన్నారు పద్మపాదులవారు. సహాధ్యాయిపట్ల ఇంత అమర్యాదతో, అహంకారంతో ఉన్నారని గ్రహించిన శంకరాచార్యులవారు ఒక్కసారి తోటకాచార్యులవారికేసి చూసారు. గురువు తలుచుకుంటే కంటిచూపుతో అనుగ్రహించగలడు. ఒక్కసారలా చూడగానే తోటకాచార్యులవారికి ఎక్కడలేని విద్వత్తు వచ్చింది. అంతే! గురువుగారిని ఉద్దేశించి అష్టకం చేసారు. 'నన్ను కరుణతోపాలించండి. దీనుణ్ణి' అంటూ ప్రతి శ్లోకం చివరకూడా 'భవశంకర దేశికమే శరణం' అంటూ సాష్టాంగం చేసారు. దేశిక అంటే దిశను చూపించేవాడు. ఎలా ప్రయాణం చేస్తే ఈశ్వరుడిని చేరతారో ఆ దిశను చెప్పగలిగినవాడు దేశికుడు. గురువు. అందుకని శంకరాచార్యులవారికి 'దేశిక' అని బిరుదు వచ్చింది.

గురువుకు 'అధ్యక్షుడు' అని పేరు. ధర్మశాస్త్రం తెలియకుండా అధ్యక్షం వహించలేరు. సభకు వచ్చిన వారూ, సభను నిర్వహిస్తున్న సభాపతి (అధ్యక్షుడు) అందరూ శివ స్వరూపమే. సభాపతి సభ నంతటినీ తన కంటిచూపుతో నడిపిస్తాడు. ఆయన చూస్తుండగా వికృత చేష్టలెవరూ చేయరు. ఆధ్యక్షం వహించినవాడూ, ధర్మశాస్త్రం తెలిసున్నవాడూ అయిన గురువు అన్నివేళలా మాట్లాడక్కర లేదు. కూర్చుని అలా శిష్యుల వంక చూస్తుంటే– ఒక్కొక్క పరిజ్ఞానం అబ్బుతుంది. భగవాన్ రమణులు విరూపాక్ష గుహలో ఉండగా 'దక్షిణామూర్తి స్తోత్రానికి వ్యాఖ్యానం చెప్పమని తరచూ శిష్యులు అడిగేవారు. అయన చెప్పేవారు కారు. ఒక మహాశివరాత్రి నాటి రాత్రి 9 గంటలకు అడిగారు...ఆయనలా శిష్యుల వంక చూస్తూ కూర్చున్నారు. తెల్లవారింది. అందరికీ దక్షిణామూర్తిస్తోత్ర భాష్యం వచ్చేసింది. ఆయనేం నోరువిప్పలేదు. మౌన వ్యాఖ్యను మౌనవ్యాఖ్యతోనే చెప్పేసారు. అదీ గురువంటే. గురువు ఆధ్యక్షత వహిస్తాడు. కంటిచూపుతో పరిపాలన చేస్తాడు.

మీకు తెలుసా?



తల్లి కడుపులో పడినప్పటి నుంచి పుడమి గర్భంలో కలిసిపోయేదాకా మానవ జీవితం నవగ్రహాల ప్రభావం మీద ఆధారపడి ఉంటుంది. నవగ్రహాల శుభాశుభదృష్టుల ఫలితాన్ని బట్టి జీవితంలో ఎత్తుపల్లాలు ఏర్పడతాయి. గ్రహాలు సానుకూలంగా సంచరిస్తూ, శుభదృష్టిని సారిస్తే, మనిషి జీవితం సుఖసంతోషాలతోనూ, ఆగ్రహిస్తే కన్నీటి కడలిలోనూ కొట్టుకుపోవాల్సి వస్తుందని పురాణోక్తి. అందువల్ల జాతకం ప్రకారం ఏ గ్రహం అశుభ దృష్టితో వీక్షిస్తోందో తెలుసుకుని దాని అనుగ్రహం సంపాదించగలిగితే కష్టాలనుంచి బయటపడి, శుభాలు పొందచ్చు. వాస్తు దోష పరిహారం కోసం గృహప్రవేశం రోజున 'వాస్తుహోమ'మంటూ ఒకదాన్ని చేస్తారు. దోషం ఉన్న పక్షంలో మత్స్యయంత్రం, కూర్మయంత్రం వేస్తారు. ఏది వేసినా ఇంట్లో నిత్యపూజ జరిగితే దోషం ఏమీ చెయ్యదు. ఇది అనుభవపూర్వకంగా పెద్దలు నిరూపించిన సత్యం.

స్ఫూర్తి

స్వేచ్ఛా స్వాతంత్ర్యాలే నా ఉచ్ఛ్వాస నిశ్వాసలు!

సాధన ద్వారా మనోచాంచల్యాన్ని నిరోధించి దైవోన్ముఖం చేయగలిగిన వానికి ఏ విధమైన వర్ణాశ్రమధర్మాలూ అవరోధం కాజాలవు. ఇది మానవత్వాన్ని మంట గలుపుతున్న ఆధునిక విద్యాప్రభావమే. ఇటువంటి విద్యావిధానం లోపభూయిష్టమైనది. దీనిని సమూలంగా మార్చగలిగిన నాడే విద్యార్థులు ఉన్నత ప్రమాణాలు గల విద్యను అందుకోగలుగుతారు. ముక్తికోసం మానవుడు అడవులకు, ఆలయాలకు, యాత్రలకు వెళ్లనవసరం లేదు. ముక్తిపొందటానికి కులగోత్రాలతోనూ, ఏకాంత దీక్షతోనూ, వనవాసంతోనూ ప్రమేయం లేదు. మానవునికి కర్మద్వారానే ముక్తి లభిస్తుంది. కర్మ చేసేటప్పుడు ఇంద్రియ ప్రభావాన్ని బుద్ధి నిలకడతో అణచివెయ్యాలి. అలా ఇంద్రియాల శక్తిని అరికట్టిన అంధుడైనా మోక్షం పొందుతాడు. అదేవిధంగా భవబంధాలను దూరం చేసుకుని భగవంతుని యెడల ప్రగాఢ భక్తివిశ్వాసాలు పెంచుకొనటమొక్కటే ముక్తికి కావలసిన అర్హతను ప్రసాదిస్తుందంటారు అరవిందులు. ఆగస్ట్ 15,1872న కలకత్తాలో స్వర్ణలతాదేవి, కృష్ణ ధన ఘోష్ దంపతులకు జన్మించిన అరబిందో ఘోష్ సుప్రసిద్ధ బెంగాలీ పండితుడు, కవి, జాతీయవాది, యోగి, గురువుగా గణుతికెక్కారు. ఆంగ్లవిద్యమీద అభిమానంతో అరవిందుడు తండ్రి చెప్పినట్లుగా ఇంగ్లండ్‌లో, మాంచెస్టర్‌లో ఉన్నత విద్య అభ్యసించారు. అక్కడనుంచి స్వదేశానికి తిరిగి వచ్చాక, కళాశాలలో ఆచార్యపదవిని చేపట్టారు. తర్వాత స్వాతంత్ర్యోద్యమం వైపు ఆకర్షితులై, వందేమాతరం అనే ఆంగ్లపత్రికకు సంపాదకత్వం వహించి, ప్రజలలో జాతీయభావాలు పాదుకొల్పారు. రాజకీయాల నుంచి కొన్ని సంఘటనల అనంతరం అనుకోకుండా ఆధ్యాత్మికత పట్ల ఆకర్షితులై, ఆశ్రమాన్ని స్థాపించారు. ఆయన ఆధ్యాత్మిక భావాలకు ప్రేరేపితులైనవారిలో దేశ, విదేశీ ప్రముఖులెందరో ఉన్నారు. అరవిందులు అద్భుతమైన ఆధ్యాత్మిక గ్రంథాలెన్నో రచించారు. ఆయన జీవితం అనేక మలుపులు తిరిగినట్లు కనిపించినప్పటికీ, ఏ పని చేపట్టినా, దానిని ఆయన ఎంతో చిత్తశుద్ధితో, అదే తన ధ్యాసగా, శ్వాసగా చేశారు. ఆయన స్థాపించిన ఆశ్రమం శాఖోపశాఖలుగా వృద్ధిచెందింది. అనేక సంస్థలకు, కార్యాలయాలకు ఇప్పటికీ ఆయన పేరు పెట్టుకోవడాన్ని చూస్తూనే ఉంటాం మనం. స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా ఆయనను తలచుకోవడం స్ఫూర్తిదాయకం.



ఉపశమనం


ఒక్కోసారి ఆర్థిక సమస్యలు విపరీతంగా ఇబ్బందిపెడుతుంటాయి. కష్టానికి ఫలితం దక్కదు. ఉద్యోగంలో, వృత్తిలో పురోగతి ఉండదు. వ్యాపారాలు మందకొడిగా సాగుతుంటాయి. చిన్నాచితకా ఖర్చులకు కూడా ఆచితూచి డబ్బు వాడాల్సిన పరిస్థితులు ఎదురవుతుంటాయి. అలాంటి పరిస్థితులను అధిగమించాలంటే.... ● గుర్రపునాడాతో ఉంగరం తయారు చేయించుకుని ఏదైనా శనివారం రోజున ఎడమచేతి మధ్యవేలికి ధరించాలి. నల్లని చేతి రుమాలులో గుప్పెడు ఉప్పువేసి, ఒక ఇనుప మేకును పూర్తిగా ఉప్పులో మునిగేలా కప్పిపెట్టి మూటగట్టాలి. ఆ మూటను ప్రవహించే నీటిలో విడిచిపెట్టాలి ● నల్లని నువ్వులను పొడిచేసి, అన్నంలో కలిపి చిన్న చిన్న ముద్దలుగా చేసి, ఆ ముద్దలను కాకులకు పెట్టండి. ఏదైనా శనివారం ప్రారంభించి, ఈ పరిహారాన్ని కనీసం పంతొమ్మిది రోజులు కొనసాగించాలి ● గుర్రాలకు శనగలు, ఉలవలు కలిపి తయారు చేసిన గుగ్గిళ్లను తినిపించాలి. ఈ పరిహారాన్ని ఇరవై ఒక్క గురువారాలు ఆచరించాలి ● చదువుకునే చిన్నారులకు ఏదైనా గురువారం రోజున పుస్తకం, పలక, బలపం వంటి సాధనాలను కానుకగా ఇవ్వాలి. వారికి ఆవునేతితో తయారు చేసిన మిఠాయిలు తినిపించాలి ● అమ్మవారి ఆలయంలో ఏదైనా మంగళవారం రోజున అర్చన చేయించుకుని, ఆలయానికి కానుకగా మూడు కిలోల కుంకుమ ఇవ్వాలి. అర్చన చేసిన పూజారికి ఇతోధికంగా దక్షిణ, కొత్త పంచె, ఉత్తరీయం, కిలో బెల్లం, కిలో కందిపప్పు దానంగా ఇవ్వాలి.

- పన్యాల జగన్నాథదాసు

రూపకాయంగా కాదు... ధర్మకాయంగా చూడాలి!

బౌద్ధకేంద్రమైన శ్రావస్తిలో పుట్టి పెరిగిన సుభద్రకు పెళ్లయింది. అత్తవారిల్లయిన రమణక నగరానికి ఆమె తొలిసారి వచ్చింది. అది బుద్ధభగవానుల గురించి ఏమాత్రం తెలియని ఊరని కొద్దిరోజుల్లోనే ఆమె గ్రహించింది. శ్రావస్తిలో తరచు బుద్ధుని దర్శిస్తూ ఆయన బోధనలు వినడానికి అలవాటుపడిన సుభద్రకు అక్కడ ఉండటం కష్టమనిపించింది. ఒకరోజు ఆమె మిద్దెమీదికెళ్లి, శ్రావస్తి దిక్కుగా చూస్తూ, ''భగవాన్! ఇక్కడ మీ గొంతు వినపడటం లేదు. మీరు కనపడటం లేదు. మీకు, మీ భిక్షుక సంఘానికి ఏ లోటూ రాకుండా నేను చూసుకుంటాను. నా గోడు విని సత్వరం మీరు రమణక నగరం రావాలి. ప్రాణం పోయినా సరే, మీకు ఆతిథ్యం ఇచ్చికానీ నేను భుజించను' 'అని ప్రార్థించింది. విచిత్రంగా బుద్ధుడు భిక్షుక సంఘంతో ఆ నగరంలోకి ప్రవేశించి, నేరుగా ఆమె ఇంటికే భిక్షకు వచ్చాడు. మహదానందంతో వారికి ఆతిథ్యమిచ్చి, తన మనసులోని బాధను ఆయనకు చెప్పుకుంది సుభద్ర. అప్పుడు బుద్ధుడు ''అమ్మా! సుభద్రా! నన్ను రూపకాయంగా చూడటం కాదు, ధర్మకాయంగా చూడు. రూపకాయం కొన్నాళ్లకు శిథిలమై అంతరించిపోతుంది. ధర్మకాయం శాశ్వతంగా ఉంటుంది.. ఈ సత్యాన్ని సదా గుర్తుంచుకో! నిజానికి మనం ఎక్కడున్నా సర్దుకుపోవడం నేర్చుకోవాలిన. భూమాతనే చూడు! ఒకచోట సమతలంగా; వేరొక చోట ఎత్తుపల్లాలుగా, ఇంకొక చోట కంటకమయంగా ఉంటుంది. భూమి ఎలా ఉన్నా, జత చెప్పులుంటే చక్కగా నడిచి పోవచ్చు. అలాగే జీవితంలో ఎటువంటి క్లిష్ట పరిస్థితినైనా అధిగమించడానికి కుశల చిత్తం ముఖ్యం! చింతను దూరం చేసేది కుశల చిత్తమే! నీవు ఎల్లప్పుడూ కుశల చిత్తంతో ఉంటే శ్రావస్తి అయినా రమణక నగరమైనా ఒకేలా కనిపిస్తాయి''అన్నాడు సుభద్రను వాత్సల్యదృష్టితో చూస్తూ! బుద్ధభగవానుల అమృతవాక్కులతో సుభద్ర మనసులోని బాధ తొలగిపోయింది.

- చోడిశెట్టి శ్రీనివాసరావు



నిర్వహణ: డి.వి.ఆర్. భాస్కర్

సువార్త



బైబిలు చెప్పే నిత్య సత్యం

యేసుక్రీస్తు జాతిరీత్యా యూదుడు. ఈ లోకంలో ఆయన తల్లి అయిన మరియది యాజకవంశం. తండ్రియైన యోసేపుది రాజులదైన దావీదు వంశం. యూదుల్లో యాజకవంశీయులైన పరిసయ్యులు, ధర్మశాస్త్రోపదేశకులదే నాటి సమాజంలో పెత్తనం, ఆధిపత్యం. రెండువైపులా ఉన్నత వంశపు మూలాలున్న యేసుక్రీస్తు పాపులు, సుంకరులు, అణగారిన వారు, నిరుపేదల కోసం నిరంతరం తపించడం నాటి యూదు పెద్దలకు రుచించక ఆయన మీద అభాండాలు వేసేవారు. దైవకుమారుడైన యేసుక్రీస్తు మాత్రం తన జీవనశైలిని, బోధలను సమర్థించుకొంటూ చాలా ఉపమానాలు చెప్పాడు. అందులో ఒకటి గొర్రెలు, వాటి కాపరిది. వంద గొర్రెలున్నా వాటిలో ఒకటి తప్పిపోయినదని కాపరికి తెలిస్తే, పోనీలే అని ఊరుకోడు కదా? తప్పిపోని 99 గొర్రెల్ని వదిలేసి, తప్పిపోయిన ఒక గొర్రె కోసం అడివంతా వెదుకుతాడు కదా? అది దొరికినప్పుడు దాన్ని భుజాన వేసుకొని ఇంటికొచ్చి తన స్నేహితులను, పొరుగువారిని పిలిచి సంతోషంతో ఆ విషయాన్ని పంచుకోడా? తప్పిపోయిన నా గొర్రె దొరికిందంటూ వారందరి సమక్షంలో సంబరపడ్డాడు కదా! మారుమనస్సు అక్కరలేని 99 మంది వల్ల కలిగే సంతోషం కన్నా, మారుమనసు పొంది తిరిగి మార్గంలోనికి వచ్చిన ఒక పాపివల్ల దేవునికెంతో సంతోషం కలుగుతుందని యేసుక్రీస్తు వివరించారు.

దేవునిదైన 'తండ్రి హృదయాన్ని' ఆవిష్కరించే అద్భుతమైన ఉపమానమిది. తెలివైన పిల్లవాడెలాగూ పైకొస్తాడు. కాని తెలివిలో, చురుకుదనంలో, ఆరోగ్యంలో బలహీనుడైన పిల్లవాడి కోసమే తల్లి తండ్రి నిరంతరం శ్రమిస్తాడు తల్లి, తండ్రి తోబుట్టువులతో కూడిన కుటుంబ వ్యవస్థ నేర్పర్చాడు. బలహీనులు, తెలివితక్కువవారు, దీనుల దిద్దుబాటు, అభ్యున్నతేధ్యేయంగా అలాంటి కుటుంబవ్యవస్థ కేంద్రంగా దేవుడు సమాజాన్ని విస్తృతపర్చాడు. సమన్యాయం, సర్వసమానత్వం దేవుని నినాదాలు కాదు, అనే ఆయన హృదయ స్పందనలుమధ్య నినాదాలు కాదు అవే ఆయన హృదయ స్పందనలు. మధ్య యుగాల నాటి యూరోప్ రాచరిక వ్యవస్థ తాలూకు అణచివేత, దోపిడీ దౌర్జన్యాన్ని సహించి సర్వం పోగొట్టుకునే స్థాయికి క్షీణించిన క్రైస్తవ సువార్తోద్యమమే సమానత్వం ఊపిరిగా కలిగిన ప్రజాస్వామ్య వ్యవస్థకు పురుడు పోసింది. అంటే యేసుక్రీస్తు బోధల్లో నుండే 'ప్రజాస్వామం' ఉద్భవించి ప్రజ్వరిల్లింది. అణచివేత, దోపిడి, అశ్లీలత, అపవిత్రత, అవినీతికి క్రైస్తవంలో తావు లేదు. దుర్బలుల్ని దూరంగా నెట్టి, బలవంతులకు పట్టం కట్టే దుర్మార్గాన్ని క్రైస్తవం సహించదు, ఎట్టి పరిస్థితుల్లోనూ పెంచి పోషించదు. తాత్కాలికంగా చలామణి అయ్యే నకిలీ నోటులాగే అలాంటి పోకడలున్న క్రైస్తవ ఉద్యమాలు, కార్యకలాపాలు, చర్చిలు కూడా నకిలీవేనన్నది. బైబిలు చెప్పే నిత్యసత్యం!

- రెవ.డా.టి.ఎ. ప్రభుకిరణ్

శ్లోకం

ధనుఃపౌష్పం మౌర్వీ మధుకర
మయీ పంచవిశిఖాః
వసన్త స్సామన్తో మలయమరుదాయోధన రథః
తథాప్యేక స్సర్వం హిమగిరిసుతే కామపి కృపామ్
అపాఙ్గాత్తే లబ్ధ్వా జగదిదమనఙ్గో విజయతే

పారాయణ విధానం: స్నానం చేసి శుచిగా ఉండి ఈ శ్లోకాన్ని 108 రోజులపాటు రోజుకు 108 మార్లు పఠించాలి. చెరకు రసాన్ని నివేదించాలి.

పారాయణ ఫలం
దంపతుల మధ్య అన్యోన్యత పెరిగి సత్సంతానం కలుగుతుంది.

ఇస్లాం వెలుగు

గుప్తదానం



పూర్వం ఒక గొప్ప సంపన్నుడుండేవాడు. అతను మంచి దైవభక్తిపరుడు. రోజూ నమాజు చేసేవాడు. రమజాన్‌లో రోజా వ్రతం ఆచరించేవాడు. క్రమం తప్పక జకాత్ చెల్లించేవాడు. హజ్ యాత్ర కూడా చేశాడు. కాని పిల్లికి కూడా బిచ్చం పెట్టేవాడు కాదు. ఎవరైనా అవసరార్థం అడిగినా ఇచ్చేవాడు కాదు.

ఒకసారి అతను ఉంటున్న వీధిలోనే ఒక పేద అనాథ యువతికి ఆ వీధివాళ్ళంతా కలసి పెళ్ళిచెయ్యాలని నిర్ణయించుకొని చందా పోగుచేశారు. ఆ వీధిలోని కొంత మంది పెద్దమనుషులు హాజీ సాబ్ వద్దకు వెళ్ళారు. కాని అతడు తానేమీ ఇవ్వలేనని స్పష్టంగా చెప్పేశాడు. ఆ సమాధానం విన్న పెద్దమనుషులు అనాథకు రూపాయి సహాయం చెయ్యని దైవభక్తి దేనికని తలా ఓ తిట్టు తిట్టారు. ఈ నమాజులు, రోజాలు ఎందుకని నానా మాటలన్నారు.

అదే గ్రామంలో ఓ మధ్యతరగతి వ్యక్తి ఉండేవాడు. అతను విరివిగా దానధర్మాలు చేసేవాడు. పేద యువతుల పెళ్ళిళ్ళకు, పేదల చదువులకు, అనాథలకు, వితంతువులకు ఉదారంగా సహాయం చేసేవాడు. ఎవరైనా పేదవారు మరణిస్తే వారి ఖనన సంస్కారాలకు పూర్తి ఏర్పాట్లు చేసేవాడు. ఈ పేద యువతి పెళ్ళికి కూడా బాగా ధనం ఇచ్చాడు. అతణ్ణి ప్రజలు ఎంతగానో గౌరవించేవారు. అతని కోసం దువాలు చేసేవారు.

ఒకసారి సంపన్న భక్తుడైన హాజీ సాబ్ అనారోగ్యానికి గురయ్యాడు. ప్రజలకు అతని పట్ల ప్రేమ, సానుభూతి లేకున్నా, వ్యాధిగ్రస్తులను పరామర్శించడం పుణ్యకార్యమన్న ప్రవచనం మేరకు, పరామర్శకు వెళ్ళారు. ఆశ్చర్యమేమిటంటే, దానధర్మాలు చేసే ఈ మనిషి సంపన్నుడి సేవలో నిమగ్నమై ఉన్నాడు. ఈ దృశ్యాన్ని చూసినవారు 'నిజంగా మనిషంటే ఈయనే, ఆ పిసినారి హాజీ నైజం తెలిసి కూడా అతనికి సేవలు చేస్తున్నాడంటే మామూలు విషయం కాదు'. అని అతణ్ణి కొనియాడారు.

కొన్నాళ్ళకు హాజీ సాబ్ మరణించాడు. అందరూ జనాజాలో పాల్గొన్నారు. ఖనన సంస్కారాలు పూర్తయిన తరువాత ఆ వ్యక్తి 'అందరూ కొద్దిసేపు మసీదులో ఆగండి' అని ప్రకటన చేశాడు. అందరూ మసీదులో గుమిగూడిన తరువాత, 'మిత్రులారా! మీకో విషయం తెలియజెప్పాలి. అందరూ హాజీ సాబ్‌ను పిసినారి అని తిట్టుకునేవారు కదా... నిజానికి హాజీ సాబ్ గొప్పదాత. కుడిచేత్తో దానం చేస్తే ఎడమ చేతికి తెలియకూడదన్నది ఆయన విధానం. దానికోసం ఆయన నన్ను ఎన్నుకున్నారు. నేను చేపట్టే సేవాకార్యక్రమాలన్నీ ఆయన సమకూర్చిన ధనంతోనే!' అని సభికులవైపు చూశాడు.

అందరి కళ్లూ సజలాలయ్యాయి. ప్రతి ఒక్కరి చేతులూ దువాకోసం అప్రయత్నంగా ఆకాశం వైపు లేచాయి. హాజీ సాబ్ కోసం నిండుమనసుతో అందరూ దు ఆ చేశారు. దానగుణం అంటే అలా ఉండాలనుకున్నారు.

- ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 270 1083

కథ నచ్చితేనే సినిమాలు తీస్తా


● రవీందర్‌రెడ్డి

బోయపాటి శ్రీను దర్శకత్వంలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా రూపొందిన చిత్రం 'జయ జానకి నాయక'. రకుల్ ప్రీత్‌సింగ్, ప్రగ్యా జైస్వాల్ కథానాయికలు. గత శుక్రవారం విడుదలైన ఈ సినిమాకు మంచి స్పందన లభిస్తోందన్నారు నిర్మాత మిర్యాల రవీందర్‌రెడ్డి. ఇంకా ఆయన మాట్లాడుతూ– ''ఫస్ట్ షో నుంచే పాజిటివ్ టాక్ మొదలైంది. అల్లు అరవింద్ గారు 'కథను నమ్మి, మంచి సినిమా తీశావ్. నీకు మంచి భవిష్యత్ ఉంది' అనడం సంతోషం కలిగించింది. టెక్నిషియన్స్‌ను నమ్ముతాను. బడ్జెట్ విషయంలో రాజీపడకుండా నిర్మించాను. ఇకపై నేను నిర్మించబోయే సినిమాల్లోనూ కథకి ఎక్కువ ఇంపార్టెన్స్ ఇస్తాను. కథ నచ్చితేనే సినిమాలు చేయాలనుకుంటున్నాను. బోయపాటి శ్రీనుగారి డైరెక్షన్ సూపర్. ఆయన యాక్షన్ సీక్వెన్స్‌ను బాగా తెరకెక్కించారు. ఫైట్ సీన్స్ చాలా బాగున్నాయని అందరూ మెచ్చుకుంటున్నారు. సాయి శ్రీనివాస్ పర్ఫార్మెన్స్ బాగుంది. అతనికి లైఫ్ లాంగ్ గుర్తుండిపోయే సినిమా ఇది. దేవిశ్రీ ప్రసాద్ అందించిన మ్యూజిక్ సినిమాను మరో మెట్టు పైకి ఎక్కించింది. బోయపాటి గారితో త్వరలోనే మరో సినిమా చేయాలనుకుంటున్నాను'' అన్నారు.

...టు ఖమ్మం ఆడియో జర్నీ!


● బాలకృష్ణ

హీరో బాలకృష్ణ, దర్శకుడు పూరి జగన్నాథ్, భవ్య క్రియేషన్స్ అధినేత వి. ఆనందప్రసాద్‌లు ఈ నెల 17న హెలికాప్టర్‌లో హైదరాబాద్ టు ఖమ్మం వెళ్లనున్నారు. ఎందుకంటే... ఈ ముగ్గురి కలయికలో రూపొందిన 'పైసా వసూల్' పాటల్ని ఖమ్మంలోనే విడుదల చేయనున్నారు. అంటే... ఈ హెలికాప్టర్ జర్నీ ఆడియో జర్నీ అన్నమాట. ఈ సందర్భంగా వి. ఆనందప్రసాద్ మాట్లాడుతూ– ''బాలకృష్ణగారి ఇమేజ్, పూరిగారి స్టోరీ స్టైల్‌కి తగ్గట్టు అనూప్ రూబెన్స్ అద్భుతమైన పాటల్ని స్వరపరిచారు. ఖమ్మంలో నందమూరి అభిమానులు, ప్రేక్షకుల సమక్షంలో జరగనున్న భారీ వేడుకలో ఈ నెల 17న పాటల్ని విడుదల చేస్తాం. అదే రోజున ట్రైలర్ కూడా విడుదలవుతుంది. ఇటీవల విడుదలైన స్టంపర్‌కు అద్భుత స్పందన లభిస్తోంది. 68 గంటల పాటు యూట్యూబ్‌లో ట్రెండింగ్‌గా నిలిచిన స్టంపర్‌ను, 70 లక్షలమందికి పైగా చూశారు. ప్రేక్షకుల్లో సినిమాపై అంచనాలను స్టంపర్ మరింత పెంచేసింది. ఆ అంచనాలకు తగ్గట్టుగానే సినిమా ఉంటుంది'' అన్నారు. ఈ సినిమాను సెప్టెంబర్ 1న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.


● తేజ, వెంకటేశ్వరరావు, గోపాలకృష్ణ, రానా, అనూప్, లక్ష్మీభూపాల్

కలక్షన్స్ చూసి కంగారుపడ్డా... అంత బాగున్నాయి! – రానా

రానా, కాజల్ జంటగా తేజ దర్శకత్వంలో డి. సురేశ్‌బాబు, సీహెచ్ భరత్‌చౌదరి, కిరణ్‌రెడ్డి నిర్మించిన చిత్రం 'నేనే రాజు నేనే మంత్రి'. శుక్రవారం విడుదలైన ఈ సినిమా సక్సెస్‌మీట్‌లో రానా మాట్లాడుతూ– ''సినిమా విడుదల తర్వాత తక్కువగా మాట్లాడతాను. కానీ, ఈ సినిమా కలెక్షన్స్ చాలా బాగున్నాయి. కలక్షన్స్ నంబర్స్ చూసి నేనే కంగారు పడిపోయాను. ఇంతకు ముందు ఎవరో 'వన్ మ్యాన్ షో' అన్నారు. కాదు... ఈ సినిమా కోసం అందరూ కష్టపడ్డాం. పోస్టర్ల మీద నేను ఉన్నాను కాబట్టి నేను కనిపిస్తున్నాను. తెలుగు ప్రేక్షకులు కొత్త సినిమాలను ఆదరిస్తారు. కథ అందరి కన్నా గొప్పది'' అన్నారు. తేజ మాట్లాడుతూ– ''యూఎస్‌లో షో పడ్డాక ఒక టాక్ వచ్చింది. అక్కడ టాక్ ఏంటంటే... 'సెకండాఫ్ డ్రాప్ అయ్యింది, ఎండింగ్ బాగుంది, ఫస్ట్ హాఫ్ బాగుంది' అని. బేసిక్‌గా ప్రాపర్ రివ్యూ రైటర్స్ తగ్గిపోయారు. తెలుగులో మంచి రైటర్స్ లేరనడం లేదు. సినిమాలో హీరోగా ఉన్నవాడు విలన్ స్థాయికి జారిపోతాడు. అక్కడ దిగజారింది కథ కాదు. కథ పరంగా హీరో క్యారెక్టర్. ఆ తేడాను పట్టుకోవాలి. కొంతమంది పట్టుకుని రివ్యూలు రాశారు. వారికి ధన్యవాదాలు. ఆ లైన్ పట్టుకోలేని వారిని దేవుడే రక్షిస్తాడు. మార్నింగ్ షోకి ప్రేక్షకులు ధర్మామీటర్లు, ప్యారామీటర్లు పట్టుకుని వస్తారు. సాయంత్రం షోకి ఒరిజినల్ ప్రేక్షకులు వస్తారు. అప్పుడు తెలుస్తుంది సినిమా గురించి. లక్కీగా మా సినిమా సేవ్ అయ్యింది. నేను హిట్ తీయగలనని తెలిసింది. హిట్ తీయగలనని ఆడియన్స్ నాకు సర్టిఫికెట్ ఇచ్చినందుకు థ్యాంక్స్. ఇక మీదట హిట్స్‌నే తీద్దామనుకుంటున్నా. తెలుగులో ఎనీ స్టైల్ స్క్రిప్ట్‌ను రానానే చేయగలడు. తెలుగు సినిమా బెటర్ అవ్వాలంటే నెగిటివ్, పాజిటివ్ రెండు షేడ్స్ చేసే యాక్టర్లు రావాలి'' అన్నారు. ''సురేశ్ ప్రొడక్షన్స్ బ్యానర్‌లో ఇది మాకు 48వ సినిమా. రామానాయుడుగారు ఉండుంటే రానాను కౌగిలించుకుని చాలా ఆనందపడేవారు. ఈ సినిమాతో తేజ ఈజ్ బ్యాక్'' అన్నారు పరుచూరి గోపాలకృష్ణ.


● రవితేజ

రవితేజ, మెహరీన్ జంటగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో 'దిల్' రాజు, శిరీష్‌లు నిర్మిస్తున్న 'రాజా ది గ్రేట్' టీజర్‌ను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 15న విడుదల చేస్తున్నట్టు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది.

రాధాజోగేంద్ర అందరికీ నచ్చారు



భర్త అంటే భరించే వాడు కాదు... భార్యను ప్రాణంగా చూసుకునేవాడు. తన జీవితంలోనే కాదు తన ఆలోచనల్లో కూడా సగభాగం ఆమెకు కల్పించి, గౌరవించేవాడు. భార్య ఇష్టాన్నే తన ఇష్టంగా, ఆమె కష్టాన్ని తన కష్టంగా భావించేవాడు నిజమైన భర్త. భార్య కూడా అంతే. భర్త తప్పులు చేయకుండా వెన్నంటే ఉండాలి. భర్త ఆశయం కోసం తన వంతు సాయం చేయాలి.


● భరత్ చౌదరి, కిరణ్‌రెడ్డి, డి. సురేశ్‌బాబు

ఇలా భార్యాభర్తలు కలిసి మెలిసి ఉంటే ఆ దాంపత్యం ఆనందంగా ఉంటుంది. ఎంతోమందికి ఆదర్శంగా ఉంటుంది. కాజల్, రానా జంటగా తేజ దర్శకత్వంలో వచ్చిన సినిమా 'నేనే రాజు నేనే మంత్రి'లోని భార్యాభర్తల (రానా–కాజల్) ప్రేమ చూడముచ్చటగా ఉంటుంది. డి. సురేశ్‌బాబు, సీహెచ్ భరత్‌చౌదరి, కిరణ్‌రెడ్డి నిర్మించారు. శుక్రవారం విడుదలైన ఈ సినిమా హిట్ టాక్‌తో దూసుకెళుతోంది. జోగేంద్ర (రానా), రాధ (కాజల్) మనసుల్లో నిలిచిపోతారని సినిమా చూసిన ప్రేక్షకులు అంటున్నారు.

కథ..

వడ్డీ వ్యాపారం చేసుకునే జోగేంద్రకు భార్య రాధే ప్రపంచం. కానీ, ఈ దంపతులకు సంతానం ఉండదు. తీరా దేవుడు దయ వల్ల రాధ కడుపు పండితే అనుకోని పరిస్థితులు ఆ సంతోషాన్ని వారి నుంచి దూరం చేస్తాయి. దీంతో రాధ చాలా బాధపడుతుంది. అప్పటివరకు మంచివాడిలా ఉన్న జోగేంద్ర ఆ ఘటన తర్వాత రూట్ మార్చుతాడు. ఏమైనా చేసి రాధను సంతోషంగా ఉంచాలనుకుంటాడు. ముందుగా ఆ ఊరి సర్పంచ్ అవుతాడు. ఊరి సర్పంచ్ నుంచి ఎమ్మెల్యే, మినిస్టర్ వరకు ఎదుగుతాడు జోగేంద్ర. ఆ తర్వాత సీఎం కావాలనుకుంటాడు? కానీ, శత్రువులు ఆడిన రాజకీయ చందరగంలో తన నమ్మినబంటు శివ (నవదీప్) ను తానే చంపుకుంటాడు జోగేంద్ర. ఇదే సమయంలో జోగేంద్ర తప్పుడు పనులు చేస్తున్నాడని నిరూపించేందుకు జర్నలిస్టు దేవికారాణి (క్యాథరిన్)ట్రై చేస్తుంది. అసలు జోగేంద్ర మారడానికి దారితీసిన పరిస్థితులు ఎంటి? దేవికారాణి ఎంటరైన తర్వాత రాధ, జోగేంద్ర జీవితాల్లో ఎమైనా మార్పులు వచ్చాయా? రాధ కోసం జోగేంద్ర తన దారిని మార్చుకున్నాడా? సి.ఎం. కావాలనుకున్న కలను నేరవేర్చుకున్నాడా? లేదా? అనేది తెరపై చూడాల్సిందే.

కథను నమ్మి ఈ సినిమా తీశామని, ఆ నమ్మకాన్ని ప్రేక్షకులు నిజం చేశారని నిర్మాతలు డి. సురేశ్‌బాబు, సీహెచ్ భరత్ చౌదరి, కిరణ్‌రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. ఈ చిత్రం ప్రేక్షకులకు దగ్గర కావడానికి ముఖ్యం కారణాలు కథ, అందులో ఉన్న ఎమోషన్ అన్నారు.

ఇంకా నిర్మాతలు మాట్లాడుతూ– ''జోగేంద్ర, రాధల స్వచ్ఛమైన ప్రేమ ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అయ్యింది. రానా, కాజల్ ఎమోషనల్ సీన్స్‌లో బాగా యాక్ట్ చేశారు. స్క్రీన్‌పై రానా, కాజల్ కెమిస్ట్రీ బాగా కుదిరింది. ఒక పక్క రాధ, జోగేంద్ర లవ్ స్టోరీని చూపిస్తూనే, మరోపక్క పొలిటికల్ డ్రామాను జోడించి, డైరెక్టర్ తేజ బాగా తీశారు. స్క్రీన్‌ప్లే ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేస్తుంది. అనూప్ రూబెన్స్ పాటలు మెప్పిస్తున్నాయి. జోగేంద్ర పాత్రకు రానా జీవం పోశారు. ఎక్స్‌లెంట్‌గా నటించారు. చాలా తక్కువమంది హీరోలు ఇలాంటి కథలను ఎంచుకుని, సినిమాలు చేస్తారు. ఇలాంటి కథ చేయండ హీరో రానా గొప్పతనం. రానా డిఫరెంట్ సినిమాలు చేయడంలో ఎప్పుడూ ముందు వరుసలో ఉంటారు. అందుకు లీడర్, బాహుబలి, ఘాజి తదితర చిత్రాలే నిదర్శనం. అనుకున్న బడ్జెట్‌లోనే సినిమాను కంప్లీట్ చేశాం. మంచి కథ–కథనం ఉన్న చిత్రాలను ప్రేక్షకులు ఆదరిస్తారని మరోసారి నిరూపించారు'' అన్నారు.









సాక్షి
ఆదివారం । ఆగస్టు । 13 । 2017
www.sakshi.com

ప్రకృతి సంపదకు నిలయమైన విశాఖ మన్యం కొండల్లో విలువైన ఖనిజ సంపదే కాదు.. రంగురాళ్ల నిక్షేపాలు అపారంగా ఉన్నాయి. దశాబ్దం క్రితం వరుస దుర్ఘటనలతో మూతపడ్డ క్వారీలు ఇప్పుడు మళ్లీ జోరందుకున్నాయి. దట్టమైన ఈ అటవీ ప్రాంతంపై సర్కారు నిఘా కొరవడడం.. మావోల కదలికలు రంగురాళ్ల వ్యాపారులకు కాసులు కురిపిస్తున్నాయి. గంజాయి సాగులో మాదిరిగానే ఇక్కడా గిరిజనులే వారి పావులు.

మన్యంలో రంగు రాళ్ల వేట


రంగురాళ్ల తవ్వకాలు చేస్తున్న కూలీలు (ఫైల్ ఫొటో)

- విచ్చలవిడిగా తవ్వకాలు
- పన్నెండేళ్ల కిందట కరక క్వారీ ప్రమాదంతో తగ్గుముఖం
- ఇటీవల తిరిగి ఊపందుకున్న మైనింగ్
- గిరిజనులతో అర్ధరాత్రి తవ్వకాలు
- మావోల సాకుతో క్వారీల జోలికి వెళ్లని పోలీసులు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం

విశాఖ మన్యంలో మళ్లీ రంగురాళ్ల వేట మొదలైంది. మావోయిస్టుల కార్యకలాపాలు తగ్గుముఖం పట్టినా, అక్కడక్కడ వారి కదలికలను ఆసరాగా చేసుకుని తవ్వకాలు చేపడుతున్నారు. కొన్నేళ్ల కిందట నర్సీపట్నం సమీపంలోని కరక క్వారీలో జరిగిన ఘోర ప్రమాదంలో 15 మంది గిరిజన కూలీలు మృత్యువాత పడిన తర్వాత తగ్గుముఖం పట్టిన తవ్వకాలు ఇటీవల తిరిగి ఊపందుకున్నాయి. చింతపల్లి, జీకే వీధి మండలాల్లోని కొండల్లో ఇప్పుడు ఎక్కడ చూసినా నిషేధిత రంగురాళ్ల క్వారీలే కనిపిస్తున్నాయి. తవ్వకాలకు వర్షాకాలం అనువైన సీజన్ కావడంతో వ్యాపారులు రంగంలోకి దిగి గిరిజన కూలీలతో తవ్వకాలు జరిపిస్తున్నారు. దట్టమైన అటవీ ప్రాంతాల్లోనూ, మావోల భయంతో పోలీసులు అడుగు పెట్టలేని మారుమూల కొండల్లోనూ తవ్వకాలు సాగిస్తున్నారు. తవ్వి తీసిన రాళ్లను ఏజెన్సీ ముఖద్వారమైన నర్సీపట్నానికి తరలిస్తున్నారు. అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు తరలించి అమ్ముకుంటున్నారు. ఇక్కడ ప్రధానంగా అలెక్స్, క్యాట్స్ ఐ (పిల్లి కన్ను–వైఢూర్యం) రాళ్లు లభ్యమవుతుంటాయి. ఒకప్పుడు అరకు, పాడేరు పరిసర ప్రాంతాల్లో మూన్ స్టోన్ రాళ్లు మాత్రమే లభ్యమయ్యేవి. కానీ, చింతపల్లి, జీకే వీధి మండలాల్లో వీటి కంటే నాణ్యమైన అలెక్స్, క్యాట్స్ ఐ రకం రాళ్లు లభ్యమవడంతో ఈ ప్రాంతాల్లో వీటి తవ్వకాలు ఎక్కువయ్యాయి. పది గ్రాముల అలెక్స్ రాయి ధర రూ.లక్ష నుంచి కోటి వరకు పలుకుతుందని చెబుతారు. ప్రస్తుతం క్యాట్స్ ఐ రాళ్లు మాత్రం భారీ పరిమాణంలోనే లభ్యమవుతున్నట్టు చెబుతున్నారు. ఈ రకం రాళ్లకు గుజరాత్, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల్లో ఎక్కువగా డిమాండ్ ఉంది. ఈ నెలలోనే సుమారు నాలుగైదు కోట్ల రూపాయల వ్యాపారం జరిగిందని అంచనా.

చింతపల్లి, జీకే వీధుల్లో తవ్వకాలు

ప్రధానంగా చింతపల్లి, గూడెం కొత్తవీధి (జీకే వీధి) మండలాల్లో రంగురాళ్ల తవ్వకాలు జోరుగా జరుగుతున్నాయి. పోతురాజు గుమ్మల, చీమలపాడు, చెదలపాడు పశువుల బంద, మామిడిపాలెం, సిగనాపల్లి, గుర్రాలగొంది, మేడూరు, సత్యవరం, లోతుగెడ్డ, కొత్తపాలెం పంచాయతీ కడశిల్ప పల్లెల్లో రాత్రిళ్లు యథేచ్ఛగా తవ్వకాలు సాగుతున్నాయి. పోతురాజు గుమ్మల కొండల్లో అధికంగా రాళ్లు దొరుకుతుండగా, మిగిలిన గ్రామాల్లో ఓ మోస్తరుగా లభ్యమవుతున్నాయి. ఇక్కడ ప్రధానంగా క్యాట్స్ ఐ (వైఢూర్యం–పిల్లి కన్ను) రకం రాళ్లు లభ్యమవుతున్నట్టు చెబుతున్నారు. వీటిని చింతపల్లి, నర్సీపట్నం ప్రాంతాలకు చెందిన వ్యాపారులు కొనుగోలు చేసి బడా సేఠ్‌లు, నగల వర్తకులకు అమ్ముతుంటారు. క్యాట్స్ ఐ రకం రాయి రూ.వెయ్యి నుంచి రెండు వేలకు కొనుగోలు చేసి బడా వ్యాపారులకు పాతిక వేల నుంచి రూ.30 వేల వరకు అమ్ముతుంటారు. కాగా, వర్షాలు వెలిసిన తర్వాత కొండల్లో ఎక్కడ అభ్రకం కన్పిస్తే అక్కడ రంగురాళ్లు (వైఢూర్యాలు) లభ్యమవుతాయని గిరిజనుల నమ్మకం.


అప్పుడే మట్టి నుంచి తీసిన ముడిసరకు రాయి ఇలా ఉంటుంది

ప్రమాదాల్లో గిరిజనులే బలి..

రంగురాళ్ల తవ్వకాలకు వర్షాకాలమే అనుకూలం. వర్షపు నీటికి ఒకటి రెండు రంగు రాళ్లు పైకి కనిపిస్తాయి. అలా రాళ్లు కనిపిస్తే.. ఆ ప్రాంతంలో రాళ్ల బెల్ట్ ఉందని గుర్తించి తవ్వకుంటూ కిందకు వెళ్తారు. వంద మంది వరకు కూలీలు సామూహికంగా కొండను తవ్వకుంటూ వెళ్తారు. ఈ క్రమంలో మట్టి పెళ్లలు జారి పడిపోవడంవల్ల అనేకమంది మృత్యువాత పడ్డారు కూడా.

- 1994 సెప్టెంబర్ 10న పప్పుశెట్టిపాలెం క్వారీలో భారీ వర్షం కురుస్తున్నా లెక్కచేయక కూలీలు తవ్వకాలు కొనసాగిస్తుండగా అకస్మాత్తుగా పైభాగం కూలి 14 మంది గిరిజన కూలీలు సజీవ సమాధి అయ్యారు. ఈ ఘటనతో ఉలిక్కిపడ్డ అధికార యంత్రాంగం ఆ క్వారీని మూయించి వేసింది.
- ఆ తర్వాత అక్టోబరు 2008లో నర్సీపట్నంలోని మరో క్వారీలో ముగ్గురు మరణించారు.
- 2004 డిసెంబర్ 17న గొలుగొండ మండలం కరకలో జరిగిన క్వారీ ప్రమాదంలో 15మంది కూలీలు దుర్మరణం పాలయ్యారు. కానీ, వెలికితీసిన మృతదేహాలు మూడే.
- ఈ ప్రమాదంతో అప్పటి ప్రభుత్వం అప్రమత్తమైంది. మన్యంలో ఎక్కడా రంగురాళ్ల క్వారీయింగ్ జరగకుండా నిషేధం విధించింది. అటవీశాఖ ఆధ్వర్యంలో బేస్ క్యాంప్‌లు ఏర్పాటుచేసింది. అప్పటి నుంచి మూతపడ్డ క్వారీలు మళ్లీ ఇప్పుడు ప్రారంభమయ్యాయి.

తవ్వకాలు జరుగుతున్నాయి

కొన్ని రోజులుగా చింతపల్లి అటవీ ప్రాంతంలో రంగు రాళ్ల తవ్వకాలు జరుగుతున్న విషయం తెలిసింది. అటవీశాఖ అధికారులను అప్రమత్తం చేసి చెదలపాడు క్వారీని మూయించాం. మావోల వారోత్సవాలు ఇటీవలే జరిగిన నేపథ్యంలో పోలీసులు రాత్రిపూట అటవీ ప్రాంతాల్లోకి వెళ్లలేని పరిస్థితి ఉంది. అధికారులతో కలిసి రంగురాళ్ల మైనింగ్‌ను అడ్డుకుంటాం.

– అనిల్ పులిపాటి, చింతపల్లి డీఎస్పీ

వ్యాపారులను నియంత్రించాలి

ఇప్పటికే గంజాయి కేసులతో సమిథలవుతున్న గిరిజనంతో రంగురాళ్ల వ్యాపారులు తవ్వకాలు చేయిస్తున్నారు. క్వారీలు కూలి ఎటువంటి దుర్ఘటనలు జరుగుతాయోనన్న ఆందోళన నెలకొంది. అధికారులు ముందుగా వ్యాపారులను మన్యంలోకి అడుగుపెట్టకుండా నియంత్రిస్తే.. క్వారీలు వాటంతట అవే మూతపడతాయి.

– బోణంగి చిన్నయ్య పడాల్, గిరిజన నాయకుడు, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు


ఎంత సరుకైనా ఇస్తాం: వ్యాపారి శ్రీనివాస్

రంగురాళ్ల తవ్వకాలు సాగిస్తున్న చింతపల్లి అటవీ ప్రాంతంలో 'సాక్షి' బృందం పర్యటించింది. ఈ క్రమంలోనే లోతుగెడ్డలో శ్రీనివాస్ అనే ఓ వ్యాపారి మాట్లాడుతూ.. తన వద్ద మేలిమి రకానికి చెందిన క్యాట్స్ ఐ పది గ్రాముల రాయి ఉందని చూపిం చాడు. ఐదు వేలకు బేరమాడితే... గిరిజన కూలీల నుంచి ఐదు వేలకు కొనుగోలు చేశానని, వెయ్యి కూడా లాభం లేకుండా ఎలా ఇస్తానని ప్రశ్నించాడు. కోటి రూపాయల విలువైన సరుకు సైతం గంటలో ఏర్పాటుచేయగలనని చెప్పాడు. ఇంత మారుమూలకు పోలీసులు వచ్చే ధైర్యం చేయరన్నాడు. కోటి విలువైన సరుకు కూడా జేబుల్లో పెట్టుకు వెళ్లిపోవచ్చని చెప్పుకొచ్చాడు.

నిఘా పెంచుతాం

చింతపల్లి పరిసరాల్లో మళ్లీ రంగురాళ్ల తవ్వకాలు జరుగుతున్నాయని తెలిసింది. ఇటీవలే చెదలపాడు క్వారీ మూయించాం. మిగిలిన చోట్ల తవ్వకాలు జరగకుండా నిఘా పెంచుతాం. ప్రత్యేకించి రాత్రి పూట గస్తీ పెంచాల్సిన అవసరం ఉంది. ఇప్పుడును రెండు బేస్ క్యాంప్‌లకు తోడు మరో ఐదు బేస్ క్యాంప్‌లు ఏర్పాటు చేస్తాం. గిరిజనుల్లో చైతన్యం తీసుకువస్తాం. వ్యాపారులపై దాడులు నిర్వహిస్తాం.

– శేఖర్‌బాబు, నర్సీపట్నం డివిజనల్ ఫారెస్ట్ అధికారి


విశాఖ మన్యంలో ఎక్కువగా దొరికే రంగురాళ్ల రకం.. పిల్లి కన్ను (క్యాట్స్ఐ)


సత్యవరం పంచాయతీ పరిధిలోని దట్టమైన అటవీ ప్రాంతంలో ఏర్పాటైన క్వారీ

మంత్రి కాలవది నోరా? తాటి మట్టా?

- వైఎస్సార్‌సీపీ నేత జోగి రమేశ్ ధ్వజం
- యనమల అడ్డదారిలో మంత్రి అయ్యారు
- వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలను బదిలీ చేసే అధికారం లేని కేఈ
- జగన్ పక్షానే నంద్యాల ప్రజలు



నంద్యాల, సాక్షి బృందం: మంత్రి కాలవ శ్రీనివాసులుది నోరా? తాటిమట్టా? అని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నేత జోగి రమేశ్ అన్నారు. శనివారం ఆయన నంద్యాలలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. దివంగత భూమా నాగిరెడ్డిని రౌడీషీటర్, గూండా, ఫ్యాక్షనిస్టు అని అసెంబ్లీ సాక్షిగా తిట్టిపోసిన కాలవ శ్రీనివాసులు నేడు సిగ్గులేకుండా ఆయన్నే పొగుడుతూ ఓట్లు అడుతున్నారని విమర్శించారు. అడ్డదారిలో మంత్రి అయిన యనమల రామకృష్ణుడికి వైఎస్ జగన్‌ను విమర్శించే హక్కు లేదన్నారు. కనీసం వీఆర్వో, వీఆర్‌ఏలను బదిలీ చేసే అధికారం కూడా లేని పరిస్థితి ఉప ముఖ్యమంత్రి, రెవెన్యూ శాఖమంత్రి కేఈ కృష్ణమూర్తిది అని విమర్శించారు. కేఈకి పెద్ద పదవి ఇచ్చామని తీవ్ర అవమానాలకు గురి చేస్తున్నారన్నారు. చంద్రబాబు పదవి మాత్రమే ఇస్తారని, అధికారం ఇవ్వరని, అధికారాలన్నీ తనయుడు లోకేశ్‌కు కట్టబెడతారని, ఆయన కనుసన్నల్లోనే మంత్రులంతా పనిచేయాల్సి ఉందని ధ్వజమెత్తారు. మంత్రి సోమిరెడ్డి సోది బాగా చెబుతారని, ఆయన సోమిరెడ్డి కాకుండా సోదిరెడ్డిగా ప్రఖ్యాతిగాంచారని ఎద్దేవా చేశారు. విలువలకు, విశ్వసనీయతకు మారుపేరుగా నిలిచిన వైఎస్ జగన్ పక్షానే నంద్యాల ప్రజలు ఉన్నారని చెప్పారు. ఈ ఉప ఎన్నికల్లో అధికార పార్టీకి ఓటర్లు గుణపాఠం చెబుతారన్నారు.

25, 37 వార్డుల్లో టీడీపీ ప్రచారం

నూనెపల్లె (నంద్యాల): నంద్యాల ఉప ఎన్నికలో టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానంద రెడ్డి శనివారం 25, 37 వార్డుల్లో పర్యటించారు. తనకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. నంద్యాల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు.


పార్టీ నేతలతో కలిసి ప్రచారంలో పాల్గొన్న టీడీపీ అభ్యర్థి బ్రహ్మానంద రెడ్డి

నంద్యాలలో కాంగ్రెస్ అభ్యర్థి ప్రచారం

నూనెపల్లె (నంద్యాల): నంద్యాల ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అబ్దుల్ ఖాదర్ శనివారం పట్టణంలోని అయ్యప్ప స్వామి టెంపుల్ ప్రాంతం, మార్కెట్‌యార్డు, చాంద్‌బాడా, బైర్మల్‌వీధి, కొత్త బస్టాండ్ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఆయనతో పాటు ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తులసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి అబ్దుల్‌ఖాదర్

నోటితో నీతులు.. మనసుతో మలిన పనులు

- చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కాకాణి ధ్వజం
- సీఎం చేతుల్లో ప్రజాస్వామ్యం అపహాస్యమైంది
- కుట్రలు, కుతంత్రాలకు మారుపేరు చంద్రబాబు..
- టీడీపీ అంటే తోడు దొంగల పార్టీ
- సోమిరెడ్డి పోర్ట్‌ఫోలియో వైఎస్ జగన్‌ను తిట్టడమే
- వ్యూహకర్తవైతే నాలుగుసార్లు ఎందుకు ఓడిపోయావ్ సోమిరెడ్డీ?


మీడియాతో మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి, చిత్రంలో మదనపల్లి ఎమ్మెల్యే దేశాయి తిప్పారెడ్డి తదితరులు

సాక్షి బృందం, నంద్యాల: సీఎం చంద్రబాబు నోటితో నీతులు చెబుతూ.. మనసుతో మాత్రం మలినమైన పనులు చేస్తారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. ఆయన శనివారం కర్నూలు జిల్లా నంద్యాలలోని ఆ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు మూడున్నరేళ్లుగా చేసిన అభివృద్ధి గురించి వివరించి ఓట్లడిగితే బాగుంటుందని, అలాగాక ఇతర జిల్లాల నుంచి తీసుకొచ్చిన టీడీపీ కార్యకర్తలతో ఇంటింటి సర్వే చేయిస్తూ.. వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉండేవారిని భయపెట్టి, బ్లాక్‌మెయిల్ చేసి టీడీపీకి ఓటు వేయాలనడం దుర్మార్గమని దుయ్యబట్టారు. చంద్రబాబు నంద్యాలకు వచ్చినప్పుడు తన సభకు ప్రజలు రాలేదన్న ఆగ్రహంతో తానేసిన రోడ్లపై నడవకూడదని, తానిచ్చే పింఛన్లు, రేషన్ తీసుకోవద్దని చెప్పడం హాస్యాస్పదమన్నారు. తన బాబు సొమ్ముతో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు చేపడుతున్నారా? లేక హెరిటేజ్‌లో వచ్చిన లాభాలతో చేపడుతున్నారా? అని ప్రశ్నించారు. ప్రజల సొమ్ముతో నడిచే ప్రభుత్వాలు.. వారికోసం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంటుందన్న విషయాన్ని సీఎం మరచిపోయారన్నారు. నంద్యాల ఎన్నికల్లో గెలిస్తే పొదుపులక్ష్మి గ్రూపులకు రుణాలిస్తాం.. రుణాలపై సబ్సిడీ ఇస్తాం.. ఓడిపోతే వడ్డీతోసహా వసూలు చేస్తామంటూ భయపెట్టడం తగదన్నారు.

హుందా అంటే అర్థం తెలుసా బాబూ?

చంద్రబాబు చేతుల్లో ప్రజాస్వామ్యం ఎప్పుడో అపహాస్యమైందని, మరీ దిగజారిపోయే పరిస్థితులు నంద్యాలలో కన్పిస్తున్నాయని గోవర్ధన్‌రెడ్డి అన్నారు. నిఘా విభాగం ఎన్నికలప్పుడు శాంతిభద్రతలు కాపాడాల్సి ఉండగా.. ప్రభుత్వం అందుకు భిన్నంగా పనిచేయిస్తోందన్నారు. ఏఏ ప్రాంతాల్లో ఏఏ నాయకులు ఓటర్లను ప్రభావితం చేయగలరనే వివరాలు సేకరించి.. వారినేదోవిధంగా ప్రలోభపెట్టి, బెదిరించి టీడీపీవైపునకు తిప్పుకునేలా పోలీసుశాఖ సహకరిస్తోందన్నారు. నంద్యాలలో సర్వే పేరుతో ఓటర్లను మభ్యపెడుతున్నవారిని కనిపెట్టి.. వారితోనే నిజం చెప్పించి, పోలీసులకు పట్టించడంతోపాటు అక్కడున్న సీఐ సైతం వారినెవరూ కిడ్నాప్ చేయలేదని చెబుతున్నా వైఎస్సార్‌సీపీ నాయకులపైనే కేసు పెట్టడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. హుందా రాజకీయాలు చేస్తున్నట్లు చంద్రబాబు చెబుతున్నారు. అసలాయనకు హుందా అంటే అర్థం తెలుసా? అని మండిపడ్డారు. ''ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి అధికారంలోకి వచ్చిన నీవా జగన్‌మోహన్‌రెడ్డి గురించి మాట్లాడేది? జగన్ నీతికి, నిజాయితీకి, విశ్వసనీయతకు మారుపేరుగా నిలుస్తే.. నీవు కుట్రలు, కుతంత్రాలు, మోసాలకు మారుపేరుగా ఉన్నావ్. ఎన్టీఆర్‌తోనే అసలైన టీడీపీ అంతరించిపోయింది. ఇప్పుడున్నది తోడు దొంగలపార్టీ'' అని దుయ్యబట్టారు. నంద్యాలలో అద్దె కార్యకర్తల్ని తీసుకొచ్చి ప్రచారం చేసుకోవాల్సిన దుస్థితి టీడీపీకి ఏర్పడిందన్నారు. కొందరు మంత్రుల్ని నంద్యాలలో పెట్టి వారిని వ్యూహకర్తలుగా పిలుస్తున్నారని, అలాంటివారిలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కూడా ఉన్నారని, ఆయనంత వ్యూహకర్త అయితే నాలుగుసార్లు వరుసగా ఎలా ఓడిపోయారని ప్రశ్నించారు. సోమిరెడ్డికి ప్రస్తుతం జగన్‌ను తిట్టే పోర్ట్‌ఫోలియో మాత్రమే చంద్రబాబు ఇచ్చారని ఎద్దేవా చేశారు. సమావేశంలో ఎమ్మెల్యే దేశాయి తిప్పారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల ఉప ఎన్నిక నిర్వహణకు రూ.1.50 కోట్లు

సాక్షి, అమరావతి: కర్నూలు జిల్లా నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక నిర్వహణకు రూ.1.50 కోట్లను విడుదల చేస్తూ తెలుగు రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారి భన్వర్‌లాల్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల నిర్వహణలో పాల్గొనే సిబ్బందికి టీఏ, డీఏలతో పాటు ఆర్టీసీ బస్సు, లారీలు, జీపులు, కార్ల అద్దె చెల్లింపు, ఇతర పోలింగ్ నిర్వహణ ఖర్చుకు రూ.1.50 కోట్లను విడుదల చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

టీడీపీ అభ్యర్థే గెలుస్తాడు



- మంత్రులు ఆదినారాయణరెడ్డి, సోమిరెడ్డి
- చెల్లెలంటూనే రోజా వస్త్రధారణపై కామెంట్

సాక్షి బృందం, నంద్యాల: ఎంతమంది వచ్చి వ్యతిరేకంగా ప్రచారం చేసినా నంద్యాల ఉప ఎన్నికలో టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డే గెలుస్తారని మంత్రులు ఆదినారాయణరెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. శనివారం నంద్యాలలోని టీడీపీ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ నుంచి ఫిరాయించిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో జరుగుతున్న అభివృద్ధిని చూసి మాట్లాడాలని సూచించారు. 'మా చెల్లెలు రోజా..' అంటూనే ఆమె జబర్దస్త్‌లో ఎలాంటి దుస్తులు వేస్తుందో అందరికీ తెలుసంటూ వ్యాఖ్యానించారు. పసిపాప అయిన మంత్రి అఖిలప్రియపై రోజా వ్యాఖ్యలు సరికాదన్నారు.

మాకు ఓటేయించకపోతే మీ ఉద్యోగం ఫట్..

సీఆర్‌పీలకు టీడీపీ నేతల బెదిరింపు

సాక్షి ప్రతినిధి, కర్నూలు: 'మీరేం చేస్తారో మాకు తెలియదు.. మీ పరిధిలోని స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యుల ఓట్లు టీడీపీ అభ్యర్థికే పడాలి.. కొంత మందిని ప్రచారానికి పంపాలి. లేదంటే మీపై చర్యలు తీసుకోవాల్సి వస్తుంది.. తర్వాత ఉద్యోగం పోయిందని బాధ పడితే లాభం ఉండదు' అనే బెదిరింపులతో కర్నూలు జిల్లా నంద్యాల్లో కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్ (సీఆర్‌పీ)లు హడలిపోతున్నారు. తమ పరిధిలోని మహిళా సంఘాలకు పొదుపుపై అవగాహన కల్పించడం, రుణాలను సద్వినియోగ పరుచుకోవడం వంటి వాటిపై సీఆర్‌పీలు పని చేయాల్సి ఉంటుంది. ఉప ఎన్నిక నేపథ్యంలో అధికార పార్టీ నేతల చూపు వారిపై పడింది. తమకు ఓట్లు వేయించాలని ఫోన్లలో ఒత్తిడి తేవడం, ప్రత్యక్షంగా కూడా హెచ్చరిస్తుండటంపై అన్ని ఆధారాలతో కొందరు ఢిల్లీలోని కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు పంపినట్లు సమాచారం. ఈ ఆధారాలను పరిశీలించిన అనంతరం ఎన్నికల సంఘం కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

పేదలకు ముద్ద పెట్టొద్దు!

- శిల్పా సహకార సొసైటీకి నోటీసులు
- అన్ని కార్యక్రమాలు నిలిపేయాలంటూ కలెక్టర్ ఆదేశాలు
- అధికారపార్టీ నేతల ఫిర్యాదుపై ఆగమేఘాలమీద చర్యలు
- రేషన్‌షాపుల ద్వారా కేవలం బియ్యమే పంపిణీ
- సొసైటీ ద్వారా తక్కువ ధరకే నిత్యావసర సరుకులిస్తుంటే వద్దంటూ ఆదేశాలు

సాక్షి ప్రతినిధి, కర్నూలు

నంద్యాల ఉప ఎన్నిక నేపథ్యంలో టీడీపీ ప్రభుత్వం అడ్డగోలు రాజకీయాలకు పాల్పడుతోంది. ఒకవైపు రేషన్‌షాపుల ద్వారా బియ్యం తప్ప మరే ఇతర నిత్యావసర సరుకులివ్వని రాష్ట్ర ప్రభుత్వం.. మరోవైపు తక్కువ ధరకే సరుకులు అందిస్తున్న శిల్పా సహకార సొసైటీపై దొంగదెబ్బకు తెరతీసింది. పేదలకు గరిష్ట చిల్లర ధర(ఎంఆర్‌పీ) కంటే పది శాతం తక్కువ ధరకు నిత్యావసర సరుకులిస్తున్న ఈ సొసైటీని మూసేయించేందుకు కంకణం కట్టుకున్న అధికారపార్టీ నేతలు ఫిర్యాదు చేయడం ఆలస్యం.. వెంటనే కార్యకలాపాలు నిలిపేయాలంటూ శనివారం సొసైటీకి నోటీసులు జారీ కావడం ఆగమేఘాలపై జరిగిపోయింది. శిల్పా సహకార సొసైటీతో పాటు శిల్పా మహిళా సహకార సొసైటీ కార్యకలాపాలు కూడా నిలిపేయాలని కలెక్టర్ తన నోటీసుల్లో పేర్కొన్నారు. అయితే ఈ నోటీసుల్లో ఎక్కడా అక్రమాలు జరిగినట్టు ఆధారాలు చూపకపోవడం గమనార్హం.

లాభాపేక్ష లేకుండా ఏడేళ్లుగా సేవ

శిల్పా సహకార సొసైటీ ఎటువంటి లాభాపేక్ష లేకుండా ఏర్పాటు చేసిన సంస్థ. 2010 సెప్టెంబర్ 2న దీన్ని ఏర్పాటు చేశారు. దీనిద్వారా ఎంఆర్‌పీ మీద 10 శాతం తక్కువ ధరకే సరుకులు అందిస్తున్నారు. వాస్తవానికి ఎన్నికల నిబంధనల మేరకు గతం నుంచి నడుస్తున్న కార్యక్రమాల్ని నిలిపివేయరాదు. కొత్త కార్యక్రమాలు చేపడితేనే ఎన్నికల నిబంధనలకు విరుద్ధం. పేదలకు, మహిళలకు ఏడేళ్లుగా సేవలందిస్తున్న సొసైటీలను ఇలా రాజకీయం చేసి మూసివేయించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు అధికారపార్టీ నేతలు సర్వేల పేరుతో టీడీపీకి ఓటు వేయకపోతే పెన్షన్ పోతుంది, రేషన్‌కార్డు పోతుందని నంద్యాల ఓటర్లను భయభ్రాంతులకు గురిచేస్తున్నా చర్యలు తీసుకోని అధికారులు.. శిల్పా సహకార సొసైటీ విషయంలో అధికారపార్టీ నేతలు ఫిర్యాదు చేయడం ఆలస్యం వెంటనే చర్యలకు ఉపక్రమించడం విమర్శలకు తావిస్తోంది. నిజానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన రేషన్‌షాపులద్వారా గతంలో 9 సరుకులను తక్కువ ధరకే అందించేవారు. ప్రస్తుతం రేషన్‌షాపులద్వారా బియ్యం మినహా మరే ఇతర సరుకులను ఇవ్వట్లేదు. ఒక్కొక్కటిగా సరుకుల్ని చంద్రబాబు ప్రభుత్వం ఎత్తివేస్తోంది. ఏడాదిక్రితం బియ్యంతోపాటు చక్కెర, కిరోసిన్ సరఫరా అయ్యేది. తాజాగా ఈ రెండు సరుకుల్నీ ఎత్తివేసింది. ఒకవైపు రేషన్‌షాపుల ద్వారా సబ్సిడీ సరుకులివ్వని ప్రభుత్వం.. మరోవైపు తక్కువ ధరకే సరుకులిస్తున్న సొసైటీని రాజకీయాల పేరిట అడ్డుకుంటుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సాక్షి పెళ్ళిచూపులు

ఆదివారం 13-8-2017

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



Yadav/33/5'10"/MBA/Bank Manager / 90 K PM. హైదరాబాద్/ గుడ్ లుకింగ్/ వరుడుకు అందమైన తగిన వధువు కావలెను. 9849061256 [HA-6665]

మాదిగ/28 Year / 5'8"/M.Tech/Jr. Eng. in BSNL / 40,000/- pm వెల్‌సెటిల్డ్ అయిన వరుడికి వధువు కావలెను. (2 Cr ప్రాపర్టీ) 8142220475 [HA-1868]

కుల పట్టింపులేదు/28 Year 5'10" / M.Tech / SWE / 1.2 pm / (5 Cr ప్రాపర్టీ ఏకైక పుత్రుడు) వెల్ సెటిల్డ్ అయిన వరుడికి వధువు కావలెను. 8142220817 [HA-1868]

వడ్డెర M.Tech / Govt. Asst/ ఇంజినీర్/ జెన్‌కో/ 45000/- PM / 5'11"/ ఎత్తు / 29 సం౹౹ల V.Fair వరునికి వధువు కావలెను. 9618007823 [HA-16438]

వాల్మీకి బోయ B.Tech / C. Govt. JTO / BSNL / 45000 PM / 5'10"/ ఎత్తు / 28 సం౹౹ల V.Fair వరునికి వధువు కావలెను. 9618007823 [HA-16438]

క్రిస్టియన్ మాదిగ B.Tech / Govt. బ్యాంక్ మేనేజర్ (బ్యాంక్ ఆఫ్ బరోడా) 60000 PM / 5'8"/ ఎత్తు / 29 సం౹౹ల వరునికి వధువు కావలెను. 9885055185 [HA-16006]

వెలమ : 32/5'6", Fair సింగపూర్‌లో సాఫ్ట్‌వేర్, జీతం 3 lakhs pm వరునకు కన్వర్టడ్ పెంతకోస్తు 25-28 yrs, 5'4", K. వెలమ వధువు కావలెను 97050 66878 [B-389]

5'7" ఎత్తు/10th/ చామనచాయ, 35 సం౹౹ 2 కోట్లు గల వరునకు వధువు కావలెను. కులప్రసక్తిలేదు. పిల్లలు లేరు, 2వ సంబంధము. నో బ్రోకర్స్. ✆ 7702494748 [B-601295]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై౹౹ లి౹౹

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Cont: K.C. Reddy, Address: 106, A K Enclave, Phase II, 8-2-350, Road No. 3, Banjara Hills (Near Furniture Mall), Hyderabad. Ph: 9849321309 / 9347807015 Email: kcreddy43@gmail.com

వధువు కావలెను

Reddy/ Big Industrialist / B.Tech / MBA/ 30/5'10"/ 100 Cr His Share.* Cont: K.C.Reddy Mar Bur, Hyd. Ph: 9849321309 / 9347807015.

Reddy/ B.Tech / MS/H1/USA/V.Smart Boy / 27/5'8"/ 30Cr (Prop) / Hyd* Cont: K.C.Reddy Mar Bur, Hyd. Ph: 9849321309 / 9347807015.

Reddy/ B.Tech / MS/USA/ 25 / 5'6"/100 Cr (Prop) / Hyd* Cont: K.C.Reddy Mar Bur, Hyd. Ph: 9849321309 / 9347807015.

Reddy/ Very Big Business/ B.Tech/ MBA/ 31/6'/V. Smart / 400 Cr Prop* Cont: K.C.Reddy Mar Bur, Hyd. Ph: 9849321309 / 9347807015.

Reddy/ Business / B.Tech/ MS /29/5'8"/225 Cr (Prop) * 27/5'8"/200 Cr * 30/5'10"/300 Cr * 26/6'/150 Cr * 28/6'/200 Cr * 29/5'10"/250 Cr* Cont: K.C.Reddy , Ph: 9849321309

Reddy/ MBBS /PG * 28'6'/15 Cr * 29/5'10"/DM/ 50 Cr * 30/5'7"/50 Cr * 30/6'/25 Cr * 27/6'/50 Cr* 28/5'9"/25 Cr *29/5'8"/50 Cr*Cont: K.C.Reddy Hyd. Ph: 9849321309 / 9347807015.

Reddy/ MBBS / Res-Doc-USA * 27/6'/50 Cr * 35/5'6"/50 Cr * 30/6' * 30/ 5'7" * 29/5'7" * 30/5'7" * 26/5'7" *Cont: K.C.Reddy, Ph: 9849321309 / 9347807015

Reddy/ Australia * B.Tech / MS/ Citizen/ 28/5'9"/30 Cr * PR / 30 /5'8"/ 25 Cr / 6 L / Rents* Cont: K.C.Reddy Ph: 9849321309 / 9347807015

Reddy/ B.Tech / MS/H1/USA * 29/5'7"/ 150K /70 Cr * 27/5'8"/100K/30 Cr * 31/6'/ 150K/ 30 Cr* 28/5'11"/60 Cr* Cont: K.C.Reddy, Ph: 9849321309 / 9347807015.

Reddy/ B.Tech / IIT/BITS/H1/USA * 31/ 6'/150K/30 Cr * 27/5'10"/25 Cr * 25/6'/15 Cr*Cont: K.C.Reddy Mar Bur, Banjara Hills, Hyd. Ph: 9849321309

వరుడు కావలెను

Reddy/ B.Tech / MBA/ Most Beautiful / 29/5'6"/ 200 Cr (Prop) / Hyd * Cont: K.C.Reddy, Ph: 9849321309 / 9347807015.

Reddy/ Rich * B.Tech/ 27/5'3"/50 Cr * 27/5'5"/40 Cr * 29/5'2 1/2"/100 Cr* 27/5'7"/50 Cr* 23/5'4"/50 Cr/ 26/5'6"/100 Cr * Cont: K.C.Reddy, Ph: 9849321309 / 9347807015.

Reddy/ B.Tech / MS/H1/USA * 25/5'3 1/2"/ 40 Cr * 27/5'5"/25 Cr * 27/5'4"/30 Cr * 26/5'2"/20 Cr* 24/5'5"/10 Cr * 28/5'5"/20 Cr * Cont: K.C.Reddy Ph: 9849321309 / 9347807015.

Reddy/ MBBS/ PG/Rich * 26/5'6"/10 Cr * 27/5'7"/100 Cr * 28/5'5"/50 Cr * 30/5'7"/15 Cr* Cont: K.C.Reddy, Ph: 9849321309 / 9347807015.

Reddy/ MBBS / Res-Doc-USA * 25/5'4"/ 120 Cr* 25/5'7"/50 Cr* 28/5'5"/10 Cr * 30/ 5'2"/ 10 Cr * 28/5'3" * 27/5'7"/10 Cr* Cont: K.C.Reddy, Ph: 9849321309 / 9347807015

Reddy/ B.Tech / 24/5'4"/10 Cr*27/5'6"/25 Cr * 27/5'5"/ 20 Cr * 24/5'6"/60 Cr * 25/5'7"/8 Cr* 27/5'3"/ 20 Cr * 27/5'3"/10 Cr * Cont: K.C.Reddy Ph: 9849321309

Reddy/ B.Tech/M.Tech/26/5'4"/6 Cr * 25/5'5"/5 Cr *30/5'2"/20 Cr*25/5'6"/15 Cr * 25/5'1"/20 Cr * 26/5'3" * Cont: K.C.Reddy, Ph: 9849321309 / 9347807015.

Reddy/ B.Tech (IIT)/BITS / 25/5'7"/30 Cr *29/5'6" *25/5'9"/*29/5'3"/* 26/5'2" *26/5'5"*26/5'3"* Cont: K.C.Reddy, Ph: 9849321309 / 9347807015.

Reddy/(Divorcee) / B.Tech/ 27/5'6"/25 Cr * 30/5'6"/4 Cr * 40/5'5"/100 K * 32/5'2"/25 Cr *32/5'2"/1 Cr* 30/5'2 1/2"/10 Cr * 33/5'3"/10 Cr * Cont: K.C.Reddy. Ph: 9849321309 /

Reddy/ MBBS - Needs any Well settled * 22/5'5"/15 Cr * 28/5'5"/50 Cr * 27/5'7"/100 Cr* Cont: K.C.Reddy Mar Bur, Ph: 9849321309 / 9347807015. [D-036]

SC మాల హిందు/ B.Tech / MBA/ 28/5'9"/ Google /SWE/ Hyd/ 12 Lakhs PA తగిన వరునికి వధువు కావలెను. 9705960270 [HA-6665]

క్రిస్టియన్ మాల/28/5'8"/B.Tech/ IIT/MBA IIM/SWE/IBM/Hyd/14L PA/చాలా అందమైన వరునికి తగిన వధువు కావలెను. 9948136776. [H-693185]

రజక/27/5'3"/Own కన్‌స్ట్రక్షన్/ 17,000/-PM గల వరునికి తగిన సాంప్రదాయ 1st & 2nd వధువు కావలెను. క్యాస్ట్ నో బార్. 9951771353. [H-693185]

రెడ్డి/29/5'10"/B.Tech/ITI/30 Laks PA. *27/5'8"/B.Tech/NIT/14 Laks. *29/5'10"/MD Gen. *28/5'10/MS Ortho. Ph: 9059430595. [H-693177]

కమ్మ: డైవర్స్, 36, 5'6", బిజినెస్, 5 కోట్ల ఆస్థి, వరునికి తగిన వధువు కావలెను. Caste No Bar (అర్జంట్) ✆ 7901503327. డైరెక్ట్ కాంటాక్ట్. [B-609462]

42 / 5.6 / గవర్నమెంట్ ఎంప్లాయి / కుల ప్రసక్తి లేని వరుడికి పెళ్ళి కొరకు వధువు కావలెను. డైరెక్ట్‌గా సంప్ర: 73867 48951. [L- 598149]

Well Settled వికలాంగుడైన యువకునికి / 33 / అమ్మాయి కావలెను. కుల, కట్న ప్రసక్తి లేదు. విడో అయినా పర్వాలేదు. పిల్లలున్నా ఓకే. సంప్ర: 79892 62248. [L- 598148]

వధువు కావలెను. బ్రాహ్మణ, క్రైస్తవ వరులకు 48/5.5/M.Phil, 38/5.6/M.Sc లకు ఉన్నత కులములకు చెందిన వధువులు సంప్రదించగలరు. 09441180562, 08763550809. [S - 837026]



★★

బ్రాహ్మణ/2nd Marriage/ 31/5'5"/ONGC (Govt.) * 39/5'9"/ IBM/ USA * 36/5'8"/ TCS/ Hyd* 33/5'9"/Infosys * 33/ 5'9" / Accenture * 35/5'8"/ Techmahindra* 9704656103 / 9533608887 [HA-19155]

బ్రాహ్మణ/39/5'7"/(Govt. Job)/ Hyd * 37/6'/CTS * 38/5'8"/ Accenture/ Hyd * 37/5'11"/ Gen Pac/ Hyd * 39/5'7"/ MNC/ Hyd * 36/5'8"/ SBH / Hyd * 35/5'7"/HCL * 9704656103 / 9533608887 [HA-19155]

కాపు (కట్న ప్రసక్తి లేదు) 27/5'10" B.Tech S/W/E, TCS 80,000/- PM అందమైన వెల్‌సెటిల్డ్ వరునికి తగిన వధువు కావలెను. ఫోన్ : 80080 55675 [V- 596805]

రెడ్డి/విడో/5'4' 48Y/ MBA/ బ్యాంక్ ఎంప్లాయి/ 58,000/-Pm/ ఒక పాప వున్న సాంప్రదాయక వధువుకు. గుణ గణాలు కలిగిన వరుడు కావలెను (ఇల్లరికం). 7095922464. [H-691016]

వరుడు కావలెను



Goud డైవర్సీ/32/5'3"/USA / MS/ SWE / 120K / V. Fair / Hyd వధువుకి USA లో వుండే తగిన వరుడు కావలెను. Caste No Bar 9246523454 [HA-48098]

ముదిరాజ్/24 Year/5'4"/B.Tech /SWE/ 40000/- PM (ఏకైక పుత్రిక, 2 Cr ప్రాపర్టీ) వెల్ సెటిల్డ్ అయిన వధువుకు వరుడు కావలెను. 8142220475 [HA-1868]

కుల పట్టింపులేదు/రెండవ సంబంధం/ 26 Year 5'4" /B.Com / Pvt. Job/ 30000 PM / (2 Cr ప్రాపర్టీ) వెల్ సెటిల్డ్ అయిన వధువుకు వరుడు కావలెను. 8142220817 [HA-1868]

రజక BSc/ హార్టికల్చర్ Govt. గెజిటెడ్ ఆఫీసర్/ హార్టికల్చర్ Dept/ 50000/- pm / 5'4" ఎత్తు / 25 సం౹౹ల అందమైన వధువుకు వరుడు కావలెను. 9618008271 [HA-16438]

వాల్మీకి బోయ BTech / C. Govt. సైంటిస్ట్/ DRDO / 40000/- pm / 5'4" ఎత్తు / 25 సం౹౹ల అందమైన వధువుకు వరుడు కావలెను. 9618007823 [HA-16438]

కుల పట్టింపులేదు/ విడో/ 35/5'4"/ ఇంటర్ /ఓన్ ఫుట్‌వేర్ షాప్/ 30 వేలు pm / ఓన్ హౌస్ గల చాలా అందమైన వధువుకు వరుడు కావలెను. 8978894173/7032016291 [HA-16006]

శెట్టి బలిజ/విడో/37/5'5"/ ఇద్దరు పిల్లలు వధువుకు పిల్లలు లేని రెడ్డి/శెట్టి బలిజ వరుడు కావలెను. 8332802983/ 9154523559 [HA-16006]

కాపు/ 8 కోట్ల ఆస్తి/Hyd లో 4 సొంత ఇల్లులు/ ఇంటర్/5'6"/ FAIR / 24 సం౹౹ల ఏకైక అందమైన వధువుకు మధ్యతరగతి వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు (What's Up) 7993529832 [HA-691355]

రెడ్డి విడో/34/5'5"/Fair / MBA/ 15 కోట్ల ఆస్తి/ గోల్డ్ షాప్/3 LPM/ 2 సం౹౹ల పాప/ ఒంటరి వధువుకు కుల ప్రసక్తిలేని మధ్యతరగతి వరుడు కావలెను. పిల్లలున్నా సరే. 7993094820 [HA-691355]

చౌదరి/ కుల ఆస్తి ప్రసక్తి లేదు/35/5'5"/Fair / డిగ్రీ/ 12 కోట్ల / 25 ఎకరాల మామిడితోట/ ఫ్యామిలీని కోల్పోయిన ఒంటరి వధువుకు1వ, 2వ మ్యారేజ్ వరుడు కావలెను. (What's Up) 7702897398 [HA-691355]

రెడ్డి/25/5'5"/Fair / డిగ్రీ/ 10 కోట్ల స్థిరాస్తి/ 40 ఎకరాల ల్యాండ్/ యాక్సిడెంట్‌లో తండ్రిని కోల్పోయిన వధువుకు కుల ప్రసక్తి లేని మధ్య తరగతి వరుడు కావలెను. (What's Up) 9121736511 [HA-691355]

రెడ్డి: 23yrs / 5.4,B.Tech, 17 కోట్ల ఆస్థి, పేరెంట్స్ లేని అందమైన ఏకైక వధువుకు వరుడు కావలెను. Cont. 77021 50438 [B-435]

REDDY/ B.Tech / MBA / 25/ Very fair వధువుకు Govt. SWE above 1 lakh, well settled, handsum, age 30 yrs below వరుడు కావలెను. 91609 47999 (Direct) [B-469]

మాల, 23, B.Tech, వెరీ ఫెయిర్, ఒక్కతే కూతురు, 30కోట్లు ఆస్థి గల వధువుకి వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు. 73299 08700 nandhinimatrimony.45@gmail.com [G-597373]

రెడ్డి డైవర్సీ : కుల, మత, ధన పట్టింపు లేదు 30 కోట్ల ఆస్తి, A:29, H:5.3, Q : Degree, నెల కు 7 లక్షల సంపాదన కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను ఫోన్ : 7286906109 [P- 872912]

రాజులు/లేట్ మ్యారేజ్/29/5'5"/ఎయిర్‌పోర్టు జాబ్/12 కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకి కుల పట్టింపులేని వరుడు కావలెను. Ph: 8897055133. [H-693186]

యాదవ/31/5'4"/డైవర్సీ/డిగ్రీ/డెయిరీఫామ్/బిజినెస్‌లు 3 PM/Own House/Hyd/ అనంతపురంలో 10 కోట్ల ప్రాపర్టీ ఉన్న ఎవరులేని ఒంటరి వధువుకు FC/ BC 1వ, 2వ వరుడు కావలెను. Ph: 9063293160 [H-693186]

రెడ్డి/34/లేటు మ్యారేజ్/MBA/Own గోల్డ్‌షాపు బెంగుళూరు/బ్యాంక్ మేనేజర్/50,000/- కాకినాడలో, గుంటూరులో 13 కోట్ల ప్రాపర్టీ/ఒంటరి వధువుకు FC/BC 1వ, 2వ వరుడు కావలెను. (అర్జెంట్) Ph: 7794969946 [H-693186]

CNB/41/లేటు మ్యారేజ్/SC/5'4"/వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ/ఇల్లరికం అయినా OK మరియు * 57 సం౹౹ /విడో/5'1"/వెల్ సెటిల్డ్ ఇల్లరికం అయినా OK. Ph: 7702650243 [H-693186]

రెడ్డి/విడో/కుల, ధన ప్రసక్తి లేదు/35 కోట్ల ఆస్తి/34/5'5"/Qly: PG/Very Fair/నెలకు 20 లక్షల సంపాదన గల అందమైన వధువుకు వరుడు కావలెను. 7997651656. [H-693185]

★★

బ్రాహ్మణ/ 2nd Marriage / 32/5'4"/Infosys / Hyd * 31/5'2"/TCS/ Hyd * 25/ 5'4"/Amazon.com * 36/5 (Govt. Job) * 28/5/ BSc / Job Nil * 32/5'3"/USA * 36/5'/SBI * 9704656103 / 9533608887 [HA-19155]

బ్రాహ్మణ/35/5'4"/TCS/ Hyd * 31/5'/Infosys/ Hyd * 36/ 5' / Pvt.Job * 37/5'5"/ Wipro* 33/5'1" /Delloite, Hyd* 32/5'2"/IBM * 38/5'6"/GE/ Hyd * 9704656103 / 9533608887 [HA-19155]

వేదికలు



15 రోజులలో అన్నికులములకు 1వ, 2వ, లేట్, దేశ, విదేశ సంబంధాలకై వ్యక్తిగత శ్రద్ధతో "పెళ్ళిపుస్తకం" వివాహవేదిక సంప్ర. M. శ్రీనివాస్‌రెడ్డి (రిటైర్డ్ ఇంజనీర్) 9246201550 [HA-6405]

కుల పట్టింపులేని, అన్ని కులాల 1వ 2వ , లేటు, డైవర్సీ, విడో, విడోయర్స్, ఒంటరి, ఇల్లరికం, రిటైర్డ్, పెన్షనర్స్ & వెరీ రిచ్ మ్యాచెస్ 8500671845 (వాట్సాప్ నం. 9676453353) స్త్రీలకు ఫ్రీ [HA-16006]

కావ్యశ్రీ మ్యారేజ్ బ్యూరో. రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 1000/- మాత్రమే. 1వ, 2వ, లేట్ మ్యారేజ్ , డైవర్సీస్, విడో, విడోయర్స్, పెన్షనర్లుకు అన్ని కులాల వారికి సంబంధములు త్వరగా కుదర్చబడును. 9705782042 [HA-693963]

SC మాల హిందువులకు మాత్రమే. B.Tech/ M.Tech /IAS/IPS/ MBBS/MD/MCA/Abroad & Govt Job Holders సంప్ర౹౹ శ్రీలక్ష్మి మ్యారేజ్ బ్యూరో సాయిరాం. Ph: 8008988513, 9000919182. [H-595638]

మీ జీవితంలో ఒంటరిగా బాధపడుతున్నారా! జీవిత భాగస్వామి కావాలని కోరుకొంటున్నారా! కుల పట్టింపు లేని వారు 1వ/2వ/విడో/లేట్/పెన్షనర్స్ వ౹౹ 25-60 సం౹౹. సంప్ర: 8096731243. [H-693185]

Visit//www.amityalliances.com / Most popular marriage bureau for Telugu speaking educated people worldwide. Register FREE. [V- 5785]

★★

అతి తక్కువ సమయంలో మీకు తగిన మీరు కోరిన సం౹౹ కుదర్చబడును. రెడ్డి/కాపు/గౌడ/యాదవ/SC మాల, మాదిగ, క్రిస్టియన్స్ & ముస్లిం, ఇంజినీర్స్/ డాక్టర్స్ Govt. ఇతర జాబ్ హో౹౹ సంప్ర౹౹ 8801056724 [HA-691356]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు

సాక్షి పెళ్ళిచూపులు

Combined : 1430/- for 4 Lines, 385/- Extra Line
Andhra Pradesh: 990/- for 4 Lines (Incl. Hyd) 275/- Extra Line
Telangana : 880/- for 4 Lines (Incl. Hyd) 240/- Extra Line
* Color 25% Extra

నిజామాబాద్	: 99122 20764	తిరుపతి	: 99122 20584	తాడేపల్లి గూడెం	: 99122 20558
కరీంనగర్	: 9705933396	కడప	: 99516 02932	రాజమండ్రి	: 99122 20358
వరంగల్	: 99516 02868	అనంతపూర్	: 99122 20718	విజయవాడ	: 9912225442
నల్గొండ	: 95055 08382	కర్నూల్	: 99122 20575	గుంటూరు	: 99122 20349
మహబూబ్‌నగర్	: 99128 22811	శ్రీకాకుళం	: 99122 20343	ఒంగోలు	: 99122 25431
ఖమ్మం	: 99122 20596	విశాఖపట్నం	: 99122 20550	నెల్లూరు	: 99122 20736

మరియు మీ దగ్గరలోని సాక్షి ప్రాంతీయ కార్యాలయములలో సంప్రదించండి.

6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం. 1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34 Ph: 040-23256000 Ext: 6230 / 6235 Cell: 9912225456.

టీడీపీ దుర్మార్గాలను ఎదుర్కోవాలి

- అధికార పార్టీ తెగబడుతోంది..
- అమీతుమీకి మనమూ సిద్ధం కావాలి
- పార్టీ నేతల సమీక్షలో వైఎస్ జగన్

నంద్యాల నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: కర్నూలు జిల్లా నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికలో అధికార తెలుగుదేశం పార్టీ దుర్మార్గాలకు పాల్పడుతోందని, వారి కుట్రలను ఎండగట్టేందుకు పార్టీ నేతలు ఎప్పటికపు డు అప్రమత్తంగా ఉండి ప్రతిఘటించాలని వైఎస్సార్ కాంగ్రెస్ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ నేతలను కోరారు. శనివారం రాత్రి పల్లెల్లో ప్రచారం ముగించిన తర్వాత నంద్యాల పట్టణానికి చేరుకున్న అనంతరం వార్డుల వారీగా ఇన్‌చార్జిలుగా ఉన్న నేతలు, పార్టీ తరఫున ప్రచారం సాగిస్తున్న నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. 2019 సాధారణ ఎన్నికలకు ముందుగా జరుగుతున్న నంద్యాల ఉప ఎన్నిక ప్రతిష్టాత్మకమైందని, ఇందులో అధికార పార్టీ తీవ్ర అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని జగన్ అన్నారు. నంద్యాల ఉప ఎన్నికలు భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికలు కనుక పార్టీ శ్రేణులు కూడా అమీ తుమీ తేల్చుకునే విధంగా న్యాయబద్ధంగా గెలుపు కోసం కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. తాను స్వయంగా ఎంపిక చేసిన నాయకులను ఆయా వార్డులు, ప్రాంతాలకు ఇన్‌చార్జిలుగా ఎంతో నమ్మకంతో నియమించానని.. వారందరూ తన అంచనాలకు అనుగుణంగా పని చేయాలని కోరారు. మొత్తం వార్డుల ఇంచార్జిలను మూడు గ్రూపులుగా విభజించి విడివిడిగా ఆయన చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల్లో నెలకొన్న పరిస్థితులు, పార్టీ గెలుపు కోసం ఇంకా తీసుకోవాల్సిన చర్యలపై జగన్.. వారితో లోతుగా సమీక్షిం చారు. అధికార పార్టీ ధనబలంతో ముందుకు వస్తోందని.. మనకున్నది ప్రజా బలమేనని, వారి అభిమానంతో మనం టీడీపీని ఎదుర్కోవాలని కూడా జగన్ ఈ సందర్భంగా సూచించారు. ఎన్నికల ప్రచారం జరిగే ఈ పది రోజులూ పార్టీ నేతలు తమకు అప్పగించిన బాధ్యతలను ఎలాంటి లోపాలు లేకుండా నిర్వర్తించి పార్టీ విశ్వాసాన్ని చూరగొనాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జగన్ రాజకీయ కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి, ఎంపీ పి.వి.మిధున్‌రెడ్డి, ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, నంద్యాల పార్టీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి, ఆయన సోదరుడు శిల్పా చక్రపాణిరెడ్డి పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా వాణి కేంద్రానికి వినిపిద్దాం

పీసీసీ చీఫ్ రఘువీరారెడ్డి

నూనెపల్లె: రాష్ట్రానికి ప్రత్యేక హోదా వాణిని కేంద్రానికి వినిపించేలా చేద్దామని పీసీసీ చీఫ్ రఘువీరారెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన క్విట్ ఇండియా యాత్ర శనివారం కర్నూలు జిల్లా నంద్యాలలో కొనసాగింది. ఈ సందర్భంగా రఘువీరా మాట్లాడుతూ.. రాష్ట్రానికి లబ్ధి చేకూర్చే ప్రత్యేక హోదాపై టీడీపీ నోరెత్తడం లేదని మండిపడ్డారు. ప్రత్యేక హోదా వస్తేనే అభివృద్ధి సాధ్యమని తెలిసినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాయలసీమకు చెందిన చంద్రబాబు కోస్తాంధ్రకు మాత్రమే పరిమితమై.. మిగిలిన ప్రాంతాలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. రాయలసీమ కరువుతో అల్లాడుతుంటే పట్టిసీమ అంటూ కాలక్షేపం చేస్తున్నారని దుయ్యబట్టారు. రాయలసీమను విస్మరిస్తున్న చంద్రబాబుకు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు.

అయినవిల్లి విఘ్నేశ్వరుని సన్నిధిలో ఉమ్మడి హైకోర్టు జడ్జి

అయినవిల్లి: తూర్పు గోదావరి జిల్లా అయినవిల్లి విఘ్నేశ్వరస్వామిని ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి పీవీఎస్ఎస్ఎస్ రామారావు శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ ప్రధాన అర్చకులు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. రామారావును స్వామివారి శేష వస్త్రాలతో సత్కరించి, స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. జస్టిస్ రామారావు ఆలయంలో ఉప ఆలయాలను దర్శించి పూజలు చేశారు.



అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయంలో జడ్జి రామారావు

ఫలించిన 'దేవరపల్లి' పోరాటం

ఎట్టకేలకు కుంటలు పూడుస్తున్న ప్రభుత్వం

పర్చూరు: ప్రకాశం జిల్లా దేవరపల్లిలోని దళితుల భూముల్లో నీరు-చెట్టు పనుల పేరుతో తవ్వించిన కుంటలను ప్రభుత్వం ఎట్టకేలకు పూడుస్తోంది. శనివారం సాయంత్రం ఐదు పొక్లెయినర్ల సాయంతో కుంటలు పూడ్చడం మొదలుపెట్టింది. అధికార పార్టీ నేతల దుశ్చర్యను నిరసిస్తూ.. రెండు నెలలుగా దేవరపల్లి దళితులు పోరాటం చేస్తున్న సంగతి తెలిసిందే. వీరికి మద్దతుగా నిలిచిన వైఎస్సార్‌సీపీ నేతలు వైవీ సుబ్బారెడ్డి, బాలినేని శ్రీనివాసరెడ్డి, గొట్టిపాటి భరత్.. ఈ సమస్యను కేంద్ర స్థాయికి తీసుకెళ్లారు. దీంతో ప్రభుత్వం చేసేది లేక ఆ భూములను తిరగి దళితులకే అప్పగించింది. ఆ భూముల్లో తవ్విన కుంటలను కూడా పూడుస్తామని ఇటీవల హామీ ఇచ్చిన సర్కార్.. ఆ మేరకు చర్యలు తీసుకుంది.



తవ్విన కుంటలను పూడుస్తున్న దృశ్యం

కేంద్రం అభ్యంతరాలకు వివరణ ఇచ్చాం

'ఉపాధి' పై గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం అమలు తీరుపై కేంద్రం అభ్యంతరాలు తెలపడం నిజమేనని గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ అంగీకరించారు. అయితే కేంద్రం అభ్యంతరం తెలిపిన అంశాలకు వివరణ ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఒక నివేదిక పంపినట్లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 'జరిగిన పనికి ఎం బుక్‌లు లేవు.. కూలీలకిచ్చిన డబ్బులకు రశీదులు లేవు..' శీర్షికన శనివారం సాక్షిలో ప్రచురితమైన కథనంపై ఆయన వివరణ ఇచ్చారు. ఎం బుక్‌లో వేసిన పాస్ ఆర్డర్స్‌లో కొన్ని చోట్ల అధికారుల సంతకాలు లేని విషయాన్ని కేంద్ర ఆడిట్ బృందం నివేదికలో తప్పుపట్టారని.. ఆ పొరపాటు సరిదిద్దుకోవడం జరిగిందని పేర్కొన్నారు. పనులకు సంబంధించిన డిజైన్లను కొన్ని చోట్ల సిబ్బంది చూపించలేక పోయారని, అయితే ఈ డిజైన్లు ఎస్టిమేట్‌తో పాటు కంప్యూటర్‌లో ఉన్న విషయాన్ని కేంద్రానికి వివరించినట్లు పేర్కొన్నారు. కేంద్రం అభ్యంతరాలకు, రాష్ట్రానికి నిధుల విడుదలకు సంబంధం లేదని చెప్పారు. నిధుల విడుదలకు తగిన చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు.

ఉల్లి ధరల నియంత్రణకు చర్యలు తీసుకోండి: సీఎం

సాక్షి, అమరావతి: ఉల్లిధరల నియంత్రణకు వెంటనే చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రతి రైతు బజార్లో ఉల్లిపాయలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ధర పెరుగుదలపై వ్యవసాయ, పౌరసరఫరాలు, మార్కెటింగ్ శాఖల కమిషనర్లు, రైతుబజార్ సీఈవోలతో శనివారం సీఎం టెలీకాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. అవసరమైతే సబ్సిడీతో రైతు బజార్లలో ఉల్లిపాయలు విక్రయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో ఎక్కడైనా ఉల్లిపాయలు అక్రమ నిల్వలు ఉన్నట్లు తెలిస్తే దాడులు చేసి మార్కెట్లో అందుబాటులో తీసుకొచ్చేలా చూడాలన్నారు. ఉల్లిపాయల కొరత ఎక్కడుందో పరిశీలించి వెంటనే అక్కడకు సరుకు పంపించేందుకు ఏర్పాటు చేయాలన్నారు. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్‌ల నుండి ఉల్లిపాయలను సేకరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

గోమాతకు సీమంతం



గోమాతకు ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు

అ అంటే అమ్మ అని.. ఆ అంటే ఆవు అని చిన్నారులకు అక్షరాలు నేర్పుతుంటాం. అమ్మ తర్వాత అంతటి ప్రాశస్త్యం కలిగిన గోమాతకు పండుగలు, వ్రతాల సమయంలో విశిష్ట పూజలు చేస్తారు. అదేవిధంగా వైఎస్సార్ జిల్లా పాత కడపకు చెందిన పల్లా నరసింహులు పెంచుతున్న గోవుకు నిత్యం పూజలు చేస్తుంటారు. ప్రస్తుతం ఆ ఆవు చూడిదైంది (గర్భం దాల్చింది). సంప్రదాయం ప్రకారం మహిళలకు ఏ విధంగా అయితే సీమంతం చేస్తారో నరసింహులు తన కూతురులాగా భావించే గోమాతకు శనివారం సాయంత్రం సీమంతం చేశారు. గ్రామంలోని మహిళలందరు వచ్చి గోమాత చుట్టూ తిరుగుతూ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహులు మాట్లాడుతూ.. ఈ గోమాత చూడిదైన ప్రతిసారి కోడెదూడలే పుడుతున్నాయని తెలిపారు. వాటిని చాలా మంది కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారని చెప్పారు.

– కడప అగ్రికల్చర్

అప్పుల ఊబిలోకి పట్టణ పేదలు

- కేంద్రం మంజూరు చేసిన ఇళ్లతో రాష్ట్ర ప్రభుత్వం 'రియల్' వ్యాపారం
- పట్టణ ప్రాంతాల్లో పేదలకు 1.20 లక్షల ఇళ్లు కేటాయించిన కేంద్రం
- కేటగిరీల వారీగా విభజించి యూనిట్ ధర పెంచేసిన రాష్ట్ర ప్రభుత్వం
- బ్యాంకుల నుంచి లబ్ధిదారులు తీసుకునే అప్పు రూ. 4,860 కోట్లు
- లబ్ధిదారులు వాటాగా చెల్లించాల్సింది రూ. 545.49 కోట్లు



సాక్షి, అమరావతి: మూడున్నరేళ్లలో రాష్ట్రంలోని పేదలకు ఒక్క ఇంటినీ కొత్తగా నిర్మించని చంద్రబాబు ప్రభుత్వం.. ఇప్పుడు పట్టణ ప్రాంతాల్లో పేదలకు కేంద్రం మంజూరు చేసిన ఇళ్లను అడ్డం పెట్టుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారానికి దిగుతోంది. ఆ రియల్ ఎస్టేట్ వ్యాపారం ద్వారా నచ్చిన కాంట్రాక్టర్లకు ప్రయోజనంతో పాటు 'ముఖ్య' నేతకు కమీషన్లు దండిగా దక్కే వ్యూహం రచించారు. దీంతో పట్టణ పేదలు మాత్రం అప్పుల ఊబిలో చిక్కుకుపోనున్నారు. పేదలకు ఇళ్లను మంజూరు చేస్తే అందుకయ్యే 99 శాతం వ్యయాన్ని ఏ ప్రభుత్వమైనా సబ్సిడీ రూపంలో భరిస్తుంది. లబ్ధిదారులు నామమాత్రంగా ఒక శాతం మేర చెల్లిస్తారు. అయితే కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్ యోజన పేరుతో రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లోని పేదలకు మంజూరు చేసిన ఇళ్ల యూనిట్ వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం భారీగా పెంచేసింది. ఇప్పటి వరకు కేంద్రం మంజూరు చేసిన 1.20 లక్షల ఇళ్లను రాష్ట్ర ప్రభుత్వం మూడు కేటగిరీలుగా విభజించింది. ఆమేరకు రుణాలు మంజూరు చేయాలని బ్యాంకులకు ఆదేశించింది. జి ప్లస్ త్రీ తరహాలో నిర్మించే ఇళ్లకు లబ్ధిదారులు ఎంత చెల్లించాలి, బ్యాంకులు ఎంత రుణం ఇవ్వాలనే పట్టికను రాష్ట్ర ప్రభుత్వం రూపొందించింది. 1.20 లక్షల ఇళ్ల కోసం ఏకంగా రూ. 4,860.99 కోట్ల మేర పట్టణ పేదలు అప్పు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తేల్చింది. అంతే కాకుండా పట్టణ పేద లబ్ధిదారుల వాటా కింద రూ. 545.49 కోట్లు చెల్లించాలని తేల్చింది. సాధారణంగా అయితే పట్టణ ప్రాంతాల్లో పేదల ఒక్కో ఇంటికి కేంద్రం రూ. 1.50 లక్షలు సబ్సిడీగా భరిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా అంతే మొత్తం సబ్సిడీగా ఇస్తోంది. ఈ రూ. 3 లక్షలతో ఒక్కో ఇంటిని పేదల కోసం నిర్మించాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా కమీషన్ల కోసం కేటగిరీల వారీగా విభజించి యూనిట్ ధరను భారీగా పెంచేసింది.

ప్రభుత్వ తీరు దుర్మార్గం..

యూనిట్ ధర పెంచడంతో పేదలు అప్పుల ఊబిలోకి కూరుకుపోతారనే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం చేయకపోవడం దుర్మార్గమని విమర్శలు వినిపిస్తున్నాయి. పెద్ద మొత్తంలో రుణాలను మంజూరు చేయాలంటే సంబంధిత ఇళ్ల స్థలాలపై లబ్ధిదారులకు హక్కు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి బ్యాంకులు చెప్పాయి. ఆ హక్కు కల్పించే స్థలాలను గ్యారెంటీగా పెట్టుకుని రుణాలు మంజూరు చేస్తామని స్పష్టం చేశాయి. ఇలాచేస్తే రుణ రికవరీకి తమకు భరోసా కలుగుతుందని బ్యాంకులు స్పష్టం చేశాయి. పేదలను ఇళ్ల పేరుతో అప్పుల ఊబిలోకి నెట్టేసి నిర్మాణ సంస్థల ప్రయోజనాల కోసం ప్రభుత్వ పెద్దలు ఈ విధంగా చేయడం అన్యాయమని ఉన్నతాధికారి ఒకరు వ్యాఖ్యానించారు.

పట్టణ ప్రాంతాల్లోని పేదలకు మంజూరు చేసిన ఇళ్లకు ఎవరు ఎంత చెల్లించాలనే వివరాలు ఈ విధంగా ఉన్నాయి

కేటగిరి	ఇళ్ల సంఖ్య	ఒక్కో ఇంటి వ్యయం	కేంద్ర సబ్సిడీ	రాష్ట్ర సబ్సిడీ	లబ్ధిదారు వాటా	లబ్ధిదారుల అప్పు
ఒకటవ	24,190	6.40 లక్షలు	362.85	326.85	1.21	821.25
రెండవ	84,665	7.60 లక్షలు	1,269.97	1,269.97	423.33	3,471.27
మూడవ	12,095	8.70 లక్షలు	181.42	181.42	120.95	568.47
మొత్తం	1,20,950	----	1,814.24	1,814.24	545.49	4,860.99 (కోట్లలో)

విద్య — శ్రద్ధావాన్ లభతే జ్ఞానం
నేటి విద్యలో..
- జనరల్ స్టడీస్: పాలిటీ
- బ్యాంక్ పీవోస్, క్లర్క్స్: జనరల్ అవేర్‌నెస్

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన ఈ-మెయిల్
sakshieducation@gmail.com


దరఖాస్తు చేశారా?

- రూరల్ బ్యాంకుల్లోని 15,337 పోస్టుల భర్తీకి నిర్వహించే ఐబీపీఎస్ సీఆర్‌పీ ఆర్ఆర్‌బీకి చివరి తేదీ: ఆగస్టు 14
- కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్‌లో 30 ప్రొబేషనరీ అసిస్టెంట్ పోస్టులకు చివరి తేదీ: ఆగస్టు 14
- ఎస్ఎస్‌సీ ద్వారా భర్తీ చేయనున్న 1,102 సైంటిఫిక్ అసిస్టెంట్ (భారత వాతావరణ విభాగం) పోస్టులకు చివరి తేదీ: ఆగస్టు 14

గ్రూప్-1 మెయిన్స్-ప్రశ్నలు

ఎగ్జామ్ గైడెన్స్

త్వరలో ప్రారంభంకానున్న ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ పాలిటీ మోడల్ ప్రశ్నలు..



1. The constitution of India is a bag of borrowed materials. ***Critically examine.***
2. The Preamble reflects the basic philosophy of the constituion. ***Explain.***
3. Parliamentary form of government is the negation of theory of separation of powers. ***Comment.***
4. 'Bicameral legislature would prevent hasty and ill considered legislation.' ***Discuss.***
5. *Enumerate*.. the special powers of Rajya Sabha.
6. Judiciary is the custodian of the constitution. ***Examine.***
7. ***Discuss*** the recommendations of Sarkaria Commission and Punchhi Commission relating to the office of Governor.
8. The Comptroller and Auditor General (C&AG) is "the friend, philosopher and guide" of the Parliament. ***Examine.***
9. India is moving towards Cooperative and Competitive Federalism. ***Do you agree?***
10. ***Examine*** the role being played by Niti Aayog in restoring the balance between the Union and the States.
11. As recommended by the Second Administrative Reforms Commission, the selection process of the members of the Election Commission should be made more transparent.. ***Discuss.***
12. The People's Representation Act is to be amended to decriminalise politics. ***Elaborate.***
13. NOTA and VVPAT are good initiatives to strengthen electoral democracy. ***Discuss.***
14. 73rd and 74th Constitutional Amendment Acts aim at strengthening democracy at grass root level. ***Comment.***
15. Amrut and SMART City Programmes aim at creating a dynamic urban India. ***Elaborate.***
16. The increasing regional and subregional sentiments resulting in parochilisation of politics. ***Examine.***
17. The SC, ST Atrocities (Prevention) Act failed to prevent atrocities against these vulnerable sections of the society. What measures do you suggest to make it more effective?
18. Rajinder Sachar Committe's Recommendations are to be implemented in letter and spirit to ameliorate the conditions of Muslim Minorities. ***Explain.***
19. Discuss the various measures initiated for the empowerment of Women?
20. RTI Act is a powerful tool to make the government functioning transparent. ***Examine.***
21. NHRC is playing a commendable role in upholding the peoples basic rights. ***Comment.***
22. Lokpal institution is yet to see the light. ***Elaborate.***



డా॥ బి.జె.బి. కృపాదానం
సివిల్స్ సీనియర్ ఫ్యాకల్టీ

పట్టణీకరణ- ప్రభుత్వ పథకాలు

జనరల్ ఎస్సే

పోటీ పరీక్షల ప్రత్యేకం

స్వాతంత్ర్యానంతరం మిశ్రమ ఆర్థిక వ్యవస్థను అనుసరిస్తున్న భారతదేశంలో ప్రైవేటు రంగ అభివృద్ధితో పట్టణీకరణ వేగవంతమైంది. ఫలితంగా 1901లో దేశ జనాభాలో 11.4 శాతం ఉన్న పట్టణ జనాభా.. 2001 నాటికి 28.53 శాతానికి, 2011 నాటికి 31.16 శాతానికి పెరిగింది. ప్రపంచ బ్యాంకు అంచనా ప్రకారం 2050 నాటికి ప్రపంచ పట్టణ జనాభాలో అధిక శాతం భారత్, చైనా, ఇండోనేషియా, నైజీరియా, అమెరికా వంటి దేశాల్లోనే ఉండగలదు.




20వ శతాబ్దంలో ముంబైకి వలసలు ఎక్కువయ్యాయి. 2011 ప్రాథమిక లెక్కల ప్రకారం అధిక పట్టణ జనాభాకు సంబంధించి ముంబై (1,84,14,288)ప్రథమ స్థానంలో ఉండగా; ఢిల్లీ, కోల్‌కతా, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ తర్వాత స్థానాల్లో నిలిచాయి.

పట్టణ జనాభా పెరుగుదలకు కారణాలు

1. రెండో ప్రపంచ యుద్ధం ఫలితంగా ప్రభుత్వ సేవల విస్తరణ.
2. దేశ విభజన సమయంలో ప్రజల వలసలు పెరగడం.
3. పారిశ్రామిక విప్లవం.
4. ప్రపంచీకరణ నేపథ్యంలో ఆర్థిక అవకాశాలు పెరగడం.
5. 11వ పంచవర్ష ప్రణాళిక.. ఆర్థికాభివృద్ధి, పట్టణీకరణలను లక్ష్యంగా ఎంచుకోవడం.
6. పట్టణ ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాలు పెరగడం.
7. 1991 తర్వాత కాలంలో ప్రైవేటు రంగ అభివృద్ధి.
8. వ్యవసాయ రంగ సంక్షోభం.
9. పారిశ్రామిక, సేవా రంగాల అభివృద్ధి.
10. జీవన ప్రమాణం అధికంగా ఉండటం; విద్య, ఆరోగ్య సౌకర్యాల అందుబాటు.
11. పట్టణ ప్రాంతాల్లో సమాచార సౌకర్యాల అభివృద్ధి

పట్టణ సేవలు – ముఖ్య సూచికలు

- 2011 లెక్కల ప్రకారం తాగునీటి సరఫరాకు సంబంధించి భారతదేశంలో 70.6 శాతం మంది పట్టణ ప్రజలు వ్యక్తిగత కనెక్షన్లు కలిగి ఉండగా, చైనాలో 91 శాతం, దక్షిణాఫ్రికాలో 86 శాతం, బ్రెజిల్‌లో 80 శాతం మంది పట్టణ ప్రజలు వ్యక్తిగత కనెక్షన్లు కలిగి ఉన్నారు. నీటి సరఫరా కాలవ్యవధి భారత నగరాల్లో 1–6 గంటలు కాగా; చైనా, బ్రెజిల్‌లో 24 గంటలుగా, వియత్నాంలో 22 గంటలుగా ఉంది.
- భారతదేశంలోని 4,861 నగరాలు, పట్టణాల్లో పారిశుద్ధ్య సౌకర్యం పాక్షికంగా ఉంది. 2011 లెక్కల ప్రకారం భారత్‌లోని 13 శాతం పట్టణ కుటుంబాలకు ఎలాంటి మరుగుదొడ్డి సౌకర్యం లేదు.
- భారతదేశ ప్రజా రవాణాలో పట్టణ రవాణా వాటా 27 శాతం. 1951లో మొత్తం ప్రజా రవాణా వాహనాల్లో పట్టణ ప్రజా రవాణా వాహనాల వాటా 11 శాతం కాగా, 2001లో 1.1 శాతం తగ్గింది. 2009లో 0.5 మిలియన్ జనాభా కంటే తక్కువ కలిగిన 85 నగరాల్లోని 20 నగరాల్లో మాత్రమే బస్ సర్వీస్ ఉంది.
- గృహ కొరత ప్రాజెక్టుల అంచనాపై ఏర్పాటుచేసిన సాంకేతిక కమిటీ అభిప్రాయంలో (2012 నాటికి) పట్టణ ప్రాంతాల్లో నివాస యూనిట్ల కొరత 18.78 మిలియన్లుగా ఉంది. అంచనా వేసిన మురికివాడల్లో నివసించే జనాభా 2012లో 94.98 మిలియన్లు. జేఎన్ఎన్‌యూఆర్ఎం కింద ఏడేళ్ల కాలంలో 1.6 మిలియన్ నివాస యూనిట్లను మాత్రమే మంజూరు చేశారు. ప్రైవేటు రంగం అందించే సౌకర్యవంతమైన సరసమైన హౌసింగ్ ప్రాజెక్టులు సైతం సరిపోయిన స్థాయిలో లేవు.



పట్టణాభివృద్ధి కార్యక్రమాలు

స్మార్ట్ సిటీస్ మిషన్: కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ సిటీస్ మిషన్‌ను 2015, జూన్‌లో ప్రారంభించింది. సుస్థిర, సమ్మిళిత నగరాలను ప్రోత్సహించడం ఈ మిషన్ ముఖ్య లక్ష్యం. తద్వారా ఆయా నగరాల్లో నివసించే ప్రజలకు మౌలిక సౌకర్యాలతో పాటు పరిశుభ్ర, సుస్థిర పర్యావరణం, నాణ్యమైన జీవన ప్రమాణాలు అందుబాటులోకి వస్తాయి. స్మార్ట్ సిటీల ఏర్పాటు ద్వారా సరిపోయినంత నీటి సరఫరా, నిరంతర విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్య సౌకర్యాలు, పటిష్ట ప్రజా రవాణా వ్యవస్థ, సరసమైన నివాస సదుపాయం (పేదలకు), ఐటీ అనుసంధానత, డిజిటలైజేషన్, గుడ్ గవర్నెన్స్, ప్రత్యేక ఈ–గవర్నెన్స్, పౌరుల భాగస్వామ్యం, సుస్థిర పర్యావరణం; రక్షణ, భద్రత; మహిళలు, పిల్లలు, వృద్ధులకు ఆరోగ్య, విద్యా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి. స్మార్ట్ సిటీ ప్రణాళికల కింద మొత్తం 60 నగరాల్లో రూ.1,44,742 కోట్ల పెట్టుబడిని ప్రతిపాదించగా, ఈ మొత్తంలో గుర్తించిన ప్రాంతాల పునర్నిర్మాణానికి (ప్రాంతాల ఆధారిత ప్రాజెక్టులు) రూ.1,05,024 కోట్లు, నగర వ్యాప్త స్మార్ట్ కార్యక్రమాలకు (initiatives) రూ.39,718 కోట్ల వ్యయాన్ని ప్రతిపాదించారు. 2017, జూన్ 23 నాటికి మొత్తం 100 నగరాల ప్రతిపాదనకు 90 నగరాలు స్మార్ట్ సిటీ చాలెంజ్ హోదా కింద ఎంపికయ్యాయి. వీటిలో న్యూటౌన్, కోల్‌కతా స్మార్ట్ సిటీ చాలెంజ్ హోదాను విరమించుకోగా స్మార్ట్ సిటీ మిషన్ కింద 89 నగరాలు భాగమయ్యాయి. సూరత్, పుణె, అహ్మదాబాద్, జబల్‌పూర్, ఉదయ్‌పూర్ స్మార్ట్ సిటీ అమలు కార్యక్రమంలో ముందంజలో ఉన్నాయి.

> - 2011 లెక్కల ప్రకారం తాగునీటి సరఫరాకు సంబంధించి భారతదేశంలో 70.6 శాతం మంది పట్టణ ప్రజలు వ్యక్తిగత కనెక్షన్లు కలిగి ఉన్నారు.
> - సూరత్, పుణె, అహ్మదాబాద్, జబల్‌పూర్, ఉదయ్‌పూర్ స్మార్ట్ సిటీ అమలు కార్యక్రమంలో ముందంజలో ఉన్నాయి.
> - ఆసియా అభివృద్ధి బ్యాంకు ఆర్థిక సహకారంతో కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఈశాన్య ప్రాంత పట్టణాభివృద్ధి కార్యక్రమాన్ని చేపట్టింది.



అమృత్: Atal Mission for Rejuvenation and Urban Transformation కింద పేద, నిర్లక్ష్యానికి గురైన వర్గాలకు మంచినీటి సరఫరా, పారిశుద్ధ్య సౌకర్యాల కల్పనతోపాటు పట్టణ రవాణా, పట్టణ ప్రజల జీవన నాణ్యతను పెంపొందిస్తారు. ఈ పథకాన్ని 2015 జూన్‌లో ప్రారంభించారు. 2015–16 ఫిబ్రవరి నుంచి 2019–20 ఫిబ్రవరి వరకు అమృత్ పథకం మొత్తం వ్యయాన్ని రూ.50,000 కోట్లుగా అంచనా వేశారు. ఇది కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకంగా అమలవుతోంది. దీన్ని నోటిఫై చేసిన లక్ష జనాభాకు పైనున్న 500 నగరాలు/పట్టణాల్లో అమలుచేస్తున్నారు. అమృత్ పథకం కింద మహారాష్ట్రలో 37, గుజరాత్‌లో 31, కర్ణాటకలో 21, ఆంధ్రప్రదేశ్‌లో 31, రాజస్థాన్‌లో 30, పశ్చిమ బెంగాల్‌లో 28, బిహార్‌లో 27, ఒడిశాలో 19, తెలంగాణలో 15 నగరాలను గుర్తించారు. 2017–18 కేంద్ర బడ్జెట్‌లో అమృత్, స్మార్ట్ సిటీస్ మిషన్ పథకాలకు రూ.9,000 కోట్లు కేటాయించారు.

స్వచ్ఛ భారత్ మిషన్: బహిరంగ మలవిసర్జన నుంచి పట్టణాలకు విముక్తి కల్పించి దేశంలోని 4041 statutory పట్టణాల్లో 100 శాతం సైంటిఫిక్ మేనేజ్‌మెంట్ ఆఫ్ వేస్ట్ సాధించే క్రమంలో 2014, అక్టోబర్ 2న స్వచ్ఛ భారత్ మిషన్‌ను ప్రారంభించారు. గృహ, పబ్లిక్ మరుగుదొడ్ల ఏర్పాటు, ఘన వ్యర్థాల నిర్వహణ స్వచ్ఛ భారత్ మిషన్‌లో ముఖ్యాంశాలుగా ఉన్నాయి. 2017–18 బడ్జెట్‌లో స్వచ్ఛ భారత్ మిషన్‌కు రూ.16,248 కోట్లు కేటాయించారు.

స్వచ్ఛ భారత్ మిషన్ లక్ష్యాలు

ఎ. 66.42 లక్షల వ్యక్తిగత కుటుంబ మరుగుదొడ్ల నిర్మాణం.
బి. 2.52 లక్షల కమ్యూనిటీ మరుగుదొడ్ల సీట్ల నిర్మాణం.
సి. 2.56 లక్షల పబ్లిక్ టాయిలెట్ సీట్ల నిర్మాణం.
డి. సైంటిఫిక్‌గా మున్సిపల్ ఘన వ్యర్థాల నిర్వహణ.

హృదయ్: కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ హెరిటేజ్ సిటీ డెవలప్‌మెంట్ అండ్ అగ్‌మెంటేషన్ యోజన (హృదయ్)ను 2015, జనవరి 1న ప్రారంభించింది. ఈ పథకం వారసత్వ నగరాల అభివృద్ధిపై దృష్టిసారిస్తుంది. 2017, మార్చి నాటికి రూ.500 కోట్ల వ్యయంతో గుర్తించిన 12 నగరాల్లో ఈ పథకాన్ని అమలుచేస్తున్నారు. అజ్మీర్, అమరావతి, అమృత్‌సర్, బాదామి, ద్వారక, గయ, కాంచీపురం, మధుర, పూరి, వారణాసి, వేలాంకణి, వరంగల్ నగరాలు హృదయ్ పథకానికి ఎంపికయ్యాయి. ఈ నగరాల్లో హెరిటేజ్ మౌలిక సౌకర్యాల ప్రాజెక్టుల అభివృద్ధికి ఈ పథకం తగిన చేయూత ఇస్తుంది.



ఎన్ఈఆర్‌యూడీపీ–ఈశాన్య ప్రాంత పట్టణాభివృద్ధి కార్యక్రమం: ఆసియా అభివృద్ధి బ్యాంకు ఆర్థిక సహకారంతో కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఈశాన్య ప్రాంత పట్టణాభివృద్ధి కార్యక్రమాన్ని చేపట్టింది. దీనికి అయ్యే మొత్తం వ్యయంలో 70 శాతాన్ని ఆసియా అభివృద్ధి బ్యాంకు భారత ప్రభుత్వానికి రుణంగా ఇస్తుంది. అగర్తలా (త్రిపుర), ఐజ్వాల్ (మిజోరాం), గ్యాంగ్‌టక్ (సిక్కిం), కోహిమా (నాగాలాండ్), ఇటానగర్ (అరుణాచల్‌ప్రదేశ్)లో ఈ కార్యక్రమాన్ని అమలు చేశారు. నీటి సరఫరా, పారిశుద్ధ్య సౌకర్యాల కల్పన, సంస్థాగత, ఫైనాన్షియల్ సంస్కరణలు వంటి కీలక పట్టణ సేవలు ఈ కార్యక్రమం పరిధిలో ఉంటాయి. ఈ కార్యక్రమ వ్యయాన్ని రూ.1371 కోట్లుగా అంచనా వేశారు.

ప్రధానమంత్రి ఆవాస్ యోజన



- పట్టణ ప్రాంత పేదలకు గృహ సదుపాయం అందించేందుకు 2015, జూన్‌లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 2022 నాటికి పట్టణ ప్రాంతాల్లోని ఆర్థికంగా వెనుకబడిన, బలహీన, అల్పాదాయ వర్గాల వారికి 2 కోట్ల గృహాలను నిర్మించడమే ఈ పథకం ప్రధాన లక్ష్యం. ఈ పథకం కింద లబ్ధిదారుల గరిష్ట వయసు 70 ఏళ్లు. ఆర్థికంగా వెనుకబడిన, బలహీన వర్గాలకు చెందిన వారి వార్షికాదాయం రూ.3 లక్షల కంటే తక్కువగా, అల్పాదాయ వర్గాల వార్షిక ఆదాయం రూ.3,00,001 నుంచి రూ.6,00,000 మధ్య ఉండాలి. 2016 ఏప్రిల్ నాటికి 6,83,724 గృహాల నిర్మాణానికి 439.22 బిలియన్ రూపాయల పెట్టుబడికి ప్రభుత్వం అంగీకరించింది. ఈ మొత్తంలో కేంద్రం సహాయం 100.50 బిలియన్ రూపాయలు. ప్రభుత్వం ఈ క్రెడిట్ లింక్ సబ్సిడీ పథకం కింద 20 ఏళ్ల వరకు లబ్ధిదారుల గృహ రుణాలకు సంబంధించి 6.5 శాతం వడ్డీ సబ్సిడీని అందిస్తుంది.
- పట్టణ పేదల గృహ నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం 2016, ఏప్రిల్ 25 నాటికి వివిధ రాష్ట్రాల్లోని నగరాలను/పట్టణాలను గుర్తించింది. వీటిలో ఛత్తీస్‌గఢ్‌లో 1000, గుజరాత్‌లో 30, జమ్మూకశ్మీర్‌లో 19, జార్ఖండ్‌లో 15, కేరళలో 15, మధ్యప్రదేశ్‌లో 74, ఒడిశాలో 42 నగరాలు/పట్టణాలు ఉన్నాయి.
- పట్టణ పేదరిక నిర్మూలన మంత్రిత్వ శాఖ పట్టణ పేదరికం, హౌజింగ్, ఉపాధి కార్యక్రమాలను పర్యవేక్షిస్తుంది. ఈ శాఖ జాతీయ విధాన నిర్ణయాల్లో పాలుపంచుకోవడంతోపాటు కేంద్ర మంత్రిత్వ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాలను సమన్వయం చేస్తుంది. దీంతోపాటు నేషనల్ బిల్డింగ్స్ ఆర్గనైజేషన్, హడ్కోలపై పరిపాలన నియంత్రణ కలిగి ఉంది. చట్టబద్ధత కలిగిన కింది స్వయంప్రతిపత్తి సంస్థలు ఈ శాఖ పర్యవేక్షణలో ఉంటాయి.

1. బిల్డింగ్ మెటీరియల్స్ అండ్ టెక్నాలజీ ప్రమోషన్ కౌన్సిల్ (బీఎంటీపీసీ).
2. సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ హౌజింగ్ ఆర్గనైజేషన్ (సీజీఈడబ్ల్యూహెచ్‌వో).
3. నేషనల్ కో–ఆపరేటివ్ హౌజింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌సీహెచ్ఎఫ్).
4. ప్రిన్సిపల్ అకౌంట్స్ కార్యాలయాలు.





డా॥ తమ్మా కోటిరెడ్డి
ప్రొఫెసర్, ఐబీఎస్,
హైదరాబాద్

వాతావరణ అధ్యయన బెలూన్లలో ఉపయోగించేది?

జడవాయువులు

ఆవర్తన పట్టికలో చివరి గ్రూపునకు (18వ గ్రూపు) చెందిన మూలకాలకు రసాయన జడత్వాన్ని ప్రదర్శించే ధర్మం ఉంటుంది. అందువల్ల వీటిని 'జడవాయువులు' అంటారు. ఈ మూలకాలున్న గ్రూపును 'సున్నా గ్రూపు' అని కూడా అంటారు.

- **జడవాయువులు:** ఇవి మొత్తం ఆరు మూలకాలు. అవి: హీలియం, నియాన్, ఆర్గాన్, క్రిప్టాన్, గ్జినాన్, రేడాన్. వీటిలో చివరిదైన రేడాన్ తప్ప మిగిలినవన్నీ వాతావరణంలో అత్యల్ప పరిమాణంలో ఉంటాయి. అందువల్ల వీటిని 'విరళ వాయువులు' (Rare gases) అని కూడా అంటారు. ఆవర్తన పట్టికలో ప్రతి పీరియడ్ జడవాయు మూలకంతో అంతమవుతుంది. వీటి బాహ్య కక్ష్యలు పూర్తిగా ఎలక్ట్రాన్లతో నిండి ఉంటాయి. ఈ మూలకాలకు ఏమాత్రం చర్యాశీలత ఉండదు. అందువల్ల వీటిని 'ఉత్కృష్ట వాయువులు' అని కూడా అంటారు. రేడాన్ అనేది రేడియోధార్మిక మూలకం.
- **ఆవిష్కరణ:** జడవాయువుల ఆవిష్కరణ ఒక్కరోజులో జరిగింది కాదు. దీనికి ఒక శతాబ్దకాలం పట్టింది. వీటి ఆవిష్కరణ చాలా వైవిధ్యంగా జరిగింది. నామకరణం విషయంలోనూ ప్రత్యేకతలున్నాయి. రామ్సే, రేలీ అనే శాస్త్రవేత్తలు సమగ్ర అధ్యయనం జరిపి, జడవాయువులను ఆవిష్కరించారు. వీటిపై చేసిన పరిశోధనకుగాను వీరికి నోబెల్ బహుమతి కూడా లభించింది.
- 1868లో సంపూర్ణ సూర్య గ్రహణం ఏర్పడినప్పుడు, సూర్యుని క్రోమోస్ఫియర్‌పై పరిశోధన జరిపి జన్‌సెన్, లాకియర్ అనే శాస్త్రవేత్తలు కొత్త మూలకాన్ని కనుగొన్నారు. దీనికి 'హీలియం' అని పేరు పెట్టారు. Helios అంటే సూర్యుడు అని అర్థం.
- 1785లో గాలిలోని అనుఘటక వాయువులను వేరుచేస్తూ దేనితోనూ చర్య జరపని ఒక వాయువు గురించి పేర్కొన్నారు. ఒక శతాబ్దం తర్వాత 1891లో రేలీ అనే శాస్త్రవేత్త వాతావరణంలోని నైట్రోజన్‌లో ఈ కొత్త వాయువును కనుగొన్నాడు. దీనికి 'ఆర్గాన్' అని పేరు పెట్టాడు. Argon అంటే సోమరి అని అర్థం.
- మిగిలిన జడవాయువులను కూడా వాతావరణంలోని నైట్రోజన్ నుంచే వేరు చేశారు. నియాన్‌ను రామ్సే, ట్రావెర్స్; క్రిప్టాన్, గ్జినాన్‌లను రామ్సే కనుగొన్నారు. Neon అంటే 'కొత్త' Krypton అంటే 'దాగి ఉన్న', Xenon అంటే 'పరిచయం లేనిది' అని అర్థం. 1900లో రేడియోధార్మిక రేడియో విఘటనం చెందితే రేడాన్ వాయువు వస్తుందని రామ్సే తెలిపాడు.
- రేడాన్ తప్ప మిగిలిన వాయువులు స్వేచ్ఛా స్థితిలో నక్షత్రాల్లో, భూ వాతావరణంలో, గాలిలో, కొన్ని ఖనిజాల్లో అంతర్బంధిత స్థితిలో ఉంటాయి.
- గాలిలో ఎక్కువ పరిమాణంలో ఉండే జడవాయువు ఆర్గాన్, అత్యల్ప పరిమాణంలో ఉండేది హీలియం.
- **ద్రవ హీలియం ప్రత్యేకత:** హీలియంను 1 అట్మాస్ఫియర్ పీడనం వద్ద 2.2 K (– 270.8 °C) ఉష్ణోగ్రతకు చల్లబరిస్తే 'హీలియం–II' అనే ద్రవరూప హీలియం లభిస్తుంది. దీని స్నిగ్ధత చాలా తక్కువ. ఇది అన్ని ద్రవాల్లా కిందికి ప్రవహించడానికి బదులుగా గురుత్వాకర్షణ శక్తికి వ్యతిరేకంగా పాత్ర గోడలపైకి ఎగబాకుతుంది.

జడవాయువుల ఉపయోగాలు

- **హీలియం:** ఇది హైడ్రోజన్ తర్వాత అత్యంత తేలికైన వాయువు. ఆవర్తన పట్టికలో రెండో స్థానాన్ని (పరమాణు సంఖ్య 2, ద్రవ్యరాశి సంఖ్య 4) ఆక్రమిస్తుంది.
- హీలియం వాయువుకు మండే గుణం లేదు (దహనశీలి కాదు). కాబట్టి దీన్ని వాతావరణ అధ్యయనానికి ఉపయోగించే బెలూన్లలో హైడ్రోజన్‌కు బదులు వాడతారు.

కాంపిటీటివ్ గైడెన్స్
జనరల్ సైన్స్

- సముద్రాల్లో లోతుకు వెళ్లే గజ ఈతగాళ్లు (Deep Sea Divers) శ్వాస కోసం వాడే ఆధునిక పరికరాల్లో గాలి స్థానంలో 80 శాతం హీలియం, 20 శాతం ఆక్సిజన్ మిశ్రమాన్ని ఉపయోగిస్తారు. సహజ గాలిలో ఉండే నైట్రోజన్, సముద్ర లోతుల్లో ఉండే అధిక పీడనాల వద్ద రక్తంలో కరిగి బెండ్స్ (Bends)ను కలుగజేస్తుంది. అందువల్ల దీన్ని ఉపయోగించరు.
- ఉబ్బసం (ఆస్తమా) వ్యాధిగ్రస్థులు ఉపశమనం కోసం హీలియం, ఆక్సిజన్‌ల మిశ్రమాన్ని వాడతారు.
- పరమశూన్య ఉష్ణోగ్రత (0 K లేదా – 273 °C) వద్ద పరిశోధనలు చేయడానికి, అల్ప ఉష్ణోగ్రతలను పొందడానికి ద్రవ హీలియాన్ని క్రయోజనిక్ ద్రవంగా వాడతారు.
- అల్ప ఉష్ణోగ్రతలను కొలిచే థర్మామీటర్లలో హీలియంను ఉపయోగిస్తారు.
- న్యూక్లియర్ రియాక్టర్లలో ఉష్ణ బదిలీ కోసం ఇది మాధ్యమంగా ఉపయోగపడుతుంది.
- విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో హీలియంను ఉపయోగిస్తారు.
- చర్యాశీలత ఉన్న మెగ్నీషియం వంటి లోహాల తయారీలో, అత్యధిక ఉష్ణోగ్రతల వద్ద అల్యూమినియం, స్టెయిన్ లెస్ స్టీలు వంటి వాటిని వెల్డింగ్ చేసేటప్పుడు జడ వాతావరణాన్ని కల్పించడానికి హీలియం వాయువును వాడతారు (అధిక ఉష్ణోగ్రతల వద్ద గాలిలోని నైట్రోజన్, ఆక్సిజన్‌తో చర్య జరుపుతుంది).
- **నియాన్:** అల్ప పీడనాల వద్ద నియాన్ బల్బులు ముదురు ఎరుపు రంగు కాంతిని వెలువరుస్తాయి. ఈ కాంతి పొగమంచు నుంచి కూడా చొచ్చుకొని పోతుంది.
- దీన్ని సిగ్నల్ లైట్లలో, ఓడరేవుల్లో, బెకన్ లైట్లలో, విమానాశ్రయాల్లో పైలట్లకు దారిచూపే దీపాలుగా ఉపయోగిస్తారు.
- దీనికి అధిక వోల్టేజీని తట్టుకునే సామర్థ్యం ఉంటుంది కాబట్టి రెక్టిఫయర్లలో వాడతారు.
- **ఆర్గాన్:** వెల్డింగ్‌లు చేసేటప్పుడు జడ వాతావరణాన్ని కల్పించడానికి దీన్ని ఉపయోగిస్తారు.
- టంగ్‌స్టన్ ఫిలమెంట్ బల్బుల్లో జడ వాతావరణాన్ని కల్పించడానికి (ఆక్సిజన్ ఉంటే ఫిలమెంట్ మండి కాలిపోతుంది) వాడతారు.
- ఉత్సర్గ నాళికల్లో, గైగర్ ముల్లర్ కౌంటర్ ట్యూబుల్లోనూ వినియోగిస్తారు.
- **క్రిప్టాన్:** గని కార్మికుల టోపీ లైట్లలో (మైనర్స్ క్యాప్‌లలో) వాడతారు.
- ఎలక్ట్రానిక్ ట్యూబుల్లో వోల్టేజీని క్రమబద్ధీకరించడానికి, లోహ పలకలు, జాయింట్‌ల మందాన్ని కొలవడానికి క్రిప్టాన్‌ను ఉపయోగిస్తారు.



- వాణిజ్య ప్రకటనల కోసం ఉపయోగించే రంగురంగుల ట్యూబుల్లో మెర్క్యూరీ బాష్పంతోపాటు నియాన్, ఆర్గాన్‌లను ఉపయోగిస్తారు.
- **గ్జినాన్:** ఫొటోగ్రాఫిక్ ఫ్లాష్‌బల్బుల్లో వాడతారు.
- **రేడాన్:** కేన్సర్ థెరపీలో ఉపయోగించే ఆయింట్‌మెంట్‌లలో రేడాన్‌ను వినియోగిస్తారు.
- ఉక్కు పోతలలో (Casts) లోపాలను గుర్తించడానికి దీన్ని ఉపయోగిస్తారు.



డా॥ బి. రమేష్
సీనియర్ ఫ్యాకల్టీ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జమ్మికుంట.



సోమ వారం	గ్రాడ్యుయేట్స్ స్పెషల్	గ్రూప్స్ ప్రత్యేకం
మంగళ వారం	ఇంజనీరింగ్/ఎంబీఏ స్పెషల్	గ్రూప్స్ ప్రత్యేకం
బుధ వారం	జాబ్ పాయింట్	గ్రూప్స్ ప్రత్యేకం
గురు వారం	టెక్నాలజీ స్పెషల్, కరెంట్ అఫైర్స్ (తెలుగు)	గ్రూప్స్ ప్రత్యేకం
శుక్ర వారం	ఫారెన్ ఎడ్యుకేషన్ స్పెషల్	గ్రూప్స్ ప్రత్యేకం
శని వారం	యూత్ స్టోరీస్/ కరెంట్ అఫైర్స్ (ఇంగ్లిష్)	గ్రూప్స్ ప్రత్యేకం
ఆది వారం	జాబ్ స్కిల్స్/గెస్ట్ కాలమ్	గ్రూప్స్ ప్రత్యేకం

ఎన్ఎస్‌క్యూఎఫ్..

నేషనల్ స్కిల్ క్వాలిఫికేషన్ ఫ్రేమ్‌వర్క్

టెక్నికల్ కోర్సులు చదివినా జాబ్ మార్కెట్‌లో అడుగు ముందుకు పడటం లేదు. కారణం.. స్కిల్ గ్యాప్! నైపుణ్యాల కొరత! పరిష్కారం.. నేషనల్ స్కిల్ క్వాలిఫికేషన్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఎస్‌క్యూఎఫ్)! హైస్కూల్ స్థాయి నుంచి పీహెచ్‌డీ వరకు.. స్కూల్ డ్రాపవుట్స్ నుంచి యూనివర్సిటీ గ్రాడ్యుయేట్స్ వరకు.. ప్రతి ఒక్కరూ తమకు నచ్చిన విభాగంలో ప్రాక్టికల్ నైపుణ్యాలు పొందేందుకు మార్గం వేయనుంది.. ఎన్ఎస్‌క్యూఎఫ్. అభ్యర్థుల ప్రస్తుత అర్హతల ఆధారంగా శిక్షణనివ్వడమే కాక సర్టిఫికెట్లు కూడా అందచేసి, ఉపాధి పొందేందుకు వీలుకల్పించే 'నేషనల్ స్కిల్ క్వాలిఫికేషన్ ఫ్రేమ్‌వర్క్'పై విశ్లేషణ.

1 **రమేశ్..** కుటుంబ పరిస్థితుల కారణంగా అయిదేళ్ల క్రితం ఏడో తరగతితో చదువు మానేసి.. ఊర్లోనే వెహికిల్ మెకానిక్ దగ్గర పనిలో చేరాడు. అనుభవం వల్ల ఇప్పుడు అతనికి నైపుణ్యం ఉంది. కానీ.. అది కెరీర్ పరంగా ముందుకు తీసుకెళ్లడం లేదు. కారణం.. ఆ నైపుణ్యానికి 'సర్టిఫికెట్' లేకపోవడం.

2 **శివ..** ఎలక్ట్రిషియన్ ట్రేడ్‌లో ఐటీఐ పూర్తి చేశాడు. బ్యాచిలర్ డిగ్రీలో ప్రవేశించాలనుకున్నాడు. కానీ, డిగ్రీలో ప్రవేశానికి కనీస అర్హత అయిన ఇంటర్మీడియెట్ లేదా తత్సమాన కోర్సుల జాబితాలో ఐటీఐ లేకపోవడంతో అతని డిగ్రీ ఆశ.. అడియాశగానే మిగిలిపోయింది.

3 **మహేశ్..** స్థానిక కళాశాలలో బీటెక్ పూర్తి చేశాడు. జాబ్ మార్కెట్‌లోకి వెళ్లాక తెలిసింది.. అతని బీటెక్ పట్టా ఉద్యోగ నైపుణ్యాలకు సరి తూగట్లేదని! కారణం అన్వేషిస్తే.. అకడమిక్‌గా ప్రాక్టికల్ ట్రైనింగ్ లేకపోవడమేనని అర్థమైంది.

2019 నుంచి అమలు..

రమేశ్, శివ, మహేశ్ వంటివారు మన సమాజంలో ఎంతోమంది. దేశవ్యాప్తంగా కోట్లాది యువత నైపుణ్యాల లేమి కారణంగా సరైన ఉపాధి మార్గాలు అందుకోలేకపోతోంది. ఇలాంటివారికి మార్గం చూపేందుకు రూపొందిన విధానమే.. నేషనల్ స్కిల్ క్వాలిఫికేషన్ ఫ్రేమ్ వర్క్ (ఎన్ఎస్‌క్యూఎఫ్). 2013లోనే నేషనల్ స్కిల్ క్వాలిఫికేషన్ ఫ్రేమ్‌వర్క్ విధి విధానాలు ఖరారైనప్పటికీ.. ఇప్పటివరకు పూర్తిస్థాయిలో అమల్లోకి రాలేదు. ప్రస్తుత జాబ్ మార్కెట్ అవసరాలు, స్కిల్ గ్యాప్ సమస్యను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం.. 2019 నుంచి పూర్తి స్థాయిలో ఎన్ఎస్‌క్యూఎఫ్ అమలు చేయాలని తాజాగా నిర్ణయించింది. జాతీయ స్థాయిలో నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎన్ఎస్‌డీఏ) ఆధ్వర్యంలో ఎన్ఎస్‌క్యూఎఫ్ అమల్లోకి రానుంది.

క్షేత్ర నైపుణ్యాల శిక్షణ




ఫ్రేమ్ వర్క్ ప్రధాన ఉద్దేశం.. పాఠశాల స్థాయిలో డ్రాపవుట్స్ మొదలు పోస్ట్ గ్రాడ్యుయేట్స్ వరకు ప్రతి ఒక్కరికి వారికి నచ్చిన విభాగంలో క్షేత్రస్థాయి శిక్షణ ఇవ్వడం. తద్వారా శిక్షణకు అనుగుణంగా జాబ్ మార్కెట్‌లో తగిన ఉద్యోగం సొంతం చేసుకునే వీలుకలుగుతుంది. ఇలా ఒక్క సాంకేతిక విభాగంలోనే ఏటా మూడు మిలియన్ల మందికి క్షేత్ర నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వాలని భావిస్తున్నారు. 4వ తరగతి నుంచి పన్నెండో తరగతి (ఇంటర్మీడియెట్) మధ్యలో ప్రస్తుతం డ్రాపవుట్‌గా ఉండి.. ఏదో ఒక వృత్తిలో కొనసాగుతున్న 20 కోట్ల మందికి వృత్తికి తగ్గ నైపుణ్యాలపై శిక్షణ అందించనున్నారు. ఈ సంఖ్యను 2020 నాటికి 50 కోట్లకు పెంచాలన్నది లక్ష్యం.

పది స్థాయిల్లో..

ఎన్ఎస్‌క్యూఎఫ్ నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాలు పది స్థాయిల్లో ఉండనున్నాయి. ఒకటో స్థాయిని.. ప్రాథమిక శిక్షణగా, పదో స్థాయిని హై స్కిల్డ్‌గా నిర్దేశించారు. ఈ కార్యక్రమాలను సెక్టార్ స్కిల్ కౌన్సిల్స్ లేదా నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ గుర్తింపు పొందిన ట్రైనింగ్ ప్రొవైడర్స్ వద్ద పొందే వీలుంటుంది.

క్రెడిట్స్, సర్టిఫికెట్స్

పది స్థాయిల విధానంలో.. అభ్యర్థులు శిక్షణ పొందిన స్థాయి, ట్రైనింగ్ పూర్తయ్యాక నిర్వహించే మూల్యాంకనం ద్వారా క్రెడిట్స్ మంజూరు చేస్తారు. ఇలా క్రెడిట్స్ ఇస్తూనే సర్టిఫికెట్స్ కూడా అందజేస్తారు. వాటితో అభ్యర్థులకు జాబ్ మార్కెట్‌లో తగిన గుర్తింపు లభించే అవకాశం ఉంటుంది.



క్రెడిట్స్ బదిలీ

శిక్షణ పూర్తయ్యాక పొందిన క్రెడిట్స్‌ను మరో కోర్సులోకి బదిలీ చేసుకునే అవకాశం కూడా ఉంటుంది. ఏదైనా డిగ్రీ చదువుతూ ఎన్ఎస్‌క్యూఎఫ్ శిక్షణ పొందాలనుకుంటే.. అప్పటికే ఆ డిగ్రీ కోర్సులో పొందిన క్రెడిట్స్‌ను పరిగణనలోకి తీసుకుని శిక్షణ స్థాయిని నిర్ణయిస్తారు. ఉదాహరణకు.. కెమిస్ట్రీ విభాగంలో పొందే క్రెడిట్స్.. పాలిమర్ టెక్నాలజీలో శిక్షణకు ఉపయోగపడతాయి. టర్నింగ్/మెషినింగ్ విభాగాల్లో శిక్షణ ద్వారా పొందిన క్రెడిట్స్‌ను పాలిమర్ సైన్స్‌లో మూడేళ్ల డిప్లొమా కోర్సు అభ్యసనంలో పరిగణనలోకి తీసుకుంటారు.

'తత్సమాన' గుర్తింపు

తత్సమాన కోర్సుల విషయంలో ఇన్‌స్టిట్యూట్‌ల మధ్య వేర్వేరు విధానాలు అమలవుతుండటం ప్రవేశంపరంగా విద్యార్థులకు సమస్యగా మారుతోంది. ఎన్ఎస్‌క్యూఎఫ్ పరిధిలోని పది దశల్లో శిక్షణ ఆధారంగా.. సదరు స్థాయికి పదో తరగతి, ఇంటర్మీడియెట్, డిప్లొమా తత్సమాన కోర్సులుగా గుర్తించేలా జాతీయ స్థాయిలో ఒకే నిబంధన అమలు చేయనున్నారు. ఈ మేరకు యూజీసీ, ఏఐసీటీఈ వంటి నియంత్రణ సంస్థలను సంప్రదించడం కూడా పూర్తయింది.

ప్రీ లెర్నర్స్ కోసం



చాలామంది నామమాత్ర విద్యార్హతలు కలిగి ఉండి.. కుటుంబ పరిస్థితుల కారణంగా ఏదో ఒక వృత్తిలో స్థిరపడుతుంటారు. అలాంటివారి కోసం రికగ్నైజింగ్ ప్రీ లెర్నర్స్ విధానాన్ని అమలు చేయనున్నారు. దీని ప్రకారం– సదరు ప్రీ లెర్నర్స్ తమకు సంబంధించిన విభాగంలో నిర్వహించే పరీక్షలు/మూల్యాంకనానికి నేరుగా హాజరవ్వొచ్చు. వారు పొందిన ఉత్తీర్ణత ఆధారంగా సర్టిఫికెట్ జారీ చేస్తారు.

కరిక్యులం.. ఇండస్ట్రీ వర్గాల ప్రమేయం

ఎన్ఎస్‌క్యూఎఫ్ శిక్షణ కరిక్యులం, బోధన, ట్రైనింగ్ కార్యకలాపాల్లో అనుసరించాల్సిన విధానాల కోసం ఎన్ఎస్‌డీఏ.. ఇండస్ట్రీ వర్గాలను సైతం భాగస్వాములను చేస్తోంది. ఫలితంగా జాబ్ మార్కెట్‌కు అనుగుణంగా ఎంప్లాయబిలిటీ స్కిల్స్ లభించేలా శిక్షణనిచ్చేందుకు వీలవుతుంది.

బహుళ నైపుణ్యాలు లభించేలా



ఎన్ఎస్‌క్యూఎఫ్‌లో మరో ముఖ్యాంశం.. శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా ఒక కోర్సుకు సంబంధించి బహుళ నైపుణ్యాలు లభించేలా చర్యలు తీసుకోవడం. ఉదాహరణకు ఎలక్ట్రికల్ విభాగంలో శిక్షణ పొందే అభ్యర్థికి.. ఎలక్ట్రిక్ పరికరాల వినియోగంతో సంబంధం ఉన్న ఇతర అంశాలపైనా ట్రైనింగ్ ఉంటుంది.

అంతర్జాతీయంగా రాణించేలా..

నేషనల్ స్కిల్ క్వాలిఫికేషన్ ఫ్రేమ్ వర్క్ ప్రకారం– పేర్కొన్న వృత్తి శిక్షణ ద్వారా యువత అంతర్జాతీయంగానూ సంబంధిత వృత్తుల్లో ఉపాధి పొందేలా ప్రణాళికలు రూపొందించారు. అంతర్జాతీయ స్థాయిలో పలు దేశాల్లో ఆయా వృత్తులకు సంబంధించి విధుల పరంగా అమలు చేస్తున్న విధానాలు, అవసరమైన స్కిల్స్ గురించి తెలుసుకుని.. ఆ మేరకు ఎన్ఎస్‌క్యూఎఫ్ ద్వారా శిక్షణ ఇవ్వనున్నారు.

ఎన్ఎస్‌క్యూఎఫ్ ముఖ్యాంశాలు

- కేవలం సాంకేతిక విభాగంలోనే 2020 నాటికి 50 కోట్ల మందికి శిక్షణ ఇవ్వడం లక్ష్యం.
- శిక్షణ పొందిన లెవల్ ఆధారంగా ఇంటర్మీడియెట్, డిప్లొమా, ఐటీఐ కోర్సులకు తత్సమాన అర్హతగా గుర్తింపు.
- ఫలితంగా ఈ మూడు కోర్సులు అర్హతలుగా ఉండే ఉన్నత విద్యా కోర్సుల్లో సైతం ప్రవేశం పొందే అవకాశం.

వర్క్ ఫోర్స్ పెరుగుతుంది

"ఎన్ఎస్‌క్యూఎఫ్ పేర్కొన్న విధానాలు యథాతథంగా, ఎలాంటి అవరోధాలు లేకుండా అమలైతే కచ్చితంగా జాబ్ మార్కెట్‌లో ఎంప్లాయబిలిటీ స్కిల్స్ ఉన్న అభ్యర్థుల సంఖ్య, దీనికి అనుగుణంగా వర్క్ ఫోర్స్ కూడా పెరుగుతుంది. అభ్యర్థులకు నైపుణ్యాలు లభించడం అనేది శిక్షణనందించే సెక్టార్ స్కిల్ కౌన్సిల్స్ స్థానిక కేంద్రాలు లేదా గుర్తింపు పొందిన ట్రైనింగ్ ప్రొవైడర్స్ సంస్థల్లోని సిబ్బంది వ్యవహరించే తీరుపై ఆధారపడి ఉంటుంది. – **ఎం.శ్రీధర్, సీఈఓ, టాలెంట్ స్ప్రింట్**

గెస్ట్ కాలమ్

'అకడమిక్‌గా, కెరీర్ పరంగా నేటి యువత అపార అవకాశాలను అందిపుచ్చుకుంటుండటం హర్షణీయం. అయితే.. వారి డిగ్రీలు, నైపుణ్యం 'నేను.. సమాజం' అనే దృక్పథంలో ఉపయోగపడితేనే సార్థకత' అంటున్నారు డా॥ రాజేంద్ర సింగ్. నీటి సంరక్షణకు సంబంధించి నోబెల్ బహుమతిగా భావించే స్టాక్‌హోం వాటర్‌ప్రైజ్, రామన్ మెగసెసే అవార్డు గ్రహీత ఈయన. జమిందారీ కుటుంబంలో జన్మించి.. బీఏఎంఎస్, హిందీ సాహిత్యంలో డాక్టరేట్, ప్రభుత్వ ఉద్యోగం సైతం సాధించారు డా॥ రాజేంద్రసింగ్. సమాజ సేవకు అవకాశం లభించదని భావించి నాలుగేళ్లకే ఉద్యోగాన్ని వదిలేశారు. అప్పటినుంచి జాతీయ స్థాయిలో నీటి సంరక్షణ, నీటి నిల్వల పెంపుతో వ్యవసాయాభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ.. 'వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. ఆయనతో ఈ వారం గెస్ట్ కాలమ్..


'వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా': డా॥ రాజేంద్ర సింగ్

మనం అనే ఆలోచనతో.. ముందడుగు వేయాలి!

ఆ రెండు పదాలే కదిలించాయి

బీఏఎంఎస్ అనంతరం.. 1980లో రాజస్థాన్ ప్రభుత్వంలో నేషనల్ వాలంటీర్ ఫర్ ఎడ్యుకేషన్‌గా ఉద్యోగం లభించింది. దౌసా జిల్లా విక్రమ్‌పురా గ్రామంలో వయోజన విద్య ప్రాధాన్యం వివరిస్తుండగా ఓ వృద్ధుడు లేచి.. 'మాకు ఇప్పుడు చదువలెందుకయ్యా..? ఈ ప్రాంతంలో చుక్క నీరు లేదు. పంట పొలాలు లేవు. తినడానికి తిండి కూడా లేదు. చేతనైతే నీరు ఇప్పించి వ్యవసాయం చేసుకునే మార్గం చూపించండి' అన్నారు. 'నీరు ఇప్పించండి'.. 'వ్యవసాయం చేసుకుంటాం' అనే రెండు మాటలే నాలో మార్పు తెచ్చాయి. ఇదే విషయాన్ని ఉన్నతాధికారులకు పలుసార్లు వివరించినా ఫలితం శూన్యం. ఎప్పటికైనా ప్రభుత్వం నుంచి స్పందన రాకపోతుందా అనే ఆలోచనతోనే నాలుగేళ్లు ఉద్యోగంలో కొనసాగా. ఉద్యోగం చేస్తూనే జైపూర్ జిల్లాలో తరుణ్ భరత్ సంఘ్‌లో కార్యకర్తగా చేరి ఖాళీ సమయంలో సామాజికాభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేవాడిని. రోజులు గడుస్తున్నా నా ప్రతిపాదనలకు ప్రభుత్వంలో కదలిక లేదు. దీంతో ఉద్యోగానికి రాజీనామా చేసి తరుణ్ భరత్‌లో కార్యకర్తగా మారా.

నీటి వనరులే.. కీలకం

సమాజం అభివృద్ధి చెందాలంటే.. ముందుగా నీటి వనరుల లభ్యత ఎంతో ఆవశ్యకం. నీరు బాగా ఉంటే వ్యవసాయం సాగుతుంది. కోట్ల మందికి ప్రయోజనకరంగా మారుతుంది. పొట్టకూటికి పట్టణాలకు వలస వెళ్లే పరిస్థితి రూపుమాసిపోతుంది. వ్యవసాయ ఫలాల ద్వారా ఆహార ధాన్యాలు లభిస్తాయి. రైతుల పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దడానికి మార్గం ఏర్పడుతుంది. ఇప్పుడు దేశవ్యాప్తంగా ఎకరాల కొద్దీ భూములున్నవారు సైతం నీరు లేక, సాగు చేయలేక పట్టణాలకు వెళుతున్నారు. ఈ పరిస్థితి పోవాలంటే జల సంరక్షణే మార్గం. చెక్ డ్యాంలు, చిన్న జలాశయాల నిర్మాణం ద్వారా నీటిని ఒడిసిపట్టొచ్చు.

అభినందనలతోనే సంతృప్తి

జల సంరక్షణ, సుస్థిరాభివృద్ధి వంటి కార్యక్రమాలకు ఎన్నో అవార్డులు లభించాయి. వీటన్నిటి కంటే సంతృప్తినిచ్చేది నేను చేపట్టిన చర్యల ఫలితంగా లబ్ధి పొందిన ప్రజల అభినందనలే. ఈ క్రమంలో వందల మంది చేయూతనివ్వడం కూడా మరవలేను. అందుకే ఈ వయసులోనూ కార్యక్రమాలు నిర్వహించగలుగుతున్నాను.

అందరూ కలిస్తేనే పర్యావరణ పరిరక్షణ

ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ కాలుష్యం ప్రధాన సమస్యగా మారింది. ఈ విషయంలో ఒక్కో దేశం ఒక్కో ధోరణి అవలంబిస్తుండటం దురదృష్టకరం. పర్యావరణ పరిరక్షణకు దేశాలు కలిసి నడవాలి. అప్పుడే సత్ఫలితాలు లభిస్తాయి. సహజ వనరుల అభివృద్ధికి మార్గం సుగమం అవుతుంది.

సమాజాభివృద్ధిలో యువత పాత్ర

నేటి యువత వ్యక్తిగత కెరీర్, కుటుంబ సంక్షేమానికే కాక సమాజాభివృద్ధికి దోహదపడేలా ఆలోచించాలి. వాతావరణ పరిస్థితులు, పర్యావరణ సమస్యల నేపథ్యంలో సుస్థిరాభివృద్ధి చర్యలపై దృష్టి పెట్టాలి. అవసరమైన పరిశోధనలు చేసి, ఆవిష్కరణలు రూపొందించాలి. ఇవన్నీ కార్యరూపం దాల్చాలంటే.. ప్రతి ఒక్కరిలో 'నేను' అనే భావన పోయి.. 'మనం' అనే ఆలోచన రావాలి.

సైన్స్‌తో అపార అవకాశాలు

సైన్స్ నైపుణ్యాలు పొందినవారికి అపార అవకాశాలు ఉన్నాయి. క్షేత్రస్థాయికి వెళ్లి ఒక సమస్యను చేపట్టి మూలం కనుగొనే క్రమంలో నైపుణ్యాలను అన్వయిస్తూ పరిశోధనలు సాగిస్తే సత్ఫలితాలు లభిస్తాయి. ఆ సంతృప్తి వెలకట్టలేనిది. మరో ముఖ్య సలహా.. ఏ కార్యక్రమం చేపట్టినా లేదా ఏ కెరీర్‌లో అడుగు పెట్టినా.. ఆరంభంలో సమస్యలు సహజం. వాటిని చూసి కుంగిపోకుండా.. నిబ్బరంగా అడుగులు వేసేలా ఆత్మవిశ్వాసం సొంతం చేసుకోవాలి.

జాబ్ స్కిల్స్



కొంత మంది ఉద్యోగంలో చేరిన కొత్తలో చాలా ఉత్సాహం చూపుతారు. కొత్త ప్రాజెక్టు వచ్చిందంటే ఎగిరి గంతేస్తారు. బాస్ కొత్త టాస్క్ చెప్పగానే సంబరపడిపోతారు. హై పెర్ఫార్మర్స్‌గా పేరు తెచ్చుకుంటారు. అందరి గుర్తింపు పొందుతారు. కొంతకాలానికి ఆ ఉత్సాహం... ఉల్లాసం తగ్గిపోతుంది. కెరీర్ గురించిన కలలన్నీ కల్లలవుతున్న భావన ప్రారంభమవుతుంది. ఆత్మవిశ్వాసం సన్నగిల్లుతుంది. అయితే... కెరీర్‌లో ఎత్తుపల్లాలు, జయాపజయాలు.. ఉత్సాహ నిరుత్సాహాలు సహజమేనంటున్నారు నిపుణులు. ఎప్పటికప్పుడు ఉత్సాహపర్చుకుంటూ ముందుకుసాగాలంటున్నారు. అందుకు కెరీర్ టిప్స్..

ఉద్యోగిగా.. ఉత్తేజంగా

నచ్చింది చేయండి

ఉద్యోగంలో మంచి అనుభవం వచ్చింది. ఆ తర్వాత.. శక్తిసామర్థ్యాలకు సవాలు విసిరే పనులే చేయండి. శక్తిని హరించే పనులు, ఆలోచనలను పక్కనపెట్టండి. ఇంట్లోనూ ఆసక్తి కలిగించే, ఉత్సాహపరిచే పనులే చేయండి. ఒకసారి గత నెలల్లో చేసినవాటిలో సంతోషాన్నిచ్చిన టాస్క్‌ను గుర్తించండి. క్లయింట్స్‌తో ఫాలోఅప్ చేయడం ఇష్టమైతే అదే చేయండి. కొలీగ్‌కు ఆడిట్ వర్క్ అప్పగించండి. ఒక పని మనస్ఫూర్తిగా చేసి ఫలితం పొందితే మీ సమర్థత స్థాయి తెలిసిపోతుంది.

దృక్పథం మార్పు

పరిసరాలు, పరిస్థితులు, పని... అన్నీ మీ దృక్పథాన్ని బట్టి మారుతూ ఉంటాయి. అంతర్గత ఆలోచనా దృక్పథాన్ని మార్చుకుంటే.. అందుకు తగ్గట్టుగా వాతావరణం మారిపోతుంది. సానుకూలంగా చూస్తే అన్నీ మంచిగానే కనిపిస్తాయి. ప్రతికూలంగా చూడటం మొదలుపెడితే.. ప్రతిదీ నెగిటివ్‌గానే కనిపిస్తుంది. రోజూ రొటీన్‌గా కాకుండా.. భిన్నమైన ఆలోచనలు చేయండి. కొత్తకొత్త లక్ష్యాలు విధించుకోండి. వీలుంటే పని షెడ్యూల్ మార్చుకోండి. తద్వారా ఆలోచనల్లో ఊహించని మార్పును గమనిస్తారు. ఇంట్లో కూర్చుని ఆలోచిస్తే.. పరిష్కారం లభించడం లేదనుకుంటే బయటకు వెళ్లి ఆలోచించండి. అప్పుడప్పుడు భవిష్యత్ గురించి కలలు కనండి. ప్రాధమ్యాలను మార్చుకోండి. దాంతో కొత్త ప్రపంచం కనిపిస్తుంది. రోజూ కొద్దిసేపు నడక కొనసాగించండి. ఇది ఉత్సాహంతో పాటు ఆరోగ్యాన్ని అందిస్తుంది.

అభిరుచి

పొద్దంతా పని చేస్తుంటే త్వరగా నీరసపడిపోవడం ఖాయం. కొంత సమయం హాబీలకు వెచ్చించండి. తద్వారా రీచార్జ్ అయ్యే అవకాశం ఉంటుంది. ఏదైనా సాహసం చేయాలనిపిస్తే (పర్వతమో, శిఖరమో ఎక్కడం వంటివి) చేసేయండి. కొత్త విషయం నేర్చుకోవడానికి ప్రయత్నించండి. అది వంట చేయడం, పియానో వాయించడం లేకపోతే కోడింగ్ రాయడమో, విదేశీ భాష నేర్చుకోవడమో కావచ్చు. కొత్త విషయాలు మొదట్లో కష్టంగా అనిపించినా.. చేస్తూ చేస్తూ ఉంటే.. మెదడులో చర్యల కారణంగా శక్తిసామర్థ్యాలు పెరుగుతాయన్నది శాస్త్రవేత్తల సూచన.

ఆ ఆందోళన వద్దు

మొదట్లో బాగా పనిచేసిన తాము.. భవిష్యత్‌లో ఏదైనా టాస్క్‌లో వెనుకబడితే ఉన్నతాధికారులు పనితీరును సందేహించే ఆస్కారముందని కొంతమంది హై అచీవర్స్ మదనపడుతుంటారు. ఇలాంటి ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు మీ భయాలు, ఆందోళనలను అన్నింటినీ ఒంటరిగా కూర్చొని ఏదైనా ఒక పేపర్‌పై రాయండి. గత విజయాలు, పూర్తి చేసిన ప్రాజెక్టులు, పడిన కష్టం గురించి కూడా రాసుకోండి. తద్వారా మీ ప్రతిభ వాస్తవమని మీకే అర్థం అవుతుంది. భవిష్యత్‌లో విఫలమవుతామనే సందేహాలు పటాపంచలు అవుతాయి. కెరీర్‌పరంగా దీర్ఘ, స్వల్ప లక్ష్యాలను రాసిపెట్టుకుని సాధించగలనని మీకు మీరు చెప్పుకోండి .

ప్రేరణ పొందండి

మిమ్మల్ని మీరు తరచూ ఉత్సాహపరచుకోండి. తోటివారికి ప్రేరణగా నిలిచే ప్రయత్నం చేయండి. కొలీగ్స్‌కావచ్చు. స్నేహితులు కావచ్చు. బంధువులు కావచ్చు. వీళ్లలో ఎవరైనా మీకు ప్రేరణగా నిలుస్తుంటే.. వారితో కొంత సమయం గడిపే ప్రయత్నం చేయండి. తద్వారా ఆలోచనల్లో సానుకూల మార్పు గమనిస్తారు. నెగిటివ్‌గా మాట్లాడేవారికి సాధ్యమైనంత దూరంగా.. చుట్టూ సానుకూల దృక్పథం కలిగిన ఉత్సాహవంతులు, కార్యోన్ముఖులుగా మార్చే, ప్రేరణ కలిగించేవాళ్లు ఉండేట్లు చూసుకోండి. ప్రతికూల దృక్పథం వారిని పూర్తిగా దూరంపెట్టడం మేలు.

మెంటార్‌తో మేలు

జీవితంలో గౌరవించే, అభిమానించే వ్యక్తే మీ ప్రేరకుడు (మెంటార్). అలాంటివారుంటే.. సలహాలు, ఫీడ్ బ్యాక్, విమర్శలు, ప్రశంసలు పొందేందుకు ప్రయత్నించండి. ఇప్పటివరకు మెంటార్ కనిపించకపోతే.. ప్రొఫెసర్లు, మీ ఉన్నతాధికారులు, బంధువుల్లో ఎవరైనా ఆ పాత్రకు సరిపోతారేమో చూడండి. ఉన్నత వ్యక్తిత్వం వారితో అనుబంధాల పటిష్ఠానికి కొంత సమయం వెచ్చించండి. మెంటార్స్ వల్ల మిమ్మల్ని మీరు నిజాయతీగా సమీక్షించుకునే వీలుంటుంది.

త్వరగా ట్రాక్‌లోకి..

అపజయాలు, ఆందోళనలు, ఒత్తిడి నుంచి బయటపడే మార్గం.. ఏది జరిగినా మంచికే అనుకోవడం.. ప్రతి ప్రతికూల పరిస్థితి, ప్రతి సంఘర్షణ నుంచి పాఠం నేర్చుకోవడానికి ప్రయత్నించడం ద్వారా ఎదురుదెబ్బల నుంచి త్వరగా కోలుకోగలరు. కెరీర్ కూడా ట్రాక్‌లో పడుతుంది. సమయం విలువ గుర్తెరిగి అనవసర సమాచారం, అప్రధానమైన అంతరాయాలను, అప్రస్తుత వాదనల నుంచి దృష్టిమరల్చండి. వీటిల్లో సోషల్ మీడియా కూడా ఉండొచ్చు.

మారాలనుకుంటే

ప్రస్తుత పని లేదా పని వాతావరణం నిరాశ పరుస్తుండొచ్చు. ఉత్సాహంపై నీళ్లు చల్లుతుండొచ్చు. శక్తి సామర్థ్యాలను హరిస్తుండొచ్చు. ఒక్కోసారి నచ్చని ఉద్యోగంలో ఉన్నామా..? అనే సందేహమూ తలెత్తుతుంది. అలాంటప్పుడు నిర్దిష్ట సమయం పెట్టుకుని.. ఉద్యోగం మారాలా..? కంపెనీ మారాలా..? కెరీర్ మారాలో ఆలోచించుకోండి. అందుకు ప్రణాళిక రూపొందించుకోండి.

సాక్షి
రాష్ట్రీయం
వైఎస్ఆర్ జిల్లా
ఆదివారం । ఆగస్టు । 13 । 2017
www.sakshi.com

లోక్‌సభ ప్రశ్నోత్తరాల ప్రకారం, దేశంలో హజ్ సబ్సిడీ కోసం ఎక్కువ మంది దరఖాస్తు చేసుకుంటున్న రాష్ట్రం కేరళ. నిర్దేశించిన కోటా ఒక్కరికి అక్కడ 8.5 దరఖాస్తులు వస్తున్నాయి. తర్వాతి స్థానాల్లో మధ్యప్రదేశ్ (6.9), ఢిల్లీ (6.3), తెలంగాణ (6.1) ఉన్నాయి.



గవర్నర్ రేసులో 16 ఏళ్ల పిల్లాడు..



అతడు ఓ హైస్కూల్ విద్యార్థి. వయసు పదహారేళ్లే.. కానీ, అప్పుడే అమెరికాలోని కాన్సాస్‌కు గవర్నర్ అయ్యేందుకు ప్రయత్నాలు ప్రారంభించాడు. ఎన్నికల ప్రచారం ద్వారా మొత్తం దేశాన్ని తనవైపు తిరిగి చూసేలా చేశాడు. అమెరికాలో గవర్నర్ అవ్వాలంటే కనీస వయసు సాధారణంగా 30గా పేర్కొంటారు. అయితే, కొన్ని రాష్ట్రాలకు మాత్రం 25, 21, 18 ఏళ్లు ఉండగా ఓక్లాహామాలో కనీస వయసు 31 ఏళ్లుండాలి. అయితే, ఒక్క కాన్సాస్, వర్మోంట్‌కు మాత్రం స్పష్టంగా ఇంత వయసు ఉండాలని పేర్కొనలేదు. జాక్ బర్గ్‌సన్ అనే హైస్కూల్ విద్యార్థి 2018లో జరగనున్న కాన్సాస్ ఎన్నికల్లో డెమోక్రటిక్ పార్టీ తరఫున బరిలోకి దిగుతుండగా ఇతడికి పోటీగా మరో హైస్కూల్ స్టూడెంట్ అలెగ్జాండర్ క్లైన్ బరిలోకి దిగుతున్నాడు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే వీరిద్దరికీ ఓటు హక్కు కూడా లేదు. గత బుధవారం ఏబీసీ నెట్‌వర్క్‌లో ప్రచారమైన జిమ్మీ కిమ్మెల్ లైవ్ అనే కామెడీ కార్యక్రమంలో పాల్గొని జాక్ బర్గ్‌సన్ ఈ విషయాన్ని తెలిపాడు. వచ్చే ఏడాది ఈ ఇద్దరు విద్యార్థుల స్కూల్ ఎడ్యుకేషన్ పూర్తవనుంది. కాన్సాస్‌కు గవర్నర్‌గా పోటీ చేసే వ్యక్తికి ఎంత వయసు ఉండాలనే విషయంలో ప్రత్యేక నిబంధనలు లేని కారణంగానే వీరిద్దరూ పోటీలోకి దిగుతున్నట్లు తెలుస్తోంది. అయితే, ఇప్పటికే జాక్‌కు నిధులు కూడా సమకూరుతున్నాయట. 1,300 డాలర్ల ఫండ్ అప్పుడే తనకు చేరినట్లు జాక్ తెలిపాడు. యువకులను ఎవరూ సీరియస్‌గా తీసుకోరని తాము గ్రహించామని, అయితే, కాన్సాస్ ప్రజలు ఇక మూసధోరణి రాజకీయాలను ఏమాత్రం భరించబోరని, తమతోనే మార్పును ఆహ్వానిస్తారని భావిస్తున్నట్లు వెల్లడించాడు.

ఇతడు మెదడుతో చూస్తాడు..!



కంటి చూపు లేక పోయినప్పటికీ చుట్టూ ఉన్న పరిసరాలను, పరిస్థితులను అంధులు ఎంతో చక్కగా అంచనా వేయగలుగుతారు. ఈ కోవలోకే వస్తాడు 17 ఏళ్ల జీత్‌త్రివేది. అయితే ఇతడు అంధుడు కాదు. కానీ డ్రైవింగ్, చదవడం, సూదిలో దారం గుచ్చడం వంటి పనులను కళ్లు మూసుకుని చకచకా చేసేస్తాడు. గతేడాది సెప్టెంబర్‌లో 40 కిలోమీటర్ల వరకు కళ్లకు గంతలు కట్టుకుని బైక్ నడిపి చూపించాడు. ఎలా ఇలా అంటే.. మధ్య మెదడును యాక్టివేట్ చేయడం వల్ల ఏదయినా సాధ్యమే అంటున్నారు జీత్ ట్రైనర్ భరత్ పటేల్. జీత్‌కు తన ఇంద్రియాల పట్ల చక్కని నియంత్రణ ఉందని, ఒక అవయవాన్ని మనం పనిచేయకుండా ఆపేస్తే ఆ పనిని ఇంకో అవయవం సహాయంతో చేయగలుతాడని భరత్ చెప్పారు. అంతేకాదు కళ్లకు గంతలు కట్టుకునే జీత్ పుస్తకాలు చదవగలడు, తన ఎదురుగా వచ్చే వస్తువులను పట్టుకోగలడు, దాగి ఉన్న వస్తువులను కనిపెట్టగలడు, ఒకేసారి ముగ్గురితో చెస్ ఆడగలడు. ఎదురుగా వచ్చే వస్తువు వాసన బట్టి గుర్తించగలుగుతున్నానని, ఆ వస్తువు ఏంటో కూడా చెప్పగలనని జీత్ చెబుతున్నాడు. మధ్య మెదడును ఉత్తేజితం చేస్తే ఆ విద్య ఎవరికైనా సాధ్యమేనంటున్నారు భరత్. సమాజంలో జీత్‌లా ఏ చిన్నారికైనా ఈ శిక్షణ ఇవ్వచ్చని, అయితే కావాల్సిందల్లా ఓపిక, పట్టుదల, తల్లిదండ్రుల్లో సానుకూల దృక్పథం అని వివరించారు.

ముక్కంటిసేవలో హైకోర్టు న్యాయమూర్తి



గురుదక్షిణామూర్తి వద్ద హైకోర్టు న్యాయమూర్తితో స్థానిక న్యాయమూర్తులు, నేతలు, అధికారులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రానికి శనివారం రాత్రి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నాగార్జునరెడ్డి కుటుంబసభ్యులతో విచ్చేశారు. వారికి ఆలయాధికారులు ఆలయ మర్యాదల ప్రకారం స్వాగతం పలికారు. వీరు ప్రత్యేకంగా స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం వారికి గురుదక్షిణామూర్తి వద్ద వేదపండితుల నుంచి ఆశీర్వాదం ఇప్పించారు. దుశ్శాలువాతో సత్కరించి స్వామి, అమ్మవార్ల తీర్థప్రసాదాలను అందజేశారు. వారితోపాటు శ్రీకాళహస్తి కోర్టు న్యాయమూర్తులు శ్రీకాంత, సంధ్య, స్థానిక మాజీ ఎమ్మెల్యే తాటిపర్తి చెంచురెడ్డి, ఆలయ పీఆర్వో హరిబాబుయాదవ్ తదితరులున్నారు.

తిరుమలలో తగ్గని భక్తుల రద్దీ

సాక్షి, తిరుమల: సెలవుల కారణంగా తిరుమలలో శనివారం కూడా భక్తుల రద్దీ తగ్గలేదు. సాయంత్రం 6 గంటల వరకు 67,541 మంది భక్తులు శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఇదే సమయానికి 31 కంపార్ట్‌మెంట్లలో సర్వదర్శనం భక్తులు నిండారు. వెలుపల నారాయణగిరి ఉద్యానవనంలో భక్తులు క్యూ కట్టారు. వీరికి 16 గంటల తర్వాత శ్రీవారి దర్శనం లభించనుంది. టైం స్లాట్ ప్రకారం కాలిబాట భక్తులు, రూ.300 టికెట్ల భక్తులకు రెండు నుండి మూడు గంటల సమయంలో శ్రీవారి దర్శనం లభిస్తోంది. గదులు ఖాళీ లేవు. హుండీ కానుకలు రూ.3.09 కోట్లు లభించాయి. వరుస సెలవులతో ఆగస్టు 16వ తేది వరకు భక్తుల రద్దీ కొనసాగనుంది.

వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు: పెరిగిన భక్తుల రద్దీకి అనుగుణంగా టీటీడీ వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దుచేశారు. శుక్రవారం నుంచి సిఫారసు లేఖలు తీసుకోలేదు. ప్రోటోకాల్ పరిధిలోకి వచ్చే ప్రముఖులకు మాత్రమే దర్శనం కల్పించారు. ఇతర సిఫారసు దర్శనాలు పరిమిత సంఖ్యలోనే కేటాయించారు.

రూ.60 లక్షల విలువైన గంజాయి స్వాధీనం

విజయనగరం జిల్లాలో ఘటన



గంజాయి బస్తాలను పరిశీలిస్తున్న సీఐ లక్ష్మణరావు

విజయనగరం: విజయనగరం జిల్లా కేంద్రంతో పాటు గంట్యాడ మండలంలో సుమారు రూ.60 లక్షల విలువైన గంజాయిని పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. అజ్ఞాత వ్యక్తుల సమాచారం మేరకు విజయనగరం పట్టణంలోని కేఎల్ పురం సమీపంలో గంజాయిలోడ్‌తో వెళ్తున్న లారీపై వన్‌టౌన్ సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు దాడిచేశారు. లారీని తనిఖీచేసి వాటిలో ఉన్న 206 గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. లారీ డ్రైవర్ శివశంకర రెడ్డి, క్లీనర్ దుర్గారావు, కె.చిన్నారావును అదుపులోకి తీసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.పది లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. అలాగే గంట్యాడ మండలం నరవ గ్రామసమీపంలో గంజాయితో వెళ్తున్న బొలెరో వాహనాన్ని సీఐ లక్ష్మణరావు ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. అంతకుముందు బొడ్డవర ఫారెస్ట్ చెక్‌పోస్టు వద్ద వాహనం ఆపకుండా వెళ్లిపోవడంతో సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సీఐ ఆధ్వర్యంలో పోలీసులు నరవ గ్రామ సమీపంలో తనిఖీలు చేపట్టి వాహనాన్ని సీజ్ చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. సీజ్ చేసిన గంజాయి విలువ(700 కిలోలు) సుమారు రూ.50 లక్షలు ఉంటుందని పోలీసులు చెబుతున్నారు. గంట్యాడ ఘటనలో బొలెరో డ్రైవర్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. మన్యంలో సాగుచేసిన గంజాయిని రైళ్లలో మహారాష్ట్ర తరలించి అమ్మకాలు సాగిస్తున్నట్టు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.

గర్భిణిపై లైంగిక దాడికి యత్నం!

పోలీసుల అదుపులో ప్రభుత్వ వైద్యుడు




రవీంద్రనాథ్ ఠాగూర్

పొదలకూరు: గర్భిణిపై ప్రభుత్వ వైద్యుడు లైంగిక దాడికి యత్నించిన ఉదంతం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పొదలకూరులో వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పొదలకూరు టైలర్స్ కాలనీలో నివాసం ఉంటున్న ఓ గిరిజన ఉపాధ్యాయుడి భార్య ఏడు నెలల గర్భిణి కావడంతో స్కానింగ్ పరీక్షల నిమిత్తం శుక్రవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లింది. ఆ ఆసుపత్రిలో గైనకాలజిస్ట్‌గా పనిచేస్తున్న డాక్టర్ రవీంద్రనాథ్ ఠాగూర్ ఆమెను స్కానింగ్ గదిలోకి తీసుకువెళ్లి తలుపులు మూసి లైంగిక దాడికి యత్నించాడు. వైద్యుడి బారినుంచి తప్పించుకుని ఇంటికి వచ్చిన బాధితురాలు జరిగిన విషయాన్ని భర్తకు చెప్పగా.. భార్యాభర్తలు శనివారం పొదలకూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రాథమిక విచారణ అనంతరం వైద్యుడు ఠాగూర్‌పై ఐపీసీ 354ఏ, 506, 376, 511 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి ఆయనను అదుపులోకి తీసుకున్నారు. కాగా, తనపై ఉద్దేశపూర్వకంగా కేసు పెట్టారని డాక్టర్ ఠాగూర్ పేర్కొన్నారు. తాను గర్భిణి పట్ల అనుచితంగా ప్రవర్తించలేదని, డాక్టరుగా పరీక్షలు చేసేందుకు ప్రయత్నించానని చెప్పారు.

రాముడుపాలెంలో ఢిల్లీ క్రైం బ్రాంచ్ పోలీసులు

సైబర్ నేరంలో అనుమానితుడి అరెస్టు



ఢిల్లీ సైబర్ క్రైమ్ బ్రాంచ్ పోలీసుల అదుపులో కృష్ణమోహన్

చల్లపల్లి (అవనిగడ్డ): ఢిల్లీ క్రైం బ్రాంచ్ పోలీసులు శనివారం కృష్ణా జిల్లా, చల్లపల్లి మండలానికి వచ్చారు. నైజీరియన్ ఫ్రాడ్‌గా పేరొంది, సైబర్ క్రైమ్‌లో భాగస్వామి అయ్యాడన్న అనుమానంతో ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. చల్లపల్లి మండలం నడకుదురు శివారు రాముడుపాలెం దళితవాడకు చెందిన మాతంగి కృష్ణమోహన్ బ్యాంకు ఖాతా ద్వారా రూ.2 కోట్ల సైబర్ క్రైమ్‌కు పాల్పడిన వ్యవహారానికి సంబంధించి కొన్ని లావాదేవీలు జరిగినట్లు గుర్తించిన ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు ఇక్కడకు చేరుకున్నారు. స్థానిక పోలీసుల సహకారంతో కృష్ణమోహన్‌ను అదుపులోకి తీసుకున్నారు. ముంబైకి చెందిన వ్యక్తి ద్వారా కృష్ణమోహన్ ఈ నేరంలో భాగస్వామిగా మారినట్లు తెలిసింది. దేశంలో పలు రాష్ట్రాలకు చెందిన 10 మంది వ్యక్తులు ఈ కేసులో ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. కృష్ణమోహన్‌ను అదుపులోకి తీసుకుంటున్నట్లు చల్లపల్లి పోలీస్ స్టేషన్‌లో లిఖిత పూర్వక సమాచారం అందించిన ఢిల్లీ పోలీసులు మచిలీపట్నం తరలించారు. అక్కడ కోర్టులో హాజరుపరిచి ఢిల్లీకి తరలించనున్నట్లు తెలిసింది.

ఉచిత విద్యుత్‌కు కోత

- ఐదేళ్లలో అంచనా డిమాండ్ 16,181 మిలియన్ యూనిట్లు
- డిస్కమ్‌ల అంచనా మాత్రం 15,037 ఎంయూలే
- ఇందులోనూ సోలార్ పేరుతో కోత
- మినీ గ్రిడ్‌కు వ్యవసాయ పంపుసెట్ల మళ్లింపు



సాక్షి, అమరావతి

వ్యవసాయ ఉచిత విద్యుత్‌కు కోత పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. 2023–24 నాటికి ఉచిత విద్యుత్ భారం తగ్గించేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ)కి విద్యుత్ పంపిణీ సంస్థలు తాజాగా సమర్పించిన భవిష్యత్ పవర్ డిమాండ్ పత్రంలో ఈ విషయాన్ని స్పష్టంగా పేర్కొన్నారు. 2018 నుంచి కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయబోమని, ఎవరైనా కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నా.. సోలార్ విద్యుత్ వైపు మళ్లిస్తామని చెప్పారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న 15 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు ఏటా 12,136 మిలియన్ యూనిట్ల విద్యుత్ డిమాండ్ ఉంటుందని 2017–18 వార్షిక ఆదాయ, అవసర నివేదిక (ఏఆర్ఆర్)లో పేర్కొన్నారు. వాస్తవానికి రాష్ట్రంలో మరో 2.5 లక్షల కొత్త కనెక్షన్ల కోసం రైతులు దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటి వరకూ ఉన్న అంచనాల ప్రకారం ఏటా 50 వేల కొత్త విద్యుత్ కనెక్షన్ల కోసం దరఖాస్తులు అందుతున్నాయి. ఈ క్రమంలో వచ్చే ఐదేళ్లలో ఇంకో 2.5 లక్షల కొత్త కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుతం ప్రతి వ్యవసాయ పంపుసెట్‌కు ఏడాదికి 8,090 యూనిట్ల విద్యుత్ డిమాండ్‌ను అంచనా వేశారు. కాబట్టి ఐదేళ్లలో మరో ఐదు లక్షల కనెక్షన్లు ఇవ్వాల్సి ఉన్నందున వ్యవసాయానికి కనీసం 4,045 మిలియన్ యూనిట్ల విద్యుత్ అవసరం ఉంటుంది. అంటే ఐదేళ్ల తర్వాత ఏడాదికి 16,181 మిలియన్ యూనిట్లకుపైగా డిమాండ్ ఉండే వీలుందని డిస్కమ్‌ల లెక్కలే చెబుతున్నాయి. కానీ వచ్చే ఐదేళ్లకు వ్యవసాయానికి 15,037 మిలియన్ యూనిట్ల డిమాండ్ మాత్రమే ఉంటుందని ఏపీఈఆర్‌సీకి లెక్కజెప్పాయి. ఇప్పుడున్న డిమాండ్‌ను కూడా 30 శాతం సోలార్ పంపుసెట్ల వైపు మళ్లిస్తామంటున్నారు. అంటే సుమారు మరో 3 వేల మిలియన్ యూనిట్ల ఉచిత భారాన్ని తగ్గిస్తామనేది డిస్కమ్‌ల కొత్త ప్రతిపాదన. కొత్త విద్యుత్ కనెక్షన్లు ఎన్నిస్తారనే విషయాన్ని మాత్రం డిస్కమ్‌లు ఎక్కడా స్పష్టంగా పేర్కొనలేదు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారికి ఇస్తారా? లేదా? అనే దానిపైనా స్పష్టత లేదు. సోలార్ విద్యుత్‌ను నిల్వచేసే బ్యాటరీలు ఏర్పాటు చేస్తున్నామని, అత్యధిక సామర్థ్యంతో ఇవి ఉంటాయని, ఒక్కో సోలార్ మినీ గ్రిడ్ (బ్యాటరీతో ఉండేవి)కు దాదాపు లక్షల కనెక్షన్లు మళ్లించే వీలుందని డిస్కమ్‌లు తెలివిగా చెబుతున్నాయి. నిజానికి సోలార్ మినీ గ్రిడ్‌కు కనెక్షన్లు మళ్లిస్తే పరిమితి మేరకే ఉచిత విద్యుత్ ఇస్తారు. అంతకు మించి వినియోగించే విద్యుత్‌ను మీటర్ ద్వారా లెక్కించి బిల్లు పంపుతారు. కాబట్టి ఉచిత విద్యుత్‌కు భారీగా కోత పెట్టవచ్చని అధికారులు అంటున్నారు.

హార్టీ సెట్‌లో వరాల కనక శిరీషకు స్టేట్ ఫస్ట్ ర్యాంకు



శిరీషకు మిఠాయి తినిపిస్తున్న తండ్రి

రామచంద్రపురం: డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి ఉద్యాన విశ్వవిద్యాలయం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన బీఎస్సీ హార్టికల్చర్ ప్రవేశ పరీక్ష హార్టీ సెట్‌లో తూర్పు గోదావరి జిల్లా రామచంద్రపురానికి చెందిన విద్యార్థిని వరాల కనక శిరీష స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించింది. బీఎస్సీ హార్టీ కల్చర్‌లో చేరేందుకు పాలిటెక్నిక్ రెండేళ్లు పూర్తిచేసిన విద్యార్థులకు గతనెల 18న రాష్ట్ర వ్యాప్తంగా ప్రవేశ పరీక్షను నిర్వహించారు. ఫలితాలను ఈనెల 11న విడుదల చేశారు. పట్టణంలోని ఎస్‌కేపీపీ ఉద్యాన కళాశాలలో రెండేళ్ల పాలిటెక్నిక్ కోర్సును పూర్తి చేసిన కనక శిరీష రాష్ట్రంలోనే ప్రథమ ర్యాంకు సాధించినట్లు ప్రిన్సిపల్ ఎం.సత్తిరాజు తెలిపారు. ఇదే కళాశాల విద్యార్థిని దోనిపాటి శ్రీలక్ష్మి 8వ ర్యాంకును కైవసం చేసుకుందన్నారు. శిరీష స్వస్థలం కపిలేశ్వరపురం మండలం అంగర. శిరీష తండ్రి కనక మల్లేశ్వరరావు సాధారణ ఇటుకల కమీషన్ వ్యాపారి. ఆమె మొదటి ర్యాంకు సాధించడంతో ఆ కుటుంబంలో ఆనందం వ్యక్తమవుతోంది.

చిన్నారులకు విషమిచ్చి తల్లి ఆత్మహత్యాయత్నం

ఇద్దరు కుమార్తెలు మృతి, తల్లి పరిస్థితి విషమం

సదుం: చిత్తూరు జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. కుటుంబ కలహాల కారణంగా ఇద్దరు పిల్లలకు విషమిచ్చి తానూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది ఓ తల్లి. ఈ ఘటన జిల్లాలోని సదుం మండలం బూరగమందలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. బూరగమంద పంచాయతీకి చెందిన నాగేంద్రకు తమ్మినాయనపల్లెకు చెందిన ఈశ్వరమ్మతో 2006లో వివాహం జరిగింది. వీరికి వైష్ణవి (5), వర్షిణి (1) కుమార్తెలు ఉన్నారు. శుక్రవారం వారికి దుస్తులు కొనే విషయంపై నాగేంద్ర తల్లి వీరమ్మకు, ఈశ్వరమ్మకు స్వల్ప వివాదం జరిగింది. దీంతో మనస్తాపం చెందిన ఈశ్వరమ్మ దగ్గరలోని పొలం వద్దకు వెళ్లి తన ఇద్దరు కుమార్తెలకు విషమిచ్చింది. తర్వాత ఆమె కూడా విషం తీసుకుని చిన్నారులను ఇంటికి తీసుకెళ్లింది. కొద్ది సేపటికి ఇంటికి వచ్చిన వీరమ్మ అపస్మారక స్థితిలో ఉన్న కోడలు, మనవరాళ్లను చూసి కేకలు వేసింది. స్థానికులు ఇంటికి చెరుకుని చికిత్స నిమిత్తం వారిని ప్రైవేటు వాహనంలో సదుం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే మార్గమధ్యంలోనే వర్షిని (1) మృతిచెందింది. ఆస్పత్రికి చెరుకున్న కొద్ద సేపటికే వైష్ణవి ప్రాణాలు విడిచింది. ఈశ్వరమ్మ పరిస్థితి కూడా విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం ఆమెను తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. కాగా, ఎస్సై నాగరాజు చిన్నారుల మృతదేహాలను పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం పీలేరుకు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

పత్తి రైతులకు 'గులాబీ' గుబులు!

▶ మొదటి పేజీ తరువాయి

పురుగు ఆశించిన కాయలు పూర్తిగా వృద్ధి చెందక త్వరగా పక్వానికి వస్తాయి.

మూడు జిల్లాల్లో గుర్తింపు...

దేశవ్యాప్తంగా పత్తిని అత్యధికంగా పండించే రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటి. వర్షాభావ పరిస్థితులున్నప్పటికీ రాష్ట్రంలో ఈ ఏడాది పత్తి సాగుచేసే విస్తీర్ణం పెరిగింది. వ్యవసాయశాఖ లెక్క ప్రకారం రాష్ట్రంలో ఇప్పటికే 4.45 లక్షల హెక్టార్లలో పత్తి సాగవుతోంది. నైరుతీ రుతుపవనాలు ముందుగా రాయలసీమను తాకడంతో కర్నూలు, అనంతపురం, వైఎస్సార్, ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో పత్తిని ఎక్కువగా విత్తారు. సీఐసీఆర్ పరిశీలన ప్రకారం రాష్ట్రంలోని కర్నూలు, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో పత్తికి ఈ పురుగు సోకింది. బీటీ కాటన్‌కు తెగుళ్లు రావని ఆయా కంపెనీలు చెప్పినప్పటికీ ఈ పత్తినీ గులాబీ రంగు పురుగు వదలకుండా అతలాకుతలం చేస్తుండడం గమనార్హం.

నివారణ చర్యలిలా...

గులాబీ రంగు పురుగు నివారణకు వ్యవసాయ నిపుణుల సూచనలు..

- పంటకు, పంటకు మధ్య కనీసం 7, 8 నెలల వ్యవధి ఉండాలి. పంట తీసేశాక గొర్రెలు, మేకలు, పశువుల్ని మేపాలి.
- నీటి వసతి ఉన్నప్పటికీ పత్తిని ఆరునెలలకు మించి పొడిగించకుండా చూడాలి.
- పంట మార్పిడి పద్ధతిని పాటించాలి. కనీసం మూడేళ్లకోసారి తప్పనిసరి.
- బీటీ పత్తిని విత్తేటప్పుడు పత్తి చుట్టూ ఐదువరుసల్లో నాన్ బీటీ పత్తి విత్తనాల్ని నాటుకోవాలి.
- పత్తి పొలంలో లేదా చేను చుట్టుపక్కల తుత్తురు బెండ లాంటి కలుపు మొక్కల్లేకుండా చూడాలి.
- పంట వేసిన 45 రోజుల్నుంచీ గులాబీ రంగు పురుగు ఉనికిని గమనించడానికి ఎకరానికి 6 నుంచి 8 లింగాకర్షక బుట్టల్ని అమర్చుకోవాలి. ఈ బుట్టలోని ఎరను 21 రోజులకోసారి మార్చాలి.
- వరుసగా 3రోజులు ఆ బుట్టల్లో 7, 8 తల్లి రెక్కల పురుగులు పడితే తక్షణమే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. గుడ్డిపూలను ఏరి నాశనం చేయాలి.
- 5 శాతం వేపకషాయాన్ని లేదా 5 మిల్లీలీటర్ల వేపనూనెను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. పురుగుమందుల్ని ఉదయం 10 గంటల్లోపు లేదా సా. 4–6 గంటల మధ్య పిచికారీ చేయాలి.
- క్వినాల్ ఫాస్ 2 మిల్లీలీటర్లు లేదా థయోడికార్బ్ 1.5 గ్రాములు లేదా ప్రొఫినోఫాస్ 2 మిల్లీలీటర్లు లేదా క్లోరోఫైరిఫాస్ 2.5 మిల్లీలీటర్లను ఒక లీటర్ నీటితో కలిపి పంటపై పిచికారీ చేసుకోవాలి.
- పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే స్పైనోశాడ్ 0.35 మిల్లీలీటర్లను లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.5 గ్రాముల్ని లీటర్ నీటితో కలిపి పిచికారీ చేయాలి.
- రైతులు ఏదేని అదనపు సమాచారం లేదా ఇతర వివరాలకోసం గుంటూరులోని వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయాన్ని లేదా ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అధికారుల్ని సంప్రదించవచ్చు.

31లోగా పోలవరంపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలు చంద్రబాబు తీసుకోవడంతో రాష్ట్రానికి నష్టం
- 2018 మార్చిలోగా పూర్తికాకపోతే నిర్మాణ ఖర్చును కేంద్ర ప్రభుత్వం అప్పుగా పరిగణించే అవకాశం
- మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్



తాడితోట (రాజమహేంద్రవరం సిటీ): పోలవరం ప్రాజెక్టుపై ఈ నెల 31లోగా శ్వేతపత్రం విడుదల చేయాలని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర విభజన సమయంలో హైదరాబాద్‌ను కోల్పోవడం వల్ల ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన నష్టాన్ని భర్తీ చేసేందుకు పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి, పూర్తిగా కేంద్ర నిధులతో నిర్మించి ఇచ్చేందుకు విభజన చట్టంలో పేర్కొన్నారని చెప్పారు. అయితే పోలవరం నిర్మాణ బాధ్యతలను చంద్రబాబు తీసుకోవడంతో.. 2018 మార్చి 31 నాటికి ప్రాజెక్టు పూర్తి కాకపోతే దానికి ఖర్చు చేసిన నిధులను అప్పుగా పరిగణిస్తామని కేంద్ర ప్రభుత్వం 2016 డిసెంబర్ 23న విడుదల చేసిన జీవోలో స్పష్టంగా పేర్కొందని వివరించారు. నిర్మాణ పనుల తీరు పరిశీలిస్తే 2018 మార్చి 31 నాటికి పోలవరం పూర్తయ్యే అవకాశం లేదన్నారు. నిర్మాణ బాధ్యతలు చంద్రబాబు తీసుకోవడంతోనే కేంద్రం ఈ నిబంధనలు విధించిందన్నారు. ప్రాజెక్టు అంచనా వ్యయం భారీగా పెంచారని, పెంచిన వ్యయాన్ని ఎవరు భరిస్తారని ప్రశ్నించారు. 2014 నాటి ధరల ప్రకారం కేంద్రం నిధులిస్తామంటే రాష్ట్రం ఎందుకు భరించాలన్నారు. ఈ నెల 18న పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ ప్రాజెక్టును సందర్శించనుందని, ఆ కమిటీ ముందైనా ప్రాజెక్టు వ్యయంపై చర్చించాలని సూచించారు.

అటార్నీ జనరల్ పరిశీలన ఏంటి?

ఏ ప్రాజెక్టును అటార్నీ జనరల్ పర్యవేక్షణ చేసిన దాఖలాలు లేవని, అయితే పోలవరం ప్రాజెక్టు పరిశీలించేందుకు అటార్నీ జనరల్ వస్తున్నట్లు వార్తలు వస్తున్నాయని తెలిపారు. ఆయన ఈ ప్రాజెక్టు ఎందుకు పరిశీలించాలనుకుంటున్నారో అర్థం కావడం లేదన్నారు. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం కోసం కొత్తగా కొనుగోలు చేసిన పంపుల నిర్వహణకు రూ.50 కోట్లు ఎందుకని ప్రశ్నించారు. పర్సెంటేజీల కోసం ఇంత ఖర్చు చేస్తున్నారా అని ప్రశ్నించారు. సమావేశంలో నక్కా శ్రీనగేశ్, పోడిపిరెడ్డి అచ్యుత్ దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ యాజమాన్యంతో ప్రభుత్వం కుమ్మక్కు

- అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ సంఘం గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల
- 16న శ్రీకాకుళం నుంచి అగ్రిగోల్డ్ బాధితుల చైతన్యయాత్ర



చైతన్య యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు తదితరులు

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్)

అగ్రిగోల్డ్ యాజమాన్యంతో ప్రభుత్వం కుమ్మక్కైందన్న అనుమానం కలుగుతోందని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. అగ్రిగోల్డ్ బాధితులు 30 నెలలుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం మాత్రం స్పందించడం లేదని ధ్వజమెత్తారు. విజయవాడలో హనుమాన్‌పేటలోని దాసరి భవన్‌లో ఆయన శనివారం విలేకర్లతో మాట్లాడారు. బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 16 నుంచి సెప్టెంబర్ 17వ తేదీ వరకు చైతన్యయాత్ర చేయనున్నట్టు తెలిపారు. ఈ యాత్ర శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి ప్రారంభమై 17న అనంతపురంలో ముగుస్తుందని చెప్పారు. అగ్రిగోల్డ్ ఆస్తులను హైకోర్టు అటాచ్ చేసిందని, ప్రతి నెల రూ.వెయ్యి కోట్లు విలువైన ఆస్తులను విక్రయించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మూడునెలల్లో డిపాజిట్ దారుల సొమ్ము వెనక్కిస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చినా ఇప్పటివరకు నెరవేర్చలేదని మండిపడ్డారు. కాగా, చైతన్యయాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను నాగేశ్వరరావు ఆవిష్కరించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తిరుపతిరావు, ఉప ప్రధాన కార్యదర్శి బీవీ చంద్రశేఖరరావు, కమిటీ సభ్యులు కె.రాంబాబు, పి.మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఈ-మెయిల్ పంపించి సంతకం చేయమన్నారు

ఏఎంటీజెడ్ బోర్డు సభ్యులపై ఒత్తిడి

- అవినీతి బయటపడటంతో నాడు సంతకాలు చేసినవారిలో ఆందోళన
- కలిసే అవకాశమివ్వండి... ఆధారాలతోసహా ఇస్తాం
- ప్రధాని కార్యాలయానికి మాజీ బోర్డు సభ్యుల లేఖ

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఆధ్వర్యంలో చేపట్టే ఏ ప్రాజెక్టుకు సంబంధించి అయినా అనుమతుల విషయంలో పద్ధతి ప్రకారం జరుగుతుంది. కానీ విశాఖపట్నంలో తలపెట్టిన మెడ్‌టెక్ జోన్ పార్కు విషయంలో మాత్రం అన్నీ వక్రమార్గాల్లోనే జరిగాయి. సవివర ప్రాజెక్టు రిపోర్టులో అంచనా వ్యయం రూ.709 కోట్లు ఉంటే.. దాన్ని ఏకంగా రూ.2,432 కోట్లకు పెంచిన విషయం తెలిసిందే. ఇంత పెద్ద ప్రాజెక్టుకు సంబంధించిన అంచనా వ్యయాన్ని పెంచడం ఒక తప్పయితే.. ఇందుకు సంబంధించి ఏఎంటీజెడ్(ఆంధ్రా మెడ్‌టెక్ జోన్) బోర్డు సభ్యులకు మాత్రం సంతకాలకోసం ఒక ఈ–మెయిల్ పంపించి దాన్ని ప్రింట్ తీసుకుని సంతకాలు చేసి పంపించమని అప్పట్లో ఒత్తిడికి గురిచేసినట్టు తెలుస్తోంది. దీనినిబట్టి ఏ స్థాయిలో అవినీతికి ప్రణాళిక రచించారో విదితమవుతోంది. తాజాగా ఇందులో అక్రమాలు బట్టబయలైన నేపథ్యంలో అప్పట్లో సంతకాలు చేసిన బోర్డు సభ్యుల్లో ఆందోళన నెలకొంది. తామెక్కడ ఇరుక్కుపోతామోననే భయం వారిలో వ్యక్తమవుతోంది. దీంతో తమను అక్రమాలకు తోడ్పాటునివ్వమని అప్పట్లో ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఫోన్ల వివరాలు, ఈ–మెయిళ్లను జాగ్రత్తగా దాచుకునే పనిలో వారు నిమగ్నమైనట్టు సమాచారం. ఈ అంశాలన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరించనున్నట్టు తెలిసింది. ప్రధానమంత్రి కార్యాలయానికీ అవినీతి వ్యవహారాల తీరును చేరవేసినట్లు తెలుస్తోంది.

తప్పుడు పద్ధతుల్లో వెళ్లిన ఫైలు

మెడ్‌టెక్‌జోన్ ఫైలు మొత్తం తప్పుడు పద్ధతుల్లోనే నడిచిందని ఉన్నతాధికారులు చెపుతున్నారు. సాధారణంగా ప్రభుత్వంలో ఏదైనా ఒక ఫైలు అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ నుంచి సెక్షన్ ఆఫీసర్, అసిస్టెంట్ సెక్రటరీ, డిప్యూటీ సెక్రటరీ, జాయింట్ సెక్రటరీకి, ఆ తర్వాత ప్రిన్సిపల్ సెక్రటరీకి వెళుతుంది. కానీ మెడ్‌టెక్ జోన్ ఫైలు జాయింట్ సెక్రటరీ వరకు ఎక్కడా రాకుండానే నేరుగా పైస్థాయిలోనే నడిపించేశారు. అంచనా వ్యయంపై ఎక్కడైనా కొర్రీలు వేస్తారేమోనన్న ఉద్దేశంతో ఆరోగ్య సలహాదారు ఫైలును వక్రమార్గంలో నడిపించినట్టు తెలుస్తోంది. ఉన్నతాధికారులు దీనిపై నోరు మెదపకపోగా... అసలు దీంట్లో అవినీతే జరగలేదని మంత్రి చెప్పుకురావడం విచిత్రం. పైగా రూ.709 కోట్ల అంచనా వ్యయాన్ని రూ.1,100 కోట్లు అని పొంతన లేని లెక్కలు చెప్పడం విడ్డూరం.

ప్రధాని కార్యాలయానికి లేఖ

మెడ్‌టెక్ జోన్ అక్రమాలపై మీడియా ముందుకొచ్చిన బోర్డు మాజీ వైస్ ప్రెసిడెంట్ జుడిష్‌రాజ్ కుటుంబ సభ్యులు, మరికొందరు మెడ్‌టెక్ మాజీ డైరెక్టర్లు ప్రధానమంత్రి కార్యాలయానికి లేఖ రాసినట్టు తెలిసింది. తమకు కలిసే అవకాశమిస్తే మెడ్‌టెక్ జోన్‌లో జరిగిన రూ.వందలకోట్ల అవినీతి, అక్రమాలను వివరిస్తామని, దానికి సంబంధించిన ఆధార పత్రాలూ అందజేస్తామని తెలిపినట్టు విశ్వసనీయ వర్గాలు చెప్పాయి.

ఏసీబీ కార్యాలయాలకు నూతన భవనాలు

ఏసీబీ డైరెక్టర్ జనరల్ ఠాకూర్

నెల్లూరు సిటీ: రాష్ట్రంలోని 13 జిల్లాల్లో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కార్యాలయాలకు సంబంధించి నూతన భవనాలు నిర్మాణంలో ఉన్నాయని ఏసీబీ డైరెక్టర్ జనరల్ ఆర్పీ ఠాకూర్ చెప్పారు. నెల్లూరులోని బట్వాడుపాళెంలో ఏసీబీ నూతన భవన నిర్మాణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం ఠాకూర్ విలేకర్లతో మాట్లాడుతూ.. వివిధ దశల్లో ఉన్న ఈ భవన నిర్మాణాలు 2018 మార్చి కల్లా పూర్తవుతాయని, ఒక్కో భవనానికి రూ.1.50 కోట్లు మంజూరు చేసినట్టు తెలిపారు. ఈనెల 14న తిరుపతిలోని ఏసీబీ కార్యాలయాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభిస్తారని వెల్లడించారు. త్వరలో నెల్లూరు, గుంటూరు, విజయవాడ, విశాఖపట్నంలోని నూతన ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఈ ఏడాది 90 ట్రాప్‌లు, 27 అసెట్ కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ కార్యాలయాల్లో దాడులు చేశామని, కొన్నిచోట్ల కీలకమైన సమాచారం సేకరించామన్నారు.

సాక్షి స్పోర్ట్స్
ఆదివారం 13-8-2017



సింక్వీఫీల్డ్ కప్ టోర్నీలో ఆనంద్‌కు రెండో స్థానం

ప్రతిష్టాత్మక సింక్వీఫీల్డ్ కప్ చెస్ టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్, ప్రపంచ చాంప్ కార్ల్‌సన్ (నార్వే) 5.5 పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచారు. మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ఆనంద్‌కు రెండో స్థానం, కార్ల్‌సన్‌కు మూడో స్థానం లభించాయి. అమెరికాలో జరిగిన ఈ టోర్నీలో 6 పాయింట్లతో లాగ్రెవ్ (ఫ్రాన్స్) విజేతగా నిలిచాడు. లాగ్రెవ్‌కు 75 వేల డాలర్లు (రూ. 48 లక్షలు), ఆనంద్‌కు 50 వేల డాలర్లు (రూ. 32 లక్షలు), కార్ల్‌సన్‌కు 40 వేల డాలర్లు (రూ. 25 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి. సో వెస్లీ (అమెరికా)తో జరిగిన చివరిదైన తొమ్మిదో రౌండ్ గేమ్‌ను ఆనంద్ 33 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు.



ధావన్ సెంచరీ అభివాదం

ఆరంభం అదిరినా!

తడబడిన భారత మిడిల్ ఆర్డర్ ● తొలి ఇన్నింగ్స్ 329/6

ధావన్ శతకం ● రాహుల్ అర్ధ సెంచరీ ● రాణించిన లంక బౌలర్లు



రాహుల్

విదేశీ గడ్డపై తొలిసారిగా మూడు టెస్టుల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయాలని భావిస్తున్న భారత్‌కు ఈ సిరీస్‌లో తొలిసారిగా శ్రీలంక బౌలర్ల నుంచి ఇబ్బంది ఎదురైంది. తొలి సెషన్‌లో భారత్ చెలరేగినా... తర్వాతి రెండు సెషన్‌లలో శ్రీలంక బౌలర్లు పైచేయి సాధించారు. శిఖర్ ధావన్, రాహుల్ తొలి వికెట్‌కు 188 పరుగులు జత చేయడంతో.. ఇక మరోసారి భారీ స్కోరు ఖాయమే అనిపించింది. ఓపెనర్లు పెవిలియన్‌కు చేరాక సీన్ రివర్స్ అయ్యింది. మిడిల్ ఆర్డర్ తడబాటుతో భారత్ 141 పరుగుల తేడాలో ఆరు వికెట్లను కోల్పోయింది. తొలి రెండు టెస్టుల్లో 600 పైచిలుకు స్కోరు చేసిన భారత్ ఈసారి 400 పరుగులు దాటే విషయం టెయిలెండర్ల చేతుల్లో ఆధారపడి ఉంది.

పల్లెకెలె: శ్రీలంకతో జరుగుతున్న మూడు టెస్టుల సిరీస్‌లో ఎప్పటిలాగే తొలి రోజు భారత జట్టు 300 పైచిలుకు పరుగులు సాధించింది. ఓపెనర్ శిఖర్ ధావన్ (123 బంతుల్లో 119; 17 ఫోర్లు) సిరీస్‌లో రెండో శతకంతో చెలరేగడంతో పాటు మరో ఓపెనర్ కేఎల్ రాహుల్ (135 బంతుల్లో 85; 8 ఫోర్లు) వరుసగా ఏడో అర్ధ సెంచరీతో మెరిశాడు. దీంతో టీమిండియా 400 పరుగులు కూడా సులువుగా దాటేస్తుందేమో అనిపించినా... అనూహ్యంగా శ్రీలంక బౌలర్లు విజృంభించారు. దీంతో ఫామ్‌లో ఉన్న మిడిలార్డర్ కూడా పూర్తిగా తడబడింది. ఫలితంగా శ్రీలంకతో జరుగుతున్న చివరిదైన మూడో టెస్టులో తొలి రోజు శనివారం ఆట ముగిసే సమయానికి భారత్ 90 ఓవర్లలో 6 వికెట్లకు 329 పరుగులు చేసింది. కెప్టెన్ విరాట్ కోహ్లి (84 బంతుల్లో 42; 3 ఫోర్లు) ఫర్వాలేదనిపించగా... క్రీజులో వికెట్ కీపర్ వృద్ధిమాన్ సాహా (38 బంతుల్లో 13 బ్యాటింగ్), హార్దిక్ పాండ్యా (1 బ్యాటింగ్) ఉన్నారు. పుష్పకుమారకు మూడు, సందకన్‌కు రెండు వికెట్లు దక్కాయి. రవీంద్ర జడేజా స్థానంలో 'చైనామన్' కుల్దీప్ యాదవ్ భారత తుది జట్టులోకి వచ్చాడు.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: ధావన్ (సి) చండిమాల్ (బి) పుష్పకుమార 119; రాహుల్ (సి) కరుణరత్నే (బి) పుష్పకుమార 85; పుజారా (సి) మాథ్యూస్ (బి) సందకన్ 8; కోహ్లి (సి) కరుణరత్నే (బి) సందకన్ 42; రహానే (బి) పుష్పకుమార 17; అశ్విన్ (సి) డిక్‌వెలా (బి) ఫెర్నాండో 31; సాహా బ్యాటింగ్ 13; పాండ్యా బ్యాటింగ్ 1; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (90 ఓవర్లలో ఆరు వికెట్లకు) 329.**
వికెట్ల పతనం: 1–188, 2–219, 3–229, 4–264, 5–296, 6–322. **బౌలింగ్:** ఫెర్నాండో 19–2–68–1; లాహిరు కుమార 15–1–67–0; కరుణరత్నే 5–0–23–0; పెరీరా 8–1–36–0; సందకన్ 25–2–84–2; పుష్పకుమార 18–2–40–3.



పుష్పకుమార

సెషన్-1 ఓపెనర్ల జోరు

టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు శిఖర్ ధావన్, రాహుల్ జోడి అద్భుత ఆరంభాన్ని అందించింది. పిచ్ నుంచి ఎలాంటి ఇబ్బంది ఎదురుకాకపోవడంతో ఈ జోడి యథేచ్ఛగా బ్యాట్లు ఝుళిపించింది. ఆరో ఓవర్‌లో రాహుల్ రెండు ఫోర్లు బాదగా, ధావన్ మరో ఫోర్ కొట్టాడు. 12వ ఓవర్‌లో రాహుల్ ఇచ్చిన క్యాచ్‌ను మిడ్ ఆన్‌లో పుష్పకుమార జారవిడిచాడు. చెత్త బంతులను బౌండరీలకు తరలిస్తూ వన్డే తరహాలో చెలరేగిన వీరిద్దరు 107 బంతుల్లోనే జట్టు స్కోరును 100 పరుగులు దాటించారు. అటు చక్కటి ఫోర్‌తో రాహుల్ 67 బంతుల్లో అర్ధ సెంచరీని అందుకున్నాడు. లంచ్ విరామానికి ముందు ఓవర్‌లో కూడా అతను వరుసగా రెండు ఫోర్లు బాది పరుగుల వేగాన్ని మరింత పెంచాడు.

ఓవర్లు: 27, పరుగులు: 134, వికెట్లు: 0

సెషన్-2 ధావన్ శతకం

లంచ్ అనంతరం కూడా శిఖర్, రాహుల్ దూకుడును కొనసాగించారు. అయితే 39 ఓవర్ల అనంతరం ఎడంచేతి వాటం స్పిన్నర్ పుష్పకుమారను బరిలోకి దింపిన లంక ఫలితం పొందింది. వరుసగా ఏడోసారి కూడా తన హాఫ్ సెంచరీని శతకంగా మలచకుండా రాహుల్ మిడ్ ఆన్‌లో కరుణరత్నేకు క్యాచ్ ఇచ్చి అవుటయ్యాడు. అయితే తన జోరును కొనసాగించిన ధావన్ మాత్రం 107 బంతుల్లో సిరీస్‌లో రెండో శతకాన్ని అందుకున్నాడు. కానీ కొద్దిసేపటికే పుష్పకుమార... ధావన్ వికెట్ కూడా తీసి లంక శిబిరంలో డబుల్ సంతోషాన్ని నింపాడు. పుజారా (8) కూడా త్వరగానే అవుట్ కావడంతో కోహ్లి, రహానే జాగ్రత్తగా ఆడి మరో వికెట్ పడకుండా టీ బ్రేక్‌కు వెళ్లారు.

ఓవర్లు: 29, పరుగులు: 101, వికెట్లు: 3

సెషన్-3 తడబాటు

ఆఖరి సెషన్లో లంక బౌలర్ల హవా సాగింది. స్పిన్నర్ల ధాటికి భారత బ్యాట్స్‌మెన్ పరుగులు చేసేందుకు చెమటోడ్చాల్సి వచ్చింది. రహానే (17) వికెట్‌ను కూడా పుష్పకుమార తీయడంతో భారత్ 264 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో కోహ్లి, అశ్విన్ (75 బంతుల్లో 31; 1 ఫోర్) జోడి లంక బౌలర్లను ఆచితూచి ఎదుర్కొంది. 12 ఓవర్లు ఆడిన ఈ జోడి ఒక్క బౌండరీ కూడా నమోదు చేయలేకపోయింది. చివరికి 79వ ఓవర్‌లో స్పిన్నర్ సందకన్‌కు కోహ్లి దొరికిపోయాడు. మరో రెండు ఓవర్లలో తొలి రోజు ఆట ముగుస్తుందనగా అశ్విన్ కూడా లెఫ్టార్మ్ స్పిన్నర్ ఫెర్నాండో బౌలింగ్‌లో అవుట్ కావడంతో జట్టు ఆరో వికెట్‌ను కోల్పోయింది.

ఓవర్లు: 34, పరుగులు: 94, వికెట్లు: 3

గతంలో నా ఆట గాడి తప్పినప్పుడు పూర్తి రక్షణాత్మక ధోరణిలో ఆడేవాణ్ని. కానీ ఇప్పుడలా కాకుండా నా సహజ శైలినే నమ్ముకుంటున్నాను. అదే ఇప్పుడు ఫలితాన్నిస్తోంది. రాహుల్, నేను బాగా ఆడాం. అయితే దూకుడుగా వెళుతున్నప్పుడు అదే తరహాలోనే అవుట్ కూడా అవుతుంటాం. చివరి రెండు సెషన్లలో వికెట్లను కోల్పోవడం సాధారణమే. స్పిన్నర్లు పుష్పకుమార, సందకన్ నిలకడగా బౌలింగ్ చేసి మమ్మల్ని ఇబ్బంది పెట్టారు. అయినా తొలి రోజు మేం సాధించిన 329 పరుగులు మరీ తక్కువేమీ కాదు. అయితే ఈ పిచ్‌పై భారీ స్కోరు కోసం పరుగులు చేయడం కష్టమే. – భారత ఓపెనర్ శిఖర్ ధావన్

1 వరుసగా ఏడు టెస్టుల్లో అర్ధ సెంచరీలు సాధించిన తొలి భారత బ్యాట్స్‌మన్‌గా, ఓవరాల్‌గా ఆరో క్రికెటర్‌గా కేఎల్.రాహుల్ గుర్తింపు పొందాడు. ఇంతకుముందు ఎవర్టన్ వీక్స్, ఆండీ ఫ్లవర్, చందర్‌పాల్, సంగక్కర, క్రిస్ రోజర్స్ ఇలా చేశారు.

1 మూడు టెస్టుల సిరీస్‌లో వరుసగా 3 సార్లు తొలి ఇన్నింగ్స్‌లో తొలి రోజే 300 అంతకంటే ఎక్కువ పరుగులు చేసిన మొదటి జట్టుగా భారత్ నిలిచింది.

29 కోహ్లి కెప్టెన్సీలో భారత్ వరుసగా 29వ టెస్టులోనూ తుది జట్టులో కనీసం ఒక మార్పుతో బరిలోకి దిగింది.

1 శ్రీలంక గడ్డపై టెస్టుల్లో తొలి వికెట్‌కు అత్యధిక పరుగుల (188) భాగస్వామ్యం నమోదు చేసిన ఓపెనింగ్ జోడిగా ధావన్, రాహుల్ గుర్తింపు.

5 శిఖర్ ధావన్ టెస్టుల్లో ఇప్పటివరకు ఆరు సెంచరీలు చేశాడు. ఇందులో ఐదు విదేశీ గడ్డపైనే వచ్చాయి.

తెలుగు టైటాన్స్ ఆరో 'సారీ'

- యూపీ యోధ చేతిలో ఓటమి
- ప్రో కబడ్డీ లీగ్



తెలుగు టైటాన్స్ రైడర్ రాహుల్‌ను పట్టేసిన యూపీ యోధ ఆటగాళ్లు

అహ్మదాబాద్: ప్రో కబడ్డీ లీగ్‌లో తెలుగు టైటాన్స్ పరాజయాల పరంపర కొనసాగుతోంది. తాజాగా శనివారం జరిగిన పోరులో టైటాన్స్ 32–39 పాయింట్ల తేడాతో యూపీ యోధ చేతిలో పరాజయం చవిచూసింది. లీగ్‌లో ఎనిమిది మ్యాచ్‌లాడిన టైటాన్స్‌కిది ఆరో ఓటమి. టైటాన్స్ కెప్టెన్ రాహుల్ చౌదరి (12 పాయింట్లు) అద్భుతంగా రాణించినప్పటికీ సహచరుల తోడ్పాటు లేక జట్టు కంగుతింది. ఆరంభంలో స్వల్ప ఆధిక్యంలో నిలిచినా... మ్యాచ్ జరిగే కొద్దీ తేలిపోయింది. తొలి అర్ధభాగం ముగిసే సమయానికి టైటాన్స్ 13–14తో వెనుకబడింది. ఇక ద్వితీయార్ధంలో నితిన్ తోమర్ (10 పాయింట్లు) యూపీ జట్టుకు క్రమం తప్పకుండా పాయింట్లు సాధించిపెట్టాడు. రిషాంక్ 6 పాయింట్లు చేశాడు. టాకిల్‌లో రాజేశ్ నర్వాల్ (4) ఆకట్టుకున్నాడు. టైటాన్స్ తరఫున డిఫెండర్ విశాల్ భరద్వాజ్ టాకిల్‌లో 4 పాయింట్లు చేశాడు. ఇరు జట్లు ఒక్కోసారి ఆలౌటయ్యాయి. అనంతరం జరిగిన మరో మ్యాచ్‌లో గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్ 29–25తో దబంగ్ ఢిల్లీని ఓడించింది. గుజరాత్ జట్టులో సచిన్ 8, సునీల్ కుమార్ 3 పాయింట్లు చేశారు. ఢిల్లీ జట్టులో మెరాజ్ షేక్ 8, రవి దలాల్ 2 పాయింట్లు సాధించారు. నేడు జరిగే మ్యాచ్‌ల్లో పట్నా పైరేట్స్‌తో యూపీ యోధ, గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్‌తో జైపూర్ పింక్ పాంథర్స్ తలపడతాయి. ఈ మ్యాచ్‌లను స్టార్ స్పోర్ట్స్–2 చానెల్ ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది.

భరత్, సుమంత్ డబుల్ సెంచరీలు

కేఎస్‌సీఏ టోర్నీ ఫైనల్లో ఆంధ్ర జట్టు



శ్రీకర్ భరత్



సుమంత్

సాక్షి, విజయవాడ: కెప్టెన్ శ్రీకర్ భరత్, సుమంత్ డబుల్ సెంచరీలు సాధించడంతో... కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ (కేఎస్‌సీఏ) ఆధ్వర్యంలో మైసూరులో జరుగుతోన్న తిమ్మప్పయ్య ఇన్విటేషన్ జాతీయ టోర్నమెంట్‌లో ఆంధ్ర జట్టు తొలిసారి ఫైనల్లోకి దూసుకెళ్లింది. కేఎస్‌సీఏ ఎలెవన్‌తో శనివారం ముగిసిన ఈ మూడు రోజుల మ్యాచ్‌లో ఫలితాన్ని టాస్ ద్వారా నిర్ణయించారు. మ్యాచ్‌లో రెండు జట్ల తొలి ఇన్నింగ్స్ పూర్తి కాకపోవడంతో టోర్నీ నిబంధనల ప్రకారం విజేతను నిర్ణయించడానికి టాస్ నిర్వహించగా... ఇందులో ఆంధ్ర జట్టును విజయం వరించింది. అంతకుముందు తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్ర జట్టు 191.3 ఓవర్లలో 6 వికెట్లకు 591 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. శ్రీకర్ భరత్ (492 బంతుల్లో 218; 26 ఫోర్లు, 2 సిక్స్‌లు), సుమంత్ (363 బంతుల్లో 202 నాటౌట్; 21 ఫోర్లు, ఒక సిక్స్) డబుల్ సెంచరీలతో కదంతొక్కారు. అనంతరం కేఎస్‌సీఏ ఎలెవన్ తొలి ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టానికి 310 పరుగులు చేయడంతో మ్యాచ్ 'డ్రా' అయింది. అభిషేక్ రెడ్డి (155 నాటౌట్; 16 ఫోర్లు), మయాంక్ అగర్వాల్ (100 నాటౌట్; 12 ఫోర్లు) సెంచరీలు సాధించారు.

స్కీట్‌లో భారత్‌కు కాంస్యం

అస్తానా (కజకిస్తాన్): ఆసియా షాట్‌గన్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్ ఖాతాలో ఏడో పతకం చేరింది. శనివారం జరిగిన పురుషుల స్కీట్ టీమ్ ఈవెంట్‌లో షీరాజ్ షేక్, మేరాజ్ అహ్మద్ ఖాన్, అంగద్ వీర్ సింగ్ బాజ్వాలతో కూడిన భారత జట్టు... 347 పాయింట్లు స్కోరు చేసి కాంస్యం నెగ్గింది.

రిలే 'పసిడి' రేసులో బోల్ట్

4x100 మీటర్ల రిలే ఫైనల్లో జమైకా బృందం



లండన్: తన అంతర్జాతీయ కెరీర్‌ను పసిడి పతకంతో ముగించాలని ఆశిస్తున్న జమైకా దిగ్గజ అథ్లెట్ ఉసేన్ బోల్ట్ ఆ దిశగా చివరి అడుగు వేశాడు. ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భాగంగా పురుషుల 4X100 మీటర్ల రిలే ఈవెంట్‌లో టికెండో ట్రేసీ, జూలియన్ ఫోర్టీ, మైకేల్ క్యాంప్‌బెల్, ఉసేన్ బోల్ట్‌లతో కూడిన జమైకా బృందం ఫైనల్‌కు చేరింది. శనివారం జరిగిన హీట్స్‌లో... రెండో హీట్‌లో బరిలోకి దిగిన జమైకా జట్టు 37.95 సెకన్లలో గమ్యానికి చేరి అగ్రస్థానం పొంది ఫైనల్ బెర్త్ దక్కించుకుంది. ఈ హీట్ నుంచి ఫ్రాన్స్, చైనా, కెనడా జట్లు కూడా ఫైనల్‌కు చేరాయి. అంతకుముందు తొలి హీట్‌లో మైక్ రోడ్జర్స్, జస్టిన్ గాట్లిన్, బీజే లీ, క్రిస్టియన్ కోల్మన్‌లతో కూడిన అమెరికా జట్టు 37.70 సెకన్లలో రేసును ముగించి ఫైనల్లోకి ప్రవేశించింది. ఈ హీట్ నుంచి బ్రిటన్, జపాన్, టర్కీ రిలే జట్లు కూడా ఫైనల్లోకి అడుగు పెట్టాయి.

మహిళల రిలే జట్టుపై అనర్హత వేటు...

మరోవైపు 4X400 మీటర్ల రిలేలో భారత పురుషుల, మహిళల జట్లు నిరాశాజనక ప్రదర్శనతో హీట్స్‌లోనే వెనుదిరిగాయి. జిస్నా మాథ్యూ, పూవమ్మ, అనిల్డా థామస్, నిర్మలా షెరోన్‌లతో కూడిన భారత మహిళల రిలే జట్టు 3 నిమిషాల 28.62 సెకన్లలో రేసును ముగించి తమ హీట్స్‌లో ఏడో స్థానంలో నిలిచింది. అయితే తొలి ల్యాప్‌లో జిస్నా 250 మీటర్ల దూరం తర్వాత నిబంధనలకు విరుద్ధంగా వేరే లైన్‌లో పరుగెత్తినట్లు తేలడంతో నిర్వాహకులు భారత రిలే జట్టు ఫలితాన్ని రద్దు చేయడంతోపాటు అనర్హత వేటు వేశారు. కున్హు మొహమ్మద్, అమోజ్ జాకబ్, మొహమ్మద్ అనస్, రాజీవ్ అరోకియాలతో కూడిన భారత పురుషుల రిలే జట్టు 3 నిమిషాల 2.80 సెకన్లలో గమ్యానికి చేరి తమ హీట్స్‌లో ఐదో స్థానంలో, ఓవరాల్‌గా పదో స్థానంలో నిలిచింది.

200 మీటర్ల విజేత షిపెర్స్



మహిళల 200 మీటర్ల విభాగంలో నెదర్లాండ్స్ అథ్లెట్ డాఫ్నీ షిపెర్స్ టైటిల్‌ను నిలబెట్టుకుంది. 2015 ప్రపంచ చాంపియన్‌షిప్‌లోనూ స్వర్ణం నెగ్గిన షిపెర్స్ శనివారం జరిగిన 200 మీటర్ల ఫైనల్ రేసును 22.05 సెకన్లలో ముగించి విజేతగా నిలిచింది. మరియా జోస్ (ఐవరీకోస్ట్–22.08సె.) రజతం, షానీ మిల్లర్ (బహమాస్–22.15 సె.) కాంస్యం గెలిచారు. మెర్లీన్ ఒట్టీ (జమైకా), అలీసన్ ఫెలిక్స్ (అమెరికా) తర్వాత ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 200 మీటర్ల విభాగంలో వరుసగా రెండుసార్లు స్వర్ణం గెలిచిన మూడో అథ్లెట్‌గా షిపెర్స్ గుర్తింపు పొందింది. మహిళల లాంగ్‌జంప్‌లో బ్రిట్నీ రీస్ (అమెరికా–7.02 మీటర్లు)... పురుషుల హ్యామర్ త్రోలో పావెల్ (పోలాండ్–79.81 మీటర్లు)... మహిళల 3000మీ. స్టీపుల్‌ఛేజ్‌లో ఎమ్మా కోబర్న్ (అమెరికా–9ని:02.58 సెకన్లు) స్వర్ణాలు నెగ్గారు.

దక్షిణాఫ్రికా 'ఎ' 274/4

ప్రిటోరియా: భారత్ 'ఎ' జట్టుతో జరుగుతున్న అనధికారిక టెస్టు మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 'ఎ' ఓపెనర్ స్టీఫెన్ కుక్ (252 బంతుల్లో 120; 8 ఫోర్లు) సెంచరీతో కదంతొక్కాడు. దీంతో తొలిరోజు మొదట బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా 'ఎ' జట్టు ఆట ముగిసే సమయానికి 89 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 274 పరుగులు చేసింది. డేవిడ్ మిల్లర్ (115 బంతుల్లో 78; 10 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. కుక్, మిల్లర్ మూడో వికెట్‌కు 138 పరుగులు జోడించారు. రుడి సెకండ్ 32, మార్క్‌రమ్ 22 పరుగులు చేశారు. జోండో (4 బ్యాటింగ్), హెండ్రిక్స్ (0 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. భారత బౌలర్లలో హైదరాబాదీ సీమర్ మొహమ్మద్ సిరాజ్, స్పిన్నర్ నదీమ్ రెండేసి వికెట్లు తీశారు.

భారత కుర్రాళ్లదే సిరీస్

మూడో మ్యాచ్‌లోనూ ఇంగ్లండ్‌పై జయభేరి



శుభ్‌మాన్ గిల్

హోవ్: భారత అండర్–19 జట్టు మరో రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే ఐదు వన్డేల సిరీస్‌ను 3–0తో కైవసం చేసుకుంది. శనివారం జరిగిన మూడో వన్డేలో భారత యువ జట్టు 169 పరుగుల తేడాతో ఇంగ్లండ్ అండర్–19 జట్టుపై ఘనవిజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేపట్టిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 327 పరుగులు చేసింది. శుభ్‌మాన్ గిల్ (127 బంతుల్లో 147; 19 ఫోర్లు, 2 సిక్సర్లు) శతకం సాధించాడు. జిగ్నేశ్ పటేల్ (38), అభిషేక్ శర్మ (31) ఫర్వాలేదనిపించారు. ఇంగ్లండ్ బౌలర్లలో మ్యాటీ పాట్స్ 4 వికెట్లు పడగొట్టగా, జాక్ ప్లామ్, ట్రెవస్కిస్ తలా ఒక వికెట్ తీశారు. తర్వాత కష్టసాధ్యమైన లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన ఇంగ్లండ్ 40.5 ఓవర్లలో 158 పరుగుల వద్ద ఆలౌటైంది. బాంటన్ (59; 4 ఫోర్లు, 2 సిక్సర్లు) రాణించాడు. భారత బౌలర్లలో నాగర్‌కోటి 3, అభిషేక్ శర్మ, శుభ్‌మాన్ గిల్ చెరో 2 వికెట్లు తీశారు.

సాక్షి రౌండప్

వైఎస్ఆర్ జిల్లా

ఆదివారం । ఆగస్టు । 13 । 2017

www.sakshi.com

యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా ప్రకారం.. వాతావరణ మార్పుల వల్ల భారత్‌లో గత 30 ఏళ్లలో జరిగిన రైతు ఆత్మహత్యల సంఖ్య 59,000. పంటల కాలంలో ఒక్క డిగ్రీ ఉష్ణోగ్రత పెరిగినా సగటున 70 ఆత్మహత్యలు నమోదవుతాయని దాని వాదన.



వాహ్.. తాజ్!

- గుండుసూదిపై తాజ్‌మహల్ చిత్తరువు
- ఏటికొప్పాక కళాకారుడు చిన్నయాచారి అద్భుత సృష్టి



శ్రీశైలపు చిన్నయాచారి



1.5 మిల్లీమీటర్ల వ్యాసార్థం ఉన్న తాజ్‌మహల్

యలమంచిలి రూరల్: జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డులు సొంతం చేసుకున్న విశాఖ జిల్లా ఏటికొప్పాక కళాకారుడు, సూక్ష్మ చిత్రాల రూపశిల్పి శ్రీశైలపు చిన్నయాచారి మరో అద్భుత కళాఖండాన్ని రూపొందించారు. ప్రపంచ వింతల్లో ఒకటైన తాజ్‌మహల్ ప్రతిరూపాన్ని అత్యంత సూక్ష్మ రూపంలో తీర్చిదిద్ది శభాష్ అనిపించుకుంటున్నారు. శ్రీశైలపు చిన్నయాచారి ఈసారి గుండు సూది తలభాగంపై.. కేవలం 1.5 మిల్లీ మీటర్ల వ్యాసార్థంలో తాజ్‌మహల్ ప్రతిరూపాన్ని తీర్చిదిద్దడం విశేషం. తొలుత గుండుసూది తలభాగంలోని గుండ్రటి భాగాన్ని, మేకు తలభాగం మాదిరిగా చదును చేసి, దానిపై తన ప్రతిభకు పదునుపెట్టారు. తాజ్‌మహల్ తయారీకి బ్రహ్మజెముడు ముల్లును వినియోగించడం విశేషం. ఈ సూక్ష్మ ప్రతిరూపాన్ని వీక్షించడానికి పుటాకార దర్పణాన్ని వినియోగించాలని చిన్నయాచారి తెలిపారు.

ఏపీ మ్యాథమెటికల్ సొసైటీ నూతన కమిటీ ఎన్నిక

అధ్యక్షుడిగా ప్రొఫెసర్ శ్రీనివాస్

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మ్యాథమెటికల్ సొసైటీ అధ్యక్షుడిగా కాకతీయ యూనివర్సిటీ మ్యాథమెటిక్స్ విభాగం ప్రొఫెసర్ శ్రీనివాస్ రెండోసారి ఎన్నికయ్యారు. తెలంగాణలోని వరంగల్ అర్బన్ జిల్లా కాకతీయ యూనివర్సిటీలో గణిత విభాగం ఆధ్వర్యంలో మ్యాథమెటికల్ సొసైటీ 26వ కాన్ఫరెన్స్ రెండో రోజు శనివారం కొనసాగింది. ఈ సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రస్తుత అధ్యక్షుడు శ్రీనివాస్‌నే రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే సొసైటీ ప్రస్తుత ప్రధాన కార్యదర్శి కేయూ గణిత విభాగం అధ్యాపకుడు డాక్టర్ టి.నాగయ్యను కూడా కొనసాగించాలని తీర్మానించారు. కోశాధికారిగా గీతం యూనివర్సిటీ డాక్టర్ పాశం నర్సింహస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా ఎస్.శివారెడ్డి, కేవీఎస్ శర్మ, ఇతర రాష్ట్రాల ప్రతినిధిగా కుంచెం శ్యాంప్రసాద్ ఎన్నికయ్యారు.





సబ్సిడీ వద్దనుకుంటే తెల్లరేషన్‌కార్డు భద్రం!

ప్రభుత్వం కొత్త ఎత్తుగడ

సాక్షి, అమరావతి: సబ్సిడీ భారం తగ్గించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఎత్తుగడలు వేస్తోంది. సబ్సిడీ బియ్యంతో పాటు ఇతర సరుకులు వద్దని లిఖితపూర్వకంగా రాసిచ్చిన వారి కార్డులను తొలగించబోమంటూ ప్రచారం చేయాలని అధికారులకు సూచించినట్లు తెలిసింది. అదే సమయంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకునే వెసులుబాటు కూడా కల్పిస్తామంటూ ప్రచారం చేయాలని అధికారులకు సూచనలు అందాయి. కేంద్రప్రభుత్వం రెండేళ్ల కిందట లెవీని పూర్తిగా ఎత్తివేయడంతో రాష్ట్ర ప్రభుత్వానికి బియ్యం సేకరణ తలకు మించిన భారంగా మారింది. రాష్ట్రంలో 1.42 కోట్ల తెల్లరేషన్ కార్డులుండగా.. జాతీయ భద్రత చట్టం కింద 92 లక్షల కార్డులకు కేంద్రప్రభుత్వమే సబ్సిడీ ఇస్తోంది. మిగిలిన 50 లక్షల కార్డులకు పంపిణీ చేస్తున్న బియ్యానికి.. రాష్ట్ర ప్రభుత్వమే సబ్సిడీ భరించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడేందుకు గానూ ప్రభుత్వం కొత్త ఎత్తుగడ వేసింది. అర్హత లేని కార్డులను ప్రభుత్వం తొలగించకముందే సబ్సిడీ బియ్యం వద్దనుకుంటే.. వారి కార్డును రద్దు చేయకుండా కొనసాగిస్తామని హామీ ఇవ్వనున్నట్లు తెలిసింది. తద్వారా ఆర్థిక భారం తగ్గడంతో పాటు లబ్ధిదారుల నుంచి కూడా ప్రతిఘటనలు ఎదురుకావని భావిస్తున్నారు.

18న పోలవరానికి పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు హుకుంసింగ్ నేతృత్వంలోని 31 మంది సభ్యులతో కూడిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఈనెల 18న ఆ ప్రాంతంలో పర్యటించనుంది. 18న ఉదయం ఈ కమిటీ విజయవాడకు చేరుకుంటుంది. అక్కడ్నుంచి పోలవరం ప్రాజెక్టు పనులను పరిశీలించేందుకు వెళుతుంది. అనంతరం కమిటీ తిరిగి విజయవాడకు చేరుకుంటుంది. 19వ తేదీన ఉదయం 10 గంటలకు పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిపై జలవనరుల శాఖ అధికారులతో సమావేశమై చర్చిస్తుంది. అదే రోజున మధ్యాహ్నం విశాఖకు చేరుకుని తోటపల్లి ప్రాజెక్టుపై సమీక్షించనుంది. ఆ రోజు రాత్రికి విశాఖలోనే బస చేసి.. 20వ తేదీ ఉదయం ఢిల్లీ వెళుతుంది. ఈ కమిటీలో ఏపీ నుంచి ఎంపీలు మురళీమోహన్, ఎస్పీవై రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

వధువు వేషంలో వరుడు!



ఇదో వివాహ ఆచార వ్యవహారం. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో మేడిబోయిన ఉమామహేశ్‌కు, ఉమాదేవికి శనివారం రాత్రి వివాహం జరిగింది. ఆ కులంలో పెళ్లి కొడుకు స్త్రీ వేషధారణ చేసిన అనంతరం వివాహం జరిపించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందుకు అనుగుణంగా పెళ్లి కుమారుడిని స్త్రీ వేషధారణ చేసి వేదిక వద్దకు తీసుకురావడం.. వివాహ తంతు ముగించడం అక్కడకు వచ్చినవారిని కనువిందు చేసింది.

– తాడితోట, (రాజమహేంద్రవరం సిటీ)





Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No. 310, Tadigotla Village, Chintakommadinne Mandal, YSR Kadapa District. 516 003 and Printed at Jagati Publications Limited, Survey No. 310, Tadigotla Village, Chintakommadinne Mandal, YSR Kadapa District. 516 003 EDITOR: V. Murali, Phone No. 08562-200076, 77 RNI Regn No. APTEL/2008/23796.